ఈనాడు

విజయవాడ 13-8-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 4
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

రాష్ట్రానికి సెమీకండక్టర్ యూనిట్

రూ. 468 కోట్లతో ఏర్పాటు



- ఒడిశాలో 2, పంజాబ్‌లో 1 చొప్పున మొత్తం 4 యూనిట్లు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో రూ.468 కోట్ల పెట్టుబడితో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. ఈ వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లకు వివరించారు. అడ్వాన్స్‌డ్ సిస్టం ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ దక్షిణ కొరియాకు చెందిన ఏపీఏసీటీ కంపెనీ లిమిటెడ్‌తో కలిసి దీన్ని ఏర్పాటు చేయనుంది. ఇక్కడ ఏటా 9.6 కోట్ల సెమీకండక్టర్లు ఉత్పత్తి కానున్నాయి. ఇందులో తయారయ్యే ఉత్పత్తులను మొబైల్ ఫోన్లు, సెట్‌టాప్ బాక్సులు, ఆటోమొబైల్ అప్లికేషన్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉపయోగిస్తారు. కేంద్ర క్యాబినెట్ మొత్తంగా రూ.4,600 కోట్లతో ఒడిశా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నాలుగు సెమీకండక్టర్ల తయారీ యూనిట్లకు ఆమోదం తెలిపింది. (మిగతా 5లో)

రాయలసీమకు మరో భారీ పెట్టుబడి | తిరుపతిలో అపాక్ట్ యూనిట్ ఏర్పాటు 5లో

నమ్మకం కోల్పోవడమే అసలు సమస్య

బిహార్ ఎస్ఐఆర్ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

మరణాలు, తొలగించిన ఓట్ల వివరాలతో సిద్ధంగా ఉండాలని ఈసీకి సూచన

ఆధార్‌ను పౌరసత్వానికి ప్రామాణిక పత్రంగా భావించలేమన్న ధర్మాసనం



దిల్లీ: బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) వివాదంపై సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సంఘం(ఈసీ) చేపట్టిన ఈ కసరత్తుపై 'విశ్వాసం కోల్పోవడమే అసలు సమస్య. అంతకుమించి ఏమీ లేదు' అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం పేర్కొంది. ఎస్ఐఆర్‌ను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా....'కోటి మంది ఓటర్లను తొలగించాలని ఈసీ భావిస్తోందనే అభిప్రాయానికి మీరెలా వచ్చారు?' అని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. (మిగతా 5లో)

ముందే పూర్తవ్వాలి

నిర్దేశిత గడువు కంటే ఆరు నెలల్లోపే రాజధాని పనులు చేయాలి

సమయానికి కాకపోతే కాంట్రాక్టర్‌తోపాటు అధికారులూ బాధ్యులే

రైతులకు ఇబ్బంది లేని రీతిలో ప్లాట్ల బదిలీ • సీఎం చంద్రబాబు స్పష్టీకరణ



రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణ పనులు రికార్డు సమయంలో పూర్తి కావాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత గడువు కంటే ఆరు నెలల ముందే నగర నిర్మాణం పూర్తవ్వాలని స్పష్టం చేశారు. సచివాలయంలో రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాజధానిలో ఎల్‌పీఎస్ లేఔట్లలో అభివృద్ధి పనుల పురోగతి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగులు, న్యాయమూర్తుల నివాస భవనాలు, రహదారులు, వరద నియంత్రణ పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. రాజధానిలో ప్రస్తుతం రూ.50,552 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని, 74 పనులు ప్రారంభమయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆయా పనుల్ని మరింత వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతి నెలా అమరావతి పనుల పురోగతిపై సమీక్ష చేస్తానన్నారు. సమయం ప్రకారం పనులు పూర్తి కాకపోతే సదరు కాంట్రాక్ట్ సంస్థతో పాటు అధికారులు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. పనుల పురోగతిని రియల్‌టైంలో పర్యవేక్షిస్తానని వెల్లడించారు. అమరావతిలో కార్యాలయాల నిర్మాణాలు చేపట్టనున్న వివిధ సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. 'బిట్స్ పిలానీ, ఎక్స్ఎల్ఆర్ఐ తదితర సంస్థలకు త్వరితగతిన భూమి కేటాయించాలి. ఇప్పటివరకు భూములు కేటాయించిన 72 సంస్థలు ఏ మేరకు నిర్మాణాలు చేపడుతున్నాయో (మిగతా 15లో)

స్త్రీశక్తి పథకం అమలులో ఇబ్బందులు రాకూడదు: సీఎం 15లో

వాగ్వాదాలు.. ఘర్షణలు.. నిరసనలు

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ముగిసిన ఉప ఎన్నికలు

పలుచోట్ల వైకాపా శ్రేణుల కవ్వింపు చర్యలు

తెదేపా కార్యకర్తలు అడ్డుకోవడంతో రాస్తారోకోలు



అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడితో వాగ్వాదానికి దిగిన మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి

ఈనాడు, కడప- న్యూస్‌టుడే, పులివెందుల, ఒంటిమిట్ట: రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిన వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు ఘర్షణలు, నిరసనలు, చెదురుమదురు ఘటనల మధ్య మంగళవారం ముగిశాయి. ఈ రెండు స్థానాలను ఇటు కూటమి పార్టీలు, అటు వైకాపా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే ధ్యేయంగా పార్టీల నేతలు కొద్దిరోజులుగా హోరాహోరీ ప్రచారం సాగించారు. బ్యాలట్ పద్ధతిలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు పులివెందులలో 76.44 శాతం, ఒంటిమిట్టలో 81.53 శాతం ఓటింగ్ నమోదైంది. బ్యాలట్ బాక్సులను కడపలోని మౌలానా అబుల్‌కలాం ఉర్దూ యూనివర్సిటీకి తరలించారు. ఈనెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. గతానికి భిన్నంగా హింసాత్మక ఘటనలకు తావు లేకుండా ఈసారి పులివెందుల ఎన్నిక ముగియడంతో ఓటర్లతో పాటు అధికారులూ ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. పల్లెల నుంచి ఓటర్ల రాకపోకలకు వీలుగా ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఈ స్థానానికి 11 మంది అభ్యర్థులు బరిలో నిలవగా తెదేపా, వైకాపా అభ్యర్థులైన (మిగతా 5లో)

అవినాష్‌రెడ్డి.. రోజంతా నానా యాగీ! 5లో

ఆశాలకు గ్రాట్యుటీ, ప్రసూతి సెలవులు
లోపలి పేజీల్లో
పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు
రాష్ట్రంలో నేడు అతిభారీ వర్షాలు

మద్యం దోపిడీకి చట్టబద్ధత ముసుగు
కేపీఎంజీని రంగంలోకి దించి మద్యం మాఫియా డ్రామా
2లో
ముడుపుల వసూళ్లకు ధనుంజయరెడ్డి ఆదేశాలు
మాన్యువల్‌గా సరఫరా ఆర్డర్ల జారీలో ఆయన హస్తం
అనుబంధ అభియోగపత్రంలో వివరించిన సిట్

ఇదీ సంగతి!



ఏం టెన్షన్ పడకండి సార్!
ఎవరూ రావట్లేదు!!

30 కార్పొరేషన్లకు కొత్త ఛైర్మన్లు



పోతుల బాలకోటయ్య | బుచ్చి రామ్‌ప్రసాద్ | నాదెండ్ల బ్రహ్మం చౌదరి | నాగుల్‌మీరా కసుమూరి | దాసరి శ్రీనివాసులు

- హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు
- బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బుచ్చి రామ్‌ప్రసాద్
- పోతుల బాలకోటయ్యకు సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ పోస్టు
- ఒంగోలు నగరాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవి జనసేనకు

ఈనాడు, అమరావతి: రాష్ట్రప్రభుత్వం 30 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించింది. వాటిలో తెదేపాకు 24, మిత్రపక్షాలైన జనసేనకు 3, భాజపాకు 2 పోస్టులు కేటాయించింది. వైకాపా హయాంలో రాజధాని అమరావతి పరిరక్షణకు వివిధ రూపాల్లో పోరాడినవారికి నామినేటెడ్ పదవుల్లో సముచిత ప్రాధాన్యమిస్తున్న కూటమి ప్రభుత్వం... ఆ క్రమంలో అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్యకు రాష్ట్ర సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ పదవి కట్టబెట్టింది. జగన్ ప్రభుత్వ దమనకాండను ఆయన తీవ్రంగా ఎండగట్టారు. కీలకమైన తెలుగు, సంస్కృత అకాడెమీ, హిందూధర్మ (మిగతా 2లో)

ఆశాలకు గ్రాట్యుటీ, ప్రసూతి సెలవులు

పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు

ఈనాడు, అమరావతి: ఆశా కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న వారి ప్రధాన డిమాండ్లను అంగీకరించింది. ఆశాల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడంతో పాటు గ్రాట్యుటీ, ప్రసూతి సెలవులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆశాలు పనిచేసిన కాలానికి సంవత్సరానికి రూ.5 వేల చొప్పున గరిష్ఠంగా ప్రతి ఆశాకు రూ.1.50 లక్షలు గ్రాట్యుటీ ఇచ్చేందుకు అంగీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 43 వేల మంది ఆశా వర్కర్లు గ్రామ స్థాయిలో వివిధ వైద్యారోగ్య పథకాల కింద సేవలందిస్తున్నారు. వీరందరికీ గ్రాట్యుటీ ఇచ్చేందుకు రూ.645 కోట్లను ప్రభుత్వం వెచ్చించనుంది. ఒక్కో ప్రసవానికి ఆరు నెలల చొప్పున మొదటి రెండు ప్రసవాలకు వేతనాలతో కూడిన సెలవు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఆశాలకు గ్రాట్యుటీ చెల్లిస్తున్న మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందని అధికారులు పేర్కొన్నారు.

వార్-2, కూలీ సినిమా టికెట్ రేట్ల పెంపునకు అనుమతి

ఈనాడు, అమరావతి: రజనీకాంత్ నటించిన కూలీ, జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ నటించిన వార్-2 సినిమాల టికెట్ రేట్లను పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ రెండు చిత్రాలకు ఈ నెల 14న ఉదయం 5 గంటలకు స్పెషల్ షో వేసుకునేందుకు కూడా అనుమతించింది.

మద్యం దోపిడీకి చట్టబద్ధత ముసుగు

- కేపీఎంజీని రంగంలోకి దించి మద్యం మాఫియా డ్రామా
- రూ.వేల కోట్ల దోపిడీయే అసలు ఎజెండా

ఈనాడు, అమరావతి: "భారీగా ముడుపులు చెల్లించే డిస్టిలరీలు, మద్యం సరఫరాదారులు, బినామీ డిస్టిలరీలకే పెద్ద ఎత్తున మద్యం ఆర్డర్లు ఇవ్వాలి. రూ.వేల కోట్లు దండుకోవాలి. ముడుపులు ఇచ్చేందుకు ముందుకురాని బ్రాండ్లను తొక్కేయాలి. ఆటోమేటిక్‌గా మద్యం సరఫరా ఆర్డర్లు (ఓఎఫ్ఎస్) ఇచ్చే విధానంలో ఈ పాచిక పారదు కాబట్టి, మాన్యువల్ విధానాన్ని తేవాలి. పోటీని పెంచేందుకు చిన్న కంపెనీలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పాలి. ఆ ముసుగులో బినామీ కంపెనీలకు దోచిపెట్టి, ముడుపులు దండుకోవాలి. దశలవారీ మద్యనిషేధం ముసుగులో ఈ కుట్ర అమలుచేయాలి. కానీ చూసేవారికి ఇదంతా ఒక పద్ధతి ప్రకారం, చట్టబద్ధంగా జరిగినట్టుగా కలరింగ్ ఇవ్వాలి" ఇదీ వైకాపా హయాంలో మద్యం మాఫియా అమలుచేసిన పన్నాగం! దీనికోసం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీని రంగంలోకి దించింది. దోపిడీయే అసలు లక్ష్యంగా అమల్లోకి తెచ్చిన కొత్త మద్యం విధానానికి విశ్వసనీయత ఆపాదించేందుకు కేపీఎంజీని వాడుకుంది. మద్యం మాఫియా... తుపాకీని కేపీఎంజీ భుజాలపై పెట్టి కాల్చింది. మద్యం కుంభకోణం కేసులోని ఈ కుట్రకోణాన్ని సిట్... అనుబంధ ఛార్జిషీట్‌లో బయటపెట్టింది.

టెండర్ పిలవకుండానే కేపీఎంజీ నియామకం

కొత్త మద్యం విధానంలో భాగంగా ఇండెంటింగ్, ఆడిటింగ్, ఎకౌంటింగ్ లాంటి అంశాల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సూచనలు, సలహాలు ఇచ్చేందుకంటూ కేపీఎంజీ సంస్థను ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్) కన్సల్టెంట్‌గా నియమించింది. 2019 జులైలో అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ఎం.ఎం.నాయక్ కేపీఎంజీ ప్రతినిధి సందీప్‌ని పిలిపించి చర్చించారు. తర్వాత కేపీఎంజీ డైరెక్టర్ రెబ్బాప్రగడ బాలసుబ్రహ్మణ్య రామప్రసాద్ ప్రసాదంపాడులోని ఎక్సైజ్ కమిషనర్ నాయక్‌ను కలిశారు. అనంతరం కేపీఎంజీ 2019 సెప్టెంబరు 13న ఎస్‌బీసీఎల్‌కి ప్రతిపాదన అందజేసింది. ఎస్‌బీసీఎల్ ఎండీ... బోర్డు సభ్యులతో చర్చించకుండా, టెండర్లు పిలవకుండా మర్నాడే కేపీఎంజీకి వర్క్ ఆర్డర్ ఇచ్చేశారు. కేపీఎంజీ సంస్థ... ఇండెంట్ ప్రక్రియ, చెల్లింపులు, స్టాక్ రీకన్సీలియేషన్, ఆడిట్, భౌతిక తనిఖీలు, ఐటీ వ్యవస్థలు, చెల్లింపుల విధానం, జరిమానాలు, అదనపు ఆదాయ వనరులు, హెల్ప్‌లైన్ సిస్టమ్స్, ఆన్‌లైన్‌లో చెల్లింపుల వంటి 10 అంశాలపై 2019 నవంబరు 4న ముసాయిదా నివేదిక అందజేసింది.

◆ అప్పటివరకు మద్యం సరఫరాదారులు మూడునెలల సగటు విక్రయాల్ని లెక్కలోకి తీసుకుని దానికి ఒకటిన్నర రెట్లు కలిపి మద్యం ఆటోమేటిగ్గా సరఫరా చేసేస్తున్నారని, దానివల్ల గోడౌన్లలో నిల్వలు పేరుకుపోతున్నాయని కేపీఎంజీ గుర్తించింది. దానికి బదులు గడచిన మూడేళ్లలో ప్రతి త్రైమాసికంలో సగటు విక్రయాల్ని పరిగణనలోకి తీసుకుని సరఫరా ఆర్డర్లు ఇవ్వాలని, అదీ ఎస్‌బీసీఎల్ కేంద్ర కార్యాలయం నుంచే జరగాలని కేపీఎంజీ సూచించింది. కానీ మద్యం మాఫియా కోరుకుంది... ఇలాంటి సలహాల్ని కాదు. కేపీఎంజీ సూచన అమలుచేయడం సాధ్యం కాదని అప్పటి ఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ చెప్పేశారు. మద్యం మాఫియా అసలు ఎజెండాను అప్పుడు తెరపైకి తెచ్చింది. మార్కెట్‌లో పోటీ పెంచేందుకు కొత్త బ్రాండ్లను ప్రోత్సహించేలా తగిన సూచనలు, సలహాలతో నివేదిక ఇవ్వాలని, స్టేక్‌హోల్డర్లు, మద్యం తయారీదారులు, అసోసియేషన్లు చిన్న, కొత్త సరఫరాదారుల నుంచి ఆ మేరకు విజ్ఞప్తులు వస్తున్నాయని అప్పటి ఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి కేపీఎంజీకి సూచించారు. తమిళనాడు, కేరళల్లో అనుసరిస్తున్న విధానాల్ని పరిశీలించి, ఇండెంటింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. మాన్యువల్ విధానం అమల్లోకి తెచ్చి మొత్తం వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకోవడానికి అలా బీజం వేశారు.

మద్యం మాఫియా కోరినట్టే నివేదిక

కేపీఎంజీ 2019 డిసెంబరు 6న నాలుగు అంశాలతో ఒక ముసాయిదా నివేదిక అందజేసింది. దాన్ని పరిపుష్టం చేస్తూ డిసెంబరు 12న ఆరు పాయింట్లతో మరో నివేదిక ఇచ్చింది. "ఆటోమేటిక్ ఇండెంట్ ప్రక్రియలో... టెండర్ నోటిఫికేషన్‌ని బట్టి సరఫరా ఆర్డర్లు నిర్ణయిస్తారు. ఒకసారి దాన్ని ఆమోదించాక ఎస్‌బీసీఎల్ మార్పులేమీ చేయలేదు. కానీ ప్రభుత్వం దశలవారీగా మద్యనిషేధం అమలు చేయాలనుకుంటోంది కాబట్టి.. డిమాండ్ తగ్గినప్పుడు దానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు, ఎడిటింగ్ ఆటోమేటిక్ విధానంలో వీలుపడదు. మాన్యువల్ విధానం అమల్లోకి తేవాలి" అని కేపీఎంజీ సిఫారసు చేసింది. కేపీఎంజీ నివేదికతో పాటు, అప్పట్లో ఏలూరు డిపో మేనేజర్ నుంచి వచ్చిన ఒక లేఖలోని అంశాల్ని పూర్తిగా వక్రీకరిస్తూ, ఆటోమేటిక్ ఆర్డర్ విధానాన్ని వాసుదేవరెడ్డి రద్దుచేసినట్టు సిట్ పేర్కొంది. కేపీఎంజీ ఆరు పాయింట్లతో ఇచ్చిన తుది నివేదికను కాకుండా... నాలుగు అంశాలతో ఇచ్చిన ముసాయిదా నివేదికలో తమకు అనుకూలంగా ఉన్న అంశాల్నే వాడుకున్నారని తెలిపింది.

కేపీఎంజీ చెప్పని విషయాలు.. చెప్పినట్టుగా!

◆ కేపీఎంజీ సిఫార్సులు అమలుపై రూపొందించిన నోట్‌ఫైల్‌లోనూ ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు వక్రీకరణలకు పాల్పడి, తమకు అనుకూలంగా రాసుకున్నారని సిట్ గుర్తించింది. తమ నివేదికలో పేర్కొనని కొన్ని అంశాలనూ నోట్‌ఫైల్‌లో తమకు ఆపాదించారని ఈ కేసు దర్యాప్తులో సాక్ష్యం ఇచ్చిన కేపీఎంజీ డైరెక్టర్ రవి పేర్కొన్నారు.

◆ మద్యం డిస్టిలరీల నుంచి డిపోల వరకు మద్యం సరఫరా వ్యవహారాల్ని ట్రాక్ చేసేందుకు ఉపయోగిస్తున్న 'హెచ్‌పీఎఫ్ఎస్' విధానంలో కేపీఎంజీ మార్పులు సూచించినట్లు నోట్‌ఫైల్‌లో పేర్కొన్నారు. కానీ కేపీఎంజీ అసలు ప్రస్తావించలేదు. ఇలాంటివే మరికొన్ని కేపీఎంజీ చెప్పని అంశాల్ని చెప్పినట్టుగా నోట్‌ఫైల్‌లో పేర్కొన్నట్లు సిట్ గుర్తించింది.

◆ మద్యం ఆర్డర్లను సిస్టమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆటోమేటిక్ విధానంలో జారీచేసే విధానాన్ని 2019 అక్టోబరు నుంచి వాసుదేవరెడ్డి రద్దు చేశారు. దాని స్థానంలో మాన్యువల్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు, దానికి విశ్వసనీయత, చట్టబద్ధత ఆపాదించేందుకు కేపీఎంజీ నివేదిక వాడుకున్నారని సిట్ పేర్కొంది.

◆ నోట్‌ఫైల్‌ని 2020 జనవరిలో సర్క్యులేట్ చేశారు, దాన్ని ఆరుగురు అధికారులు సంతకాలు చేశారని సిట్ తెలిపింది. కానీ ఎక్కడా తేదీని ప్రస్తావించలేదని పేర్కొంది. మద్యం మాఫియా ఆదేశాల మేరకు ఉద్దేశపూర్వకంగానే తేదీ నమోదు చేయలేదని సిట్ పేర్కొంది.

ముడుపుల వసూళ్లకు ధనుంజయరెడ్డి ఆదేశాలు

- మాన్యువల్‌గా సరఫరా ఆర్డర్ల జారీలో ఆయన హస్తం
- ఎక్సైజ్ శాఖ విధుల్లో జోక్యం చేసుకున్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి
- అనుబంధ అభియోగపత్రంలో వివరించిన సిట్


ధనుంజయరెడ్డి

ఈనాడు, అమరావతి: మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్లకు వీలుగా రూపొందించిన కుట్రను అమలుచేసేలా.. నాటి సీఎంఓ కార్యదర్శి విశ్రాంత ఐఏఎస్ అధికారి కాల్వ ధనుంజయరెడ్డి (ఏ-31) ఎప్పటికప్పుడు ఆదేశాలిచ్చేవారని సిట్ తేల్చింది. అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ డి.వాసుదేవరెడ్డి (ఏ-2), ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి (ఏ-1) ఆయనే దిశానిర్దేశం చేసేవారని గుర్తించింది. అంతకుముందు వరకూ ఆటోమేటిక్ పద్ధతిలో జారీచేసే మద్యం సరఫరా ఆర్డర్లను.. మాన్యువల్ పద్ధతిలోకి మార్చటం, తమ కుట్రలో భాగస్వాములైన ముఠా సభ్యుల్ని ఏపీఎస్‌బీసీఎల్‌లోని కీలక స్థానాల్లో నియమించడంలో ఆయనదే ప్రధాన హస్తమని పేర్కొంది. ముందుగా అనుకున్నట్లే కుట్ర అమలవుతుందా? లేదా అనే అంశాలపై సమీక్షించేందుకు రజత్ భార్గవ, డి.వాసుదేవరెడ్డి, డి.సత్యప్రసాద్‌లతో ఆయన ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించేవారని వెల్లడించింది. రాజ్ కెసిరెడ్డి, ఆయన అనుచరగణం నుంచి ధనుంజయరెడ్డికి ముడుపుల సొమ్ము చేరేదని నిర్ధారించింది. తాజాగా దాఖలుచేసిన అనుబంధ అభియోగపత్రంలో సిట్ ఈ వివరాలన్నీ ప్రస్తావించింది. ధనుంజయరెడ్డితో పాటు జగన్ ఓఎస్డీ పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ (ఏ-33) ఈ కుట్రలో పాత్రధారులేనని సిట్ పేర్కొంది. ప్రధానాంశాలివి.

ఆధారాల ధ్వంసం..

మద్యం సరఫరా ఆర్డర్ల (ఓఎఫ్ఎస్) రికార్డుల ట్యాంపరింగ్, వాటి విధ్వంసం ఎలా చేయాలో చర్చించేందుకు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సహా పలువురు 2024 జనవరిలో తాడేపల్లిలో సమావేశమయ్యారు. వీరిద్దరూ ఈ భేటీల్లో పాల్గొన్నట్లు సెల్ టవర్ డేటా విశ్లేషణ, సాక్షుల వాంగ్మూలాల ద్వారా తేలింది. ప్రభుత్వ రికార్డుల మానిప్యులేషన్‌లో వీరిద్దరి ప్రత్యక్ష ప్రమేయం, కుట్ర ఉన్నాయి. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలు.. ఎక్సైజ్ శాఖ అధికారిక విధుల్లో జోక్యం చేసుకునేవారు. ఏపీఎస్‌బీసీఎల్‌లో అక్రమాలు, అవకతవకలపై నాటి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రజత్ భార్గవ చాలాసార్లు మెమోలు జారీ చేసినా.. నాటి ఎండీ వాసుదేవరెడ్డి (ఏ-2), ప్రత్యేకాధికారి సత్యప్రసాద్‌పై (ఏ-3) క్రమశిక్షణ చర్యలేవీ తీసుకోవొద్దంటూ ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలు తీవ్ర ఒత్తిడి తెచ్చేవారు. వీరి జోక్యం వల్ల ఏపీఎస్‌బీసీఎల్‌లో ఆర్థిక అక్రమాలు కొనసాగాయి.

ఎన్నికల్లో మద్యం ముడుపుల సొమ్ము వెచ్చించేందుకు వార్ రూమ్ సమావేశాలు

జగన్ ఓఎస్డీగా పనిచేసిన పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి.. .. గత ఎన్నికలకు ముందు వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డితో వార్‌రూమ్‌లో తరచూ రహస్యంగా సమావేశమయ్యేవారు. మద్యం ముడుపుల ద్వారా కొల్లగొట్టిన సొత్తును వైకాపా తరఫున ఎన్నికల్లో ఎలా ఖర్చుచేయాలో చర్చించుకునేవారు. మద్యం ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ నిర్వహించిన ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ అధికారుల మధ్య సంధానకర్తగా వ్యవహరించారు. ఓఎఫ్ఎస్ నోట్‌ఫైళ్లను ట్యాంపరింగ్ చేయటంలో ఫెసిలిటేటర్‌గా ఉన్నారు. మద్యం కుంభకోణం కుట్ర అమలు కోసం వాసుదేవరెడ్డి, రజత్‌భార్గవలకు ఎప్పటికప్పుడు ఆదేశాలిచ్చారు. రాజ్ కెసిరెడ్డి నుంచి మద్యం ముడుపుల సొమ్ము తీసుకున్నారు. మద్యం ముఠా ఆయన ఖాతాల్లోకి ఎప్పటికప్పుడు ముడుపుల సొమ్ములో కొంత సీడీఎంల ద్వారా జమచేసేది.

అత్యున్నత స్థాయి రాజకీయ ఏజెంట్

మద్యం కుంభకోణానికి పాల్పడ్డ ముఠాలో భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ (ఏ-33) కీలక సభ్యుడు. ముడుపుల వసూళ్ల నుంచి ఆ సొమ్ము మళ్లింపు వరకూ ప్రతిదశలోనూ ఆయనది ప్రధాన పాత్ర. అత్యున్నత స్థాయి రాజకీయ ఏజెంట్‌గా వ్యవహరించేవారు. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డితో తరచూ రహస్యంగా సమావేశమయ్యేవారు. ఆయన నుంచి ముడుపుల సొమ్ము ఎప్పటికప్పుడు సేకరించి, దాన్ని పట్టుకుని వెళ్లేవారు. ఈ ముఠా ఎలా కార్యకలాపాలు నిర్వహించాలో గోవిందప్ప బాలాజీయే సూచించేవారు. దర్యాప్తునకు తీవ్ర ఆటంకం కలిగించారు. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్, విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలతో హైదరాబాద్, విజయవాడల్లో తరచూ సమావేశమై... మద్యం ముడుపులపై చర్చించేవారు.

30 కార్పొరేషన్లకు కొత్త ఛైర్మన్లు

(మొదటి పేజీ తరువాయి)

పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్ పదవులను భాజపాకు కేటాయించింది. తెలుగు, సంస్కృత అకాడెమీ ఛైర్మన్‌గా ఆర్డీ విల్సన్, హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు నియమితులయ్యారు. దాసరి శ్రీనివాసులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక పోస్టుల్లో పనిచేశారు. పదవీవిరమణ అనంతరం భాజపాలో చేరారు. మండలి మాజీ వైస్‌ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం భార్య రెడ్డి అనంతకుమారిని బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించింది. ఒంగోలు నగరాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవి జనసేనకు చెందిన షేక్ రియాజ్‌కి దక్కింది. జగన్ ప్రభుత్వ దాష్టీకాలకు ఎదురొడ్డి, అనేక నిర్బంధాలు, కేసులు ఎదుర్కొన్న తెదేపా యువనేత నాదెండ్ల బ్రహ్మం చౌదరికి కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి లభించింది. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న బుచ్చి రామ్‌ప్రసాద్‌కి బ్రాహ్మణ సంక్షేమసంస్థ ఛైర్మన్ పదవి దక్కింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు నాగుల్‌మీరాను నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ సంస్థ ఛైర్మన్‌గా నియమించారు. 2014-19 మధ్య మాంసం అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పనిచేసిన 'చంద్రదండు' ప్రకాశ్‌నాయుడికి మళ్లీ అదే పోస్టు లభించింది. రాష్ట్రప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో... కళింగ కోమటి, కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కూడా ఉంది. ఆ పోస్టులో ఆమదాలవలసకు చెందిన కాళింగ సామాజికవర్గానికి చెందిన మొదలవలస రమేష్‌ని పొరపాటున నియమించింది. ఆ తర్వాత ఆ నియామకాన్ని ఉపసంహరించుకుంది. త్వరలో ఆ పోస్టును భర్తీచేస్తామని తెలిపింది.

వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్ల వివరాలు

సంస్థ	ఛైర్మన్	పార్టీ
ఎస్సీ సహకార ఆర్థిక సంస్థ	ఆకెపోగు ప్రభాకర్ (కోడుమూరు)	తెదేపా
సామాజిక సంక్షేమ మండలి	పోతుల బాలకోటయ్య (నందిగామ)	అమరావతి బహుజన ఐకాస
కమ్మ కార్పొరేషన్	నాదెండ్ల బ్రహ్మం చౌదరి (గురజాల)	తెదేపా
బ్రాహ్మణ సంక్షేమ సంస్థ	బుచ్చి రామ్‌ప్రసాద్ (గుంటూరు పశ్చిమ)	తెదేపా
ముదలియార్ సంక్షేమ, అభివృద్ధి సంస్థ	సీఎస్ త్యాగరాజన్ (చిత్తూరు)	తెదేపా
బొందిలి సంక్షేమ, అభివృద్ధి సంస్థ	డి.విక్రమ్‌సింగ్ (కర్నూలు)	తెదేపా
హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ)	దాసరి శ్రీనివాసులు (తిరుపతి)	భాజపా
వడ్డి అభివృద్ధి సంస్థ	జి.వెంకటలక్ష్మి (దెందులూరు)	జనసేన
ఆరెకటిక సంక్షేమ, అభివృద్ధి సంఘం	హరికృష్ణారావు హనుమంతకరి (తాడిపత్రి)	తెదేపా
విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి సంస్థ	కమ్మరి పార్వతి (పాణ్యం)	తెదేపా
కుంచిటి వక్కలిగ సంక్షేమ, అభివృద్ధి సంఘం	లక్ష్మీనారాయణ (మడకశిర)	తెదేపా
నగరాల సంక్షేమ, అభివృద్ధి సంస్థ	మరుపిళ్ల తిరుమలేశ్వరరావు (విజయవాడ పశ్చిమ)	తెదేపా
పాల-ఏకరి సంక్షేమ అభివృద్ధి సొసైటీ	నాగేశ్వరనాయుడు కందూరి (రాయచోటి)	తెదేపా
నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్	నాగుల్‌మీరా కొసునూరి (విజయవాడ పశ్చిమ)	తెదేపా
కూరాకుల, పొందర సంక్షేమ, అభివృద్ధి సొసైటీ	నరసింహులు దామోదర (నరసన్నపేట)	తెదేపా
వికలాంగులు, వృద్ధుల సహాయ సంస్థ	నారాయణస్వామి (రాప్తాడు)	తెదేపా
కనీస వేతన సలహా బోర్డు	పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి (కోవూరు)	తెదేపా
మాంసం అభివృద్ధి సంస్థ	ప్రకాశ్ నాయుడు (సింగనమల)	తెదేపా
తెలుగు, సంస్కృత అకాడమీ	ఆర్డీ విల్సన్ (నెల్లూరు సిటీ)	భాజపా
సగర, ఉప్పర సంక్షేమ, అభివృద్ధి సంస్థ	ఆర్.వెంకటరమణప్ప (పెనుకొండ)	తెదేపా
నాగవంశం సంక్షేమ, అభివృద్ధి సంస్థ	రమణారావు ఎరుబోతు (విజయవాడ సెంట్రల్)	తెదేపా
సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ	రవి మందలపు (రాజమహేంద్రవరం సిటీ)	తెదేపా
వెనుకబడిన తరగతుల సహకార ఆర్థికసంస్థ	రెడ్డి అనంతకుమారి (కొత్తపేట)	తెదేపా
బెస్త సంక్షేమ, అభివృద్ధి సంస్థ	శ్రీధర్ బొమ్మన (సూళ్లూరుపేట)	తెదేపా
ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ	షేక్ రియాజ్ (ఒంగోలు)	జనసేన
జానపద కళలు, సృజనాత్మక అకాడమీ	వంపూరు గంగులయ్య (పాడేరు)	జనసేన
వీరశైవ లింగాయత్ సంక్షేమ, అభివృద్ధి సొసైటీ	స్వప్న (అనంతపురం అర్బన్)	తెదేపా
కృష్ణ బలిజ, పూసల సహకార ఆర్థిక సంస్థ	త్రిమూర్తులు గంటా (భీమవరం)	తెదేపా
జంగం సంక్షేమ, అభివృద్ధి సొసైటీ	వి.చంద్రశేఖర్ (పీలేరు)	తెదేపా
దాసరి సంక్షేమ, అభివృద్ధి సంఘం	వెంకట రత్నాజీ పొట్నూరు (శృంగవరపుకోట)	తెదేపా

మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్‌లకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఇవి అందుబాటులో లేకపోవటం వల్ల బహిరంగ మద్యపానం పెరిగి, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా వీటికి అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పర్మిట్ రూమ్ ప్లింత్ ఏరియా 1,000 చదరపు అడుగులకు మించి ఉండరాదని, మద్యం దుకాణం పక్కనే ఈ ప్రాంగణం ఉండాలని నిర్దేశించింది. రూ.55 లక్షల లోపు వార్షిక లైసెన్సు రుసుము చెల్లించే దుకాణాలకు రూ.5 లక్షలు, రూ.65-85 లక్షల వార్షిక లైసెన్సు రుసుము చెల్లించే దుకాణాలకు రూ.7.50 లక్షలను పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు రుసుముగా (రిటైల్ ఎక్సైజ్ సుంకం) నిర్ణయించింది. ఈ మొత్తం రుసుము ఒకే విడతలో చెల్లించాలి. 2025-26 సంవత్సరానికి సంబంధించి పర్మిట్ రూమ్‌ల లైసెన్సు రుసుమును నవంబరు 10 లోగా చెల్లించాలని సూచించింది. ఈ మేరకు మద్యం దుకాణాల లైసెన్సుదారులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. పర్మిట్ రూమ్‌ల్లో వంటలకు అనుమతించరు. రెడీ టూ ఈట్ స్నాక్స్‌కు మాత్రమే అనుమతిస్తారు. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు తాగడానికి, చేతులు కడుక్కోవడానికి నీళ్లు అందుబాటులో ఉంచాలి. ఈ మేరకు విధివిధానాలు నిర్దేశిస్తూ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బహిరంగ మద్యపానానికి అడ్డుకట్ట వేసేందుకు పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగతి: ప్రధాని మోదీ

దిల్లీ: సెమీకండక్టర్ల ఉత్పత్తిలో భారత్ వేగంగా పురోగమిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ ప్రగతి అంతర్జాతీయంగా నవీన ఆవిష్కరణలకు, భావి డిజిటల్ రంగాన్ని అందిపుచ్చుకునేందుకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుందని తెలిపారు. కేంద్ర క్యాబినెట్ నాలుగు సెమీకండక్టర్ తయారీ యూనిట్లకు మంగళవారం ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రధాని ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. ఈ యూనిట్లు నెలకొల్పడం ద్వారా దేశంలో తయారీ రంగం ఊపందుకుంటుందని, అధిక నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాలను కల్పిస్తుందని, ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ కీలక పాత్రధారిగా ఎదుగుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

డబుల్ ఇంజిన్ సర్కారు వల్లే సాధ్యమైంది: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: డబుల్ ఇంజిన్ సర్కార్ కారణంగానే సెమికండక్టర్ తయారీ యూనిట్ రాష్ట్రానికి వస్తోందని, ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'అడ్వాన్స్‌డ్ సిస్టం ఇన్ ప్యాకేజి టెక్నాలజీస్.. కొరియాకు చెందిన అపాక్ట్ కంపెనీ లిమిటెడ్‌తో కలిసి ఏటా 96 మిలియన్ యూనిట్ల చిప్‌ల తయారీకి ఒప్పందం కుదుర్చుకుంది. వాటిని మొబైల్ ఫోన్లు, సెట్ టాప్ బాక్సులు, ఆటోమొబైళ్లు, ఇతర నూతన ఎలక్ట్రానిక్ గృహోపకరణాల తయారీలో వినియోగిస్తారు' అని పేర్కొన్నారు.

సెమీ కండక్టర్ యూనిట్ కేటాయింపు హర్షణీయం: మాధవ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి సెమీ కండక్టర్ యూనిట్ కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర దిశ మారనుంది: యామినీశర్మ

రాష్ట్రానికి సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర దిశను మారుస్తుందన్నారు.

గ్రహం అనుగ్రహం

13–8–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
చవితి: ఉ. 8-16 తదుపరి పంచమి
ఉత్తరాభాద్ర: మ. 1-05 తదుపరి రేవతి
వర్జ్యం: రా. 12-23 నుంచి 1-54 వరకు
అమృత ఘడియలు: ఉ. 8-31 నుంచి 10-02 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-39 నుంచి 12-29 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.45; **సూర్యాస్తమయం:** సా.6.24

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.5	26.0
తాడేపల్లిగూడెం	36.3	26.7
విశాఖపట్నం	36.2	25.6
విజయనగరం	36.0	27.0
విజయవాడ	35.4	25.2
శ్రీకాకుళం	34.0	27.0
నరసాపురం	34.0	26.1
ఒంగోలు	33.5	26.0
నెల్లూరు	31.6	27.1
కర్నూలు	31.1	23.2
గుంటూరు	31.0	27.0
అనంతపురం	30.1	23.5
తిరుపతి	30.0	23.6
హైదరాబాద్	29.3	21.6
కడప	29.0	24.0


ఈనాడు

ట్రంప్ స్వార్థం... మునీర్ మూర్ఖత్వం!

'చంకదుడ్డు శరణార్థి' అని తెలుగులో ఓ జాతీయం ఉంది. పైకి భయం నటిస్తూ, శరణు కోరుతూ వచ్చి ఆఖరికి ఆశ్రయం ఇచ్చినవాళ్ల గొంతులను కోసేసే దుర్మార్గుల గురించి చెప్పేటప్పుడు దీన్ని వాడతారు. అలాంటి నయవంచకత్వాన్ని నరనరానా నింపుకొన్న పాకిస్థాన్- ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశమని డొనాల్డ్ ట్రంప్ మొదటి హయాంలో అమెరికా రక్షణ మంత్రిగా పనిచేసిన జేమ్స్ మాటిస్ ఛీత్కరించారు. పాక్ అధునాతన అణ్వాయుధ సాంకేతికతలను సమకూర్చుకుంటోందని అగ్రరాజ్య జాతీయ భద్రతా ఉప సలహాదారుగా జాన్ ఫైనర్ నిరుడు ఆందోళన వ్యక్తంచేశారు. దానివల్ల అమెరికాకూ ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. పాక్‌ను చేరదీయడమంటే పాముకు పాలుపోసినట్లేనని స్వదేశీయులే నెత్తీనోరూ కొట్టుకుంటున్నా ట్రంప్ మాత్రం ఇస్లామాబాద్‌పై ఎనలేని ప్రేమాభిమానాలను ఒలకబోస్తున్నారు. దాంతో కన్నూమిన్నూ కానక ప్రవర్తిస్తున్న పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఆసిం మునీర్- తాజాగా అగ్రరాజ్య గడ్డపైనుంచే అణ్వాయుధ బెదిరింపులకు దిగారు. తమ అస్తిత్వానికి ప్రమాదం ఎదురైతే, సగం ప్రపంచాన్ని అణ్వాయుధ జ్వాలల్లో దహించివేస్తామన్న మునీర్‌వి ఒట్టి చిల్లర ప్రేలాపనలు కావు- ఆయన పైశాచిక మనోప్రవృత్తిని పట్టించే విషవ్యాఖ్యలవి! పాక్ వంటి మూర్ఖ, ఛాందస, అస్థిర దేశం చేతుల్లో అణ్వాయుధాలు ఉండటం- విశ్వశాంతికి వినాశహేతువు అన్నది వాస్తవం!

అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో పాకిస్థాన్‌ను పావుగా వాడుకుంటున్న అమెరికా- 2004లోనే పాక్‌కు నాటోయేతర ప్రధాన భాగస్వామ్యపక్షమనే హోదా కట్టబెట్టింది. 1948-2010 మధ్యలో ఇస్లామాబాద్‌కు నేరుగా 3వేల కోట్ల డాలర్లకు పైగా ధనసాయం చేసిన వాషింగ్టన్- 2013 తరవాత పదేళ్లలో 707 కోట్ల డాలర్లను సమకూర్చింది. ఆ దశాబ్దంలోనే సామాజిక భద్రత, అభివృద్ధి పనుల కోసమంటూ మరో 113 కోట్ల డాలర్లనూ ఉదారంగా అందించింది. అమెరికాతో పాటు బ్రిటన్, చైనా, జర్మనీ, జపాన్, సౌదీల నుంచి దండిగా విదేశీ సాయం పొందిన పాక్- ఐఎంఎఫ్ వంటి వాటి దగ్గర ఎప్పటికప్పుడు అప్పుల ముష్టి ఎత్తుతోంది. ఆ సొమ్ములతో ఉగ్రవాదులను ఎగదోస్తూ ఇండియాపై నిత్యం ప్రచ్ఛన్న యుద్ధం చేస్తోంది. బిన్ లాడెన్‌ను దాచిపెట్టడం మొదలు అఫ్గాన్‌లో అమెరికన్ సేనలపై దాడులకు పాల్పడిన హక్కానీలకు దన్నుగా నిలబడటం దాకా అగ్రరాజ్యానికీ పాక్ ఎన్నో వెన్నుపోట్లు పొడిచింది. అబద్ధాలూ మోసాలకు పేరుమోసిన 'పాపిస్థాన్'కు సాయంచేయడం దండగని ఏడేళ్ల క్రితం తిట్టిపోసిన ట్రంపే ఇప్పుడు పశ్చిమాసియాలో స్వప్రయోజనాలకోసం పాక్‌ను దువ్వుతున్నారు. ఆయన కుటుంబసభ్యులేమో ఇస్లామాబాద్‌తో ఏకంగా క్రిప్టో వ్యాపారమే చేస్తున్నారు. తక్షణ లాభాలకోసం అగ్రరాజ్యాధిపతి అనుసరిస్తున్న ఆత్మవిధ్వంసక విధానాలే మునీర్ లాంటి కురచబుద్ధుల మనుషులకు కొమ్ములు మొలిపిస్తున్నాయి!

భారత జీడీపీలో స్థూల దేశీయ పొదుపు వాటా 30శాతానికి పైగా ఉంటే- పాక్‌లో అది ఆరుశాతమే. అక్కడి సర్కారీ బడ్జెట్‌లో సగం సొమ్ము విదేశీ రుణాలకు వడ్డీ చెల్లింపులకే పోతోంది. 45శాతం ప్రజానీకం దారిద్ర్యరేఖకు దిగువన కొట్టుమిట్టాడుతుంటే, వారి సంక్షేమాన్ని గాలికొదిలేసిన పాకిస్థాన్- తన రక్షణరంగ వ్యయాన్ని మాత్రం గడచిన నాలుగేళ్లలో దాదాపు రెండింతలకు పెంచింది. సొంత జనాన్ని పస్తులు పెట్టి 170 దాకా అణు వార్‌హెడ్‌లను పోగేసుకున్న పాక్- తన అణ్వాయుధ పాటవానికి ఇంకా పదును పెట్టుకునేందుకు తెగ ప్రయత్నిస్తోంది. ఆ దేశాన్ని కట్టడి చేయాల్సిందిపోయి చంకనేసుకుని తిరుగుతున్న అమెరికా పోకడలు- దక్షిణాసియా సుస్థిరతకే కాదు, ప్రపంచ భద్రతకే పొగపెడుతున్నాయి!




లోకాన్ని చుట్టి వస్తే మనసు విశాలమవుతుంది, ఆలోచనల పరిధి పెరుగుతుంది. ప్రయాణాలు మనలో సహానుభూతిని పెంచుతాయి. వృత్తి ఉద్యోగాల్లో కొత్త విషయాలు తెలుసుకోవడానికి, కొత్త ప్రోత్సాహకాలు అందుకోవడానికి మనల్ని సిద్ధం చేస్తాయి.

– రమేశ్ చంద్ర దత్, చరిత్రకారుడు, ఆర్థికవేత్త

నిజమైన తపస్సు

మాళవదేశాన్ని శిఖిధ్వజుడు ధర్మబద్ధంగా పాలిస్తూ ఉండేవాడు. ఆయన భార్య చూడాల మహాజ్ఞాన సంపన్నురాలు. ఇద్దరూ ఆత్మజ్ఞానం పొందాలనుకున్నారు. కానీ వారి మనఃస్థితులు వేరుగా ఉన్నాయి. శిఖిధ్వజుడు భౌతిక జీవితమే ఆనందకారకం అని భావించాడు. చూడాల నిజమైన జ్ఞానం కోసం భగవత్ తత్త్వాలను అధ్యయనం చేసింది. ఆత్మ కళంకం కాకపోతే జీవాత్మ పరమాత్మతో ఏకమవుతుందని గ్రహించింది. ధ్యానం, తపస్సు ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందింది. రాజు భార్యలో దైవత్వాన్ని గ్రహించి ఇంత ఆనందం ఎలా పొందుతున్నావని ప్రశ్నించాడు. సుఖదుఃఖాల వ్యత్యాసం లేని స్థితిలో, ఇంద్రియాలకు గోచరించని పరబ్రహ్మ స్వరూపాన్ని



తాను దర్శిస్తున్నానని చెప్పింది చూడాల. అది విన్న శిఖిధ్వజుణ్ని వైరాగ్యం ఆవహించింది. సంసార జీవనం వ్యర్థమని భావించి అడవులకు వెళ్లిపోయాడు. కందమూలాలు తింటూ దేహాన్ని శుష్కింపచేస్తూ తపస్సు చేస్తున్నాడు. తన భర్త అసలు తత్వాన్ని గ్రహించలేకపోయాడని తెలుసుకున్న చూడాల ఆయనకు నిజమైన ఆధ్యాత్మికజ్ఞానం కలుగజేయాలనుకుంది. యోగబలంతో 'కౌమారి' అనే యోగినిగా మారి ఆయనను సమీపించింది.

అంతర్యామి

ఎంత ప్రయత్నించినా తపస్సుకు ఏకాగ్రత కుదరని శిఖిధ్వజుడు ఆ యోగినీమాత ముఖంలో ప్రశాంతత, వర్చస్సు, ఆనందం చూసి మీరు అలా ఎలా ఉండగలుగుతున్నారని అడిగాడు. అప్పుడామె రాజుకు జ్ఞానోపదేశం చేస్తూ.. నిజమైన వైరాగ్యం అంటే శరీరాన్ని వదిలేయడం కాదు, మనసును వదిలేయడం; సంసారాన్ని వదిలేయడం కాదు, మనసులోని అహంకారాన్ని కోరికలను వదిలేయడం... అదే నిజమైన మోక్షం- అని చెప్పింది. నువ్వు రాజ్యాన్ని, భార్యను వదిలావు కానీ మనసునూ మోహాన్నీ వదలలేదు. అదే నీకు బంధనం అవుతోంది అని వివరించింది. తన పరిస్థితిని అర్థం చేసుకున్న శిఖిధ్వజుడు యోగినికి నమస్కరించి- నిజమే, తపస్సు మనసులో ఉండాలి కానీ బయట కాదన్న నిజాన్ని అర్థం చేసుకున్నానని చెప్పాడు. క్రమంగా తనకీ ఆనందానుభూతి కలగడాన్ని అతడు గ్రహించాడు. అప్పుడు చూడాల తన నిజరూపాన్ని చూపగా ఆమెను గురువుగా భావించి నమస్కరించాడు శిఖిధ్వజుడు. నిజమైన జ్ఞానంతో రాజ్యంలోకి తిరిగి వచ్చిన ఆ రాజు వాస్తవమైన ధర్మాన్ని పాటిస్తూ రాజ్యపాలన చేశాడు. అనంతరం దంపతులిద్దరూ మోక్షాన్ని పొందారు.

వాసిష్ఠ రామాయణంలో వశిష్ఠుడు శ్రీరాముడికి ఆధ్యాత్మిక రహస్యాలను తెలియజేస్తూ ఆత్మజ్ఞానం ఎలా పొందాలో ఈ కథ ద్వారా వివరించాడు. తపస్సు అంటే- మనసును మౌనం చేయడం, మనసే బంధనాలకు కారణమని గ్రహించడం. 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' అని భగవద్గీత చెప్పినట్టు గురువు ఆశ్రయం లేకుండా జ్ఞానం రాదని చూడాలోపాఖ్యానం తెలియజేసింది.

మోక్షం అంటే జీవితాన్ని వదిలేయడం కాదు, బ్రహ్మాన్ని గ్రహించడం. అంతేకాదు, జీవించి ఉన్నప్పుడే మోక్షాన్ని సాధించడాన్నే జీవన్ముక్తి అంటారు. అన్నీ వదిలేసినవాడు కాదు... ప్రపంచంలోనే, ప్రపంచంతోనే సంచరిస్తూ ఆకర్షణలకు లొంగక జ్ఞానంతో జీవించగలిగిన వాడే నిజమైన ముని.

– యర్రాప్రగడ ప్రసాద్

సమ్మిళిత ప్రగతికి సమాన అవకాశాలు

ఏ వ్యక్తి అయినా సాధారణ కుటుంబంలో పుట్టి విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదగడానికి ప్రణాళికాబద్ధంగా ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. అదే వ్యాపార కుటుంబాల్లో పుట్టిన వారైతే బడా వ్యాపారులుగా ఎదగడానికి అవకాశాలు ఎక్కువ. పైగా వారు చిన్ననాటి నుంచే వ్యాపార మెలకువలను పుణికి పుచ్చుకుంటారు. ఎవరైనాసరే వ్యాపార రంగంలో రాణించడానికి ఆయా ప్రాంతాల్లోని ప్రోత్సాహకరమైన వాతావరణం(ఎకోసిస్టమ్) కూడా కలిసి రావాలని ప్రపంచవ్యాప్తంగా జరిగిన అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకు మన దేశంలో ఇంకా కృషి జరగాలి.

మనది భిన్న జాతులు కులాలు మతాలతో కూడిన దేశం. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా చెప్పుకొనే భారతదేశంలో కొన్ని వర్గాలవారే ఎక్కువగా పారిశ్రామిక రంగం వైపు మొగ్గు చూపుతున్నారు. పరిశ్రమలు స్థాపించడానికి వారికే పుష్కలంగా వనరులు సమకూరుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు... ముఖ్యంగా మహిళలు వ్యవస్థాపకులుగా మారడానికి, నిలదొక్కుకోడానికి సరైన సామాజిక, ఆర్థిక, మానసిక తోడ్పాటు లభించడం లేదు. దాంతో వారు వెనకబాటులోనే ఉండిపోతున్నారు. మరోవైపు ఆసక్తి ఉన్నవారే... చాలామంది వ్యవస్థాపకులుగా మారకపోవడానికి సంప్రదాయాలు, కట్టుబాట్లు, మూఢనమ్మకాలు ప్రతిబంధకాలవుతున్నాయి. ఈ విషయాన్ని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ తాజా పరిశోధన తేల్చిచెప్పింది.





నేటికీ దక్కని ఆర్థిక స్వేచ్ఛ!

కుటుంబానికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసి, వారు కోటీశ్వరులు కావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వాలు చెబుతుంటాయి. అయితే, వెనకబడిన వర్గాలు, మహిళలు వ్యాపారాన్ని ఒక వృత్తిగా ఎంచుకునే స్వేచ్ఛ ఇప్పటికీ కొరవడిందన్నది వాస్తవం. వారిలో ఎంతోమంది పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉన్నప్పటికీ- మానసికబలమైన దన్నూ ఆర్థిక స్వేచ్ఛా కుటుంబం నుంచి అంతగా అందట్లేదు. అదే సామాజిక స్వేచ్ఛ ఎక్కువగా ఉండే వర్గాల్లో వర్తక, వ్యాపారాల వైపు ఎక్కువమంది ఆకర్షితులవుతున్నారు. విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అవసరమైన వ్యక్తిగత సామర్థ్యాలను సైతం వారు సునాయాసంగా అందిపుచ్చుకుంటున్న విషయాన్ని ఇక్కడ గమనించాలి. వ్యాపారాలలో రాణించాలనుకునే వారిలో ప్రధానంగా ఉండాల్సినవి- రిస్క్ తీసుకునే ధైర్యం, సృజనాత్మకత, సాధించాలనే తపన, లక్ష్యం కోసం శ్రమించే తత్వం, మానవ సంబంధాలు ఏర్పరచుకునే నైజం. నిరంతర సాధన ద్వారా వీటిని అలవర్చుకోగలిగిన వారే వ్యాపార రంగంలో రాణించగలరు.

అనువైన వాతావరణం ఉంటేనే...

దేశంలో 1991 తర్వాత ఆర్థిక సంస్కరణల మూలంగా క్రమంగా వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతూ వచ్చింది. ఇది సమాజంలోని అనేక వర్గాలవారు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా(ఎంఎస్ఎంఈ) వ్యాపారవేత్తలుగా మారడానికి దోహదపడింది. అలా ప్రస్తుతం భారతదేశ ఎంఎస్ఎంఈ రంగంలో మహిళల వాటా 20శాతానికి చేరింది. షెడ్యూల్డ్ కులాల్లో వెనకబడిన వర్గాలవారు సైతం చిన్న పరిశ్రమలపై మొగ్గు చూపిస్తున్నారు. ప్రభుత్వ విధానాలు, పథకాలు, తక్కువ వడ్డీ రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతరత్రా ప్రోత్సాహకాల వల్లే ఇది సాధ్యమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూక్ష్మ, చిన్న పరిశ్రమల అభివృద్ధికి అనువైన వాతావరణం కల్పించడాన్ని ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి.

మన దేశంలో విద్యార్థులకు పాఠశాల దశ నుంచే వాణిజ్య, పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించడం చాలా అవసరం. అందుకు అనుగుణమైన విద్యావిధానాలను రూపొందించుకోవాలి. దానితోపాటు యువతకు అవగాహన సదస్సులు, వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలి. తద్వారా వ్యవస్థాపకత గురించి వారిలో అవగాహన పెంచాలి. పరిశ్రమలను స్థాపించేవారిని ప్రోత్సహించడంతో సరిపెట్టకుండా... ఆ తరవాత వారు ఎలా ముందుకెళ్తున్నదీ నిరంతరం పర్యవేక్షించాలి. ప్రతి దశలోనూ వారికి మద్దతు, ప్రోత్సాహాన్నీ అందించాలి. ఇందుకోసం ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు సంఘటితంగా పని చేయాలి. ప్రాంతాలవారీగా అనుభవజ్ఞ కమిటీల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సూచనలు సలహాలు అందజేయడం ముఖ్యం. సులభంగా మంజూరయ్యే తక్కువ వడ్డీ రుణాలు, ఆధునిక సాంకేతికత వినియోగం వంటి అంశాలపై అధికారులు వారికి అవగాహన పెంచాలి. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. గ్రామాల నుంచి ఉత్పత్తులను దేశ విదేశాల్లో మార్కెటింగ్ చేసేందుకు సహకారం అందించడం కూడా వ్యాపారాభివృద్ధికి ఎంతగానో అత్యవసరం.

వికసిత భారత్ సాకారం కోసం...

కేంద్రం, రాష్ట్రాలు చిన్న పరిశ్రమల విషయంలో అమలుచేస్తున్న విధానాలు, పథకాలు అట్టడుగు వర్గాల వారికి, ముఖ్యంగా మహిళలకు ఎంత వరకు ఉపయోగపడుతున్నాయనే అంశంపై చెప్పుకోదగ్గ అధ్యయనాలేమీ జరగలేదు. అందుకే, వీరికి ప్రయోజనకరమైన వ్యవస్థను రూపొందించడంలో మనమింకా వెనకబడి ఉన్నాం. ఫలితంగా వీరి అభివృద్ధి విషయంలో ప్రస్తుతం ప్రభుత్వ నెలకొని నిర్దిష్ట ఉన్నట్లు పేరుకుపోయి న్నాయి. దీనికి తోడు కొన్నేళ్లుగా నైపుణ్యాభివృద్ధి అనుకున్నంత స్థాయిలో జరగలేదు. దాంతో చాలా పరిశ్రమల్లో నిపుణుల కొరత నెలకొంది. 'యూనిసెఫ్' నివేదిక ప్రకారం, భారత్‌లో 15-29 ఏళ్ల మధ్య యువత సుమారు 37.10 కోట్ల మంది ఉన్నారు. యువ భారతంలో వెనకబడిన వర్గాలకు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో ఉన్నారని గుర్తించాలి. వీరందరినీ పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో భాగస్వాములను చేయడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. సరైన విద్య- శిక్షణ విధానాలు, పథకాల ద్వారా వీరిలో వ్యవస్థాపక సామర్థ్యాలను పెంపొందించేందుకు గట్టి కృషి జరగాలి. అందుకు అనువైన ప్రోత్సాహక వాతావరణాన్ని కల్పించడమూ ఎంతో కీలకం. ఆ విధంగా సామాజికంగా వెనకబడిన వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేసినప్పుడే- 'వికసిత భారత్' లక్ష్యం సులభంగా సాకారమవుతుంది.



డాక్టర్ మక్కా కొండయ్య
మాజీ డైరెక్టర్ జనరల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ



ఫ్యామిలీ ఫొటో!

'ఏసీబీ వలలో అవినీతి తిమింగలం', 'ఆదాయానికి మించిన ఆస్తులు' లాంటివి దినపత్రికల్లో చాలా తరచుగా కనిపించే వార్తా శీర్షికలు. అవినీతీ, అధికార దుర్వినియోగాలు కష్టపడి వెతక్కుండానే వెలుగులోకి వస్తుంటాయి. విలువలకు పాత రేసి, పథకాలన్నిటినీ ఒక పథకం ప్రకారం 'స్కాము'లుగా మార్చేసే నైపుణ్యమే కొందరు అవినీతిపరుల పెట్టుబడి. కిందిస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకూ చాలా మందిలో ఎవర్ని పట్టుకున్నా కోట్లల్లో అక్రమాస్తుల చిట్టాలు బయట పడుతుంటాయి. సంపాదించడమే గొప్ప... ఎలా సంపాదించాం అన్నది ముఖ్యం కాదు వాళ్లకి. పదవి ఉన్నంతవరకు అందినకాడికి దోచుకోవడం, కూడబెట్టుకోవడమే జీవితాశయం అన్నట్లు బతుకుతారు. పట్టుబడి జైలుకు వెళ్తే కుటుంబం పరువు ఏమవుతుంది? పిల్లల భవిష్యత్తు ఏమిటి?... అని ఆలోచిస్తే ఆ పనులు చేయగలరా?

ఆఫ్రికన్ దేశం సెనెగల్‌కి నిరుడు అధ్యక్షుడిగా ఎన్నికైన నలభై నాలుగేళ్ల బస్సిరౌ డియోమాయే ఫే ఆ దేశచరిత్రలోనే ఆ పదవి చేపట్టిన పిన్న వయస్కుడు! అవినీతి నిర్మూలనా, పరిపాలనలో పారదర్శకతా.. ఈ రెండూ తన ప్రాధాన్యాల్లో ముఖ్యమైనవని ఆయన అధికారంలోకి రాగానే ప్రకటించారు. "మీ కార్యాలయాల్లో నా ఫొటో చూడాలనుకోవట్లేదు. నేను దేవుణ్ని కాను. కేవలం ఈ దేశానికి సేవకుణ్ని. నా చిత్రానికి బదులు మీ కన్నబిడ్డలు, కుటుంబ సభ్యుల చిత్రాల్ని తగిలించండి. విధి నిర్వహణలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడల్లా ఆ చిత్రాన్ని చూడండి. ఏదైనా అక్రమార్జనకూ, అవినీతికీ పాల్పడాలన్న కోరిక తలెత్తితే, ఆ ఫొటోని మరింత నిశితంగా చూడండి. 'నా కుటుంబం, నా కన్నబిడ్డలూ దేశాన్ని మోసం చేసిన అవినీతిపరులుగా పేరుపొందాలని నేను కోరుకుంటున్నానా?' అని మిమ్మల్ని మీరు ఒకసారి ప్రశ్నించుకోండి" అని అధికారులకు ఆయన చెప్పినట్లు వార్తలొచ్చాయి.

ఈ స్ఫూర్తిదాయకమైన మాటలు ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించే కీలక స్థానాల్లో ఉన్న అందరి హృదయాలను తాకగలిగితే ఎంత బాగుంటుంది! 'ఇనఫ్- ఈజ్ ఏ డెసిషన్. నాట్ యాన్ అమౌంట్' అన్న మాటలో లోతైన అర్థం ఉంది. 'చాలు' అనేది ఒక నిర్ణయం. అంతేకానీ మనం సంపాదించిన డబ్బు లేదా ఆస్తుల మొత్తం అని కాదు! 'సంతృప్తి' అనేది ఒక మానసిక స్థితి. ఇంకా ఏదో సంపాదించెయ్యాలి అన్న వెంపర్లాటకన్నా మనకు ఉన్నది 'చాలు' అన్న భావనను పెంచుకోవాలి. ఇది సంపద కూడబెట్టుకోవడం అనే ఆరాటం నుంచీ; ఇతరులతోనూ, ఇతరుల ఆస్తులతోనూ పోల్చుకునే ఒత్తిడి నుంచీ విముక్తి కలిగిస్తుంది. డబ్బూ, బంగారం, ఫ్లాట్లు, ప్లాట్లు, విల్లాలు.. ఎన్ని పోగేసుకున్నా, ఆఖరున వాటిని మనతోపాటు పంపే కొరియర్ సర్వీసులు ఏవీ లేవన్న వాస్తవాన్ని గ్రహిస్తే అవినీతి దారుల్లో నడవాలని ఎవరూ అనుకోరు. కుటుంబసభ్యుల్ని అవమానంతో తలదించుకునేలా చేయరు.

– గుమ్మడి రవీంద్రనాథ్

అరకొర సంపాదనే...

తలసరి స్థూల జాతీయ ఆదాయం 1135 డాలర్లు అంతకన్నా తక్కువ ఉన్నవాటిని అల్పాదాయ దేశాలుగా ప్రపంచ బ్యాంకు గుర్తిస్తోంది. 1135– 4,446 డాలర్ల మధ్యలో ఉంటే దిగువ మధ్యాదాయ దేశాలుగా పరిగణిస్తోంది. 4446 నుంచి 13,935 డాలర్ల లోపు ఉంటే ఎగువ మధ్యాదాయ, అంతకు మించి ఉంటే అధికాదాయ దేశాలుగా పేర్కొంటోంది. నాలుగు దశాబ్దాల క్రితం ప్రపంచవ్యాప్తంగా 283 కోట్ల మంది అల్పాదాయ జనాభా ఉంటే, 2024 నాటికి వారి సంఖ్య బాగా తగ్గింది. అదే కాలంలో దిగువ మధ్యాదాయ ప్రజల సంఖ్య 61 కోట్ల నుంచి దాదాపు అయిదు రెట్లు పెరిగింది. అధికాదాయ వర్గాల జన సంఖ్యలో 61 కోట్లు ఎగువ మధ్యాదాయ ప్రజల సంఖ్యలో 241 కోట్ల మేర పెరుగుదల నమోదైంది. నిరుడు ప్రపంచ జనాభా 816 కోట్లు. వారిలో 16.32 కోట్ల మంది ఆదాయ వివరాలు తెలియట్లేదు. మిగిలిన ప్రజల్లో ఆయా ఆదాయ వర్గాల సంఖ్య... (కోట్లలో)

అధికాదాయం	142
ఎగువ మధ్యాదాయం	283
దిగువ మధ్యాదాయం	312
అల్పాదాయం	62.46

(ఆధారం: ప్రపంచ బ్యాంకు నివేదిక 2025)

అదనపు ఆదాయానికి బయోగ్యాస్

అన్నదాతల ఆదాయ పెంపునకు అనేక మార్గాలున్నాయి. వాటిలో అత్యంత అనుసరణీయమైనదీ, వేగంగా అమలు చేయదగినదీ- బయోగ్యాస్(గోబర్ గ్యాస్) ప్లాంట్ల ఏర్పాటు. పాతతరం జనతా, దీనబంధు నమూనాలకు భిన్నంగా ఇప్పుడు అత్యాధునిక 'హోమ్ బయోగ్యాస్' తరహా విధానాలు వచ్చాయి. వీటిని తక్కువ ఖర్చుతోనే కొద్దిపాటి స్థలంలో సులభంగా ఏర్పాటు చేసుకోవచ్చు. పేద రైతులు వీటి ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశముంది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తరచూ చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నారు. అన్నదాతల కుటుంబాల్లో వెలుగులు నింపగల ఈ లక్ష్య సాధన కోసం ఆధునిక బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు మంచి సాధనం కాగలదు. ఏపీలో పశువుల జనాభాను పరిగణనలోకి తీసుకుంటే, సుమారు పది లక్షల వరకు గోబర్ గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటుచేసే అవకాశముంది. ఒక్క ప్లాంట్ నుంచి నెలకు రెండు వంట గ్యాస్ సిలిండర్లకు సమానమైన ఇంధనం ఉత్పత్తి అవుతుంది. ఆ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా 20 లక్షల సిలిండర్లకు సమానమైన గ్యాస్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ప్రభుత్వం, రైతులు కలిసి దీన్ని సమర్థంగా అమలు చేయగలిగితే- ఏటా 2.4 కోట్ల బయోగ్యాస్ సిలిండర్ల ఉత్పత్తి ద్వారా రూ.2,160 కోట్లను ఆర్జించే అవకాశముంటుంది. మరోవైపు ఈ ప్లాంట్ల నుంచి ద్రవరూప ఎరువు(స్లరీ) కూడా ఉత్పత్తి అవుతుంది. ఒక్కో ప్లాంట్ నుంచీ నెలకు మూడు కిలోలీటర్ల స్లరీ వస్తుంది. దీని ద్వారా ఏటా రూ.1.8లక్షల ఆదాయం సమకూరుతుంది. ఇలా రైతులు ఒక్క ప్లాంట్ ద్వారా గ్యాస్, ఎరువు ఉత్పత్తి చేపట్టి... ఏటా రెండు లక్షల రూపాయలకుపైగా ఆదాయాన్ని కళ్లజూడవచ్చు. ప్రతి పది గోబర్ గ్యాస్ ప్లాంట్ల ద్వారా ఇద్దరికి ఉపాధి దొరుకుతుంది. ఆ లెక్కన ఏపీలో పది లక్షల ప్లాంట్ల ద్వారా రెండు లక్షల మందికి ఉపాధి కల్పించే అవకాశముంటుంది.

కాలుష్య కట్టడికీ తోడ్పాటు...

పశువుల పేడను బహిరంగ ప్రదేశాల్లో పారబోయడం వల్ల దానినుంచి విడుదలయ్యే మీథేన్ వాతావరణంలో కలుస్తుంది. పశువుల పెంపకందార్లు అధికంగా ఉండే ఏపీ వంటి రాష్ట్రాల్లో వాతావరణం వేడెక్కడానికి ఇది కూడా ఒక కారణం. పేడ వంటి జీవవ్యర్థాలను బయట పారబోయకుండా ఆధునిక గోబర్‌గ్యాస్ ప్లాంట్లను ఉపయోగించడం వల్ల మీథేన్ వంటి వాయు ఉద్గారాలు గణనీయంగా తగ్గుముఖం పడతాయి. రసాయన ఎరువులూ పురుగు మందులను అధిక మోతాదులో వాడటం వల్ల వ్యవసాయ దిగుబడులు ప్రజారోగ్యానికి హానికరంగా మారుతున్నాయి. మరోవైపు పంట పొలాలూ నిస్సారమవుతున్నాయి. రసాయన వ్యర్థాల వల్ల ఉపరితల, భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది.





ఈ ఎరువుల వాడకం వల్ల రైతులకు సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా, సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర పలుకుతుంది. బయోగ్యాస్ ప్లాంట్ల నిర్వహణ ద్వారా సేంద్రియ సాగుకు అవసరమైన ఎరువులను అందించవచ్చు.

ఆధునిక 'హోమ్ బయోగ్యాస్' విధానంలో వంట గ్యాస్ ఉత్పత్తికి పశు వ్యర్థాలే ముడిసరకు. ట్యూబ్ రూపంలో ఉండే ఈ ప్లాంట్‌లో ప్రధానంగా నీరు కలిపిన పేడను వినియోగిస్తారు. కోళ్లు, గొర్రెలు, పందుల విసర్జకాలను సైతం వినియోగించవచ్చు. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.45 వేలు ఖర్చవుతుంది.

అన్నదాతల రాబడికి భరోసా...

ప్రభుత్వమే రైతుల నుంచి గోబర్ గ్యాస్‌ను సేకరించి పైపుల ద్వారా గృహ వినియోగానికి సరఫరా చేయవచ్చు. నిత్యం ఈ ఇంధనం అందుబాటులో ఉంటే- ఎల్పీజీ సిలిండర్లపై ఆధారపడాల్సిన అవసరమే రాదు. తద్వారా రైతుల ఆదాయానికి భరోసా దక్కుతుంది. ఇప్పటికే ఆదిలాబాద్ వంటి చోట్ల కొందరు రైతులు వీటిని ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నారు. హోమ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణకు 'కార్బన్ క్రెడిట్ సంస్థలు' 10-15 ఏళ్ల పాటు నిధులు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. కాబట్టి, స్థానిక రైతులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. పచ్చగడ్డి, పశు దాణాను సరఫరా చేస్తే పాడి రైతులకు చాలా సమయం ఆదా కావడంతో పాటు కూలి ఖర్చులు మిగులుతాయి. బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌లో నూతన, పునరుద్ధరణీయ ఇంధనాభివృద్ధి సంస్థ(ఎన్ఆర్ఈడీసీఏపీ) నోడల్ ఏజెన్సీగా ఉన్నా... ఏపీలో వీటికి డిమాండ్ లేదని అక్కడి ఉన్నతాధికారులు చెబుతున్నారు. అది అవాస్తవమే. ఆధునిక బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు రైతుల ఆదాయ పెంపునకు, పల్లెపట్టుల ఆర్థిక పరిపుష్టికి దోహదపడతాయనడంలో సందేహం లేదు.

– దేవినేని మధుసూదన రావు

శ్లోకాలతో రికార్డులు..!

హాయ్ ఫ్రెండ్స్..! మీకేమైనా పద్యాలూ, పాటలు వచ్చా? "ఎందుకు రావు.. వచ్చు. 'సరస్వతీ నమస్తుభ్యం, వేమన పద్యాలు, సుమతీ శతకం..' ఇలా పాడుతూ ఉంటాం కదా" అంటారా! నిజమే మనకు అలాంటివి కొన్నే వస్తాయి. కానీ ఒక నేస్తం మాత్రం శ్లోకాలు చెబుతూ రికార్డులు సాధిస్తున్నాడు. తనెవరంటే..

కృష్ణాజిల్లా పోరంకికి చెందిన కోగంటి జైరుద్రకు ఆరున్నరేళ్లు. ప్రస్తుతం ఒకటో తరగతి చదువుతున్నాడు. తను ఆధ్యాత్మిక శ్లోకాలు చక్కగా చెబుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాడు. రెండేళ్ల వయసు ఉన్నప్పటి నుంచే ఏదైనా చెబితే బాగా గుర్తుపెట్టుకునేవాడట. వాళ్లమ్మ శ్లోకాలూ, పద్యాలూ చెబితే మళ్లీ తిరిగి చెప్పడానికి ప్రయత్నించేవాడట. అది గమనించిన వాళ్లమ్మ జ్ఞానశ్రీ.. అప్పటి నుంచే కథలు, రామాయణం, భాగవతం, శ్లోకాలు, భక్తిగీతాలు నేర్పించడం మొదలుపెట్టారు. మూడున్నరేళ్లకే ఒకసారి విన్న గీతాలను ఇట్టే ఆలపించసాగాడు జైరుద్ర. ప్రస్తుతం తన ప్రతిభతో రికార్డుల మీద రికార్డులు సాధిస్తున్నాడు. ఈ ఏడాది జనవరిలో కాలభైరవ అష్టకంలోని దివ్యశ్లోకాలను అతి తక్కువ సమయంలో ఆలపించి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సాధించాడు. జూన్‌లో లండన్ సంస్థ.. 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' నిర్వహించిన పోటీల్లో రామాయణంలోని ఏడు కాండాలను కథ రూపంలో ఏకధాటిగా 49 నిమిషాల 39 సెకన్లలో చెప్పాడు. దాంతో అంతర్జాతీయ స్థాయిలో తన పేరు నమోదు చేసుకున్నాడు. ఇంతేకాదు నేస్తాలూ.. జాతీయస్థాయిలో నిర్వహించే గీతా ఫెస్టివల్-2025, ఆల్ ఇండియా కిడ్స్ టాలెంట్ కాంటెస్ట్‌లూ.. హైదరాబాద్, విజయవాడల్లో జరిగిన పలు బాలల ప్రతిభా పాటవ పోటీల్లో ప్రథమస్థానాల్లో నిలిచాడు. అమ్మే.. తనకు స్ఫూర్తి అని చెబుతున్నాడు మన జైరుద్ర.

హాయ్! బుజ్జీ!!




– వెలగపూడి ప్రసాద్

అక్కడా.. ఇక్కడా..!

ఇక్కడ కొన్ని వాక్యాలూ, వాటి మధ్యలో ఖాళీలూ ఉన్నాయి. మొదటి గడుల్లో వచ్చే పదానికి వ్యతిరేక పదమే తరవాతి వాటిలో సరిపోతుంది. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

1. ☐☐ అబ్బాయి కంటే ☐☐ అబ్బాయి అమాయకుడు పాపం.
2. ఎండాకాలంలో ☐☐గా శీతాకాలంలో ☐☐గా ఎందుకుంటుందో తెలుసా?
3. ☐☐☐ వినాలి.. ☐☐☐ మాట్లాడాలని మా నాన్న చెబుతుంటారు.

రాష్ట్రంలో నేడు అతి భారీ వర్షాలు



ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో మంగళవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధవారం నంద్యాల, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వానలు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని వివరించింది. గురువారం ప్రకాశం, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, అనంతపురం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో బుధవారం నుంచి శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. మంగళవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, వైఎస్సార్ కడప, ప్రకాశం తదితర జిల్లాల్లో వానలు పడ్డాయి.

ఆయుష్‌లో 358 పోస్టుల భర్తీకి ఆమోదం

ఈనాడు, అమరావతి: నేషనల్ ఆయుష్ మిషన్ (ఎన్ఏఎం) కింద రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో సేవలు అందించేందుకు 358 మంది వైద్య సిబ్బందిని ఒప్పంద, పొరుగు సేవల విధానంలో నియమించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటిలో ఆయుష్ వైద్యులు, రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్, ఫైనాన్స్ మేనేజర్, కన్సల్టెంట్లు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, స్టైఫెండరీ/ట్రెయినీ, ల్యాబ్ టెక్నీషియన్, కాంపౌండర్ కమ్ ఏఎన్ఎం అసిస్టెంట్లు, ఫిజియోథెరపిస్టులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, స్వీపర్ కమ్ అటెండర్ పోస్టులు, మల్టీపర్పస్ వర్కర్లు (ఎంపీడబ్ల్యూ), పంచకర్మ థెరపిస్టులు, స్వీపర్ పోస్టులు ఉన్నాయి. ఇందులో 72 ఎంపీడబ్ల్యూలు, 45 స్వీపర్ పోస్టులను గతంలో ఎన్ఆర్‌హెచ్ఎం కింద పనిచేసి విధుల నుంచి తొలగించిన వారితో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిన పోస్టులు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక బోర్డు (ఏపీ ఎంఎస్ఆర్బీ), ఆయుష్ శాఖ ద్వారా భర్తీ చేస్తారు. ప్రస్తుతం స్టేట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25 మార్గదర్శకాలకు అనుగుణంగా వేతన పెంపు, 2024 ఏప్రిల్ నుంచి బకాయిలు చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన ప్రక్రియకు శ్రీకారం

త్రిసభ్య కమిటీని నియమించిన స్పీకర్

నివేదిక అందేవరకు తొలగింపు పెండింగులో



దిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలంటూ వివిధ పార్టీలు ఇచ్చిన నోటీసును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం అనుమతించారు. దీంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లయింది. నిబంధనల ప్రకారం ఈ అభియోగాలపై విచారణకు త్రిసభ్య కమిటీని ఆయన నియమించారు. దీనిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది బి.వి.ఆచార్య ఉన్నారు. 91 సంవత్సరాల ఆచార్య దాదాపు ఆరు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. కమిటీ వీలైనంత త్వరలో నివేదిక సమర్పిస్తుందని, అది అందేవరకూ న్యాయమూర్తి తొలగింపు ప్రతిపాదన పెండింగులో ఉంటుందని ఓం బిర్లా ప్రకటించారు. జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించాలని 146 మంది లోక్‌సభ సభ్యులు ప్రతిపాదన సమర్పించారని తెలిపారు. ఈ న్యాయమూర్తి దిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు అధికారిక నివాసంలో మార్చి 14న పెద్దఎత్తున నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది. ఆ సంఘం ఇచ్చిన నివేదిక దరిమిలా పదవి నుంచి వైదొలగాల్సిందిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచించారు. ఆయన దానికి అంగీకరించకపోవడంతో పార్లమెంటులో అభిశంసన ప్రయత్నాలు మొదలుకావడం తెలిసిందే.

ధన్‌ఖడ్ వేసిన ప్రక్రియ ఏమైనట్లు?: కాంగ్రెస్

న్యాయమూర్తి తొలగింపు ప్రక్రియను లోక్‌సభ కంటే ముందే రాజ్యసభ ప్రారంభించిందని కాంగ్రెస్ పేర్కొంది. జస్టిస్ వర్మను తొలగించాలని కోరుతూ 63 మంది సభ్యులు రాజ్యసభ గత ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు నోటీసు సమర్పించారని, ఆ విషయాన్ని అప్పట్లో ధన్‌ఖడ్ స్వయంగా ప్రకటించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గుర్తుచేశారు. ప్రక్రియ నిలిపివేసినట్లు ఇప్పటివరకు చెప్పలేదని తెలిపారు.

వాగ్వాదాలు.. ఘర్షణలు.. నిరసనలు



ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్తున్న వైకాపా నేతలు, శ్రేణులు

(మొదటి పేజీ తరువాయి)

మారెడ్డి లతారెడ్డి, హేమంత్‌రెడ్డి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఓటింగ్ సందర్భంగా కనంపల్లెలో తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య ఉదయం స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఓటు వేసేందుకు కారులో వెళ్తున్న తెదేపా కార్యకర్తలను వైకాపా నేతలు అడ్డుకుని అద్దాలు ధ్వంసం చేశారు. ప్రతిగా వైకాపా నేతలపై తెదేపా కార్యకర్తలు ఘర్షణకు దిగగా, పోలీసులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

ఒంటిమిట్టలో రెచ్చిపోయిన వైకాపా

ఒంటిమిట్ట స్థానం నుంచి తెదేపా, వైకాపా అభ్యర్థులుగా ముద్దుకృష్ణారెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో నిలిచారు. ఇక్కడి పలు పోలింగ్ కేంద్రాల్లో వైకాపా నేతలు వీరంగం చేశారు. కడప, రాజంపేట నుంచి వచ్చిన పలువురు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి రిగ్గింగ్‌కు ప్రయత్నించారు. వైఎస్సార్ కడప జిల్లా వైకాపా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పలువురు నగర కార్పొరేటర్లు కలిసి దాదాపు వంద మందికిపైగా ఒంటిమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలోని బూత్ నంబర్ 14లోకి ప్రవేశించారు. కుర్చీలు, కర్రలు తోసేసి లోనికెళ్లారు. ఇది గుర్తించిన తెదేపా నాయకులు అడ్డుకునే క్రమంలో దాడులు, తోపులాటకు దిగారు. ఆ తర్వాత వైకాపా శ్రేణులు కడప-తిరుపతి జాతీయ రహదారిపై ఆందోళనకు దిగడంతో వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జోక్యం చేసుకుని సర్దిచెప్పినప్పటికీ వినలేదు. ఆయనతో వాగ్వాదానికి దిగారు. తుదకు సాయుధ బలగాలతో నిరసనకారులను చెదరగొట్టారు. చింతరాజుపల్లి, చిన్నకొత్తపల్లి, మంటపంపల్లె, గంగపేరూరు, రాచిపల్లిలో తెదేపా ఏజెంట్లపై వైకాపా నేతలు జులుం ప్రదర్శించారు. పోలింగ్ కేంద్రం-4లో ఏజెంట్‌గా కూర్చున్న తెదేపా ఎస్సీ సెల్ కార్యదర్శి నల్ల వెంకటసుబ్బయ్యపై దాడి చేశారు. తెదేపా కార్యకర్తలపై వైకాపా అభ్యర్థి సుబ్బారెడ్డి దౌర్జన్యానికి దిగారు. విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా తెదేపా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు ఒంటిమిట్టకు వచ్చి పలు పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు వేస్తున్న వైకాపా వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సాలాబాద్ కేంద్రంలోనూ రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. మంటపంపల్లె వద్ద వైకాపా శ్రేణులు హైవేపై ఆందోళనకు దిగడంతో, వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పలు కేంద్రాల్లో వివాదాల కారణంగా పలుమార్లు పోలింగ్ ఆగిపోగా, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పునరుద్ధరించారు.





ఒంటిమిట్టలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగిన వైకాపా అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ★ మరో కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

అవినాష్‌రెడ్డి.. రోజంతా నానా యాగీ!



రహదారిపై బైఠాయించిన ఎంపీ అవినాష్‌రెడ్డి, పక్కన కడప మేయర్ సురేష్‌బాబు

ముందస్తు అరెస్టుతో ఎర్రగుంట్లకు తరలింపు

అక్కడ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయింపు

పోలీసుల కళ్లుగప్పి తిరిగి పులివెందులకు

ఈనాడు, కడప-న్యూస్‌టుడే, ఎర్రగుంట్ల: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా వైకాపా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి మంగళవారం రోజంతా నానా యాగీ చేశారు. పోలీసులకు మస్కా కొట్టారు. వారి కళ్లుగప్పి నాటకీయంగా తప్పించుకున్నారు. ఉప ఎన్నిక నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా అవినాష్‌రెడ్డితో పాటు తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ సిబ్బందితో వేకువజామున 4.30 గంటలకే అవినాష్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన ఎంపీ అనుచరులు.. పోలీసులను ప్రతిఘటించారు. డీఎస్పీతో పాటు వేముల సీఐ ఉలసయ్య మాత్రమే ఎంపీని పోలీసు వాహనం ఎక్కించే ప్రయత్నం చేయగా, మిగతా పోలీసు సిబ్బంది సహాయ నిరాకరణ చేశారు. డీఎస్పీ ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు ఫోన్‌లో వివరించారు. గంటన్నర పాటు తీవ్ర పెనుగులాట తర్వాత వాహనంలోకి ఎక్కించారు. ఆయన్ను ఎర్రగుంట్ల వైపు తీసుకెళ్లారు. అక్కడ పోలీసు వాహనాన్ని వైకాపా నేతలు, కార్యకర్తలు అడ్డుకుని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. అవినాష్‌రెడ్డి కూడా వారితో కలిసి రహదారిపై నిరసన వ్యక్తంచేస్తూ బైఠాయించారు. ఈ సమయంలో పోలీసుల కళ్లుగప్పి మధ్యాహ్నానికి పులివెందులలోని వైకాపా కార్యాలయానికి చేరుకున్నారు. ఎర్రగుంట్ల నుంచి ఎంపీ వెళ్లిపోయిన విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన్ను వెంబడించే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్‌కుమార్ పులివెందులలో అవినాష్‌రెడ్డి ఉన్న చోటుకు వెళ్లారు. చట్టాన్ని గౌరవించకుండా, కళ్లుగప్పి పారిపోయి తిరిగి పట్టణానికి ఎలా వస్తారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సాయంత్రం ఐదింటికి పోలీసు స్టేషన్‌కు రావాలంటూ హెచ్చరించి వెళ్లారు. ఆ సమయంలో వైకాపా కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు చెప్పినట్లుగా ఎంపీ సాయంత్రం ఠాణాకు వెళ్లగా, నోటీసులు అందించి పంపించారు. మరోపక్క, తెదేపా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని ఇడుపులపాయ పోలీసు స్టేషన్‌లో సాయంత్రం 6 గంటల వరకు ఉంచారు.

డీఎస్పీ తీవ్ర హెచ్చరిక

అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి డీఐజీ, ఎస్పీ వైకాపా కార్యాలయానికి చేరుకునే సమయంలో ఆ పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఆ సందర్భంలో డీఎస్పీ మురళీనాయక్ ఆందోళనకారులనుద్దేశించి 'కాల్చి పారేస్తాం. జాగ్రత్తగా మాట్లాడండి' అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు. 'పోలీసు దుస్తులు వేసుకుని ఉన్నాం. చూడండి. చులకనగా మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతాం' అనడంతో కాస్త వెనక్కి తగ్గారు.



ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో పోలీసు వాహనాలను అడ్డుకున్న వైకాపా శ్రేణులు, చిత్రంలో అవినాష్‌రెడ్డి



పులివెందులలో తెల్లవారుజామున అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

30 ఏళ్ల తర్వాత 'స్థానిక' ఓటు భాగ్యం

సోమశిల ముంపు బాధితుల్లో ఆనందం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆ గ్రామాల ఓటర్లకు మూడు దశాబ్దాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసే భాగ్యం దక్కింది! వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని కుడమలూరు, బేస్తపల్లి గ్రామాలను సోమశిల జలాశయం నిర్మాణం తర్వాత ముంపు గ్రామాల కింద జమకట్టారు. చాలామంది ఈ గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోయారు. సుమారు 115 కుటుంబాలు జలాశయం సమీపంలో నీరు రాని మిట్ట ప్రాంతంలో తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. అక్కడ 240 మందికి ఓటు హక్కు ఉంది. వీరికి శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో మాత్రమే ఓటు వేసేలా అధికారులు అనుమతిస్తున్నారు. స్థానిక సంస్థలైన పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు మాత్రం ఓటు హక్కు కల్పించడం లేదు. దీనిపై వీరు 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. ఈసారి అధికారులు వీరి మొర ఆలకించి ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో ఓటు వేసే అవకాశం కల్పించారు. ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాచపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం-10లో ఇక్కడి ఓటర్లలో 220 మంది ఓటేశారు. 'మా ఊరిని ముంపు కింద చూపించి, 30 ఏళ్లుగా మాకు ఓటు హక్కు దూరం చేశారు. మేం చేపల వేటపై ఆధారపడ్డ వాళ్లం. ఇన్నాళ్లకు ఓటేసే అవకాశమిచ్చార'ని కుడమలూరు వాసి పెంచలయ్య తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ఓటు వేయాలన్న మా కల ఇన్నాళ్లకు నెరవేరిందని బేస్తపల్లి వాసి గుడి బాలయ్య హర్షం ప్రకటించారు.



ఓటు వేశాక వేలిపై సిరా గుర్తు చూపుతున్న ఓటర్లు

నమ్మకం కోల్పోవడమే అసలు సమస్య

(మొదటి పేజీ తరువాయి)

'మొత్తం 7.9 కోట్ల మంది ఓటర్లలో ఎస్ఐఆర్‌కు 7.24 కోట్ల మంది స్పందించారు. అలాంటి పరిస్థితుల్లో కోటి మంది ఓటు హక్కును కోల్పోతారు లేదా ఓటరు జాబితాల నుంచి తొలగించేస్తారనే వాదనలకు అవకాశం ఎక్కడుంది' అని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ధర్మాసనం నిలదీసింది. సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ స్వయంగా కోర్టుకు వచ్చి వాదనలు వినిపించారు. రాష్ట్రంలో 8.18 కోట్ల మంది వయోజనులు ఉంటే 7.9 కోట్ల మందికే ఓటు హక్కు ఉందని, ఓటర్లను తొలగించడం కోసమే ఎస్ఐఆర్ కసరత్తును ప్రారంభించారని ఆరోపించారు. ఒక నియోజకవర్గంలో జీవించి ఉన్న 12 మందిని చనిపోయారని చెబుతూ వారి ఓట్లు తీసివేశారని న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. ఇలాంటి పొరపాట్లు జరిగితే సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసింది ముసాయిదా జాబితా మాత్రమేనని చెప్పారు. ఈ క్రమంలో స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంత మంది ఓటర్లు ఉన్నారు? గతంలో నమోదైన మరణాల సంఖ్య ఎంత? ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య ఎంత? వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పింది.

మరిన్ని పత్రాలూ ఉండాలి

పౌరసత్వానికి సాక్ష్యాలుగా ఆధార్, ఓటరు ఐడీ కార్డులను పరిగణనలోకి తీసుకోలేమన్న ఈసీ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. వీటిని బలపరిచే మరికొన్ని పత్రాలూ ఉండాలని తెలిపింది. అయితే, దీనిని స్వతంత్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఎన్నికల సంఘానికి ఈ అధికారం ఉందా అన్న అంశాన్ని మొదటగా నిర్ణయించాలని పేర్కొంది. విచారణ బుధవారం కూడా కొనసాగనుంది.

రెండు జడ్పీటీసీ సీట్లను లాక్కునేందుకు అరాచకం

- మాజీ సీఎం జగన్ ఆరోపణ



ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలను లాక్కునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ విమర్శించారు. పోలీసులను వాడుకుని, ఎన్నికను హైజాక్ చేశారని ఎక్స్‌లో మంగళవారం పోస్ట్ చేశారు. 'ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడాల్సిన డీఐజీ కోయ ప్రవీణ్ పచ్చచొక్కా వేసుకుని దగ్గరుండి ఎన్నికల అక్రమాలను ప్రోత్సహించారు. ఈ జడ్పీటీసీల ఉప ఎన్నికను రద్దు చేసి, కేంద్ర బలగాల భద్రత మధ్య తిరిగి నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల అక్రమాలపై ఆధారాలను న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్తాం. ఎన్నికలు జరుగుతున్న ప్రతి గ్రామంలోకి సుమారు 200 మంది చొప్పున సోమవారం రాత్రి నుంచే బయట ప్రాంతాలకు చెందిన తెదేపా వాళ్లు చొరబడ్డారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే స్థానిక ఓటర్లను దిగ్బంధించి వారి ఓట్లను లాక్కున్నారు. వాటితో తెదేపా కార్యకర్తలు, నాయకులు ఓట్లేశారు. వైకాపా ఏజెంట్లను పోలింగ్ బూత్‌లలోకి రానివ్వలేదు, మహిళా ఏజెంట్లపైనా దాడులు చేశారు' అని జగన్ పలు ఆరోపణలు గుప్పించారు.

నాలుగేళ్ల తర్వాత పోలీసులు ఉద్యోగంలో ఉండరు

- అవే ఖాకీ దుస్తులతో పోస్ట్‌మెన్‌గా ఉంటారు
- వైకాపా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు వ్యాఖ్యలు



మీడియా సమావేశంలో మీసం తిప్పుతున్న రాచమల్లు శివప్రసాదురెడ్డి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: 'పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో ప్రజాస్వామ్యాన్ని మానభంగం చేసేలా పోలీసులు ప్రవర్తించారు. డీఎస్పీ దగ్గర నుంచి సీఐలు, ఎస్సైలు నాలుగు సంవత్సరాల తర్వాత వారు పోలీసు ఉద్యోగంలో ఉండరు. అవే ఖాకీ దుస్తులతో పోస్టుమెన్ ఉద్యోగాలు చేసుకోవాల'ని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత రాచమల్లు శివప్రసాదురెడ్డి వ్యాఖ్యానించారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసి ఎర్రగుంట్ల మీదుగా తరలిస్తుండగా ఆయనకు మద్దతుగా రాచమల్లు అక్కడికి వచ్చి రోడ్డుపై బైఠాయించారు. అక్కడే మీడియాతో మాట్లాడుతూ పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'పోలీసుల్లో మంచివాళ్లను ఏమీ అనడం లేదు. చివరిగా చెప్పేదొకటే. నాలుగేళ్ల తర్వాత మాకు ఒకరోజు వస్తే రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో తెదేపా వ్యక్తి వార్డు సభ్యుడిగా గెలిచినా' అంటూ రాచమల్లు మీసం తిప్పారు.

■ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో మంగళవారం పోలింగ్‌కు చాలామంది స్థానిక ఓటర్లను అనుమతించలేదని వైకాపా నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి ఫిర్యాదు చేశారు.

ప్రజాస్వామ్యం గెలిచింది

నారా లోకేశ్



ఈనాడు, అమరావతి: పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు. '30 ఏళ్ల తర్వాత ప్రజలంతా నిర్భయంగా బయటకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పులివెందుల ప్రజలకు ధన్యవాదాలు. వైకాపా మూర్ఖత్వానికి అంతం లేదని మరోసారి రుజువైంది. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు నిర్వహించడం, భయపెట్టి ఏకగ్రీవం చేసుకోవడం కాదు' అని పోస్టు పెట్టారు.

14న నీటి సంఘాల అధ్యక్షులతో సీఎం భేటీ

రాష్ట్రంలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల అధ్యక్షులతో ఈ నెల 14న సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

రాయలసీమకు మరో భారీ పెట్టుబడి



ఈనాడు, అమరావతి: సెమీకండక్టర్ యూనిట్ల హబ్‌గా రాయలసీమ మారనుంది. ఈ రంగానికి సంబంధించి మరో భారీ ప్రాజెక్టు తిరుపతి జిల్లాలో ఏర్పాటు కానుంది. దక్షిణ కొరియాకు చెందిన 'అడ్వాన్స్‌డ్ సిస్టం ఇన్ ప్యాకేజ్ (ఏఎస్ఐపీ) టెక్నాలజీస్- అపాక్ట్' సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా రూ.468 కోట్ల పెట్టుబడులను సంస్థ పెట్టనుంది. దీనికి కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. దేశంలోనే మొదటి ప్రైవేట్ సెమీకండక్టర్ యూనిట్ కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఏర్పాటుకు ఇండిచిప్ సెమీకండక్టర్స్ లిమిటెడ్, జపాన్‌కు చెందిన ఇవోటా మైక్రో టెక్నాలజీ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో ఈ ఏడాది జనవరిలో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీని ద్వారా రూ.14వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సంస్థ అంగీకరించింది.

కేబినెట్ నోట్‌కు.. గంట ముందు నిర్ణయం: రాష్ట్రానికి సెమీకండక్టర్ యూనిట్ అంత తేలిగ్గా రాలేదు. దీని వెనుక కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుదీర్ఘ సంప్రదింపులు జరపాల్సి వచ్చింది. కేంద్ర కేబినెట్ నోట్ తయారీకి సోమవారం రాత్రి సుదీర్ఘ కసరత్తు జరిగింది. తుది నోట్ తయారీకి గంట ముందు వరకు మరో రాష్ట్రానికి అపాక్ట్ యూనిట్ కేటాయించాలన్న ప్రతిపాదన ఉంది. దీంతో పలు దఫాలు చర్చించిన మీదట రాష్ట్రానికి యూనిట్‌ను కేటాయించేలా కేంద్రంతో సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. రాష్ట్రానికి ప్రాజెక్టు రాకుండా అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. వాటన్నింటినీ అధిగమించి.. ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడంతో ప్రభుత్వం సఫలమైంది.

త్వరలో స్థల పరిశీలనకు ప్రతినిధులు.. చిప్ తయారీ యూనిట్ కోసం సుమారు 15 నుంచి 20 ఎకరాల స్థలం అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీన్ని తిరుపతి జిల్లా పరిధిలో ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై స్పష్టత లేదు. అపాక్ట్ సంస్థ ప్రతినిధుల బృందం రాష్ట్రానికి వచ్చి. యూనిట్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ హబ్‌గా రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా తిరుపతి సమీపంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ) 1, 2, కడప జిల్లా కొప్పర్తిలో ఈఎంసీని అభివృద్ధి చేసింది.

రాష్ట్రానికి సెమీకండక్టర్ యూనిట్

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు రూ.76 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించేలా కేంద్రం 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' చేపట్టింది. అందులో భాగంగానే ఈ నాలుగు యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఇందులో ఒడిశాలో రూ.4,015 కోట్లు, ఏపీలో రూ.468 కోట్లు, పంజాబ్‌లో రూ.117 కోట్లతో యూనిట్లు నెలకొల్పనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఒడిశాలో ఏర్పాటు చేసే ఓ ప్లాంట్‌లో సిలికాన్ కార్బైడ్ సెమీకండక్టర్లు ఉత్పత్తి చేస్తారు. ఇందులో ఏటా 9.6 కోట్ల సెమీకండక్టర్లు తయారవుతాయి. మరో యూనిట్‌లో త్రీడీ గ్లాస్ ఉత్పత్తులు తయారుచేస్తారు. ఇందులో ఇంటెల్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ త్రీడీ గ్లాస్ ఉత్పత్తులు డిఫెన్స్, ఏరోస్పేస్, రాడార్లు, వైర్‌లెస్ టెక్నాలజీలో ఉపయోగిస్తారు. పంజాబ్‌లోని మొహాలీలో ఉన్న సీడీఐఎల్ ప్లాంట్‌లో హైపవర్ డిస్క్రీట్ సెమీకండక్టర్ పరికరాలు తయారుచేస్తారు. ఇక్కడ ఏటా 15.8 కోట్ల చిప్స్ ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం.

కీలక నిర్ణయాలు

■ ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూ నగరంలో రూ.5,801 కోట్లతో నిర్మించనున్న మెట్రో ఫేజ్-1బికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో 11.2 కిలోమీటర్ల మెట్రో లైన్, 12 స్టేషన్లు నిర్మిస్తారు.

■ అరుణాచల్‌ప్రదేశ్‌లోని షియోమి జిల్లాలో రూ.8,146.21 కోట్లతో 700 మెగావాట్ల జల విద్యుత్తు కేంద్రం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రధానికి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు


దక్షిణ కొరియాకు చెందిన అడ్వాన్స్‌డ్ సిస్టం ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీస్, అపాక్ట్ సెమీకండక్టర్ యూనిట్‌ను ఏపీకి కేటాయిస్తూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. 'ఈ సంస్థ రాకతో దేశంలో సెమీకండక్టర్ల తయారీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఏపీలో ఎలక్ట్రానిక్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన పరిస్థితులు వేగంగా అభివృద్ధి చెందుతాయి' అని సీఎం పేర్కొన్నారు.

150 కూడళ్ల గజిబిజి ఊరు నౌగావ్



ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లో 180 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన నౌగావ్ పట్టణంలో ఏకంగా 150 కూడళ్లు ఉన్నాయి. ఇవన్నీ పరస్పరం అనుసంధానమై ఉంటాయి. చిక్కుముడులను తలపించే ఈ కూడళ్లను చూస్తే ఎంతటివారైనా గందరగోళానికి గురవుతారు. నాటి బ్రిటిష్ పాలకులు లండన్ వేదికగా సిద్ధం చేసిన నమూనా ప్రకారం సైనిక కంటోన్మెంట్ కోసం ఈ పట్టణాన్ని ఇలా నిర్మించారు. రావులలోని జైత్‌పూర్ పాలకుడు పరీక్షిత్ సింగ్ 1841లో బ్రిటిష్ వారి సదర్ కంటోన్మెంట్‌పై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ ఘటనతో రగిలిపోయిన బ్రిటిష్ పాలకులు లండన్ ఇంజినీర్ల సర్వే ప్రకారం ఛతర్‌పూర్ సమీపాన 1842లో పకడ్బందీగా నిర్మించిన మరో సైనిక కంటోన్మెంట్ నౌగావ్. నాటి వింధ్య (బుందేల్‌ఖండ్) ప్రాంతంలోని 36 సామంత రాజ్యాలకు ఇది బ్రిటిష్ పాలనా రాజధాని.

దేశమంతా చుట్టేసిన వందేభారత్



దిల్లీ: ప్రధాని మోదీ 2019 ఫిబ్రవరిలో దిల్లీ - వారణాసి మార్గంలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించగా.. ఆరేళ్లలో ఈ రైళ్ల సంఖ్య 150కి పెరిగింది. ఆదివారం ఒక్క రోజే ప్రధాని 3 కొత్త వందేభారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. ఈ రైళ్లు దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొస్తున్నాయని జీ20 సదస్సుకు భారత్ తరఫున షెర్పా (ప్రత్యేక దూత)గా వ్యవహరించిన అమితాబ్ కాంత్ అన్నారు. "కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఇవి దేశాన్ని కలుపుతున్నాయి" అంటూ 'ఎక్స్' ద్వారా ఓ పటాన్ని ఆయన షేర్ చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన 'వందేభారత్' రైలు మార్గాలు భారత భౌగోళిక చిత్రపటాన్ని ఆవిష్కరించేలా ఉండటంతో ఈ పోస్టు ఆసక్తికరంగా మారింది.

వీధి కుక్కలపై సుప్రీం తీర్పు ఓ వెనకడుగు



- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ విమర్శ
- మూగజీవాలపై క్రూరత్వం తగదు: ప్రియాంక

దిల్లీ: దిల్లీ ఎన్సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంకా గాంధీ వాద్రాలు మంగళవారం స్పందించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా మనం అనుసరిస్తూ వచ్చిన మానవీయ, సైన్స్ ఆధారిత విధానాల నుంచి వెనకడుగు వేసినట్లుగా ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "వీధి కుక్కలన్నింటినీ గంపగుత్తగా తొలగించాలన్న నిర్ణయం క్రూరమైనది. దూరదృష్టి లోపించినది, దయా విహీనమైనది" అని ఆయన అన్నారు.

దేశ రాజధాని నగరంలోని వీధి కుక్కలన్నింటినీ వీధుల నుంచి షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు సోమవారం తీర్పు వెలువరించిన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని వారాల వ్యవధిలో వీధి కుక్కలన్నింటినీ షెల్టర్లకు తరలించడం దారుణానికి దారి తీస్తుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా వ్యాఖ్యానించారు. 'కుక్కలు అతి సుందర జీవులు. వాటి పట్ల క్రూరత్వం తగదు'' అని ఆమె అన్నారు. దిల్లీ వీధికుక్కలకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రముఖ సినీనటులు జాన్ అబ్రహాం, జాన్వీ కపూర్, వరుణ్ ధవన్, సిద్ధార్థ్ ఆనంద్, అడివి శేష్ తదితరులు విభేదించారు.

ఐటీ బిల్లుకు పార్లమెంటు ఆమోదం



దిల్లీ: ఆదాయపు పన్ను (ఐ.టి.) చట్టం-1961లో అనేక మార్పులతో తీసుకువచ్చిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. లోక్‌సభ ఇప్పటికే దీనికి సమ్మతి తెలపగా రాజ్యసభ కూడా మంగళవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఆదాయపు పన్ను బిల్లు 2025, పన్ను చట్టాల (సవరణ) బిల్లు 2025లను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. పాత చట్టంలో కొన్నింటికి కాలం చెల్లడంతో కొత్తది తీసుకురావాల్సి వచ్చిందని ఆమె వివరించారు. దీనిలో కొత్తగా ఎలాంటి రేటు ప్రవేశపెట్టడం లేదని, కొన్ని పదాలను సరళతరం చేశామని చెప్పారు. ఇలాంటి ముఖ్యమైనవాటిపై చర్చలోనూ విపక్షం పాల్గొనకపోవడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. జాతీయ క్రీడల బిల్లుకు, యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లుకు కూడా రాజ్యసభ సమ్మతి లభించడంతో ఇవి పార్లమెంటు ఆమోదం పొందినట్లయింది. ఎస్‌ఐఆర్‌పై చర్చకు డిమాండ్‌చేస్తూ విపక్షనేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఎస్‌ఐఆర్ అంశంపై విపక్షాల నినాదాలతో లోక్‌సభలో కార్యకలాపాలకు పలుమార్లు అంతరాయం వాటిల్లింది. విపక్షాలు వివిధ పత్రాలను చించి సభాపతి స్థానంవైపు విసిరారు. ఇది సభాపతిని అవమానించడమే అవుతుందని కేంద్రమంత్రి రిజిజు ఆక్షేపించారు.

రెండు బిల్లులకు పచ్చజెండా

అంతరాయాల మధ్యే రెండు బిల్లుల్ని లోక్‌సభ ఆమోదించింది. వాటిలో ఒకటి 'గనులు, ఖనిజాల (అభివృద్ధి-నియంత్రణ) సవరణ బిల్లు 2025' కాగా రెండోది 'భారతీయ ఓడరేవుల బిల్లు 2025'. దివాలాకు సంబంధించిన నియమావళిని సవరించే బిల్లును నిర్మల ప్రవేశపెట్టారు. తర్వాత సభ వాయిదా పడింది. స్వాతంత్ర్య వేడుకల దృష్ట్యా 5రోజుల సెలవుల తర్వాత పార్లమెంటు ఈ నెల 18న తిరిగి సమావేశం కానుంది. 'జమిలి' బిల్లుల్ని పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీ తన నివేదిక సమర్పించడానికి గడువును లోక్‌సభ మరోసారి పొడిగించింది.

జాతీయస్థాయిలో ఓట్ల చోరీ

రాహుల్‌గాంధీ ఆరోపణ

దిల్లీ: ఓట్ల చోరీపై ఆరోపణల స్వరాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరింత పెంచారు. ఈ చోరీ ఒక్క నియోజకవర్గానికే పరిమితం కాలేదని, చాలా చోట్ల జరిగిందని స్పష్టం చేశారు. దేశంలో ఎన్నో మహాదేవపురలున్నాయని, దీనివల్ల లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 48 సీట్లను కోల్పోయామని తెలిపారు. ఒక్కరికి ఒక్క ఓటు అనే విషయంలో ఎన్నికల సంఘం (ఈసీ) తన విధులను సక్రమంగా నిర్వర్తించలేదని విమర్శించారు. మంగళవారం పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ప్రసంగించారు. ఇటీవల కర్ణాటకలోని మహాదేవపురలో ఓట్ల చోరీ జరిగిందంటూ వివరాలను రాహుల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఆయన స్పందించారు. 'ఓట్ల చోరీ ఒక్క సీటులోనే కాదు. చాలా చోట్ల జరిగింది. ఇది జాతీయ స్థాయిలో.. ఒక క్రమ పద్ధతిలో వ్యవస్థీకృతంగా సాగింది. ఈ విషయం ఈసీకి తెలుసు. మనకూ తెలుసు. ఇంకా చాలా సినిమా మిగిలే ఉంది' అని రాహుల్ స్పష్టం చేశారు.

- ఓట్ల చోరీ అంశంపై ప్రతి జిల్లా కేంద్రంలో గురువారం ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది.



పార్లమెంటు ఆవరణలో నిర్వహించిన ఆందోళనలో ప్రియాంకాగాంధీ తదితరులు

మంగళవారం ఉదయం పార్లమెంటు ఆవరణలో పలువురు విపక్ష ఎంపీలు.. టీ షర్టులతో నిరసన తెలిపారు. వాటిపై 'మింతా దేవి.. 124 ఏళ్ల ఓటరు.. నాటౌట్' అనే క్యాప్షన్‌తో పాటు ఆమె చిత్రాన్ని ముద్రించారు. ఈ నిరసనలో ఖర్గే, సోనియా, ప్రియాంక, టీఆర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షాకాలం ముగిసిన ఖైదీలను విడుదల చేయండి: సుప్రీం

దిల్లీ: నిర్ణీత శిక్షాకాలం పూర్తిచేసుకొని మరే ఇతర కేసుల్లోనూ వారి అవసరం లేని ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. ఖైదీల శిక్షా కాలం ముగిసినా జైళ్లలోనే మగ్గటంపై జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం ఆందోళన వ్యక్తంచేసింది. 2002లో నితీశ్ కటారా అనే దిల్లీ వ్యాపారవేత్తను పరువుహత్య చేసిన కేసులో దోషిగా జైలుకు వెళ్లిన సుఖ్‌దేవ్ యాదవ్ అలియాస్ పహిల్వాన్ 20 ఏళ్ల శిక్షాకాలం ఈ ఏడాది మార్చితో పూర్తయింది. అతడిని విడుదల చేయాలని పిటిషను విచారణ అనంతరం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గడువుకు మించి ఇంకా ఎవరైనా నిందితులు లేదా దోషులు జైళ్లలోనే ఉన్నారా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు తాజా తీర్పు కాపీలను అన్ని రాష్ట్రాలు, యూటీల హోంశాఖ కార్యదర్శులకు పంపాలని రిజిస్ట్రీకి ధర్మాసనం సూచించింది.

భారత్, చైనా మధ్య త్వరలో విమాన సర్వీసులు!

దిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో సరిహద్దు వివాదం, ఆ తదనంతరం కొవిడ్ విజృంభణ నేపథ్యంలో భారత్, చైనాల మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులు త్వరలో పునఃప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ దిశగా రెండు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చల్లో ముందడుగు పడిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ నెలాఖరులో ప్రధాని మోదీ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లనున్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచుకునేందుకు రెండు దేశాలు గత కొన్ని నెలలుగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.



జీవితం కూడా పర్వతారోహణ లాంటిదే

జీవితంలో చాలా సందర్భాలను పర్వతారోహణతో పోల్చి చెప్పవచ్చు. పర్వతారోహణలో నడక సాగేకొద్దీ.. మీరు దారిని మరింత స్పష్టంగా గుర్తించడం మొదలుపెడతారు. జీవితం విషయంలోనూ అంతే! అన్ని సమాధానాలూ ముందే తెలియనక్కర్లేదు. పనిని ప్రారంభించే ధైర్యం మీకుంటే.. దాన్ని పూర్తిచేసేందుకు కొత్త దారులు వాటంతటవే కనిపిస్తాయి.

– జేమ్స్ క్లియర్, రచయిత

ఈసీ.. నన్ను బామ్మను చేసింది

- 35 ఏళ్ల మింతా దేవి ఆశ్చర్యం



పట్నా: తొలిసారిగా 35 ఏళ్ల వయసులో తాను ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల సంఘం (ఈసీ) తనను బామ్మను చేసిందని బిహార్‌లోని సివాన్ జిల్లాకు చెందిన మింతా దేవి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె ఫొటో ఉన్న టీ షర్టులతో పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీలు ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో ఆమె స్పందించారు. 'ఈ అపహాస్యానికి నన్నెందుకు నిందిస్తారు. 35 ఏళ్లలో తొలిసారిగా ఓటేద్దామనుకున్నా. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నింపా. నా పుట్టిన సంవత్సరాన్ని ఆధార్ కార్డు ప్రకారం.. 1990గా అందులో పేర్కొన్నా. కానీ ఓటరు జాబితాలో దానిని 1900గా పేర్కొంటే నేనేం చేయగలను. ఎలాగైనా నాకు ఓటు హక్కు వచ్చినందుకు సంతోషిస్తున్నా. తొలిసారిగా ఓటేయబోతున్నా' అని మింతా దేవి వివరించారు. మింతా దేవిని 124 ఏళ్ల ఓటరుగా ముసాయిదాలో పేర్కొనడంతో స్థానిక మీడియా వెలుగులోకి తెచ్చింది. అది వైరల్‌గా మారి జాతీయ అంశంగా మారింది. మరోవైపు అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఈ నెల 10న మింతా దేవి నుంచి సవరణ దరఖాస్తును తీసుకుని వయసును మార్చేందుకు చర్యలు చేపట్టారు.

మా నుంచి చుక్కనీటినీ గుంజుకోలేరు

భారత్‌పై పాక్ ప్రధాని ప్రేలాపన



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌కు చెందాల్సిన ఒక్క చుక్క నీటిని గుంజుకునేందుకూ భారత్‌కు అవకాశం ఇవ్వబోమని ప్రధాని షెహబాజ్ షరీఫ్ మంగళవారం స్పష్టం చేశారు. "పాకిస్థాన్‌కు చెందాల్సిన నీటిని అడ్డుకునే చర్యలకు సాహసిస్తే మీకు మళ్లీ గుణపాఠం నేర్పుతాం" అని షెహబాజ్ భారత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమకు రావాల్సిన నదీజలాలను నిలిపివేసేందుకు తీసుకునే ఏ చర్య అయినా యుద్ధానికి కవ్వింపుగా భావించాల్సి ఉంటుందని గతంలోనూ పాకిస్థాన్ హెచ్చరించింది.

చైనాకు 90 రోజుల ఉపశమనం

సుంకాలను వాయిదా వేసిన అమెరికా



వాషింగ్టన్: ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధానికి మరో 90 రోజుల విరామం లభించింది. చైనాపై విధించిన ప్రతీకార సుంకాలను వాయిదా వేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. అదే సమయంలో ఇటు చైనా.. సుంకాల వాయిదాను ప్రకటించింది. దీంతో రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకోవడానికి మరింత సమయం లభించినట్లయింది. ఈ ఏడాది ఆఖరులో ట్రంప్, జిన్‌పింగ్‌ల మధ్య సమావేశం జరిగే అవకాశముంది. అప్పటికల్లా ఒప్పందం కుదిరే అవకాశముంది.

ఆధార్, ఓటరు ఐడీ కార్డులతో భారత పౌరులు కాలేరు


బాంబే హైకోర్టు వ్యాఖ్య



ముంబయి: ఓ వ్యక్తికి ఆధార్, పాన్, ఓటరు ఐడీ కార్డులు ఉన్నంత మాత్రాన భారత పౌరుడిగా పరిగణించలేమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన బంగ్లాదేశీయుడికి బెయిల్ నిరాకరిస్తూ జస్టిస్ బోర్కర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పౌరసత్వ చట్టంలోని నిబంధనల ప్రకారమే దీనిని నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. ఆధార్, పాన్, ఓటరు ఐడీ కార్డులు ఆయా వ్యక్తుల గుర్తింపు లేదా సంబంధిత సేవలు పొందడం కోసం మాత్రమేనని న్యాయమూర్తి పేర్కొన్నారు.

దర్యాప్తు సంస్థలు న్యాయవాదిని విచారించవచ్చా?

- తీర్పును వాయిదా వేసిన సుప్రీం



దిల్లీ: కోర్టులో కక్షిదారుల తరఫున వాదనలు వినిపించే న్యాయవాదులను దర్యాప్తు సంస్థలు నేర విచారణకు పిలిపించవచ్చా? అన్న అంశంపై తనంత తానుగా చేపట్టిన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు తన తీర్పును మంగళవారం వాయిదా వేసింది. దేశ పౌరులందరి సంరక్షకులుగా తాము ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియాల ధర్మాసనం పేర్కొంది. న్యాయ ప్రక్రియలో భాగస్వాములైన న్యాయవాదుల్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. వృత్తి నిర్వహణలో భాగంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన న్యాయవాదిని దర్యాప్తు సంస్థలు విచారణకు రప్పించడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయవాది నేరంలో భాగస్వామి అయిన సందర్భంలో అతనికి ఎలాంటి రక్షణా లభించబోదని ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయ సలహా అందించడం న్యాయవాది బాధ్యత, దాని నుంచి పక్కకు జరిగి తప్పుడు సాక్ష్యాలను సృష్టించడం లేదా సాక్ష్యంలో జోక్యం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడితే అతనికి రక్షణ ఉండబోదని ధర్మాసనం స్పష్టం చేసింది. నేరం చేయడంలో కక్షిదారుకు సహకారం అందించిన న్యాయవాదిని దర్యాప్తు సంస్థలు విచారణకు పిలిపించవచ్చని పేర్కొంది. న్యాయ సలహాలు అందించినందుకు, తమ కక్షిదారు తరఫున వాదనలు వినిపించినందుకు ఓ న్యాయవాదిని విచారణకు పిలిపించడం ద్వారా ఈడీ హద్దులన్నింటినీ మీరిందని గతంలో అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

వారిపై బలవంతపు చర్యలు వద్దు

పాత వాహన యజమానుల విషయంలో సుప్రీం ఆదేశాలు

దిల్లీ: దేశరాజధాని దిల్లీ, ఎన్సీఆర్ ప్రాంతాల్లో కాలుష్యాన్ని నివారించేందుకు పాత వాహనాలను వినియోగించవద్దని జాతీయ హరిత ట్రైబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 10 ఏళ్లు దాటిన డీజిల్ వాహనాలు, 15 ఏళ్లు దాటిన పెట్రోల్ వాహనాల యజమానులపై బలవంతపు చర్యలేవీ తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది. 2018 అక్టోబరు 29న ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన అభ్యర్థనను మంగళవారం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పాత వాహనాల యజమానుల కష్టాలను దిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వాహనాదారులపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. సమస్యను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపింది. నాలుగు వారాల తర్వాత ఈ విషయమై విచారణ జరుపుతామని, ఈ సమయంలో పాత వాహదారులపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది.

ఉత్తరకాశీలో ఎన్‌జీఆర్‌ఐ గాలింపు చర్యలు ప్రారంభం



ఉత్తర కాశీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో ఆకస్మిక వరదలకు తుడిచిపెట్టుకుపోయిన ధరాలీ గ్రామంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. 24 మంది నేపాలీలు సహా గల్లంతైన 66 మంది ఆచూకీ కోసం నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ).. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్లతో శోధన ప్రక్రియను ప్రారంభించింది. సోమవారం ధరాలీ ప్రాంతానికి చేరుకున్న ఎన్‌జీఆర్‌ఐ బృందం.. శిథిలాల కింద మానవ ఉనికి ఉన్న ప్రదేశాలను గుర్తించనుంది. గల్లంతైన 66 మందిలో 24 మంది నేపాలీలు కాగా మిగిలిన 42 మందిలో 9 మంది సైనిక సిబ్బంది, ధరాలీ గ్రామ ప్రజలు-8, తెహ్రీ జిల్లా-1, బిహార్-13, ఉత్తర్‌ప్రదేశ్-6, ఐదుగురు ఇతర ప్రాంతాల వారు ఉన్నారు.

ఈసీ అంగీకరిస్తే ప్రధాని రాజీనామా చేయాలి

తృణమూల్ ఎంపీ అభిషేక్ బెనర్జీ

కోల్‌కతా: గత సార్వత్రిక ఎన్నికల ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఎన్నికల సంఘం (ఈసీ) అంగీకరిస్తే ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రివర్గం రాజీనామా చేయాలని, లోక్‌సభకు మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ డిమాండు చేశారు. గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లోనే ఓటరు జాబితాలు సక్రమంగా ఉన్నాయని ఈసీ ఎంపిక చేసుకుని చెప్పజాలదని అభిప్రాయపడ్డారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బిహార్‌లలోనే తప్పుగా ఉన్నాయని ఎలా చెబుతుందని ప్రశ్నించారు. 'ఎస్‌ఐఆర్ చేపట్టాల్సి వస్తే దేశవ్యాప్తంగా చేపట్టాలి. దానికంటే ముందు ప్రధాని రాజీనామా చేయాలి. లోక్‌సభను రద్దు చేయాలి' అని స్పష్టం చేశారు. అవసరమైతే రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, తృణమూల్‌తోపాటు ప్రతిపక్ష ఎంపీలందరూ అందుకు సిద్ధమేనని బెనర్జీ పేర్కొన్నారు. కోల్‌కతాలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిహార్‌లో న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగితే భాజపా ఓడిపోతుందని వ్యాఖ్యానించారు.

ఓట్ల చోరీపై నేను ప్రచారం చేయలేదు

నటుడు కేకే మేనన్ స్పష్టీకరణ

దిల్లీ: కాంగ్రెస్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేసిన ఓట్ల చోరీ ప్రచార వీడియోలో బాలీవుడ్ నటుడు కేకే మేనన్ కనిపించడం సంచలనంగా మారింది. అయితే తాను ఈ ప్రచారం చేయలేదని, తన ఇతర వీడియోల నుంచి ఒక క్లిప్‌ను తీసుకుని ఎడిట్ చేసి.. కాంగ్రెస్ నేతలు ఉపయోగించుకున్నారని ఆయన స్పష్టం చేశారు. సోమవారం కాంగ్రెస్ తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఒక వీడియోను పోస్టు చేసింది. అందులో మేనన్.. స్పై డ్రామా సిరీస్‌లోని హిమ్మత్ సింగ్‌గా కనిపిస్తూ.. 'ఆగండి.. ఆగండి. స్క్రోల్ చేయకండి. ఈ రీల్ చూస్తే తెలుస్తుంది ఇదేంటనేది' అని వ్యాఖ్యానిస్తారు. ఇది తాను చేసింది కాదని మేనన్ స్పష్టం చేశారు.

పశ్చిమబెంగాల్ సీఎస్‌కు ఈసీ పిలుపు

కోల్‌కతా: ఓటరు జాబితా సవరణలో అక్రమాలకు పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయబోమన్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై కేంద్ర ఎన్నికల సంఘం వివరణ కోరింది. అధికారుల సస్పెన్షన్‌కు నిరాకరించడానికి కారణాలను వివరించేందుకు దిల్లీకి రావాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌కు సమన్లు జారీ చేసింది. బుధవారం ప్రధాన కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరు కావాలని ఈసీ తన ఆదేశాల్లో పేర్కొంది.

ఎయిరిండియా దారిమళ్లింపు ఘటన..

లోక్‌సభ స్పీకర్‌కు ఎంపీల ఫిర్యాదు

- హక్కుల ఉల్లంఘన కింద చర్చకు డిమాండ్



దిల్లీ: కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ సహా అయిదుగురు ఎంపీలు తాము ప్రయాణిస్తున్న తిరువనంతపురం - దిల్లీ ఎయిరిండియా (ఏఐ 2455) విమానాన్ని చెన్నైకు దారి మళ్లించడంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు మంగళవారం లేఖ రాశారు. తమ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన విమానయాన సంస్థపై చర్యకు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తక్షణం పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కాంగ్రెస్ ఎంపీలు కేసీ వేణుగోపాల్, కె.సురేశ్, అదూర్ ప్రకాశ్, సి.రాబర్ట్ బ్రూస్‌తోపాటు కె.రాధాకృష్ణన్ (సీపీఎం) కోరారు. వంద మందికి పైగా ప్రయాణికులతో ఆదివారం తిరువనంతపురం నుంచి దిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానాన్ని సాంకేతిక లోపం కారణంగా మార్గమధ్యంలో చెన్నైకు మళ్లించారు. బెంగళూరు, కోయంబత్తూరు వంటి ఇతర విమానాశ్రయాలు సమీపంలోనే ఉండగా.. చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. చెన్నైలోనూ నేరుగా ల్యాండ్ చేయకుండా అక్కడే గంటకుపైగా చక్కర్లు కొట్టినట్లు ఎంపీలు తెలిపారు. బహుశా రన్‌వేపై మరో విమానం ఉండటం వల్ల కావచ్చని పైలట్ ప్రకటనను ఉటంకించారు. కనీసం రాత్రి భోజనం కూడా ఏర్పాటు చేయలేదని, అర్ధరాత్రి దాటాక మరో విమానంలో తామంతా దిల్లీకి చేరినట్లు వివరించారు. ఈ వ్యవహారంపై సామాజిక మాధ్యమాల ద్వారా తాము లేవనెత్తిన ఆందోళనను తప్పుడు ప్రకటనగా చిత్రీకరించిన ఎయిరిండియా ఎంపీల ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అత్యవసర మళ్లింపులు, రన్‌వే భద్రతకు సంబంధించిన ప్రొటోకాల్‌ను మరింత బలోపేతం చేయాలని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రయాణికులకు సరైన సమాచారం అందేలా చూడాలని ఎంపీలు కోరారు. విమాన వాతావరణ రాడార్ పనిచేయనందునే చెన్నైకు దారి మళ్లించినట్లుగా అనుమానిస్తున్నట్లు డీజీసీఏ తెలిపింది.

ఓవైపు హెచ్చరికలు.. మరోవైపు అభ్యర్థనలు

- పాక్ ద్వంద్వ వైఖరి



ఇంటర్నెట్‌డెస్క్: భారత్‌ను పాకిస్థాన్ ఒకవైపు నుంచి హెచ్చరిస్తూనే మరోవైపు నుంచి అభ్యర్థనలు చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం నిలిపివేసిన సింధూ జల ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలని పాకిస్థాన్ విదేశాంగ శాఖ దిల్లీని కోరింది. సింధు జల ఒప్పందాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అందులోని అంశాలను పూర్తిస్థాయిలో సంపూర్ణంగా పాటించాలని భారత్‌ను కోరుతున్నట్లు పాక్ విదేశాంగ కార్యాలయం 'ఎక్స్' ద్వారా తెలిపింది. మధ్యవర్తిత్వ న్యాయస్థానం సింధూ జలాల ఒప్పందంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు పేర్కొంది. పశ్చిమ నదుల (చినాబ్, జీలం, గంగా)పై భారత్ చేపట్టనున్న జల విద్యుత్ ప్రాజెక్టులు ఒప్పందంలో నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఉండాలంది.

భారత దౌత్యవేత్తలకు నీరు, గ్యాస్ నిలిపివేత

ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యవేత్తల పట్ల పాకిస్థాన్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. దౌత్యవేత్తల నివాసాలకు నీరు, గ్యాస్, వార్తాపత్రికలు వంటివి నిలిపివేసినట్లు ఓ మీడియా కథనం పేర్కొంది. భారత రాయబారులపై నిఘాను కూడా పెంచినట్లుగా తెలుస్తోంది.

రాహుల్ పెడదోవపట్టిన వీధి నాయకుడు : భాజపా

ముంబయి: రాహుల్ గాంధీ ఒక పెడదోవపట్టి తిరుగుతున్న వీధి రాజకీయ నాయకుడని మహారాష్ట్ర భాజపా నాయకుడు రాజ్ పురోహిత్ మంగళవారం దుయ్యబట్టారు. దిల్లీలో వీధి కుక్కలకు సంబంధించి సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులపై రాహుల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భాజపా నేత ఈ మాటలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో రాహుల్ జాతీయ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి అంశాలకు బదులు రాహుల్ రైతు సంక్షేమం, దారిద్ర్యం వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ నేపథ్యంలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థపై ప్రతిపక్షం విమర్శలు గుప్పించడాన్ని భాజపా నేత తప్పు పట్టారు.

పరిశోధనలకు బిలియన్ డాలర్ల పెట్టుబడులు

ప్రధాని మోదీ వెల్లడి



ముంబయి: పరిశోధనల కోసం భారత్ బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని ముంబయిలో జరిగిన ఖగోళశాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్ర ఒలింపియాడ్‌లో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ..భారత్‌లో సంప్రదాయం ఆవిష్కరణలతో భాగమవుతోందని అన్నారు. "వివిధ కార్యక్రమాల్లో భాగంగా భారత్ పరిశోధన వ్యవస్థలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతను భారత్‌లో చదువుకోవడానికి, పరిశోధనలు చేయడానికి మేం ఆహ్వానిస్తున్నాం. ఎవరికి తెలుసు అతి పెద్ద శాస్త్రవేత్త ఇటువంటి భాగస్వామ్యాల నుంచే పుట్టవచ్చేమో. విజ్ఞానశాస్త్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. గొప్ప కలలు కనండి, ఉన్నత లక్ష్యాలను ఉంచుకోండి. ఆకాశం హద్దు కాదని, అది కేవలం ఆరంభం మాత్రమే అని భారత్‌లో నమ్ముతామని గుర్తుంచుకోండి" అని ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి ప్రసంగించారు.

12 రోజుల్లో 21 వేల మందిని అరెస్టుచేసిన ఇరాన్

ఇంటర్నెట్ డెస్క్: గత జూన్‌లో ఇజ్రాయెల్- ఇరాన్ దేశాల పరస్పర దాడులతో పశ్చిమాసియా అట్టుడికింది. ఇరుదేశాలూ పరస్పరం క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించుకున్నాయి.. చివరకు కాల్పుల విరమణ ఒప్పందంతో 12 రోజుల యుద్ధానికి తెరపడింది. ఆ వ్యవధిలోనే ఇరాన్ పోలీసులు దేశవ్యాప్తంగా 21 వేలమందికిపైగా అనుమానితులను అరెస్టు చేసినట్లు తాజాగా వెల్లడైంది. భద్రతాపరమైన కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ అధికారిక మీడియా వెల్లడించింది. యుద్ధ సమయంలో జరిగిన అరెస్టులపై పోలీసులు వివరాలు అందించడం ఇదే తొలిసారి.

అనుమానితుల గురించి ప్రజలే తమకు ఫిర్యాదు చేశారని పోలీసు ప్రతినిధి జనరల్ సయీద్ మొంతాజెరల్మహదీ వెల్లడించారు. 12 రోజుల యుద్ధ సమయంలో 21 వేల మందిని అరెస్టు చేయడమనేది.. భద్రత విషయంలో పౌరుల అప్రమత్తత, భాగస్వామ్యాన్ని సూచిస్తోందన్నారు. అయితే.. అనుమానితులు ఎదుర్కొంటున్న అభియోగాల గురించి మాత్రం ఆయన వివరించకపోవడం గమనార్హం. 260 మందిని గూఢచర్యం ఆరోపణల కింద, మరో 172 మందిని అక్రమంగా వీడియోలు చిత్రీకరించినందుకు అరెస్టుచేసినట్లు చెప్పారు.



గణనాథుడు సిద్ధం..

ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వీధులు అంటూ తేడా లేకుండా ఊరూవాడా కలిసి చేసుకునే పండగ వినాయక చవితి... గత కొన్నేళ్లుగా ప్రజల్లో చైతన్యం వచ్చి మట్టి విగ్రహాలనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపిస్తాయని కొంతమంది ఇప్పటికీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. వారికోసం కేదారేశ్వరపేట- రామకృష్ణాపురం మధ్య రామచంద్ర థియేటర్ రహదారికి ఇరువైపులా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన విగ్రహాలివి.

–ఈనాడు, అమరావతి





యంత్రాంగం.. సన్నద్ధం

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో పోలీసులు మంగళవారం ముందస్తు కవాతు నిర్వహించారు. మైదానాన్ని త్రివర్ణశోభితంగా తీర్చిదిద్దుతున్నారు.

– ఈనాడు, అమరావతి

ధరలు పెంచి.. ధగధగతో ముంచి!

★ విజయవాడ బస్టాండ్‌లో నయా దందా ★ ప్రయాణికులను దోచేస్తున్న వ్యాపారులు



ఇదీ.. విజయవాడ బస్టాండ్‌లో ఓ దుకాణంలో నీటి బాటిల్‌పై ముద్రించిన అధిక ఎమ్మార్పీ. బ్రాండెడ్ కంపెనీల లీటర్ బాటిల్ విలువ రూ.20. ఇక్కడ మాత్రం లోకల్ కంపెనీల లీటర్ బాటిల్‌పై రూ.25 ఎమ్మార్పీ ఉంటుంది. ఇదేంటని ప్రశ్నిస్తే కొంటే కొనండి... లేకుంటే పొండి అంటారు.



ఇవీ బస్టాండ్‌లో విక్రయానికి పెట్టిన తాగు నీటి బాటిళ్లు, శీతల పానీయాలు. దాదాపు ఏవీ గుర్తింపు ఉన్న కంపెనీలవి కాదు. చూడడానికి అన్నీ ప్రముఖ కంపెనీల మాదిరిగానే కనిపిస్తాయి. బ్రాండెడ్ కంపెనీల్లానే పరిమాణం, ఆకృతి, అదే రంగు లేబుళ్లతో తయారు చేస్తారు. కంపెనీ పేరు సైతం చిన్న అక్షరం మార్పుతో అదేవిధంగా ఉంటుంది. దీంతో తెలియని వారే కాదు.. చదువుకున్న వారు సైతం మోసపోతున్నారు.

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, విజయవాడ బస్‌స్టేషన్

విజయవాడ బస్టాండ్‌లో వ్యాపారులు కొత్త రకం దోపిడీకి తెరదీశారు. అధిక ధరలు, నాణ్యత, పరిమాణం లోపాలతో సొమ్ము చేసుకునే స్థాయి నుంచి ఏకంగా స్వయంగా ఎమార్పీలు ముద్రించి దోచుకునే వరకు వచ్చారు. నాసిరకం వస్తువులు సరఫరా చేసి ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

రూ.కోట్లలో దోపిడీ...

తాగునీరు బాటిళ్ల మొదలు, శీతల పానీయాలు, స్నాక్స్, ఫ్యాన్సీ ఇలా ఏ వస్తువు చూసినా బ్రాండెడ్ వస్తువులు కన్పించవు. అన్నీ లోకల్ కంపెనీలే దర్శనమిస్తాయి. ఈ వస్తువుల తయారీదారులతో వ్యాపారులు కుమ్మక్కై తయారీ ప్రాంతాల్లోనే అధిక ఎమ్మార్పీలు ముద్రిస్తున్నారు. ఈ వస్తువులు బ్రాండెడ్ వస్తువుల ధరలో సగానికే కొని... గుర్తింపు ఉన్న కంపెనీల కంటే 10 శాతం ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. రాత్రి 10 దాటితే 20 శాతం అదనపు వడ్డింపు తప్పదు. దీంతో ప్రయాణికులను మోసం చేయడమే కాకుండా వారి ఆరోగ్యంతోనూ ఆడుకుంటున్నారు. ఇలా అన్ని వస్తువుల్లో కలిపి ఒక్కో దుకాణదారుడు రోజుకు రూ.20 వేల వరకు దోచేస్తున్నారు. బస్టాండ్‌లో అన్ని దుకాణాలు కలిపి రోజుకు రూ.25 లక్షల చొప్పున నెలకు రూ.7 కోట్లకు పైనే దోపిడీ జరుగుతోంది.

విజయవాడ బస్టాండ్ నుంచి రోజుకు లక్షన్నర మంది రాకపోకలు సాగిస్తుంటారు. సిటీ బస్సులతో కలిపి మూడు వేల బస్సులు వచ్చి వెళుతుంటాయి. బస్టాండ్ ఆవరణలో 127 దుకాణాలు ఉన్నాయి. 90 శాతం దుకాణాల్లో వ్యాపారులు నిబంధనలు పాటించరు. ఏళ్లుగా పాతుకుపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

అంతా మా ఇష్టం..

ఆహార పదార్థాల పరిమాణం, ధరకు పొంతన ఉండదు. కొన్ని తినుబండారాలపైన ఎమ్మార్పీ, గడువు తేదీ కూడా ఉండదు. చాలా దుకాణాల్లో ధరల పట్టికలు కనిపించనంత చిన్నగా ఉంటాయి. ప్రయాణికులు సైతం ఎప్పుడో ఒకసారి వస్తాం కదా అని పట్టించుకోవడంలేదు. అధికారులకు తెలిసినా అరకొర జరిమానాలతో మమ అనిపిస్తున్నారు. **అధిక ధరలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఆర్‌ఎం దానం తెలిపారు.**

ఏరు దాటలేము.. వేదన దాచలేము!

వైరా ఏటికి వరద.. నిలిచిన రాకపోకలు ★ దాములూరు వంతెన అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో జాప్యం

నందిగామ, న్యూస్‌టుడే

రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే కూడలి దాములూరు వద్ద వైరా ఏరుకు ఉద్ధృతంగా వరదొచ్చింది. దీంతో రెండు ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 40 గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు నానా అవస్థలుపడుతున్నారు. వర్షం వస్తే చాలు భారీగా వరద వచ్చి లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికే వరదల వల్ల ఈ వంతెనపై రోడ్డు పూర్తిగా దెబ్బతింది. తొమ్మిదేళ్ల కిందట వైరా ఏటిపై హైలెవల్ వంతెన నిర్మించినా దీనికి అనుసంధానంగా ఇప్పటికీ అప్రోచ్ రోడ్లు లేవు. ఇందుకు పాలకులు, ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వత్సవాయి నుంచి కంచికచర్ల మండలం చెవిటికల్లును కలిసే ఈ రోడ్డు వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, వీరులపాడు, కంచికచర్ల మండలాల మీదుగా విస్తరించి ఉంది. నిత్యం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రజలు, రైతులు ఈ మార్గం గుండా పొలాలకు, గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మధ్యలో దాములూరు వద్ద సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద వైరా, కట్టలేరు కలిసి ప్రవహిస్తుంటాయి. వరద లోలెవల్ వంతెనపైకి రావడంతో రైతులు చుట్టూ తిరిగి మధిర, కంచికచర్ల మండలం గండెపల్లి మీదుగా పొలాలకు వెళ్లాల్సి వస్తోంది.

పట్టించుకోని గత ప్రభుత్వం

ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి రాష్ట్రంలో హైలెవల్ వంతెన నిర్మించారు. కానీ అప్రోచ్ రోడ్లు నిర్మించ లేదు. ఆ సమయంలో భూసేకరణలో జాప్యం వల్ల నిర్మాణానికి నోచుకోలేదు. గత వైకాపా ప్రభుత్వంలో అప్రోచ్ రోడ్ల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నుంచి అప్రోచ్ రోడ్లతో పాటు, కొణతమాత్మకూరు వరకు రోడ్డు పనులకు నిధులు కేటాయించారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాకపోవడం వల్ల గుత్తేదారుడు ముఖం చాటేయడంతో నిర్మాణానికి నోచుకోలేదు.



దాములూరు వద్ద లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

రూ.33 కోట్లు మంజూరు: కూటమి ప్రభుత్వం వచ్చాక వంతెన అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో జాప్యంపై 'ఈనాడు'లో వరుస కథనాలు ఇవ్వడంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. వంతెన వద్ద 400 మీటర్ల అప్రోచ్ రోడ్లు, నందిగామ మండలం కొణతమాత్మకూరు నుంచి వీరులపాడు మండలం పల్లంపల్లి గ్రామం వరకు 14 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.33 కోట్లు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నుంచి నిధులు మంజూరు చేశారు. ప్రధాన గుత్తేదారుడు ఈ పనులను మరో గుత్తేదారుడికి కేటాయించారు. దీంతో పనుల్లో జాప్యం నెలకొంది.

వరద తగ్గాక పనులు చేపడతాం: పరుశురాముడు, డీఈ

ఎన్‌డీబీ నుంచి వంతెనకు ఇరుపక్కలా అప్రోచ్ రోడ్లు, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారుడితో మాట్లాడి వరద తగ్గాక పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. వంతెనకు అప్రోచ్ రోడ్లతో పాటు 14 కి.మీ రోడ్డు నిర్మిస్తాం.

నాలుగు మాటలు.. నలభై లక్షలు..

ఫేస్‌బుక్ పరిచయంతో యువతి టోకరా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన యువకుడికి 'ఫేస్‌బుక్‌'లో పరిచయమైన ఓ అమ్మాయి తియ్యని మాటలు చెప్పింది. ఛాటింగ్ చేసింది. అధిక ఆదాయం వస్తుందని పెట్టుబడులు పెట్టించింది. చివరికి రూ.లక్షలు కొట్టేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గొల్లపూడికి చెందిన ఒక యువకుడు (34)కి ఈ ఏడాది జూన్ 11న ఫేస్‌బుక్‌లో నిధి విక్రమ్ అనే యువతి ఇంటీరియర్ డిజైనర్‌ను అంటూ పరిచయం అయింది. ఇద్దరూ తరచూ వాట్సప్‌లో ఛాటింగ్ చేసుకునేవారు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే.. పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించింది. నాకు బాగా లాభాలు వచ్చాయని ఆమె కొన్ని స్క్రీన్ షాట్లు పంపి నమ్మించింది. ఆమె పంపిన లింక్‌ను అతడు క్లిక్ చేశాడు. తర్వాత 'మార్కెట్ యాక్సెస్' పేరుతో ఉన్న ట్రేడింగ్ సంస్థలో లావాదేవీలు నిర్వహించడం ప్రారంభించాడు. సంస్థ చెప్పినట్లుగా పెట్టుబడుల రూపంలో 11 బ్యాంకు ఖాతాలకు రూ.40,46,939లు పంపించాడు. ఆ తర్వాత డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా.. అవి రాలేదు. మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

దేశం నలుమూలలకు బదిలీ..

ఆ యువకుడు డబ్బులు పంపిన బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే.. ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి. వీటిలో ఒకటి గుంటూరు నగరపాలెం ఐడీఎఫ్‌సీ శాఖ ఉంది. 7 బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలు ఉండగా... వీటిలో ముంబయిలో రెండు, మహారాష్ట్రలోని కరాడ్ 1, బెంగళూరులో 1, ఉత్తరాఖండ్‌లో 2, దిల్లీలోని నోయిడా శాఖకు వెళ్లినట్లు తేలింది. కోల్‌కతా శాఖకు డబ్బులు వెళ్లినట్లు గుర్తించారు. ఆయా బ్యాంకుల ఖాతాలను అధికారులు స్తంభింపచేసి. . లావాదేవీలు విశ్లేషిస్తున్నారు.

పీ4కు చేయూతనిస్తాం

ఎన్టీఆర్ కలెక్టరేట్: పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ-4 విధానానికి చేయూతనిస్తామని మరికొందరు ఆసక్తి చూపారు. ఎనికేపాడులో 149 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి కృష్ణా ఇంజినీరింగ్ వర్క్స్ యజమాని బి.రాజశేఖర్, భవానీపురం హెచ్.బి.కాలనీలోని 113 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరించడానికి గాయత్రీ వొడా టెక్ నిర్వాహకులు తమ సంసిద్ధత తెలిపారు. 37 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి డెవీ న్యూ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమిత్ జిందాల్ తమ అంగీకారం తెలిపారు. వీరంతా కలెక్టర్ లక్ష్మీశతో మంగళవారం సమావేశమయ్యారు. ప్రతిజ్ఞా పత్రాలు అందజేశారు.

నియంత్రికల ధరలు... దిగొచ్చాయి!

ఈనాడు - అమరావతి: ట్రాన్స్‌కోలోని ప్రాజెక్ట్స్ విభాగం.. ట్రాన్స్‌ఫార్మర్ల అంచనాల్లో అక్రమాలకు పాల్పడుతూ వస్తున్న ధరలు ఎట్టకేలకు దిగి వచ్చాయి. కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు ఉప కేంద్రాల అంచనాల్లో డ్యూయల్ ఫాస్ కోర్ 132 కేవీ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలను అమాంతం పెంచేసి ట్రాన్స్‌కో అధికారులు దోచుకున్నారు. దీనిపై 'ఈనాడు'లో 'వెలుగింట అవినీతి చీకట్లు' శీర్షికన వచ్చిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ట్రాన్స్‌కోలోని ప్రొక్యూర్‌మెంట్ విభాగం ఈ ట్రాన్స్‌ఫార్మర్లనే జీఎస్టీతో కలిపి రూ.1.75 లక్షలకు కొనుగోలు చేస్తోంది. వీటిని ప్రాజెక్ట్స్ విభాగం జీఎస్టీకి ముందు రూ.3.05 లక్షలుగా నిర్ణయించింది. ఈ దోపిడీపై ఉన్నతాధికారులు స్పందించి తగ్గించారు.

ఈనాడు కథనానికి స్పందన

తాజాగా కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని పోర్టు వద్ద నిర్మిస్తున్న రెండు 'మీటరింగ్ బే'ల నిర్మాణ అంచనాల్లో ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలను ఒక్కొక్కటి రూ.1.66 లక్షలుగా నిర్ణయించారు. తగ్గింపు కారణంగా ట్రాన్స్‌కోపై ఏటా రూ.11 కోట్ల మేర భారం తప్పుతుంది.



మే 24న ప్రచురించిన కథనం

పచ్చదనానికి కాపలా

అమరావతిని హరిత రాజధానిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. వీలైనంత మేరకు పచ్చదనంతో నింపుతున్నారు. హరితదనం ధ్వంసం కాకుండా కాపలాదారులను నియమించి... ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా డివైడర్లపై వేసిన పచ్చిక, మొక్కలను గేదెలు, ఆ మార్గంలో వెళ్లే వారు పాడుచేయకుండా 24 గంటలూ కాపలా పెట్టారు. ఎనిమిది గంటలకో షిఫ్ట్ చొప్పున మొత్తం మూడు విడతల్లో 17 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డులోని వెంకటపాలెం, ఈ3, ఎన్9, తదితర ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసింది.



– ఈనాడు, అమరావతి

విధేయతకు నామినేటెడ్ పట్టం

ఉద్యమ నేతకు గుర్తింపు...

కంచికచర్లకు చెందిన దళిత ఉద్యమ నేత, రచయిత **పోతుల బాల కోటయ్య**ను ప్రభుత్వం **రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గా** నియమించింది. గత ప్రభుత్వం రాజధాని అమరావతిని నిర్వీర్యం చేస్తున్న క్రమంలో బహుజన ఐకాస(జేఏసీ) అధ్యక్షుడిగా బాలకోటయ్య వైకాపా పాలనలో తప్పిదాలను నిరంతరం ఎత్తిచూపారు. అమరావతి ఉద్యమానికి నిరంతరం తన కవితలు, చర్చలతో మద్దతు తెలిపారు. బాలకోటయ్య మాట్లాడుతూ ఈ పదవి 'ప్రజా రాజధాని అమరావతి ఉద్యమం తనకు ఇచ్చిన గుర్తింపు అని, దానిని బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, విద్యా శాఖా మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుభవానికి అందలం..

రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా తెదేపా సీనియర్ నాయకులు **నాగుల్‌మీరాను** నియమించారు. గతంలో ఆయన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిగా, నగర అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గానూ నియమితులై పనిచేశారు. ప్రస్తుతం కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నాగుల్‌మీరాను ఎమ్మెల్యే సుజనా చౌదరి అభినందించారు.

తెదేపా బలోపేతానికి అవిశ్రాంత కృషి ..

రాష్ట్ర నగరాలు సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా విజయవాడ కోమలవిలాస్ సెంటర్ కూడలికి చెందిన **మరుపిళ్ల తిరుమలేష్** నియమితులయ్యారు. గత 20 సంవత్సరాలుగా తిరుమలేష్ తెదేపా బలోపేతానికి కృషి చేశారు. పార్టీకి నమ్మకంగా పనిచేశారు. గత ఐదేళ్లలో నగరాలు సామాజిక అభివృద్ధికి వైకాపా ఎలా అడ్డుపడుతుందో అవగాహన కల్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించారు. నగరాల సామాజిక వర్గీయులు తెదేపా వెనుక నిలబడేందుకు ఆయన కీలకపాత్ర పోషించారు.



ఎన్టీఆర్ వీరాభిమాని..

తెదేపా విధేయుడిగా పేరు పొందిన **ఎరుబోతు రమణారావు.. ఏపీ నాగ వంశం సంక్షేమ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా** నియమితులయ్యారు. ఈయన ఎన్టీఆర్ వీరాభిమాని. 1982లో తెదేపా స్థాపించినప్పుడు పార్టీలో చేరారు. న్యూరాజరాజేశ్వరీపేటలో తన కంటూ ప్రత్యేకమైన క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 1995, 2000, 2005లో కార్పొరేటర్‌గా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. 2005 నుంచి 2010 వరకు పార్టీ ఫ్లోర్‌లీడర్‌గా, టీఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడిగా కార్మికుల సంక్షేమానికి కృషి చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా ఆరు సార్లు, అర్బన్ అధికార ప్రతినిధిగా 2 సార్లు, నాగవంశ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులై.. నాగ వంశీకుల అభివృద్ధికి కృషి చేశారు. వైకాపా హయాంలో తీవ్రమైన ఒత్తిడి వచ్చినా తెదేపాతోనే ఉన్నారు.



- విద్యాధరపురం, విజయవాడ వన్‌టౌన్, మధురానగర్, కంచికచర్ల



అందాల అనుపమ

విజయవాడలో మంగళవారం సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. పరదా సినిమా ప్రమోషన్‌లో భాగంగా నగరానికి వచ్చిన ఆమె కాసేపు అభిమానులు, మీడియాతో ముచ్చటించారు.

- గాంధీనగర్

18 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి సంబంధించి ప్రత్యేక కేటగిరీ ఎన్‌సీసీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన యూనివర్సిటీలో ఈ నెల 18వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు. ఆగస్టు 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నీట్ యూజీ ఒకటో ర్యాంకు నుంచి 1,38,000 వరకు, 19న 1,38,001 నుంచి 2,60,000 వరకు, 20న 2,60,001 నుంచి 4,91,000 వరకు, 21న 4,91,001 నుంచి ఆఖరి ర్యాంకు వరకు అభ్యర్థులు హాజరుకావాలని చెప్పారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితాలు, నీట్ యూజీ-2025 ర్యాంకు కార్డు, అన్ని ఎన్‌సీసీ, క్యాంపు/యూనివర్సిటీ ధ్రువ పత్రాలు ఒరిజినల్‌తో పాటుగా మూడు సెట్ల జెరాక్స్‌లు, అభ్యర్థి డిక్లరేషన్ పత్రాన్ని తీసుకొని రావాలని తెలిపారు.



మంగళవారం రాత్రి కదలికి తరలుతున్న కృష్ణమ్మ

వెన్నంటే.. వరద ముప్పు

3 లక్షల క్యూసెక్కుల పైచిలుకు వచ్చే ప్రమాదం..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన ప్రకాశం బ్యారేజీకి వరద ముప్పు పొంచి ఉంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి మంగళవారం 2 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఇది క్రమేపీ బ్యారేజీకి చేరుతోంది. బుధవారం 3 లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్: బ్యారేజీ వరద తీవ్రత నేపథ్యంలో కలెక్టర్ జి.లక్ష్మీశ మంగళవారం రాత్రి జలవనరులు, రెవెన్యూ, వీఎంసీ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటల పాటు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రక్షణ, భద్రత ఏర్పాట్లలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు నది వద్దకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పులిచింతల నుంచి విడుదలైన నీటితో పాటు, ఎగువున కురుస్తున్న వర్షపు నీరు చేరుతుందన్నారు. బ్యారేజీకి 4 లేదా 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే ప్రమాదం ఉందని, నదీ పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను క్రియాశీలం చేయాలని సూచించారు. పునరావాస శిబిరాలను సిద్ధం చేసుకోవాలని ఆయన ఆదేశించారు.

వెలగలేరు రెగ్యులేటర్ వద్ద పర్యవేక్షణ: వెలగలేరు రెగ్యులేటర్ వద్ద బుడమేరు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నదిలో ఈతకు వెళ్లకుండా చాటింపు వేయాలన్నారు. రానున్న రెండు లేదా మూడు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

సముద్రంలోకి 71,000 క్యూసెక్కులు: ప్రకాశం బ్యారేజీకి మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 87,326 క్యూసెక్కులు రాగా, 30 గేట్లను రెండు అడుగులు, మిగతా 40 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 71,000 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు 16,326 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 9,412, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 6,714, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

వాళ్లు కొట్టేశారు.. వీళ్లు పట్టేశారు..!

600 చరవాణుల స్వాధీనం ★ యజమానులకు అప్పగించిన పోలీసులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: చోరీకి గురైన చరవాణులను పోలీసులు కనిపెట్టి, వాటిని అప్పగించడంతో యజమానుల ఆనందం అంతాఇంతా కాదు. మంగళవారం లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా రూ.70లక్షల విలువైన 600 చరవాణులను సంబంధిత యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నేరాలపై వినూత్న రీతిలో పోరాడుతున్నామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకోవాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇప్పటి వరకు కమిషనరేట్‌లో 6000 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నూరు శాతం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'డివైన్ సురక్ష' పేరుతో ప్రార్థనా మందిరాల్లోనూ బిగిస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత ప్రతి పాఠశాలలోనూ సీసీ కెమెరా ఉండాలన్నదే తమ ధ్యేయమన్నారు.

చరవాణి పోతే... ఎవరిదైనా చరవాణి పోతే.. దాని ఐఎంఈఐ నంబరును సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లో నమోదు చేస్తారు. అది పనిచేయకుండా బ్లాక్ చేస్తారు. ఆ చరవాణిలో వేరే సిమ్ వేస్తే.. వెంటనే ఆ సమాచారం పోలీసులకు వచ్చేస్తుంది. పోలీసులు వారి నుంచి చరవాణులను స్వాధీనం చేసుకుంటారు. దాన్ని అన్‌బ్లాక్ చేసి, యజమానులకు అప్పగిస్తారు.

ఇతర రాష్ట్రాల నుంచి రికవరీ: ఇలా పట్టుకున్న చరవాణుల్లో కొన్ని ఇతర రాష్ట్రాల్లో ఉండగా.. స్వాధీనం చేసుకున్నారు. ఏపీలో 504, ఒడిశా 20, కర్ణాటక 18, మహారాష్ట్ర 16, రాజస్థాన్ 13, ఉత్తర్ ప్రదేశ్ 12, బిహార్ 10, పశ్చిమ్‌బంగా నుంచి 7 చరవాణులను తీసుకువచ్చారు. వీటిల్లో ఎక్కువగా వీవో బ్రాండ్ చరవాణులు ఉన్నాయి. వీవో 140, ఒప్పో 99, రియల్‌మీ 93, సామ్‌సంగ్ 87, వన్‌ప్లస్ 46, మోటరోలా 37, ఐక్యూబ్ 30, రెడ్‌మీ 30, ఐ ఫోన్ 13, షియామి 7, ఇన్‌ఫినిక్స్ 6, గూగుల్ పిక్సల్స్ ఫోన్ 6, బ్రాండ్ లేనివి 7 ఉన్నాయి.



మహిళకు ఫోన్ అప్పగిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

కొరియర్‌లో రప్పించారు... చోరీకి గురైన 600 ఫోన్లలో 504 చరవాణులను ఏపీలోనే స్వాధీనం చేసుకున్నారు. మిగిలినవి ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు గుర్తించారు. వాటిని వాడుతున్న వారికి పోలీసులు ఫోన్లు చేసి వివరాలు అడిగారు. తాము తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేశామని, చోరీకి గురైనవని తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. పోలీసులు వారికి సమాచారం ఇవ్వడంతో.. 96 చరవాణులను విజయవాడ పోలీసులకు కొరియర్ ద్వారా పంపించారు. తక్కువ ధరకు వస్తుందని అపరిచిత వ్యక్తుల నుంచి సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనవద్దని సీపీ సూచించారు. ఒకవేళ అవి చోరీకి గురైనవి అయితే.. పోలీస్ కేసుల్లో ఇరుక్కుంటారని ఆయన హెచ్చరించారు.

త్రివర్ణ కాంతులు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరమంతా త్రివర్ణ శోభితంగా మారుతోంది. ఇందులో భాగంగా ప్రకాశం బ్యారేజీ గోడలతో పాటు పరిసర ప్రాంతాలను మూడు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. - ఈనాడు, అమరావతి

నీట్ యూజీ తాత్కాలిక సీట్ల కేటాయింపు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ ఆల్ ఇండియా కోటా మొదటి విడత కౌన్సెలింగ్ తాత్కాలిక సీట్ల కేటాయింపు వివరాలను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ మంగళవారం రాత్రి విడుదల చేసింది. అభ్యంతరాలుంటే 13వ తేదీ ఉదయం 11 గంటల్లోగా mccresultquery@gmail.com ఈ-మెయిల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే తుది సీట్ల కేటాయింపు చేస్తామని, ఎంసీసీ వెబ్‌సైట్ నుంచి సీట్ల కేటాయింపు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 492 ఎంబీబీఎస్ సీట్లు ఆల్ ఇండియా కోటా కింద ఉంచారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా ఆయా కళాశాలల్లో చేరాలి. ఈ వారంలో మూడు రోజులు బ్యాంకులకు సెలవు దినాలు కావడంతో చేరేందుకు గడువు పొడిగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

చోరీ.. రికవరీ భారీ..!

7 నెలల్లో రూ.8.39 కోట్ల సొత్తు స్వాధీనం



పటమట పీఎస్ పరిధిలో కిటికీ విరిచి చోరీ (పాత చిత్రం)

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో ఏడు నెలల కాలంలో 525 చోరీ కేసులు నమోదు కాగా రూ.8,39,36,760ల సొత్తు చోరీకి గురైంది. వీటిలో 363 కేసులను ఛేదించారు. నిందితుల నుంచి రూ.6.90 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ శాతం అత్యధికంగా 82.2గా నమోదైంది. నేరం జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల ద్వారా నిందితులను తక్షణం గుర్తించి అరెస్టు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సీపీ రాజశేఖరబాబు పేర్కొన్నారు. నగరంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేర పరిశోధన విభాగం పనితీరును ఆయన వివరించారు.

సీసీ కెమెరాలకు చిక్కుతారు..

ఏదైనా ప్రాంతంలో చోరీ జరిగితే నిందితులు సీసీ కెమెరాల్లో కనిపించేలా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. దొంగలు ద్విచక్ర వాహనం వినియోగిస్తే.. దాన్ని నంబరును గుర్తించడం, పాత నేరస్థులను ముఖ ఆధారిత స్కానింగ్ ద్వారా గుర్తించే వినూత్న సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఫలితంగా కేసుల ఛేదన గణనీయంగా పెరిగిందని సీపీ పేర్కొన్నారు. గత ఏడాది జులై నెలాఖరు నాటికి 668 చోరీలు జరిగితే.. ఈ ఏడాది 502 కేసులు నమోదయ్యాయి. వీటిలో 330 కేసులను అధికారులను ఛేదించారు. నిందితులను అరెస్టు చేశారు.

సెంట్రల్ జోన్ పరిధిలో ఎక్కువ..

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెస్ట్, నార్త్, సెంట్రల్, సౌత్, మైలవరం, నందిగామ డివిజన్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ కేసులు వెస్ట్ డివిజన్ పరిధిలో నమోదు కాగా.. సెంట్రల్ జోన్ పరిధిలో ఎక్కువ మొత్తం చోరీకి గురైంది. అదే విధంగా సెంట్రల్ జోన్ పరిధిలో రికవరీ కూడా ఎక్కువగానే ఉంది.

డివిజన్	కేసులు	చోరీకి గురైన సొత్తు (రూ.లలో)	రికవరీ
వెస్ట్	139	1,54,78,148	1,10,15,560
నార్త్	112	85,51,898	59,26,898
సెంట్రల్	117	4,00,18,664	3,63,22,962
సౌత్	43	81,41,600	73,81,400
మైలవరం	47	34,19,250	25,40,400
నందిగామ	67	83,27,200	58,13,700

మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి



సైకిల్ ర్యాలీలో డీఆర్ఎం మోహిత్ సొనాకియా తదితరులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: దేశభక్తిని చాటిచెప్పేలా మువ్వన్నెల జెండా ప్రతి ఇల్లు, రైల్వే కార్యాలయాలపై రెపరెపలాడాలని డీఆర్ఎం మోహిత్ సొనాకియా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులంతా దేశ సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. భారత్‌మాతాకి జై, వందేమాతరం నినాదాలతో నిర్వహించిన ఈ ర్యాలీలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, ఈఎల్ఎస్ డీఈఈ ఎన్. గురుశ్రీనివాస్, డీజిల్ లోకోషెడ్ డీఎంఈ జి.ఉదయ్‌భాస్కర్, అన్ని విభాగాల సీనియర్ అధికారులు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్, ఓబీసీ, రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాజధాని పనుల టెండర్ల కమిటీల పునఃవ్యవస్థీకరణ

కొత్తగా పలు శాఖల అధికారులకు చోటు

ఈనాడు - అమరావతి: రాజధానిలో సీఆర్డీఏ, ఏడీసీఎల్ చేపట్టే పనుల టెండర్లకు గతంలో ఉన్న కమిటీలను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈమేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మంగళవారం రెండు ఉత్తర్వులు జారీ చేశారు. మూడు కమిటీల్లో కొత్తగా పలు శాఖల అధికారులను చేరుస్తూ పునః వ్యవస్థీకరించారు. ఏడీసీఎల్ పనుల... మూడు కమిటీల్లో ఆ సంస్థ సీఎండీ ఛైర్మన్‌గా, ఆ సంస్థ సీఈ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. టెండర్ల రూపకల్పన వేళ.. సాంకేతిక అంశాలు, అర్హతలను నిర్దేశించే ప్రమాణాలను చూసే కమిటీ-1లో సీఆర్డీఏ కమిషనర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా సీఆర్డీఏలో సంబంధిత సీఈ ఉంటారు. సభ్యులుగా ప్రజారోగ్య విభాగం ఈఎన్‌సీ, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి, యూఎస్ఐ గ్రూప్ డైరెక్టర్, ర.భ శాఖ సీఈ, ర.భ శాఖ సీఈ (విద్యుత్తు), జలవనరుల శాఖ సీఈ, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ, ఏపీసీపీడీసీఎల్ సీఈ, ఏడీసీఎల్ సీఈ, వీఎంసీ సీఈ వ్యవహరిస్తారు. ★ టెండర్లు దాఖలైన తర్వాత టెక్నికల్ బిడ్లను తెరిచేటప్పుడు ప్రమాణాలను పరిశీలించే కమిటీ-2లో సీఆర్డీఏ కమిషనర్ ఛైర్మన్‌గా, సంబంధిత సీఆర్డీఏ సీఈ కన్వీనర్‌గా, సభ్యులుగా ఏడీసీఎల్ సీఎండీ, ప్రజారోగ్య విభాగం ఈఎన్‌సీ, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి, పురపాలక శాఖ అదనపు కార్యదర్శి, యూఎస్ఐ గ్రూప్ డైరెక్టర్, అకౌంట్స్ గ్రూప్ డైరెక్టర్, ర.భ శాఖ సీఈ, ర.భ శాఖ (విద్యుత్తు విభాగం) సీఈ, జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్, సీపీడీసీఎల్, ఏపీయూఎఫ్ఐడీసీ, ఏడీసీఎల్, సీఆర్డీఏ సీఈలు ఉంటారు. ★ ఆరు నెలల పైన పనుల సమయం పొడిగింపు, అదనపు పనులకు సొమ్ము చెల్లింపునకు సిఫార్సు చేసే కమిటీ-3లో ఛైర్మన్‌గా సీఆర్డీఏ కమిషనర్, సీఆర్డీఏ సీఈ కన్వీనర్‌గా, ఏడీసీఎల్ సీఎండీ, పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి, పురపాలక శాఖ అదనపు కార్యదర్శి, యూఎస్ఐ గ్రూప్ డైరెక్టర్, సీఆర్డీఏ అకౌంట్స్ గ్రూప్ డైరెక్టర్, ర.భ శాఖ, జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్, సీపీడీసీఎల్, ఏపీయూఎఫ్ఐడీసీ, ఏడీసీఎల్, వీఎంసీ, సీఆర్డీఏ సీఈలు సభ్యులుగా ఉంటారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ద్వారా జాతీయ ఉపకార వేతనాలు పొందడానికి దివ్యాంగ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు (ఏడీ) వి.కామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతులు (ప్రీ మెట్రిక్), ఇంటర్, డిగ్రీ డిప్లొమా స్థాయి వరకు (పోస్టు మెట్రిక్), 240 ప్రకటిత ఉత్తమమైన విద్యాసంస్థల్లో చదువుతున్న నూతన/రెన్యువల్ వారు అర్హులు. ప్రీ మెట్రిక్ విద్యార్థులు ఈ నెల 31 లోపు, ఉన్నత విద్య, పోస్టు మెట్రిక్ వారు అక్టోబరు 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

డ్రోన్ల వినియోగంతో ఉపాధి అవకాశాలు



డ్రోన్ పరిశీలిస్తున్న హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తదితరులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దేశానికి సేవలందించిన మాజీ సైనికోద్యోగులకు డ్రోన్ల వినియోగంతో మరోసారి సమాజానికి సేవ చేసే అవకాశం వచ్చిందని హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ సూచించారు. డ్రోన్లతో ఉపాధి పొందుతూ మరికొంతమందికి ఉపాధి కల్పించాలని అన్నారు. రాష్ట్ర సైనిక సంక్షేమ విభాగం, కోరమండల్ సంస్థ, దక్ష డ్రోన్స్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో మాజీ సైనికోద్యోగులకు మంగళవారం డ్రోన్స్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వజిత్ మాట్లాడుతూ.. దేశ రక్షణకు పాటుపడిన సైనికులకు కోరమండల్ సంస్థ ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధారిత రాష్ట్రమని, ఎరువులు, పురుగు మందుల వినియోగానికి అన్నదాతలు డ్రోన్లు వాడితే తక్కువ సమయంలో పని పూర్తవుతుందని తెలిపారు. రాష్ట్ర సైనిక సంక్షేమ విభాగం డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ అతిత్వరలోనే సైనిక సంక్షేమ విభాగంలో ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దక్ష డ్రోన్స్ సీఈవో సమీర్ సచిదానంద, ఆరెంటియస్ టెక్ సర్వీసెస్ ఎండీ ఆదిత్య మనోహర్, సీవోవో కె.శ్రీనివాస ప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ విభాగం సహాయ సంచాలకుడు పి.సత్యప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కె.కల్యాణవీణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టా తెచ్చిన తంటా..!

అసభ్య చిత్రాలతో వివాహితకు బ్లాక్‌మెయిల్

సూర్యారావుపేట: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి.. వివాహిత ఫొటోలు సేకరించాడు. వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన ఒక వివాహిత (31)కు ఇన్‌స్టాగ్రామ్‌లో పవన్ యాదవ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. 2024, జులై నుంచి ఆమెతో తరచూ ఛాటింగ్ చేస్తూ. . ఫొటోలు సేకరించాడు. వాటిని మార్ఫింగ్ చేసి భర్తకు, బంధువులకు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేయడంతో భయపడిపోయింది. అతను అడిగిన డబ్బులు ఇచ్చేందుకు సిద్ధపడింది. రూ.లక్ష నగదు, 2 బంగారు గాజులు ఇచ్చేందుకు అంగీకరించగా.. పవన్ యాదవ్ తన తండ్రి అంజయ్యను పంపి వాటిని తీసుకున్నాడు. ఇంకా డబ్బులు కావాలని బెదిరిస్తుండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

నకిలీ ఖాతాలు తెరిచి.. విస్సన్నపేటకు చెందిన ఓ యువతి (19) పేరుతో రెండు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు తెరిచి.. వాటి ద్వారా ఆమె బంధువులకు డబ్బులు పంపాలని అభ్యర్థనలు పంపుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ యువతి ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటున్నారు. ఏడు నెలలుగా ఆమె పేరుతో గుర్తు తెలియని ఓ వ్యక్తి రెండు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు తెరిచాడు. వాటి ద్వారా సదరు యువతి బంధువులు, స్నేహితుల గ్రూపులకు డబ్బులు పంపమంటూ మేసేజ్‌లు పంపుతున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన యువతి తండ్రి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేనత్తపై కత్తితో యువకుడి దాడి





మరియమ్మ (బాధితురాలు) నరేంద్ర (నిందితుడు)

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: డబ్బుల కోసం వేధిస్తూ మేనత్తపైనే యువకుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన మంగళవారం వెంగనాయకునిపాలెంలో చోటుచేసుకుంది. ఎస్సై అర్జున్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లగిరి నరేంద్ర(27) మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరుగుతున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో అదే గ్రామంలో నివసిస్తున్న మేనత్త యాదల మరియమ్మ చేరదీసి ఆశ్రయం కల్పించింది. మద్యం తాగేందుకు డబ్బుల ఇమ్మని ఆమెను తరచూ వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో కూరగాయల కత్తితో మేనత్తపై దాడికి తెగబడ్డాడు. అందరూ చేస్తుండగానే గొంతుకోసి పరారయ్యాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగానే ఉంది. నిందితుడిని ముండ్లపాడు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

గత ఏడాది తండ్రిని హత్య చేశాడు

నరేంద్ర చిన్నతనంలోనే తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో తండ్రి చిన్నోడు కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కొడుకులను పెంచాడు. వారిలో చిన్న కొడుకు వివాహం చేసుకొని పక్క గ్రామంలో ఉంటున్నాడు. నరేంద్ర తండ్రితోనే ఉంటూ పనులకు వెళ్లేవాడు. మద్యానికి బానిసై డబ్బుల కోసం నిత్యం తండ్రిని వేధింపులకు గురిచేసేవాడు. గత ఏడాది జనవరిలో నిద్రపోతున్న తండ్రిని రోకలిబండతో మోది హత్య చేశాడు. ఆ కేసులో కొన్ని నెలలు జైలుకు వెళ్లాడు. జైలు నుంచి తిరిగొచ్చిన తర్వాతైనా మారతాడనుకుని మేనత్త మరియమ్మ అతడికి ఆశ్రయం కల్పించగా ఇప్పుడు ఆమెపైనే దాడికి పాల్పడ్డాడు.

గంపలగూడెంలో 44.2 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. గంపలగూడెం 44.2, వత్సవాయి 33.2, చందర్లపాడు 8.2, పెనుగంచిప్రోలు 4.8, నందిగామ 3.6, జగ్గయ్యపేట 2.2, ఎ.కొండూరులో 1.8 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

ఆక్వా రంగంపై అమెరికా సుంకాల ప్రభావం



సమావేశంలో బలరాం, కృష్ణయ్య, కేశవరావు తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆక్వా ఎగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఏపీ రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు బి.బలరాం అన్నారు. ఆక్వా రైతుల సంఘం, ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 'భారత్‌పై అమెరికా ట్రంప్ సుంకాలు - ఆక్వా రంగంపై ప్రభావం' అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానంగా 8 జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పైగా రొయ్యలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై సుమారు లక్ష మంది రైతులు ఆధారపడ్డారని చెప్పారు. భారత్ నుంచి ఇతర దేశాలకు పెద్ద మొత్తంలో ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ స్థితిలో డొనాల్డ్ ట్రంప్ ఎగుమతులపై సుంకాన్ని పెంచడంతో రూ.లక్షకు రూ.50వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. సుంకాల విధింపు రాష్ట్రంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇప్పటికే ట్రంప్ ప్రకటనతో రొయ్యల ధరలు పడిపోయాయని, సుంకాల సాకుతో ఇతర దేశాలకు ఎగుమతి చేసే రొయ్యలు, కౌంట్‌లు కూడా ధర తగ్గించి కంపెనీలు కొనడంతో టన్నుకు సుమారు రూ.40వేల వరకు నష్టపోతున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ధరలు మరింత పతనమయ్యే అవకాశాలు ఉన్నాయని వాపోయారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు.. కేంద్ర ప్రభుత్వం ఎంపీఈడీఏ (మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ) ద్వారా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను ప్రస్తుత ధర కంటే తక్కువ కాకుండా కొనుగోలు చేస్తామని భరోసా ఇవ్వాలన్నారు. కేంద్రం ఎక్స్‌పోర్టర్స్ ధర తగ్గించి కొనుగోలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు. ఆక్వా రంగం నిపుణులు ఆలీ హుస్సేన్, రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు, కోనా జోసఫ్, ఆర్.సూర్యనారాయణ రాజు, రావి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ దుర్మరణం



నాగేశ్వర నాయక్ (పాత చిత్రం)

జయంతి(వీరులపాడు), న్యూస్‌టుడే: స్తంభంపై మరమ్మతులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతానికి గురై లైన్‌మెన్ మృతి చెందిన ఘటన మండలంలోని జయంతిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుగ్లోతు నాగేశ్వరరావు నాయక్ పొన్నవరంలో జూనియర్ లైన్‌మెన్ కాగా.. జయంతి గ్రామంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్థానిక బీసీ కాలనీలో ఎల్‌టీ లైను తీగలు వదులుగా ఉండడంతో మరమ్మతుల చేయడానికి నియంత్రిక వద్ద ఫ్యూజ్ తీసి స్తంభంపై మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అదేసమయంలో ఓ ఇంటిలో ఇన్వెర్టర్ నుంచి విద్యుత్తు సరఫరా కావడంతో నాయక్ విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు బలమైన గాయమై మృతి చెందారు. మృతుడు జి.కొండూరు మండలం చెరువు మాధవరం గ్రామానికి చెందిన వ్యక్తి. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

కొలిక్కి వచ్చిన కమిటీల ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే : రెండు నెలలుగా సందిగ్ధంలో పడిన తెదేపా మండల, పట్టణ కమిటీల ఎంపిక కొలిక్కి వచ్చింది. ఆయా కమిటీల అధ్యక్షుల నియామకాన్ని మంగళవారం పూర్తి చేసినట్లు నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్వగ్రామం నందిగామ మండలం ఐతవరంలో మండలంలోని నేతలు, ఆసంపూర్తిగా ఉన్న గ్రామాల నాయకులను పిలిపించారు. వారితో సమావేశమైన ఎమ్మెల్యే, గత ఎన్నికల్లో తెదేపా తర పున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన మండలంలోని జొన్నలగడ్డకు చెందిన జొన్నలగడ్డ గోపాలస్వామిని తెదేపా మైలవరం మండల అధ్యక్షుడిగా ప్రకటించినట్లు తెలిసింది. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా పట్టణ కార్యదర్శిగా ఉన్న షేక్ కరీంఖాదర్ పేరును ప్రకటించినట్లు సమాచారం. అధ్యక్షుల ఎంపిక పూర్తి కావడంతో, కార్యదర్శుల ఎంపికను వెంటనే పూర్తి చేయనున్నట్లు నాయకులు చెబుతున్నారు. మరో వైపు గ్రామ కమిటీల ఎంపిక పూర్తికాని వెల్వడం, పొందుగల సంబంధించిన ప్రక్రియ నేతల మధ్య పేచీతో నిలిచినట్లు ప్రాథమికంగా తెలిసింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన వందనం

◆ తిరువూరు పురపాలిక పరిధిలోని 18వ వార్డు నాగార్జున కాలేజీ రోడ్డులో డ్రైయిన్ జేబీ నుంచి తీసిన వ్యర్థాలను అలాగే వది లేశారని స్థానికుడు ఆర్.సుబ్బారావు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో వాటిని తీయించారు. సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**



? దుగ్గిరాలపాడు గ్రామ శివారులోని విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా నివారించాలి. **- వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో స్తంభాన్ని సరి చేయిస్తాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **- షఫీ విద్యుత్తు శాఖ సహాయక ఇంజినీర్ - న్యూస్‌టుడే, జి.కొండూరు**

? కొండపల్లి పురపాలిక ఇబ్రహీంపట్నం ప్రధాన్‌నగర్ కాలువల్లో మురుగు పేరుకుపోయింది. దీంతో వర్షం వచ్చిన ప్రతిసారి వర్షం నీరు మురుగు నీటితో కలసి రోడ్లపై నిలుస్తున్నాయి. **- శ్రీకర్, స్థానికుడు** ✔ ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కాల్వ డ్రెయిన్లలో ఉన్న చెత్తను తొలగిస్తున్నాం. చిన్నపాటి కాలువల వల్లే నీరు రహదారులపైకి వస్తున్నాయి. **- మధు, పారిశుద్ధ్య మేస్త్రీ - న్యూస్‌టుడే, కొండపల్లి**

శాస్త్రోక్తంగా విగ్రహాల ప్రతిష్ఠ

గంపలగూడెం : మండలంలోని పెనుగొలను బోటీ మీద ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం జంట నాగుల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించగా పలువురు భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి మూలవిరాట్‌కు పూజలు చేశారు.

కుట్టుమిషన్ వితరణ

మైలవరం : స్థానిక జయలక్ష్మి జ్యువెలరీ మార్ట్ యజమాని, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బలుస వెంకటేశ్వరరావు, స్వాతికంగా ఉన్న ఒక పేద మహిళకు మహిళకు కుట్టు మిషన్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర రాష్ట్ర సహాయ కార్యదర్శి బూశాయం లక్ష్మణప్రసాద్ పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ

విస్సన్నపేట : స్థానిక బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఐటీయూ జరిగిన కార్మికుల మహాసభలో విస్సన్నపేట సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక రాగా అడా శ్రీనివాసరావు, కో-కన్వీనర్‌గా బిలకమ్మ మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

క్రమబద్ధీకరణకు మరో అవకాశం

డిసెంబరు 31 వరకు గడువు పెంపు

న్యూస్‌టుడే ఇబ్రహీంపట్నం (గ్రామీణ)

అదనపు విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణకు మరో అవకాశం లభించింది. ప్రతి కిలో వాట్‌కు 50 శాతం రాయితీని ప్రకటిస్తూ మార్చి 1 నుంచి జూన్ 30 వరకు అధికారులు గడువు ఇచ్చారు. పరిమితికి మించి విద్యుత్తును అదనంగా వాడుతూ అపరాధ రుసుముకు గురవుతున్న వినియోగదారుల కోసం ఈ శాఖ క్రమబద్ధీకరణ పేరుతో ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీనికి వినియోగదారుల వినతుల మేరకు గడువును డిసెంబరు 31వ తేదీ వరకు పెంచుతూ విద్యుత్తు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



విద్యుత్తు నియంత్రిక

రాయితీ వర్తింపు ఇలా (లోడు కిలోవాట్లలో)..		
అదనపు లోడు	అసలు ధర(రూ.)	తగ్గింపు ధర (రూ.)
1	2,250	1,250
2	4,450	2,450
3	6,650	3,650
4	8,850	4,850
5	11,050	6,050

పథకం ద్వారా జూన్ 30వ తేదీ నాటికి రూ.20,618,200 చెల్లించి తాము వినియోగిస్తున్న అదనపు విద్యుత్తు లోడును క్రమబద్ధీకరించుకున్నారు. రూరల్ డివిజన్ పరిధిలోని చిల్లకల్లు, ఇబ్రహీంపట్నం, మైలవరం, నందిగామ సబ్ డివిజన్ పరిధిలో 10,138 మంది వినియోగదారులు 16696.2 కిలో వాట్ల అదనపు విద్యుత్తు వినియోగానికి రుసుము చెల్లించి క్రమ

రూ.2.06 కోట్లు ఆదాయం

విజయవాడ రూరల్ డివిజన్ పరిధిలోని వినియోగదారులు విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణ

విజయవాడ రూరల్ డివిజన్ పరిధిలో.. 2025 మార్చి 1 నుంచి జూన్ 30 వరకు అదనపు లోడు క్రమబద్ధీకరణ వివరాలు ఇలా..

సబ్ డివిజన్	కనెక్షన్లు	అదనపు లోడు (కి.వా)	చెల్లించిన సొమ్ము(రూ.)
చిల్లకల్లు	2,364	4291	5,286,600
ఇబ్రహీంపట్నం	3,686	5767.74	7,132,500
మైలవరం	1,625	2965.46	3,669,550
నందిగామ	2,463	3672	4,529,550

బద్ధీకరించుకున్నట్లు అధికారులు తెలిపారు.

స్పందిస్తున్నారు

అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవడానికి వినియోగదారులు ముందుకొస్తున్నారు. రాయితీ కాల పరిమితి జూన్ 30తో ముగిసినా వినియోగదారుల స్పందనను దృష్టిలో పెట్టుకొని గడువును పొడిగించారు. దీని విద్యుత్తు శాఖకు వినియోగదారులకు ఉపయుక్తమైంది. **- వెంకన్న, విద్యుత్తు శాఖ సహాయక ఇంజినీర్, ఇబ్రహీంపట్నం**

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : జి.కొండూరులోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని పది విద్యార్థులకు వేముల కొండ శ్రీరాములు మనిమన్య మెమోరియల్ తరఫున వారి కుమారుడు కొండిన్య సేవా సమితి కార్యదర్శి వెంకటేశ్వరరావు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు

తెదేపా నేత మాతృమూర్తికి పరామర్శ



కస్తూరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన సురేంద్ర దంపతులు

తిరువూరు, న్యూస్‌టుడే : తెదేపా నాయకుడు, 8వ వార్డు కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర మాతృమూర్తి కస్తూరిని హైదరాబాద్ ల్యాండ్ మార్క్ ఆసుపత్రిలో తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. నాలుగు రోజుల కిందట ఆమెకు అక్షిత మోకాలు శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆసుపత్రికి వచ్చి ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీశారు. కౌన్సిలర్ సురేంద్ర దంపతులు ఆయన వెంట ఉన్నారు.

ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌కు శ్రీకారం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని కంగరంలో కూరపాటి సుస్మిత పొలంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పతంజలి ఫుడ్స్ కంపెనీ సహకారంతో చేపట్టిన ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానాధికారి బాలాజీ కుమార్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి పరాన్ మాబూ సుభాని మాట్లాడారు. తొలుత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానాధికారి నరేంద్ర కుమార్, పీఏసీఎల్, వీహెచ్‌ఏలు, పతంజలి ఫుడ్స్ కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో బాలాజీ కుమార్, పరాన్ మాబూ సుభాని, లక్ష్మీ కల్యాణి

బాధ్యతల స్వీకరణ

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : పీఏసీఎస్‌ల నియమితులైన త్రిసభ్య కమిటీల సభ్యులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం మండలం నెమలిలో పి.మాధవరావు, బి.మురళీధరరావు, కె.దేవయ్య, తిరువూరు మండలం టేకులపల్లిలో ఎస్.మల్లారెడ్డి, జి.కాటయ్య, బి.లక్ష్మణరావులను తెదేపా నాయకులు అభినందించారు. ఎ.కొండూరు మండలంలోని రేపూడి మాధవరం సొసైటీకి కె.సత్యేంద్ర కుమార్, ఎ.వెంకట సర్వయ్య, బి.కామ్మ, కోడూరు సొసైటీకి వై.కృష్ణారావు, వి.నాగరాజు, ఎం.నాగేంద్రమ్మ, గంపలగూడెం మండలంలో రాజవరం సొసైటీకి బి.శ్రీనివాసరావు, ఎస్.నరసింహారావు, ఎం.మల్లేశ్వరి, సత్యాలపాడు సొసైటీకి పి.రామయ్య, బి.చిన్న, ఎం.అంజనేయులు, దుందిరాలపాడు సొసైటీకి ఎస్.శివన్నారాయణ, ఎం.సురేష్, జి.కొండయ్య నియమితులయ్యారు. తిరువూరు మండలం మల్లేల, గంపలగూడెం మండలం కొణిజెర్ల సంఘాలకు సభ్యులను నియమించాల్సి ఉంది.



నెమలిలో కమిటీ సభ్యులను అభినందిస్తున్న తెదేపా నాయకులు

కేశినేని ఫౌండేషన్ సహకారంతో ఇంటింటా ఉపాధి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో నడుస్తున్న కేశినేని ఫౌండేషన్ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటా ఉపాధి లభిస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధి తెల్లదేవరపల్లిలో మంగళవారం జరిగిన ప్రచార కార్యక్రమంలో ట్రస్టుకి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. సర్పంచి రాయల నాగరాజు, రాజా, నాల్లె నాగమణి, రాయల సత్యనారాయణ, దారా పత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

మధిర కాల్వకు సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబందం 72వ కి.మీ నియంత్రిక నుంచి మంగళవారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర కాల్వకు 585 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ కె.మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 258 క్యూసెక్కులు చేరాయని, దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 10, ఊటుకూరు-1కి 20, పెదకొమిర 10, మధిర 10, నిదానపురం 50 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు ఏఈ మహేష్ బాబు వివరించారు.

ఉపాధి హామీ పనుల్లో కొలతల తేడాలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి రికార్డుల్లో నమోదైన కొలతలు పని జరిగిన ప్రదేశంలో కొలతలకు తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు డీఆర్పీలు గ్రామ సభలో తెలిపారు. ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభలు మంగళవారం మద్దులపర్వ, రెడ్డిగూడెంలో జరిగాయి. మద్దులపర్వలో రూ.1.37 లక్షల పనులు జరిగాయని, వీటిలో సామాజిక తనిఖీ బృందం రికార్డుల మేరకు ఉన్న కొలతలు, పని ప్రదేశంలోని కొలతలు, కూలీల మస్టర్లలో తేడాలు గుర్తించినట్లు డీఆర్పీ కీమానాయక్ వివరించారు. రెడ్డిగూడెంలో ఉపాధి పనులు రూ.1.49 లక్షలు, పంచాయతీరాజ్ శాఖ రోడ్ల నిర్మాణం పనులు రూ.93 లక్షలు పనులు జరిగాయని డీఆర్పీ డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇరు గ్రామాల సర్పంచులు నాగేంద్రమ్మ, ఎం.రాణి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. వేమిరెడ్డిపల్లికి ఉత్తర్వులు వెలువడలేదు. తెల్లదేవరపల్లిలో వీరమాచినేని కృష్ణప్రసాద్(తెల్లదేవరపల్లి), కంభంపాటి బద్రీనాథ్(విస్సన్నపేట), కస్తూరి సీతారామస్వామి(పుట్రేల), పామర్తి లక్ష్మీనారాయణ(కొండపర్వ), దొడ్డా నరసింహారెడ్డి(కలగర), కట్టా నరసింహారావు(కొర్లమండ) నియమితులయ్యారు.

సమాధానమివ్వకుండా అరెస్ట్ తగదు



నిరసన తెలుపుతున్న కిరణ్, కాంగ్రెస్ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : ఎన్నికల నిర్వహణలో తలెత్తిన సందేహాలపై ప్రశ్నించిన తమ అధినాయకుడు రాహుల్ గాంధీకి సమాధానం చెప్పకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ అన్నారు. రాహుల్ అరెస్ట్‌కు నిరసనగా మంగళవారం స్థానిక నూజివీడు రోడ్డులోని మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, గొంది సురేష్, పిట్టల నాగేశ్వరరావు, దోసపాటి గిరి, రవికుమార్, సుధాకర్, దుర్గారావు, అంజనేయులు పాల్గొన్నారు.

దీపాలు వెలగక.. ప్రమాదాలు ఆగక..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి శాంతినగర్ వరకు, గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు భద్రాచలం, హైదరాబాద్ జాతీయ రహదారులపై ఉన్న విద్యుత్తు దీపాలు ఏళ్ల తరబడి వెలగడం లేదు. రోజూ ఈ రోడ్లపై ఎక్కడో ఒక్కచోట ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ద్విచక్ర వాహన చోదకులతో పాటు పాదచారులు ఆవేదన చెందుతున్నారు. చీకటి పడితే పశువులు కూడళ్ల వద్ద తిష్ఠ వేస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు చీకట్లో వాటిని గమనించకుండా ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్తు దీపాలకు ఛార్జీలు ఎవరు చెల్లించాలన్న విషయంపై స్పష్టత లేక పోవడంతో విద్యుత్తు శాఖ వాటికి సరఫరా నిలిపేసినట్లు ఆ శాఖ సిబ్బంది తెలుపుతున్నారు.



రహదారిపై చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నిర్వహణ ఖర్చులు వస్తాయి: కొండపల్లి పురపాలిక పరిధిలోని రహదారుల డివైడర్లపై సోలార్ పలకలు ఏర్పాటు చేసి ఆ విద్యుత్తును రోడ్ల వెంట ఉన్న వీధి దీపాలకు వినియోగించుకుంటే విద్యుత్తు బిల్లుల చెల్లింపు సమస్య ఉండదని, మిగులు విద్యుత్తును ఆ సంస్థకు విక్రయించుకుంటే నిర్వహణ ఖర్చులు వస్తాయని సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. ఆ దిశగా పురపాలిక అధికారులు చర్యలు తీసుకుంటే సమస్య పరిష్కారమవుతుందని పురపాలిక వాసులు సూచిస్తున్నారు. చీకట్లో రహదారిపై పశువులను గుర్తించేందుకు వాటి కొమ్ములకు రేడియం స్టికర్లు అతికించే విధంగా పశుపోషకుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. వారు ముందుకు రాకపోతే పురపాలిక అధికారులైనా స్టికర్లు అతికించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆసుపత్రికి తాళం.. ఎవరొస్తారో తెలియని దైన్యం

నాలుగున్నర దశాబ్దాలుగా మండల ప్రజలకు వైద్య సేవలు అందించిన పుల్లూరు హోమియోపతి ఆసుపత్రి నిర్వహణ మిథ్యగా మారింది. మండలంలో వైద్య సౌకర్యాలు అంతగా లేని సమయంలోనే హోమియో సేవలను ప్రజలు వినియోగించుకున్నారు. కానీ నిర్వహణ బాధ్యతల విషయంలో మండల స్థాయిలో ఎవరూ లేకపోవడంతో, ఇటీవల తరచూ వేసిన తాళాలతో దర్శనమిస్తోంది. నెల కిందట జరిగిన బదిలీల్లో అప్పటి వరకు పని చేసిన వైద్యురాలు వెళ్లిపోవడంతో, ఇటీవల ఎప్పుడు చూసినా ఆసుపత్రి భవనానికి తాళాలు వేసే ఉంటున్నాయి. దీనిపై ఆరోగ్య శాఖ అధికారులను సంప్రదించినా, తమకేమీ తెలియదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుల్లూరు(మైలవరం)



రక్తదానం చేయడం పరోపకారం

మైలవరం, న్యూస్‌టుడే : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా రక్తదానం చేయడం పరోపకారమని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించగా పలువురు విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులుగా ఉన్న వారు తరచూ రక్తం ఇవ్వొచ్చని వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ మదన్‌మోహన్, ఎన్ఎస్ఎస్ అధికారులు శివహరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోండి

చీమలపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : చీమలపాడులో ఆర్ఎంపీ వైద్యుడు ఉమామహేశ్వరరావు చేసిన వైద్యం వికటించి ములగపాటి బాబు(32) మృతి చెందారని ఆరోపిస్తూ అతని కుటుంబ సభ్యులు మంగళవారం ఆర్ఎంపీ ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేశారు. తన భర్త మృతికి కారణమైన ఉమామహేశ్వరరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భార్య అరుణ కుమారి అధికారులను కోరింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనపై విచారించేందుకు వారిని పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరారు. అతని మృతిపై వారం రోజుల క్రితమే వివాదం జరగ్గా కొందరు పెద్దలు ఇరువర్గాల మధ్య పంచాయతీ చేసినట్లు తెలిసింది.



నినాదాలు చేస్తున్న బాబు కుటుంబ సభ్యులు

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇచ్చిన సందర్భంగా స్థానిక శ్రీరామాంజనేయ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మందులు విక్రయిస్తున్నారని ఫిర్యాదు

చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : ప్రజల ఆరోగ్యానికి సంబంధించి అర్హులైన వైద్యులు రాసిచ్చిన చీటీల మేరకు దుకాణాల నిర్వాహకులు మందులు విక్రయించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.కృష్ణ స్పష్టం చేశారు. మండల పరిధిలోని పలు మందుల దుకాణాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. మూత్ర పిండాల వ్యాధి ప్రభావిత ప్రాంతమైన ఎ.కొండూరులో మెడికల్ షాపుల నుంచి నొప్పుల నివారణ మందులు ప్రజలకు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయని, దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

హర్‌ఘర్ తిరంగా ప్రదర్శన

ఇబ్రహీంపట్నం గ్రామీణం : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపు ప్రాంగణంతో పాటు కాలనీలో ద్విచక్ర వాహనాలతో తిరంగా ర్యాలీ చేశారు. వర్క్‌షాపు ముఖ్య ఇంజినీర్ శ్రీనివాస్ ఇందులో పాల్గొని సిబ్బందిని, కార్మికులను ఉత్సాహ పరిచారు. అంతక ముందు వర్క్‌షాపులో ముగ్గుల పోటీలు, వ్యాసరచన, తిరంగా రాఖీ, క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



మైలవరం : జాతీయ పతాకాలతో సిబ్బంది



గుంటుపల్లి : ర్యాలీలో శ్రీనివాస్, అధికారులు, కార్మికులు

మైలవరం : హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జాతీయ పతాకాల ప్రదర్శన చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద సర్పంచి మంజుభార్గవి, పంచాయతీ కార్యదర్శి రఫీ తదితరులు సెల్ఫీలు దిగి, త్రివర్ణ పతాకాలను ప్రదర్శించారు. మూడ్రోజుల పాటు ప్రత్యేక ప్రదర్శన ఉంటుందని వారు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని, ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులు, సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత ఎన్టీఆర్ జిల్లా జట్టు



అందుకున్న ట్రోఫీతో ఆటగాళ్లు, శిక్షకులు

మైలవరం : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన కొల్లేరు గ్రూపు ఫుట్‌బాల్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జట్టు విజేతగా నిలిచినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేష్ మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు విజేత జట్టుకు కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి ట్రోఫీ, బహుమతిని అందించారు. విజేత జట్టు ఈ నెల 16, 17 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలోని వంతెనపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. విజయవాడ నుంచి కొండపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్న తల్లి, కుమారులను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి పరగటి విజయమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. వాహనాన్ని నడుపుతున్న ఆమె కుమారుడు ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విజయమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న ప్రవీణ్

మురుగు కాలువలో పడి...

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గుంటుపల్లి అంబేడ్కర్ నగర్‌లోని మురుగు కాలువలో మంగళవారం ఓ వ్యక్తి పడి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసుల సమాచారం మేరకు.. మృతుడు పట్టేటి కల్యాణ్(40) సెంట్రింగ్ పని చేస్తుంటారు. కొద్ది కాలంగా కుటుంబ వివాదాలతో అతను మానసికంగా బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం కూడా విషమించి కూర్చున్న చోటనే పడిపోతుంటారు. రోజు మాదిరిగానే వర్క్‌షాపు రోడ్డులో మురుగు కాలువపై ఉన్న బెంచిపై కూర్చుని తూలు వచ్చి కాలువలో పడిపోయారు. గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి కాలువలోని అతడిని బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఎస్సై విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొని చోదకుడి దుర్మరణం

ముష్టికుంట్ల(తిరువూరు), న్యూస్‌టుడే : మండలంలోని ముష్టికుంట్లకు వెళ్లే దారిలో వేప చెట్టును ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో చోదకుడు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరానికి చెందిన కర్నాటి వేమారెడ్డి(45) మంగళవారం దుర్మరణం పాలయ్యాడు. చెట్టును వాహనం బలంగా ఢీకొట్టడంతో వేమారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.



దరఖాస్తు చేశారా?

- బెల్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీలు
  చివరి తేదీ: 13.08.2025
- సౌత్ వెస్టర్న్ రైల్వేలో అప్రెంటిస్ ఖాళీలు (904)
  చివరి తేదీ: 13.08.2025

కరెంట్ అఫైర్స్

- భారత కొత్త వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్? జ: పుష్పేంద్రసింగ్



- కర్తవ్య భవన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఎక్కడ ప్రారంభించారు? జ: న్యూదిల్లీ
- 2025 నాటికి యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా కోసం భారత నామినేట్ చేసిన ప్రదేశం?

మాదిరి ప్రశ్నలు

జ: సారనాథ్ (ఉత్తర్‌ప్రదేశ్)

- 'ది కాన్షియస్ నెట్‌వర్క్' పుస్తక రచయిత? జ: సుగత శ్రీనివాస రాజు
- తప్పిపోయిన బాలికలను కనుక్కొని తిరిగి ఇంటికి చేర్చేందుకు ఆపరేషన్ TRACE ను ప్రారంభించిన రాష్ట్రం? జ: ఆంధ్రప్రదేశ్
- బ్లూ బర్డ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఏ దేశం అభివృద్ధి చేస్తుంది? జ: అమెరికా
- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి నూతనంగా ఎన్నికైన ఐదు తాత్కాలిక సభ్య దేశాలు ఏవి? (2026, జనవరి 1 నుంచి 2027, డిసెంబరు 31 వరకు ఈ ఐదు సభ్య దేశాలు తాత్కాలిక సభ్య దేశాలుగా భద్రతా మండలిలో సేవలు అందిస్తాయి.)
  జ: బ్రహెయిన్, కొలంబియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), లాత్వియా, లైబీరియా.

మరింత సమాచారం

ఈనాడు ప్రతిభ
- https://pratibha.eenadu.net - https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

సంక్షిప్త సమీకరణానికి సరళ రూపం!



సూపర్ మార్కెట్‌కి వెళ్లారు. రకరకాల వస్తువులను డిస్కౌంట్‌లో కొన్నారు. ప్రతి వస్తువుపై విడివిడిగా డిస్కౌంటు తీసేసి చెల్లించాల్సిన మొత్తాన్ని లెక్కగడతారు. ఈ విధంగా ఒక సమస్యను లేదా సమీకరణాన్ని సరళమైన, సులభమైన రూపంలోకి మార్చడమే సూక్ష్మీకరణ. ఇందులో సంఖ్యలు, బీజగణిత పద్ధతులు, గుణకార, భాగహారాలు, కూడికలు, తీసివేతలు మొదలైన గణిత ప్రక్రియలను ఉపయోగిస్తారు. దీనిపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. అభ్యర్థులు గణిత సూత్రాలు, నియమాలను తప్పనిసరిగా నేర్చుకోవాలి. ఘాతాంకాలు, వర్గమూలాలు, భిన్నాలు, దశాంశాలు, పట్టికలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

సూక్ష్మీకరణ

'VBODMAS' సూత్రం: సమస్య సాధనలో అనేక గణిత గుర్తులు ఒకేసారి వస్తే సూక్ష్మీకరణ చేసేటప్పుడు కింది విధంగా వరుసను అనుసరించాలి.

V – Vinculum (అడ్డుగీత) ——

B – Bracket [( ), { }, [ ] ఈ క్రమంలోనే తొలగించాలి)


O – of (గమనిక: దీనిలో ఘాతాలు కూడా ఉంటాయి)

D – Division (భాగహారం) ÷

M – Multiplication (గుణకారం) ×

A – Addition (కూడిక) +

S – Subtraction (తీసివేత) –



బ్రాకెట్లు తొలగించిన తర్వాత, of → భాగహారం → గుణకారం → కూడిక → తీసివేత వరుసను అనుసరించాలి.

మాదిరి ప్రశ్నలు

1. $(3080 + 6160) \div 28$ విలువ ఎంత?
   1) 20 2) 440 3) 330 4) 335

వివరణ: $(3080 + 6160) \div 28$

ముందుగా బ్రాకెట్ తొలగించి, తర్వాత భాగహారం చేయాలి.

$9240 \div 28 = 330$ జ: 3

2. $1001 \div 11$ of 13 విలువ ఎంత?
   1) 7 2) 91 3) 143 4) 169

వివరణ: $1001 \div 11$ of 13

$= 1001 \div 143 = 7$ జ: 1

3. $\frac{(6+6+6+6) \div 6}{4+4+4+4 \div 4}$ విలువ ఎంత?
   1) 1 2) $\frac{3}{2}$ 3) $\frac{4}{13}$ 4) $3\frac{6}{13}$

వివరణ: $\frac{(6+6+6+6) \div 6}{4+4+4+4 \div 4}$

$= \frac{24 \div 6}{4+4+4+1} = \frac{4}{13}$ జ: 3

4. $18 - [5 - \{6 + 2(7 - \overline{8-5})\}]$ విలువ ఎంత?
   1) 13 2) 15 3) 27 4) 32

వివరణ: $18 - [5 - \{6 + 2(7 - \overline{8-5})\}]$

$= 18 - [5 - \{6 + 2(7-3)\}]$

$= 18 - [5 - \{6 + 2(4)\}]$

$= 18 - [5 - \{6+8\}] = 18 - [5 - 14]$

$= 18 - [-9] = 18 + 9 = 27$ జ: 3

5. $\left(\frac{5}{7} \text{ of } 1\frac{6}{13}\right) \div \left(2\frac{5}{7} \div 3\frac{1}{4}\right)$ విలువ ఎంత?
   1) $\frac{20}{169}$ 2) 1 3) $\frac{5}{4}$ 4) $1\frac{119}{180}$

వివరణ: $\left(\frac{5}{7} \text{ of } 1\frac{6}{13}\right) \div \left(2\frac{5}{7} \div 3\frac{1}{4}\right)$

$= \left(\frac{5}{7} \times \frac{19}{13}\right) \div \left(\frac{19}{7} \div \frac{13}{4}\right) = \frac{95}{91} \div \left(\frac{19}{7} \times \frac{4}{13}\right)$

$= \frac{95}{91} \div \frac{76}{91} = \frac{95}{91} \times \frac{91}{76} = \frac{5}{4}$ జ: 3

6. $\left[3\frac{1}{4} \div \left\{1\frac{1}{4} - \frac{1}{2}\left(2\frac{1}{2} - \overline{\frac{1}{4} - \frac{1}{6}}\right)\right\}\right]$ విలువ ఎంత?
   1) $\frac{1}{78}$ 2) 78 3) 76 4) $\frac{3}{76}$

వివరణ: $\left[3\frac{1}{4} \div \left\{1\frac{1}{4} - \frac{1}{2}\left(2\frac{1}{2} - \overline{\frac{1}{4} - \frac{1}{6}}\right)\right\}\right]$

$= \left[\frac{13}{4} \div \left\{\frac{5}{4} - \frac{1}{2}\left(\frac{5}{2} - \frac{3-2}{12}\right)\right\}\right]$

$= \left[\frac{13}{4} \div \left\{\frac{5}{4} - \frac{1}{2}\left(\frac{5}{2} - \frac{1}{12}\right)\right\}\right]$



$= \left[\frac{13}{4} \div \left\{\frac{5}{4} - \frac{1}{2}\left(\frac{30-1}{12}\right)\right\}\right]$

$= \left[\frac{13}{4} \div \left\{\frac{5}{4} - \frac{29}{24}\right\}\right] = \left[\frac{13}{4} \div \left\{\frac{30-29}{24}\right\}\right]$

$= \left[\frac{13}{4} \div \frac{1}{24}\right] = \frac{13}{4} \times \frac{24}{1} = 78$ జ: 2

7. $\frac{1}{2\times3} + \frac{1}{3\times4} + \frac{1}{4\times5} + \frac{1}{5\times6} + ... + \frac{1}{9\times10}$ విలువ ఎంత?
   1) $\frac{5}{2}$ 2) $\frac{2}{5}$ 3) $\frac{1}{3}$ 4) $\frac{1}{10}$

వివరణ: $\frac{1}{2\times3} + \frac{1}{3\times4} + \frac{1}{4\times5} + \frac{1}{5\times6} + ... + \frac{1}{9\times10}$

$= \frac{1}{2} - \frac{1}{3} + \frac{1}{3} - \frac{1}{4} + \frac{1}{4} - \frac{1}{5} + ... + \frac{1}{9} - \frac{1}{10}$

$= \frac{1}{2} - \frac{1}{10} = \frac{5-1}{10} = \frac{4}{10} = \frac{2}{5}$ జ: 2

నోట్: $\frac{1}{2\times3} + \frac{1}{3\times4} + ... + \frac{1}{9\times10} = ?$

ఇలాంటి ప్రశ్నలను సులభంగా చేయడానికి $\frac{1}{d}(f - l)$ ఫార్ములాను ఉపయోగించవచ్చు.

d = difference, f = first number

l = last number

జ: $\frac{1}{1}\left[\frac{1}{2} - \frac{1}{10}\right] \Rightarrow \frac{5-1}{10} = \frac{4}{10} = \frac{2}{5}$
(d f l)

8. ఒక వ్యక్తి తన జీవితంలో $\frac{2}{5}$ వ భాగం ఇంటి అద్దెకు, $\frac{3}{10}$వ భాగం తిండికి, $\frac{1}{8}$ వ భాగం దారి ఖర్చుకు వాడతాడు. అతడికి మిగిలిన జీతం రూ.1400 అయితే దారి ఖర్చుకు ఎంత ఉపయోగించాడు?
   1) రూ.1000 2) రూ.1500
   3) రూ.2000 4) రూ.2500

వివరణ: 5, 10, 8ల కసాగు = 40 మొత్తం

అద్దెకు $\frac{2}{5}$, తిండికి $\frac{3}{10}$, దారి ఖర్చుకు $\frac{1}{8}$, మిగిలింది

అద్దెకు	తిండికి	దారి ఖర్చుకు	మిగిలింది
16	12	5	7
		?	1400

$7 \rightarrow$ రూ.1400, $5 \rightarrow$ రూ.1000 జ: 1

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. $4\frac{1}{2} \times 4\frac{1}{3} - 8\frac{1}{3} \div 5\frac{2}{3}$ విలువ?
   1) $\frac{7}{17}$ 2) $1\frac{33}{34}$ 3) 8 4) $18\frac{1}{34}$

2. $\frac{\frac{1}{2} \div \frac{1}{2} \text{ of } \frac{1}{2}}{\frac{1}{2} + \frac{1}{2} \text{ of } \frac{1}{2}}$ విలువ?



   1) 1 2) $1\frac{1}{3}$ 3) $2\frac{2}{3}$ 4) 3

3. $\frac{x}{y} = \frac{4}{5}$ అయితే $\left(\frac{4}{7} + \frac{2y - x}{2y + x}\right)$ విలువ?
   1) $\frac{3}{7}$ 2) 1 3) $1\frac{1}{7}$ 4) 2

4. $\frac{1}{1\times2} + \frac{1}{2\times3} + \frac{1}{3\times4} + ... + \frac{1}{11\times12}$ విలువ?
   1) $\frac{7}{8}$ 2) $\frac{11}{12}$ 3) $\frac{15}{16}$ 4) $\frac{17}{18}$

5. $999\frac{995}{999} \times 999$ విలువ?
   1) 990809 2) 998996
   3) 998999 4) 99982

6. బంతి పైకి ఎగిరినప్పుడు, అది పడిన ఎత్తులో $\frac{3}{4}$వ వంతు ఎత్తుకు చేరుకుంటుంది. బంతిని 32 మీటర్ల ఎత్తు నుంచి పడేస్తే, 3వ సారి నేలను తాకిన తర్వాత ఎంత ఎత్తుకు ఎగురుతుంది?
   1) 13 మీ. 2) $13\frac{1}{2}$ మీ.
   3) $14\frac{1}{2}$ మీ. 4) ఏదీకాదు

సమాధానాలు: 1-4; 2-3; 3-2; 4-2; 5-2; 6-2.

గత పరీక్షల్లో ప్రశ్నలు

1. $[76 - \{90 \div 5 \times (24 - 36 \div 3) \div 3\}]$ విలువ?
   1) 71.5 2) 75.5
   3) 4 4) 77.5

2. $243 \div 3 \div 3 \div 3 \div 3$ విలువ ఎంత? (ఆర్‌ఆర్‌బీ ఎన్‌టీపీసీ 2021)
   1) 27 2) 3 3) 9 4) 243

3. $\{40 - (90 \div 5 \times \overline{16 - 8} \div 2 \div 3)\}$ విలువ? (ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ – 2019)
   1) 16 2) 28 3) 14 4) 64

4. $\frac{x}{y} = \frac{3}{2}$ అయితే $\frac{x^2 + y^2}{x^2 - y^2}$ విలువ? (ఆర్‌ఆర్‌బీ ఎన్‌టీపీసీ – 2022)
   1) $\frac{7}{5}$ 2) $\frac{11}{5}$ 3) $\frac{13}{5}$ 4) $\frac{9}{5}$

5. $\frac{1}{4} + \frac{6}{10} \times \frac{5}{4} - \frac{3}{4} \div \frac{4}{6} + \frac{1}{2}$ of $\frac{3}{4}$ విలువ? (ఏపీఎస్ఐ – 2023)
   1) $\frac{1}{8}$ 2) $\frac{1}{6}$ 3) $\frac{1}{4}$ 4) $\frac{1}{2}$

6. $\frac{3\left(\frac{2}{5} \text{ of } \frac{5}{7}\right) + \left(5 \div \frac{2}{9} \times \frac{6}{5} + 1\right)7^{-1}}{\sqrt{289}}$ విలువ? (టీఎస్ ఎస్ఐ – 2023)
   1) $\frac{3}{17}$ 2) $\frac{2}{7}$ 3) $\frac{13}{17}$ 4) $\frac{12}{7}$

సమాధానాలు

1-3; 2-2; 3-1; 4-3; 5-3; 6-2.



రచయిత: పిరాది నరేష్

స్వయంగా పండించి.. సొంతంగా విక్రయించి..

మాగల్లు(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే

కష్టపడి పండించిన పంటను దళారుల పాలుచేయకుండా తానే సొంతంగా విక్రయిస్తూ.. ఆశించిన రాబడి పొందుతున్నారు నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన సన్నకారు రైతు పగడాల నర్సయ్య. ఆయన ఇరవై సెంట్ల స్థలాన్ని కౌలుకు తీసుకున్నారు. బెండ తోట సాగు చేశారు. దుక్కి, విత్తనాలు, ఎరువులు, నీటి కోసం సుమారు రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కొద్ది రోజుల నుంచి పంట చేతికొస్తోంది. కూలీల ఖర్చు తగ్గించుకోడానికి తానే కాయలు కోసుకుంటారు. రోజు విడిచి రోజు 60 కిలోల కాయలు కోసి మార్కెట్లో నేరుగా కొంత సరకు విక్రయిస్తున్నారు. మిగిలినవి తన వద్ద ఉంచుకుని మరికొన్ని ఇతర కూరగాయలు కొనుగోలు చేసి, వాటితో కలిపి నిత్యం సాయంత్రం చుట్టుపక్కల గ్రామాల్లో ద్విచక్రవాహనంపై తిరుగుతూ విక్రయిస్తున్నారు. ఫలితంగా తాను పండించిన బెండ కాయలను గిట్టుబాటు ధరకు విక్రయిస్తూ లాభం పొందుతున్నానని చెప్పారు. మార్కెట్లో వ్యాపారులు తన వద్ద కిలో బెండకాయలు రూ.25 ధరకు కొంటున్నారని, తాను నేరుగా వినియోగదారులకు రూ.30 ధరకు విక్రయించి లాభం పొందుతున్నానని, ఇతర కూరగాయలు కూడా విక్రయించడం వల్ల మరికొంత అదనపు ఆదాయం వస్తోందని వివరించారు. నాలుగు మాసాల పాటు బెండ కాయలు చేతికి వస్తాయని తెలిపారు. మరో ఇరవై సెంట్లలో పచ్చిమిర్చి సాగు చేస్తున్నారు. మిర్చి మొక్కల కొనుగోలుకు రూ.2 వేలు ఖర్చు పెట్టారు. మార్కెట్లో కిలో పచ్చిమిర్చి ధర రూ.70 ఉంది. మరో నెల రోజుల్లో పంట చేతికొస్తుందని చెప్పారు. కొద్ది విస్తీర్ణంలో సాగు చేసినా రెండు పంటలపై ఏడాదికి రూ.50 వేల వరకు రాబడి వస్తుందని తెలిపారు.



బెండ కాయలను బస్తాలో పోస్తున్న రైతు నర్సయ్య

రైతేరాజు

ప్రశ్న: క్యాబేజీ పంటకు అనువైన నేలలు, విత్తే కాలం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించండి? - కె.వెంకటేశ్వరరావు, రైతు, తాడేపల్లి

సమాధానం: క్యాబేజీ పంటకు చల్లని, తేమ వాతావరణం అనుకూలం. చౌడు భూములు తప్ప మిగతా అన్ని నేలల్లో పండించవచ్చు. ముందుగా వేసే పంటకు ఇసుకతో కూడిన బంకనేలలు మేలు. సారవంతమైన నేలలు అధిక దిగుబడి ఇస్తాయి. స్వల్ప కాలిక రకాలకు ఆగస్టు, సెప్టెంబరు అనుకూలం. హెక్టారుకు 20-25 టన్నుల పశువుల ఎరువు వేసి కలియ దున్నాలి. ఆఖరి దుక్కిలో 150-200 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 100 కిలోల పొటాష్ వేసి దున్నాలి. నాటిన తరువాత 60 కిలోల నత్రజని ఎరువును 3 భాగాలు చేసి మొదటి సారి నారు నాటిన 25-30 రోజులకు, రెండోసారి 60 రోజులకు, మూడో సారి 75-80 రోజులకు వేసి నీరు పెట్టాలి. స్వల్పకాలిక రకాలు హెక్టారుకు 30-35 టన్నులు దిగుబడి వస్తుంది.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం
- ఘంటసాల, న్యూస్‌టుడే

వరిలో కలుపు యాజమాన్యం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : వరిలో కలుపు మొక్కల వల్ల పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. సకాలంలో వాటిని నివారించడం వల్ల ప్రతి వరి మొక్క పెరుగుదల సమర్థంగా ఉండి ఆశించిన దిగుబడి వస్తుంది. వరిలో కలుపు నివారణ యాజమాన్యంపై వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీదేవి వివరించారు.

- వరి పైరు జీవిత కాలంలో మూడో వంతు అంటే.. 40, 50 రోజుల వ్యవధిలో కలుపు నివారించాలి. వేసవిలో లోతు దుక్కులు, పరికరాల ద్వారా నివారణ, కూలీలతో తీయించడం, రసాయన మందులు పిచికారీ చేయడం లాంటి విధానాలతో కలుపు పూర్తిగా నివారించవచ్చు. రైతులు రెండు పద్ధతుల్లో వరి సాగు చేపడుతున్నారు. ఒకటి నాట్లు వేయడం, రెండోది వెద పద్ధతి.
- నారుమడిలో ప్రధానంగా వచ్చే ఊద జాతి కలుపు నివారణకు సైహలోఫాప్ బ్యూటైల్ 10 శాతం ఈసీ మందును ఎకరాకు 300 మి.లీ పిచికారీ చేయాలి. నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల వ్యవధిలో ప్రెటిలాక్లోర్ 50 శాతం ఈసీ మందు ఎకరాకు 500 మి.లీ. 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి. వరి నాటిన 20 నుంచి 22 రోజుల సమయంలో కేవలం గడ్డిజాతి కలుపు మాత్రమే ఉంటే ఫెనాక్సీఫాప్ ఇథైల్ 6.7 శాతం ఈసీ మందును ఎకరాకు 300 మి.లీ పిచికారీ చేయాలి. గడ్డి జాతిలో వెడల్పు జాతి కలుపు మొక్కలు ఉంటే ఎకరాకు సోడియం ఎస్లీప్లోరోఫిన్ 16.5 శాతం, క్లోడినోఫాప్ ప్రొపెర్గిల్ 8 శాతం మందును 400 మి.లీ పిచికారీ చేసుకోవాలి. తర్వాత 40 నుంచి 45 రోజుల్లో కూలీలతో కలుపు తీయించడం ఉత్తమం.
- వెద పద్ధతిలో ప్రధాన సమస్య కలుపు. దాన్ని సకాలంలో నివారించకపోతే దిగుబడి తగ్గుతుంది. విత్తిన 24 నుంచి 48 గంటల్లోపు ఎకరాకు పెండిమిథాలిన్ 37 శాతం ఈసీ లీటరు మందు పిచికారీ చేయాలి. 20 నుంచి 22 రోజుల వ్యవధిలో బిస్పైర్యాక్స్ సోడియం 10 శాతం ఈసీ మందును 80 గ్రాములు పిచికారీ చేయాలి. 40 నుంచి 45 రోజుల సమయంలో ఎకరాకు గడ్డిజాతి, వెడల్పు జాతి కలుపు నివారణ కోసం 2, 4డి అమైనోసాల్ట్ 400 మి.లీ మందును పిచికారీ చేయాలి.



సాగులో వరి పైరు

పశువుల బీమా.. పాడి రైతుకు ధీమా

కంకిపాడు, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పశువుల బీమా పథకం పాడి రైతులను అవసరమైన సమయంలో ఆదుకుంటోంది. ఇటీవల అంతుపట్టని వ్యాధులు, విద్యుదాఘాతాలు, చెరువులు, నదీ జలాల్లో పశువులు మునిగి చనిపోవడం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఆసరాగా ఉంటున్న పాడి పశువు మృతితో పోషకులు జీవనోపాధి కోల్పోతున్నారు. మరో పాడి గేదె కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా సమస్యలకు బీమా పథకంలో చేరడం ఒక్కటే పరిష్కార మార్గమని పశువైద్యాధికారి కె.మాధవరావు సూచిస్తున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- 80 శాతం రాయితీపై గేదెలు, ఆవులకు పథకం అమలు చేస్తారు.
- ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు వర్తిస్తుంది.
- ఒకసారి బీమా చెల్లిస్తే మూడేళ్లపాటు అమల్లో ఉంటుంది.
- పశువుకు చెవి పోగు వేయించి బీమా నమోదు చేసుకోవాలి.
- పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రం, సమీప పశు వైద్యశాలలో సంప్రదించాలి.



మంతెనలో మేతలు తోలుకెళ్తున్న పశువులు

లబ్ధి పొందాలంటే అన్నదాతలు చెల్లించాల్సిన నగదు వివరాలు (రూ.ల్లో)

పశువు బీమా	ప్రీమియం సొమ్ము	ప్రభుత్వ రాయితీ	రైతు వాటా (పన్ను మినహా)
15,000	960	768	192
30,000	1920	1536	384
35,000	2240	1536	704
40,000	2560	1536	1024
45,000	2880	1536	1344
50,000	3200	1536	1664

సీఎం పర్యటనకు గట్టి భద్రత

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: పండిట్‌నెహ్రూ బస్‌స్టేషన్‌ను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పరిశీలించారు. ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో కలిసి బస్‌స్టేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా లోపాలు లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పటిష్ఠ భద్రత దృష్ట్యా ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఇతర మార్గాలను అన్వేషించాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించే రోజు రాష్ట్ర మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు భారీ సంఖ్యలో రానున్న నేపథ్యంలో వాహనాల రద్దీ, పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి దానం, డీసీపీ ఎస్‌విడి ప్రసాద్, సౌత్ ఏసీపీ పావన్‌కుమార్ పాల్గొన్నారు.



బస్టాండ్‌లో పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు, రవాణాధికారి దానం

స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహణపై సమీక్ష



సమావేశంలో చర్చిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఈ నెల 15వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహణపై మంగళవారం కలెక్టర్ జి.లక్ష్మీశ, సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు జిల్లా అధికారులతో స్టేడియంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, వీవీఐపీలు, వీఐపీలు, ప్రజలు స్టేడియానికి వస్తారని, స్టేడియం, పరిసర ప్రాంతాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని కట్టుదిట్టమైన భద్రత, పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వేడుకల్లో కంటింజెన్సీ బృందాల కవాతు, ట్రాఫిక్ ఏర్పాట్లపై చర్చించారు. వేడుకలకు వచ్చే ప్రముఖులకు, ప్రజలకు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డీఐజీ ఐఎస్‌డబ్ల్యూ కె.ఆరిఫ్ హఫీజ్, డీసీపీలు కేజీవీ సరిత, ఎస్వీడీ ప్రసాద్, ఏడీసీపీలు, ఏసీపీలు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా రైళ్ల రద్దు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: పాపటపల్లి, డోర్నకల్ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు దారి మళ్లిస్తున్నట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్తిగా రద్దయినవి(అక్టోబరు 14వ తేదీ నుంచి 18వరకు).. ★ 67767/67768 విజయవాడ-డోర్నకల్, 67215/67216 విజయవాడ-భద్రాచలం రోడ్, 12705/12706 గుంటూరు-సికింద్రాబాద్, 12713/12714 విజయవాడ-సికింద్రాబాద్, 12803/12804 విశాఖపట్నం- నిజాముద్దీన్(అక్టోబరు 13, 15, 17, 19 తేదీల్లో), 20805/20806 విశాఖపట్నం-న్యూదిల్లీ(16, 17 తేదీల్లో), 20819/20820 ఓకా-పూరి(12, 15 తేదీల్లో).

దారి మళ్లించినవి (వయా గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్).. ★ 18519/18520 విశాఖపట్నం-ముంబయి(అక్టోబరు 13 నుంచి 17 వరకు) ★ 11019/11020 భువనేశ్వర్-ముంబయి(16, 17 తేదీల్లో), 17205/17206 సాయినగర్‌శిర్డీ- కాకినాడ పోర్ట్(16, 18 తేదీల్లో), 22849 షాలిమార్-సికింద్రాబాద్(15వ తేదీ) ★ రైలు నెంబరు 17201/17202 గుంటూరు-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు, ఖాజీపేట మధ్య రద్దు.

గుత్తేదారుల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ వేయాలి

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-తాడేపల్లి: గుత్తేదారులకు సంబంధించి దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, గుత్తేదారులతో కలిపి హైపవర్ కమిటీ వేయాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) నాయకులు కోరారు. తాడేపల్లి మండలం కొలనుకొండలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం సబ్కా సమావేశం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్, సూర్యప్రకాష్ మాట్లాడారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు ఉన్న బిల్లులు ఆటో మైగ్రేషన్ చేయకుండా వెనక్కి పంపారని, ఈ బిల్లులు అన్నింటికీ బడ్జెట్ కేటాయించాలని కోరారు. పాత బిల్లులన్నీ అప్‌లోడ్ చేసేందుకు వీలు కల్పించాలన్నారు. 2025-26 బడ్జెట్ కేటాయింపుల్లోని త్రైమాసిక పరిమితులు పూర్తిగా సడలిస్తే, బడ్జెట్‌ను వెంటనే వినియోగించుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ బిల్లుల చెల్లింపునకు సంబంధించిన డీ-లింకింగ్ విధానం తక్షణమే అమలు చేయాలని కోరారు. ఇందులో ఆర్థికశాఖ నియంత్రణ లేకుండా మున్సిపాలిటీలకు ఆర్థిక స్వయంప్రతిపత్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీడీఎస్‌ఎస్ నిబంధనల ప్రకారం బిల్లులు సమర్పించిన 14 రోజుల్లో చెల్లింపులు చేయాలని తెలిపారు. ఎంఎస్ఎంఈ కేటగిరీ గుత్తేదారులకు చెల్లింపుల్లో ఆలస్యమైనందుకు.. వడ్డీతో సహా 45 రోజుల్లో బకాయిలు చెల్లించే విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లలో ఎవరైనా అవకాశమిస్తే.. వారిని కలిసి సమస్యలన్నీ విన్నవించుకుంటామని పేర్కొన్నారు.



ఐక్యత చాటుతున్న సబ్కా గుత్తేదారులు

ఔటర్ రింగ్ రోడ్డు భూముల పరిశీలన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నోటిఫికేషన్ జారీకి యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే జిల్లాల వారీగా సేకరించాల్సిన భూముల ప్రతిపాదనలను అధికారులు కలెక్టర్లకు పంపారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 189 కి.మీ పరిధిలో నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లి, జి.కండ్రిక, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి, ఆగిరిపల్లి, సగ్గూరు, కృష్ణవరం, సూరవరం గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్లనుంది. ఎనిమిది గ్రామాల పరిధిలో 1377 ఎకరాలు సేకరించేందుకు ప్రతిపాదిత సర్వే నంబర్లలో ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూములను పరిశీలిస్తున్నారు. దానిలో భాగంగా ఆ ప్రాంతాలను మంగళవారం నూజివీడు సబ్‌కలెక్టర్ బి.వినూత్న నేతృత్వంలో రెవెన్యూ, అటవీ శాఖ, నేషనల్ హైవే అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఆ భూముల వివరాలను రికార్డుల ఆధారంగా సబ్‌కలెక్టర్‌కు వివరించారు. తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్, ఆర్ఐ యూనస్, మండల సర్వేయర్ రామకృష్ణబాబు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ, నేషనల్ హైవే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

పేదింటి... యువ శాస్త్రవేత్త

పేద కుటుంబం. నాన్న లేరు. అమ్మ అండతో కష్టపడి చదివి అంచెలంచెలుగా ఎదిగారు కెల్ల శ్రీవెంకట పూర్ణచంద్రిక. యువశాస్త్రవేత్తగానూ గుర్తింపు పొందారు.


పూర్ణచంద్రిక

మాది విజయనగరం. నాకు పదేళ్లప్పుడు నాన్న చనిపోయారు. అమ్మే నన్ను పెంచింది. ఇంటర్ తర్వాత ఎంబీబీఎస్ సీటు వచ్చినా ఆర్థిక కారణాల రీత్యా చేరలేకపోయా. వ్యవసాయ, ఉద్యానవన కోర్సుల్లో చేరితే త్వరగా ఉద్యోగాలు వస్తాయని విని తాడేపల్లిగూడెంలోని ఉద్యానవర్సిటీలో చేరా. డిగ్రీ అనంతరం ఐకార్ జూనియర్ ఫెలోషిప్ పరీక్ష రాస్తే జాతీయ స్థాయిలో 13వ ర్యాంకుతో దిల్లీలో సీటొచ్చింది. ఎంఎస్సీలో వ్యవసాయ రసాయనాల విభాగంలో చేరి, పరిశోధనలపైనా దృష్టిసారించా. పీజీ పూర్తవగానే భారతవ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ)లో పీహెచ్‌డీ చేశా. ఆపై అఖిలభారత వ్యవసాయ పరిశోధన సర్వీసు (ఏఆర్ఎస్) పరీక్షలో దేశంలోనే మొదటిర్యాంకునీ సాధించా. తర్వాత హైదరాబాద్‌లోని జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్)లో వ్యవసాయ రసాయనాల శాస్త్రవేత్తగా చేరా.

పనికిరాదని రొయ్య పొట్టు పారేస్తాం. కానీ నేను దానిపై పరిశోధనలు చేసి సహజ ఎరువుగా మార్చా. రొయ్యపొట్టును శుద్ధి చేసి, ద్రవంగా మార్చి దానికి మొక్కలకు మేలు చేసే ట్రైకోడెర్మా వంటి సూక్ష్మజీవులు, పోషకాలు, శిలీంధ్ర సంహారకాలు, ఇతర జీవ, సేంద్రియ పదార్థాలను కలిపి ఆ మిశ్రమాన్ని విత్తనాలకు పొరలుగా చేశా. దీనికి పేటెంట్ కూడా లభించింది. ఈ ప్రయోగంతో నూనె గింజలు, పప్పు దినుసుల్లో దిగుబడి 25-30% పెరిగింది. బయోపాలిమర్ ఆధారిత మల్టీలేయర్ సీడ్ కోటింగ్‌లు, స్ప్రే చేయగల బయోడిగ్రేడబుల్ మల్చ్‌లు, పోషకాలు, బయోఏజెంట్‌ల కోసం నానో-ఎనేబుల్డ్ క్యారియర్ విధానాలపై చేస్తున్న పరిశోధనలు ముగింపుదశలో ఉన్నాయి, త్వరలో వాటినీ ఆవిష్కరిస్తాం. ఈ క్రమంలో ప్లాంట్ పాథాలజీ సొసైటీ నుంచి ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం అందుకున్నా. తాజాగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) 97వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చేతుల మీదుగా ఉద్యానవన కేటగిరీలో యువ శాస్త్రవేత్త పురస్కారాన్నీ అందుకున్నా. దీనికి జాతీయస్థాయిలో 700మంది పోటీపడగా నేను పురస్కారం దక్కించుకున్నా. తెలుగు రాష్ట్రాల నుంచి దీన్ని అందుకున్న తొలి శాస్త్రవేత్తగా నిలవడం గర్వంగానూ ఉంది. వాతావరణ పరిస్థితులు, విపరీతమైన రసాయనిక ఎరువుల వాడకం వల్ల జీవవైవిధ్య సూక్ష్మజీవులు నాశనం అవుతున్నాయి. దీంతో పంట దిగుబడి తగ్గుతోంది. వీటన్నింటినీ తట్టుకునేలా బయోపాలిమర్ ఆధారిత విత్తనోత్పత్తి చేపట్టాలనేది నా లక్ష్యం.

– ఆకారపు మల్లేశం, హైదరాబాద్

ఈ అంకురం... అమ్మకు అవకాశం..!

అన్ని నైపుణ్యాలూ ఉన్నా... కాస్త గ్యాప్ ఉంటే తిరిగి ఉద్యోగం సాధించడం ఎంత కష్టమో శంకరి సుదర్శనన్‌కు తెలుసు. ఈ సమస్యకు పరిష్కారం చూపించాలనుకుంది ఆమె. 'ఓవర్‌క్వాలిఫైడ్ హౌస్‌వైవ్స్' అంకురాన్ని స్థాపించింది. దీనిద్వారా వందల మంది మహిళలు కెరియర్‌లో రాణించేందుకు సహాయపడుతోంది. ఆ ప్రయాణం ఆమె మాటల్లోనే...


శంకరి

ఇన్ఫోసిస్‌లో ట్రైనీ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా... ఎనిమిదేళ్లు నిర్విరామంగా పనిచేశాను. నాలుగేళ్లకే టీమ్ లీడర్ హోదాను సాధించా. బాబు పుట్టాక, వాడి ఆలనాపాలనా చూసుకోవాలని ఉద్యోగానికి రాజీనామా చేశా. అదే నాకు కెరియర్‌లో పెద్ద అడ్డంకిగా మారుతుందని ఎప్పుడూ ఊహించలేదు. మాది తమిళనాడులోని తూత్తుకుడి. ప్రస్తుతం చెన్నైలో స్థిరపడ్డాం. బాబుకి ఏడాది వయసు అనుకుంటా... అప్పుడు మళ్లీ ఉద్యోగంలో చేరాలనుకున్నా. ఇంటి నుంచే పనిచేయాలని... ఆన్‌లైన్లో చాలా ప్రయత్నించా. ఎక్కడా అవకాశం రాలేదు. ఎంత వెతికినా లాభం లేకపోయింది. అప్పుడే ఫుల్ టైమ్ ఉద్యోగాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనించా. తిరిగి ఉద్యోగంలో చేరాలంటే ఎంత కష్టమో అర్థమైంది. ఇది నా ఒక్కదాని సమస్యే కాదు... ప్రముఖ విద్యా సంస్థల్లో చదువుకుని, కీలక స్థానాల్లో పనిచేసి... పెళ్లి, పిల్లల కారణంగా ఏటా ఎంతో మంది మహిళలు రాజీనామా చేస్తున్నారు. మళ్లీ కెరియర్ మొదలుపెట్టే అవకాశం లేక ఇంటికే పరిమితం అవుతున్నారు. అలాంటి వారందరినీ ఓ తాటిపైకి తీసుకురావాలనుకున్నా.

కష్టమైనా కొనసాగించా...

2022 ఆగస్టు 15న 'ఓవర్‌క్వాలిఫైడ్ హౌస్‌వైవ్స్' ద్వారా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించా. దీని ఏర్పాటుకోసం 'నారీప్రెన్యూర్ ఫర్ హర్' కార్యక్రమం కింద విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో నమోదు చేసుకున్నా. 10 వేల దరఖాస్తులు వస్తే వాటిలో 144 మాత్రమే ఎంపిక చేశారు. అందులో మా అంకురం కూడా ఒకటి. అంతేకాదు టాప్-5లో చోటు దక్కించుకుని, ప్రోత్సాహకంగా రూ.3 లక్షల గ్రాంట్‌ను కూడా అందుకున్నా. మొదట్లో ఏడాది పిల్లాడితో నేను ఒక్కదాన్నే అన్ని కార్యకలాపాలు చూసుకునేదాన్ని. కష్టంగా అనిపించేది. ఆ సమయంలో మావారు సుదర్శనన్ గణపతి, కుటుంబ సభ్యులు అందించిన సహకారం మరచిపోలేను. ఇప్పుడు నాతోపాటూ మరో ఐదుగురు పని చేస్తున్నారు. నాలుగేళ్లుగా సంస్థని విజయవంతంగా నడిపిస్తున్నా. ఇప్పటివరకు 35,000 మంది మహిళలు మా సైట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. వారు ఫుల్ టైమ్, పార్ట్‌టైమ్, ఫ్రీలాన్సింగ్ విధానాల్లో పనిచేసేలా అవకాశాలు చూపిస్తున్నాం. ఇందుకు 175కు పైగా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం. కెరియర్‌లో బ్రేక్ వచ్చి... మళ్లీ తిరిగి ప్రారంభించాలనుకునే వారికి నైపుణ్యాల కొరత ఉండటం గమనించాం. దాన్ని పరిష్కరించడానికి 2023 నుంచి ఇప్పటివరకు 100కు పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించాం. వీటి ద్వారా దాదాపు 7 వేల మంది ప్రయోజనం పొందారు. ఈ సంఖ్య పెరిగి, మా అంకురాన్ని మరింత మందికి చేరువ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా.



– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

వ్యాపారిగా మారాలంటే... ధైర్యం సరిపోవట్లేదు!

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికై ఏడేళ్లుగా ఒక కార్పొరేట్ సంస్థలో పనిచేస్తున్నా. ఈ ర్యాట్ రేస్ నుంచి బయటకు వచ్చి సొంత కంపెనీ స్థాపించాలనేది నా లక్ష్యం. మంచి వ్యాపార ఆలోచనా ఉంది. కానీ ఏదో భయం ముందుకు వెళ్లనీయడంలేదు. దీన్ని ఎలా అధిగమించాలి? – ఓ సోదరి

కార్పొరేట్ ఉద్యోగాల్ని వదిలి వ్యాపారులుగా మారాలనుకుంటున్నవారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది. వ్యాపారులుగా మారే ప్రత్యేక లక్షణాలుండటంతోపాటు తమ ఆలోచన ఎంతో ప్రత్యేకమనీ, మార్కెట్ అవసరాల్ని తీరుస్తుందనీ... విశ్వాసం ఉండటమే దీనికి కారణం. ఆరునూరైనా తమ ఆలోచనను ఆచరణలో పెట్టి తీరాల్సిందేనన్న పట్టుదలతో ఉంటారు. అయితే ఇదంతా ఒక్కరోజులో వచ్చే మార్పు కాదు, అనుభవంతో సాధించేది. కాలంతోపాటు ఇవి వాళ్లలో దృఢపడి ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకుంటారు. ఈ క్రమంలో తమనుతాము ఎన్నోసార్లు ప్రశ్నించుకుంటూ, పలు రకాలుగా ఎదురయ్యే సందేహాలకు జవాబుల్ని సిద్ధం చేసుకుంటారు.


డియర్ వసుంధర
కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

మీ సందిగ్ధత నుంచి బయటపడాలంటే, మరోసారి భిన్న కోణాల్లో మిమ్మల్ని ప్రశ్నించుకోండి. మీరు మొదలుపెట్టాలనుకుంటున్న వ్యాపారానికి అవసరమయ్యే అర్హతలు మీకు కచ్చితంగా ఉన్నదీ లేనిదీ చూసుకోండి. వ్యాపారం ఏ స్థాయిలో చేయాలనుకుంటున్నదీ తేల్చుకోండి. ఉద్యోగం వదిలి వ్యాపారిగా మారాక ఎలాంటి జీవితం పొందాలనుకుంటున్నారో, ప్రస్తుతం ఉన్నవాటిలో ఏం వదులుకోవాలనుకుంటున్నారో స్పష్టత తెచ్చుకోండి. పూర్తి శక్తిసామర్థ్యాలను ఉపయోగించి అంకితభావంతో పనిచేయగలిగేదీ లేనిదీ చూసుకోండి. మీలాంటి వ్యాపారమే కాకున్నా, మీ వ్యాపారానికి దగ్గరగా ఉన్న విజేతల్ని కలిసి మాట్లాడండి. అప్పుడు మీకు మరింత అవగాహన వస్తుంది. అప్పటికీ ముందుకు వెళ్లాలనిపిస్తే అన్ని వనరుల్నీ సమకూర్చుకుని మీ కలను నిజం చేసుకోండి. మీ ఐడియా, సామర్థ్యాల గురించి నెగెటివ్‌గా మాట్లాడేవారికి దూరంగా ఉండటం మంచిది.



'స్టెమ్' అందుకోవాలని!

ఝార్ఖండ్, తూర్పు సింగ్‌భూమ్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోన్న గ్రామీణ, వెనకబడిన వర్గాలకు చెందిన బాలికలు వీళ్లు. ఆ రాష్ట్రంలో అమల్లో ఉన్న 'విద్యా పర్యటన పథకం'లో భాగంగా తిరుపతి జిల్లాలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్-షార్‌ను సందర్శించారు. సంప్రదాయ కెరియర్ మార్గాల్ని దాటి స్టెమ్(సైన్స్, సాంకేతికత, ఇంజినీరింగ్, గణితం) రంగాల్లో ఉండే అవకాశాలపైన అవగాహన, వాటిల్లో చేరేలా బాలికలకు ప్రేరణ కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. వీళ్లంతా సైన్స్ ఒలింపియాడ్ పోటీల్లో రాణించడం ద్వారా ఈ పర్యటనకు ఎంపికయ్యారు. దీన్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహ సాంకేతికత గురించి తెలుసుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలతో సంభాషించి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఉపగ్రహ ప్రయోగ ప్రక్రియ, నియంత్రణ వ్యవస్థలు, రియల్ టైమ్ డేటా పర్యవేక్షణ విభాగాల్ని గమనించారు. చంద్రయాన్, గగన్‌యాన్... తదితర ప్రధాన ప్రయోగాలతోపాటు అంతరిక్ష పరిశోధనలో భారత విజయగాథల్ని సీనియర్ శాస్త్రవేత్తలు వీరికి వివరించారు.

– కల్లిపూడి దేవేంద్రరెడ్డి, శ్రీహరికోట



మీకు తెలుసా?

ప్యాట్రిషియా బాత్... లేజర్ ఫాకో ప్రోబ్ పరికరాన్ని కనిపెట్టారు. దీనివల్ల కాటరాక్ట్ సర్జరీ చేయటం మరింత తేలికైంది. ఓ మెడికల్ పేటెంట్‌ను అందుకున్న తొలి నల్లజాతీయురాలైన ఫిజీషియన్ కూడా ఈమేనట.



జ్ఞాపకాల్ని రాస్తారా?

ఎప్పుడైనా పాత ఫొటోలను తిరగేస్తారా? ఒక్కోటీ ఎన్నెన్ని మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తుందో! అన్నట్టూ దానిలో మనల్ని ఎక్కువ ఆకర్షించేదంటే 'క్యాండిడ్ పిక్'లనే చెబుతాం కదూ. మిగతా ఫొటోలంటే ఆ సందర్భానికి గుర్తుగా తీసుకుంటాం. వాటిలోనూ ఆనందం కనిపించొచ్చు కానీ... ఎంతైనా తెలిసి దిగేవవి. క్యాండిడ్ పిక్స్ అలా కాదు. ఎదుటి వ్యక్తి క్లిక్‌మనిపిస్తున్నారని తెలియదు. దీంతో అసలైన భావోద్వేగం కనిపిస్తుంది. చూడగానే ఆ క్షణాలన్నీ మెదడులో రీల్‌లా తిరుగుతాయి. ఇవంటే కెమెరాలో బంధించాం కాబట్టి కళ్లముందుంటాయి. కానీ కొన్ని ఆనందక్షణాలు, అనుభూతులు కెమెరా కంటికి చిక్కవు. అయితేనేం మనసులో బలమైన ముద్ర వేస్తాయి. స్నేహితుల్నో, బంధువుల్నో కలిసినప్పుడు చూడండి. ఎన్నెన్ని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటామో. అవన్నీ ఆల్బమ్‌లో కనిపించవు. మెదడు పొరల్లో మాత్రం తిష్ఠ వేసుకుని కూర్చుంటాయి. వాటి గురించి మాట్లాడుతోంటే సమయమూ తెలియదు, మనసూ నిండుతుంది. ఆ వేళ... ఒత్తిడి, ఆందోళన ఎటు పారిపోయాయో కూడా తెలియదు. అందుకే మనసు బాలేనప్పుడు అయినవాళ్లు దగ్గరుంటే బాగుంటుంది అనిపిస్తుంది. కానీ ఈ బిజీ జీవితంలో అన్నిసార్లూ వాళ్లని కలవడం సాధ్యమేనా? కెరియర్, పెళ్లి పేరుతో ఎక్కడెక్కడో స్థిరపడతాం. అందుకే వాటిని కాగితం మీద పెట్టండి. వాటన్నింటినీ తలుచుకుంటూ, ఆ క్షణాల్ని తిరిగి అనుభవిస్తూ రాస్తాం కదా! అదే ఆనందాన్ని అనుభూతి చెందుతాం. దాన్ని మాటల్లో చెప్పడం అంత సులువేం కాదు... దీంతో ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాం. ఇది సృజనాత్మకతను పెంచే మార్గం కూడా. మనసూ కుదుటపడుతుంది. ముఖ్యంగా వ్యక్తుల విలువ తెలుస్తుంది. మరి.. . రాస్తారా ఆ జ్ఞాపకాలని? వెళ్లొస్తారా మళ్లో సారి ఆ ఆనంద క్షణాల్లోకి!

బంగారం - వెండి



12న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,650	93,350	1,16,430
విజయవాడ	99,765	92,950	1,17,000
ప్రొద్దుటూరు	1,00,250	92,230	1,17,000
రాజమహేంద్రవరం	1,01,400	92,950	1,25,000
విశాఖపట్నం	1,01,040	92,950	1,25,000
తమిళనాడు	-----	92,950	1,26,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.



గ్రో హార్లెమ్ బ్రట్లాండ్ నార్వే ప్రధానిగా మూడుసార్లు ఎంపికయ్యారు. ఆ సమయంలో వాళ్లబ్బాయి ఆమెను ఒక ప్రశ్న అడిగాడు... 'నార్వేకి ప్రధానిగా పనిచేసే అర్హత మగవాళ్లకు ఉంటుందా' అని! మహిళలు అన్ని రంగాల్లోనూ ఆ స్థాయికి చేరడమే లక్ష్యంగా పనిచేయాలి.
- మీరా శంకర్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్, అమెరికాలో భారత మాజీ రాయబారి

ఈ అమ్మ... ఓ అద్భుతం




పేరు సిమి. వయసు 36. స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగి అయిన ఈమె ఎత్తు కేవలం 3.1 అడుగులు. కానీ మరుగుజ్జుతనం ఆమె మాతృత్వానికి అడ్డు కాలేదు సరికదా, ఈమధ్యే త్రిసూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సి-సెక్షన్ ద్వారా పండంటి బాబుకి జన్మనిచ్చింది. ఈ ఘటన వైద్య చరిత్రలోనే ఓ మిరకల్‌గా నిలిచింది. దేశంలోనే అత్యంత తక్కువ ఎత్తున్న తల్లిగా సిమి లిమ్కా బుక్ రికార్డుల్లోకీ ఎక్కనుంది. ఇప్పటి వరకూ తమిళనాడుకు చెందిన కామాక్షి (3.5 అడుగులు) అత్యంత తక్కువ ఎత్తున్న తల్లి కాగా, ఆ రికార్డును సిమి అధిగమించిందట. 'మరుగుజ్జుగా ఉన్న మహిళ, బిడ్డకు జన్మనివ్వడం అనేది అరుదుగా జరుగుతుంది. ఇది ఒకరకంగా ఆమెకు పునర్జన్మే. శారీరక వైకల్యం వల్ల గర్భిణిగా ఎన్నో సమస్యలు. అవన్నీ తట్టుకున్నా ప్రసవ సమయంలో ఊపిరి కూడా సరిగ్గా అందదు. బిడ్డకీ ప్రమాదమే' అంటున్నారు నిపుణులు. పైగా ఈమె భర్త ప్రగేష్‌కి దృష్టి లోపం. అయితే ఈ సమస్యలేమీ తల్లి కావాలన్న ఆమె కలను అడ్డుకోలేకపోయాయి. ఎంతో ధైర్యంగా బాబుకి జన్మనిచ్చిన సిమి మనోస్థైర్యం చికిత్సను అందించిన వైద్యుల్నీ చకితుల్ని చేసిందట.

బోర్డే... గిన్నె అయితే!

కొన్నిసార్లు చిన్న వస్తువులే పెద్ద ప్రయోజనాలను అందిస్తాయి కదా! అలాంటివే ఇవి కొన్ని... చూసేయండి.

మడిచేలా...

కూరగాయలు, పండ్లు కట్ చేసుకునేందుకు ఉపయోగపడే బోర్డే గిన్నెలానూ ఉపయోగపడితే... బావుంటుంది కదా! అయితే, ఈ 'టూ ఇన్ వన్ ఫోల్డబుల్ బోర్డ్'ను తెచ్చేసుకోండి. దీన్ని ప్లేటుగానే కాదు, బౌల్‌గానూ ఉపయోగించుకోవచ్చు. సిలికాన్ మెటీరియల్‌తో చేసింది కాబట్టి, మడతపెట్టినా ఎక్కువకాలం మన్నుతుంది.







ఎక్కడికైనా పట్టుకెళ్లేలా...

స్పూన్, ఫోర్క్, బాటిల్ ఓపెనర్, చాకు... ఇలాంటివన్నీ ఒకేచోట ఉండేందుకు ఈ 'కట్లరీ సెట్' ఉపయోగపడుతుంది. డిటాచబుల్ కాబట్టి, అవసరమైనప్పుడు, కావాల్సింది బయటకు తీసి వాడుకోవచ్చు. క్యాంపింగ్, హైకింగ్, పిక్నిక్... వంటి వాటికీ దీన్ని తీసుకెళ్లొచ్చు.

స్మార్ట్ కిచెన్



కొబ్బరి తీసేందుకూ...

పండగలూ, వ్రతాలప్పుడు కొబ్బరి కాయలు ఇంట్లో ఎక్కువగానే ఉంటుంటాయి. కానీ, పనంతా టెంక నుంచి కొబ్బరిని వేరుచేయటంతోనే. ఆ కష్టం లేకుండా చేస్తుంది ఈ 'స్టీల్ కోకోనట్ రిమూవర్'. దీంతో తేలిగ్గా కొబ్బరిని తీయటమే కాదు, కొబ్బరికాయను పగలగొట్టేందుకూ ఇది ఉపయోగపడుతుంది.



నాన్న మాట... నలుగురికీ సాయం!

తోటివారికి సాయపడాలనేవారు నాన్న. ఆమె తను చేయడమే కాదు... ఇతరుల్నీ భాగస్వామ్యం చేయాలనుకున్నారు. అమ్మాయిలు తమను తాము రక్షించుకునేలా చూస్తున్నారు. పర్యావరణంపైనా దృష్టిపెడుతున్నారు. 11 ఏళ్లలో ఇంకా ఇలాంటివెన్నో! కవితా జనార్దనన్... ఆమెను పలకరించగా తన గురించి చెప్పుకొచ్చారిలా.



నాన్న తెలుగు వ్యక్తే! కాకపోతే తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా అవినాశీలో స్థిరపడ్డారు. నేను ఎకనామిక్స్‌లో పీజీ పూర్తయ్యాక ఫ్యాషన్ డిజైనర్‌గా మారా. నాన్నెప్పుడూ నలుగురికీ సాయపడాలని చెబుతూ పెంచారు. దీంతో ఆహారం, దుస్తులు, చెప్పులు... ఇలా తోచినవి పేదలకు ఇస్తుండేదాన్ని. ఎన్‌సీసీ క్యాడెట్‌ని కూడా. ఐఏఎస్ అధికారినై పేదలకు సాయపడాలి అనుకునేదాన్ని. కానీ కుదర్లేదు. వివాహమయ్యాక మావారు జనార్దనన్ కూడా అండగా నిలవడంతో... 'ఇని ఒరు విది సెయివోమ్' అనే ట్రస్ట్‌ని ప్రారంభించా. దీని ద్వారా తిరుప్పూర్‌లో 'ఫుడ్ బ్యాంక్' పేరుతో ఫ్రిజ్‌లు, మరికొన్ని జిల్లాల్లో 'అన్బుసువర్' పేరిట గోడలకు కొన్ని అలమరాలూ ఏర్పాటు చేయించా. ఫ్రిజ్‌ల్లో ఆహారం, అలమరాల్లో వస్త్రాలు, చెప్పులు, ఇంటి ఉపయోగకర వస్తువులు, పుస్తకాలు ఇలా తమకు పనికి రావనుకున్న వస్తువులు ఉంచేలా చూశా. పేదల ఆకలి నింపేలా, వృథా అరికట్టేలా చేసిన ఏర్పాట్లివి. అవసరమైన వాళ్లు ఉచితంగా తీసుకుని వాటిని తీసుకెళ్లొచ్చు.



గర్భిణులు, వృద్ధులకు పోషకాహారం... క్యాన్సర్ సోకిన చిన్నారులు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులకు వైద్యసాయం వంటివీ అందిస్తున్నాం. ఆర్థిక స్తోమత సరిగాలేక చదువు మానేస్తున్న పిల్లలెందర్నో గమనించా. వారికి ఆర్థిక సాయం అందిస్తున్నాం. ముఖ్యంగా తల్లిదండ్రుల్లేని, సింగిల్ పేరెంట్ సంరక్షణలో పెరిగే 300 మంది ఆడపిల్లలను చదివిస్తున్నాం. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థులకు క్రీడావస్తువులు, టోర్నమెంట్‌లలో పాల్గొనేందుకు అవసరమైన నిధులు అందిస్తున్నా. నేను సంపాదించే మొత్తాన్నీ సేవకే ఖర్చుపెడుతున్నాను. నా సేవలు నచ్చి కొందరు వాలంటీర్లుగా చేరారు. అత్యవసర సదుపాయాల్లేని నంబియూర్ అనే గ్రామాన్ని పదేళ్ల క్రితం దత్తకు తీసుకున్నా. అక్కడి ప్రజలకు వైద్యశిబిరాలు నిర్వహించడం, రోడ్లు వేయించడం, చెత్తకుండీలు, తాగునీటి ఏర్పాటు వంటివెన్నో చేశాం. కొవిడ్‌లో ఆహారం, ఆక్సిజన్ సిలిండర్లు వంటివీ అందించాం. అమ్మాయిలు ముందుకు సాగాలంటే తమని తాము రక్షించుకోవడం తప్పనిసరి. అందుకే బాలికల భద్రత, వారికి సాయపడే చట్టాల గురించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నా. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణనిప్పిస్తున్నా. పేద మహిళలకు శానిటరీ న్యాప్కిన్లు అందించడం, పర్యావరణ పరిరక్షణ, ట్రాఫిక్ పోలీసులతో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటివీ చేస్తున్నా. చుట్టూ ఉన్నవారికి మేలు జరిగేలా చూడాలన్నదే నా ఆశయం.

– ఆళ్ల లక్ష్మీహరికృష్ణ, చెన్నై

ఛాంపియన్


హారిక

అర్జున్‌కు మరో డ్రా

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్

చెన్నై: తెలంగాణ క్రీడాకారుడు అర్జున్ ఇరిగేశి చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్‌లో వరుసగా రెండో గేమ్‌ను డ్రాగా ముగించాడు. మంగళవారం జరిగిన ఆరో రౌండ్లో నల్లపావులతో ఆడిన అతడు.. విన్సెంట్ కీమర్ (జర్మనీ)ను 42 ఎత్తుల్లో నిలువరించాడు. అర్జున్‌కు అయిదో రౌండ్లో కూడా డ్రా ఎదురైన సంగతి తెలిసిందే. కీమర్ 4.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అర్జున్, లియాంగ్ (అమెరికా) చెరో 3.5 పాయింట్లతో ఆ తర్వాత ఉన్నారు. ప్రణవ్‌పై లియాంగ్ గెలిచాడు. నిహాల్ సరీన్ ఆరో రౌండ్లో ఓటమిపాలయ్యాడు. జోర్డెన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్) 51 ఎత్తుల్లో అతణ్ని ఓడించాడు. విదిత్ గుజరాతి, అనిష్ గిరి (నెదర్లాండ్స్) మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. కార్తికేయన్, రాబ్సన్ రే (అమెరికా) కూడా పాయింట్ పంచుకున్నారు. ఛాలెంజర్స్ విభాగంలో అభిమన్యు విజయపరంపరకు తెరపడింది. ఆరో రౌండ్లో అతడిపై పర్ణేక్ నెగ్గాడు. వైశాలిపై హరిక విజయం సాధించింది. ఆర్యన్ చోప్రాపై ల్యూక్ మెండోంకా, దిప్తాయన్‌పై అధిబన్ నెగ్గారు. హర్షవర్ధన్, ఇనియన్ మధ్య గేమ్ డ్రా అయింది. పర్ణేక్, అభిమన్యు, ల్యూక్ తలో 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నారు.

మూడో స్థానంలో గుకేశ్

సెయింట్ లూయిస్ (అమెరికా): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగమైన సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ పుంజుకున్నాడు. మొదటి రోజు పోటీల్లో తొలి రౌండ్లో ఓటమి చవిచూసిన గుకేశ్.. తర్వాత రెండింట్లో విజయాలతో సత్తా చాటాడు. తొలి రౌండ్లో లెవాన్ అరోనియన్ (అమెరికా) చేతిలో గుకేశ్ పరాజయం చవిచూశాడు. అనంతరం రెండో రౌండ్లో గ్రిగోరీ ఒపారిన్ (అమెరికా)పై గుకేశ్ విజయం సాధించాడు. మూడో రౌండ్లో లీమ్ క్వాంగ్ (వియత్నాం)ను గుకేశ్ చిత్తుచేశాడు. దీంతో 3 రౌండ్ల అనంతరం నాలుగేసి పాయింట్లతో గుకేశ్, వెస్లీ సో (అమెరికా) సంయుక్తంగా మూడో స్థానంలో కొనసాగుతున్నారు. అరోనియన్ (6), ఫాబియానో కరువానా (5- అమెరికా) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా శుభ్‌మన్


శుభ్‌మన్ గిల్

దుబాయ్: ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అదిరే ప్రదర్శన చేసిన శుభ్‌మన్ గిల్.. ఐసీసీ జులై 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఎంపికయ్యాడు. ఆ నెలలో ఈ భారత కెప్టెన్ 3 టెస్టుల్లో 94.50 సగటుతో 567 పరుగులు చేశాడు. బెన్ స్టోక్స్ (ఇంగ్లాండ్), వియాన్ ముల్డర్ (దక్షిణాఫ్రికా) కూడా రేసులో ఉన్నా.. శుభ్‌మన్‌కే అవార్డు దక్కింది. మొత్తం ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అతడు నాలుగు సెంచరీలు సహా 754 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' పురస్కారం దక్కించుకోవడం శుభ్‌మన్‌కు కెరీర్‌లో ఇది నాలుగోసారి. ఈ ఏడాది ఫిబ్రవరి, 2023లో జనవరి, సెప్టెంబర్‌లోనూ ఈ అవార్డు పొందాడు. పురుషుల విభాగంలో ఇన్నిసార్లు ఈ పురస్కారాన్ని సాధించిన తొలి ఆటగాడు అతడే. మహిళల్లో అత్యధికంగా హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్), ఆష్లీ గార్డనర్ (ఆస్ట్రేలియా) నాలుగేసి అవార్డులు అందుకున్నారు. ఐసీసీ జులై మహిళా 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఇంగ్లాండ్ బ్యాటర్ సోఫియా డంక్లీ ఎంపికైంది. భారత్‌తో వన్డే, టీ20 సిరీస్‌లో 7 మ్యాచ్‌ల్లో డంక్లీ 270 పరుగులు సాధించింది.

ఆ ద్విశతకం మరువలేనిది: బర్మింగ్‌హామ్ టెస్టులో ఇంగ్లాండ్‌పై సాధించిన ద్విశతకం ఎప్పటికీ మరువలేనిదని శుభ్‌మన్ గిల్ అన్నాడు. "జులై నెల ఐసీసీ ప్లేయర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఇంగ్లాండ్ పర్యటనలో బర్మింగ్‌హామ్‌లో జరిగిన టెస్టులో చేసిన డబుల్ సెంచరీని ఎప్పటికీ మరిచిపోలేను. ఈ పర్యటన సారథిగా కూడా ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశాన్ని కల్పించింది. రాబోయే సిరీస్‌లలోనూ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తానని ఆశిస్తున్నా" అని శుభ్‌మన్ తెలిపాడు. బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో శుభ్‌మన్ తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (269), రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (161) చేశాడు. దీంతో భారత్ ఈ టెస్టులో ఘనవిజయం సాధించి సిరీస్‌ను సమం చేసింది. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో, నాలుగో టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లోనూ శుభ్‌మన్ సెంచరీలు చేశాడు.

దీప్తికి రెండో ర్యాంకు


దీప్తి

దుబాయ్: భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ప్రపంచ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌కు మరింత చేరువైంది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన జాబితాలో ఒక స్థానం మెరుగైన దీప్తి (732 పాయింట్లు) రెండో ర్యాంకు సాధించింది. అనాబెల్ సదర్లాండ్ (736- ఆస్ట్రేలియా) అగ్రస్థానంలో నిలిచింది. వీరిద్దరి మధ్య వ్యత్యాసం నాలుగు పాయింట్లే కావడంతో తొలిసారిగా నంబర్‌వన్ ర్యాంకు సాధించేందుకు దీప్తికి అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. రేణుక సింగ్ 11, రాధ యాదవ్ 15వ స్థానాల్లో నిలిచారు. వన్డే బ్యాటింగ్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన నంబర్‌వన్ ర్యాంకు కోల్పోయింది. ఒక ర్యాంకు కిందకు దిగిన స్మృతి రెండో స్థానంలో నిలిచింది. నటాలీ సీవర్ బ్రంట్ (ఇంగ్లాండ్) అగ్రస్థానం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 11, జెమీమా రోడ్రిగ్స్ 13వ స్థానాల్లో నిలిచారు.

వయసు అంకె మాత్రమే!

శారీరక శ్రమతో కూడుకున్న ఆట ఏదైనా సరే.. 40వ పడిలో పడిలోకి వస్తే రిటైరైపోవాల్సిందే. చాలామంది క్రీడాకారులు 30ల మధ్యలోకి వచ్చేసరికే ఇక చాలు అనిపించేస్తారు. 40 దాటితే కాడి వదిలేయక తప్పదు. కానీ కొద్దిమంది మాత్రం వయసు ఒక అంకె మాత్రమే అని చాటుతూ.. 40ల్లోనూ మైదానంలో రఫాడిస్తుంటారు. ప్రస్తుతం వివిధ క్రీడల్లో అలా తన ప్రత్యేకతను చాటుకుంటున్న క్రీడాకారులెవరో చూద్దామా!

ఈనాడు క్రీడావిభాగం


రొనాల్డో

అతను మనిషేనా?

ఫుట్‌బాల్ ఆడాలంటే ఎంత సామర్థ్యం కావాలి.. 90 నిమిషాల పాటు ఒకే తీవ్రతతో మైదానంలో పరుగులు తీయాలంటే ఎంతటి బలం ఉండాలి. కుర్రాళ్లయితే ఫర్వాలేదు. దూసుకెళ్తారు అదే వయసు 30 దాటితే కదలికలు మందగిస్తాయి. అలాంటిది 40 ఏళ్లు వచ్చినా.. కుర్రాళ్లతో పోటీపడుతూ.. అద్భుత ప్రదర్శనలు చేస్తే! అతడు క్రిస్టియానో రొనాల్డో అవుతాడు.. ఈ పోర్చుగల్ సూపర్ స్టార్ సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. అయినా అలుపెరుగని ఈ వీరుడు అభిమానులను అలరిస్తూనే ఉన్నాడు. ఫిట్‌నెస్‌కు చిరునామాగా ఉన్న రొనాల్డో.. 20 ఏళ్ల క్రితం.. ఇప్పుడూ అదే దూకుడా అని ఆశ్చర్యపోయేలా చేస్తున్నాడు. ఒకవైపు పోర్చుగల్‌కు మరోవైపు క్లబ్ జట్టు అల్ నాసర్‌కు రొనాల్డో సేవలందిస్తున్నాడు. అతడిలో వయోభారం లేదు. తమ జట్లకు భారంగా లేడు. ఇప్పటికీ టాప్ ప్లేయర్‌గానే కొనసాగుతున్నాడు. కీలక గోల్స్ సాధిస్తూ తమ జట్లను గెలిపిస్తున్నాడు. తాజాగా అల్ నాసర్ తరపున హ్యాట్రిక్ చేయడమే ఇందుకు నిదర్శనం. తనయుడు ఏంజెల్ సాంటోస్ పోర్చుగల్ జూనియర్ జట్టులోకి చోటు దక్కించుకున్నా.. రొనాల్డో ఇంకా అంతర్జాతీయ టోర్నీల్లో ఆడుతుండడం విశేషం. అతడు ఏడాదికి దాదాపు రూ.2 వేల కోట్లు సంపాదిస్తున్నాడు. అత్యధికంగా ఆర్జిస్తున్న అథ్లెట్లలో రొనాల్డోదే అగ్రస్థానం.

అమెరికా తార.. ఆపేదేలే


వీనస్


టెన్నిస్ అత్యంత శ్రమతో కూడుకున్న ఆటల్లో ఒకటి. మహిళల్లో చాలామంది 30ల్లోకి రాగానే ఒత్తిడిని తట్టుకోలేక రిటైరైపోతుంటారు. గత ఏడాది స్టార్ ప్లేయర్ ముగురుజ 30 ఏళ్ల వయసులోనే ఆటకు టాటా చెప్పేసింది. 35 ఏళ్ల క్విటోవా ఈ ఏడాది రిటైర్మెంట్ దిశగా అడుగులు వేస్తోంది. కానీ 45 ఏళ్లు వచ్చినా అమెరికా టెన్నిస్ తార వీనస్ విలియమ్స్ మాత్రం రాకెట్ పక్కన పెట్టను అంటోంది. చెల్లెలు సెరెనా విలియమ్స్ కొన్నేళ్ల ముందే ఆటకు టాటా చెప్పేసినా.. వీనస్ మాత్రం ఇంకా ప్రొఫెషనల్ టెన్నిస్‌లో కొనసాగుతోంది. ఈ ఏడాది ఆమె సొంతగడ్డపై యుఎస్ ఓపెన్ కూడా ఆడుతోంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆమెకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కింది.

ఆల్‌టైం గ్రేట్.. ఇప్పటికీ టాపే


లెబ్రాన్ జేమ్స్

లెబ్రాన్ జేమ్స్.. ప్రపంచవ్యాప్తంగా బాస్కెట్‌బాల్ ప్రేమికులకు ఆరాధ్య దైవం. అమెరికాలో అత్యంత ఆదరణ పొందిన ఈ క్రీడలో నిర్వహించే ఎన్‌బీఏ లీగ్‌లో లెబ్రాన్ సాధించిన ఘనతలు ఎన్నో. ఈ లీగ్‌లో ఏకంగా 1562 మ్యాచ్‌లు ఆడిన అతను.. 42,184 పాయింట్లు సాధించాడు. లీగ్ చరిత్రలో అతనే టాప్ స్కోరర్. ఇంకా మరెన్నో ఘనతలతో ఆల్‌టైం గ్రేట్‌గా పేరు తెచ్చుకున్నాడు. అత్యున్నత స్థాయి ఫిట్‌నెస్ అవసరమైన బాస్కెట్‌బాల్‌లో 40 ఏళ్లు నిండిన లెబ్రాన్ ఉత్తమ ప్రదర్శనతో కొనసాగుతున్నాడు. ఒక మ్యాచ్‌లో సాధించిన పాయింట్లలో తన కెరీర్ సగటు 27 కాగా.. ఈ ఏడాది 24.4 సగటుతో కుర్రాళ్లకు దీటుగా నిలిచాడు. నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లోనూ అతను బరిలో దిగాడు. కొత్త సీజన్ కోసం అతణ్ని లాస్ ఏంజెలెస్ లేకర్స్ జట్టు రూ.460 కోట్లతో అట్టిపెట్టుకోవడం విశేషం.

హామిల్టన్.. నాన్‌స్టాప్



లూయిస్ హామిల్టన్

ఫార్ములావన్‌లో సుదీర్ఘ కాలం కెరీర్‌ను కొనసాగించడం అంత తేలిక కాదు. పైగా వయసు మీద పడ్డాక ట్రాక్‌లో కుర్రాళ్లతో పోటీపడుతూ దూసుకెళ్లడం సవాలే. ఆ సవాల్‌ను స్వీకరిస్తూ ముందుకెళ్తున్నాడు లూయిస్ హామిల్టన్. 40 ఏళ్ల ఈ బ్రిటన్ డ్రైవర్ కెరీర్ ఆరంభంలో ఎలా ఉన్నాడో ఇప్పటికీ అదే ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాడు. టైటిళ్ల వేటలో వెనుకబడ్డా.. ప్రతి జీపీలోనూ పోటీకి వస్తున్నాడు. ఫెరారీకి ప్రాతినిధ్యం వహించే ఈ స్టార్... ఆస్ట్రియన్, బ్రిటన్ గ్రాండ్‌ప్రిల్లో నాలుగో స్థానంలో నిలిచి కొద్దిలో పోడియంపై నిలిచే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 2008లో తొలి ఎఫ్-1 ఛాంపియన్‌షిప్ సాధించిన అతడు.. 2020లో చివరిగా ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. అయిదేళ్లలో మరో టైటిల్ దక్కకపోయినా అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. రెండుసార్లు ట్రాక్‌లో ప్రమాదాల్లోనూ చిక్కుకున్నాడు.

మన మహీ.. ఆ ఇద్దరు


ధోని


నబి


డుప్లెసిస్

క్రికెట్లోనూ 40లో సత్తా చాటుతున్న ఆటగాళ్లున్నారు. అందులో ముందుగా చెప్పుకోవాల్సింది మన మహేంద్రసింగ్ ధోని గురించే. అతడి వయసు 44 ఏళ్లు. మహి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఆరేళ్లు గడిచిపోయింది కానీ.. ఐపీఎల్‌లో మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాడు. మూడేళ్ల ముందు నుంచి రిటైర్మెంట్ ఊహాగానాలు నడుస్తున్నప్పటికీ.. అతను మాత్రం ఒక్కో ఏడాది కెరీర్‌ను పొడిగించుకుంటూ వస్తున్నాడు. ఒకప్పటి స్థాయిలో బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు రాకపోయినా, నిలకడగా రాణించకపోయినా.. అప్పుడప్పుడూ విలువైన ఇన్నింగ్స్ ఆడుతున్నాడు మహి. తన వికెట్ కీపింగ్‌లో మాత్రం ఇంకా చురుకుదనం తగ్గలేదు. అవసరమైనపుడు కెప్టెన్సీ భారాన్నీ మోస్తున్నాడు. ఇక క్రికెట్లో 40 తర్వాత ఇంకెవరికీ సాధ్యం కాని అథ్లెటిజం చూపిస్తున్న ఆటగాడు ఫాఫ్ డుప్లెసిస్. అంతర్జాతీయ క్రికెట్‌కు ఎప్పుడో గుడ్‌బై చెప్పినా.. ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌ల్లో అదరగొడుతున్నాడు. కుర్రాళ్లతో పోటీ పడుతూ విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడడం, ఫీల్డింగ్‌లో డైవ్‌లు చేస్తూ మెరుపు క్యాచ్‌లు అందుకోవడం ద్వారా అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. ఇటీవలే మేజర్ క్రికెట్ లీగ్‌లో రెండు శతకాలు బాదడంతో పాటు కళ్లు చెదిరే క్యాచ్‌లతో డుప్లెసిస్ అబ్బురపరిచాడు. 41 ఏళ్ల ఈ ఓపెనింగ్ బ్యాటర్.. ఈ ఏడాది ఐపీఎల్‌లోనూ సత్తా చాటాడు. 40 ఏళ్ల వయసులో ఓవైపు అంతర్జాతీయ క్రికెట్లో సత్తా చాటుతూ, మరోవైపు టీ20 లీగ్‌ల్లోనూ మెరుపులు మెరిపిస్తున్న ఆటగాడు మహ్మద్ నబి. అఫ్గానిస్థాన్ క్రికెట్లో ఈ ఆల్‌రౌండర్‌ను దిగ్గజ ఆటగాడిగా చెప్పొచ్చు. ఆ దేశ జట్టు అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగు పెట్టినప్పటి నుంచి అతనున్నాడు. తన తర్వాత ఎంతోమంది ఆటగాళ్లు జట్టును వీడినా.. తన ప్రతిభతో ఇంకా కొనసాగుతున్నాడు. విశేషం ఏంటంటే.. నబి తనయుడు హసన్ ఐసాఖిల్ కూడా క్రికెటరే. ఇంకా అంతర్జాతీయ క్రికెట్లోకి రాకపోయినా.. కొడుకుతో కలిసి దేశవాళీ టీ20 లీగ్స్‌లో కలిసి, ప్రత్యర్థిగా ఆడాడు నబి.

మోనికా సెలెస్‌కు అరుదైన వ్యాధి


మోనికా సెలెస్

లండన్: టెన్నిస్ దిగ్గజం మోనికా సెలెస్ అరుదైన వ్యాధితో బాధపడుతోంది. కండరాల బలహీనతకు సంబంధించిన మస్తీనియా గ్రావిస్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మోనికా తెలిపింది. ఈ వ్యాధితో బాధపడుతున్న వాళ్లకు డిప్లోపియా (డబుల్ విజన్), నరాల బలహీనతతో పాటు మరి కొన్ని సమస్యలు ఉంటాయి. మూడేళ్ల క్రితం ఈ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందని మోనికా తెలిపింది. ఈ నెల 24న యుఎస్ ఓపెన్‌కు ముందు ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచేందుకు మోనిక మొదటిసారిగా తన ఆరోగ్య పరిస్థితి గురించి బహిరంగంగా మాట్లాడింది. "ఒక రోజు కొంతమంది పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి టెన్నిస్ ఆడుతున్నా. కొన్నిసార్లు బంతికి రాకెట్‌ను తగిలించలేకపోతున్నా. నిజంగా రెండు బంతులు కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలు తేలిగ్గా తీసుకునేవి కావు. ఈ ప్రయాణం ప్రారంభమైనప్పుడు నిజాన్ని గ్రహించడానికి, బహిరంగంగా మాట్లాడటానికి చాలా సమయం పట్టింది. ఇదెంతో కష్టమైనది. నా దైనందిన జీవితాన్ని చాలా ప్రభావితం చేస్తుంది" అని మోనికా వివరించింది. 51 ఏళ్ల మోనికా తన కెరీర్‌లో 9 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించింది. ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లోనూ స్థానం దక్కించుకుంది. 1990లో విజేతగా నిలిచిన మోనికా 16 ఏళ్ల వయసులో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించింది. 2003లో చివరి గ్రాండ్‌స్లామ్ ఆడింది.

రెచ్చిపోయిన బ్రెవిస్

- 41 బంతుల్లోనే శతకం
- రెండో టీ20లో ఆసీస్‌పై దక్షిణాఫ్రికా విజయం


బ్రెవిస్ 125 నాటౌట్

125 బ్రెవిస్ స్కోరు. టీ20ల్లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే. డుప్లెసిస్ (2015లో వెస్టిండీస్‌పై 119)ను అధిగమించాడు.

డార్విన్: దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ (125 నాటౌట్; 56 బంతుల్లో 12×4, 8×6) విధ్వంసం సృష్టించాడు. బౌండరీలు, సిక్సర్లతో స్టేడియాన్ని ఊపేసిన బ్రెవిస్.. అజేయ శతకంతో రికార్డులు తిరగరాశాడు. మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో బ్రెవిస్ విశ్వరూపం చూపించాడు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బ్రెవిస్ శతక్కొట్టడంతో ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 53 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తుచేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. బ్రెవిస్ ధాటికి మొదట దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోరు సాధించింది. 25 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న బ్రెవిస్.. తర్వాతి 50 కోసం 16 డెలివరీలే ఆడటం విశేషం. కేవలం 41 బంతుల్లోనే బ్రెవిస్ సెంచరీ సాధించాడు. అనంతరం ఆసీస్ 17.4 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. టిమ్ డేవిడ్ (50; 24 బంతుల్లో 4×4, 4×6) పోరాడినా ఫలితం లేకపోయింది. నిర్ణయాత్మక మూడో టీ20 శనివారం జరుగుతుంది.

- **టీ20ల్లో ఆసీస్‌పై అత్యంత వేగవంతమైన సెంచరీ, అత్యధిక స్కోరు, ఎక్కువ సిక్సర్లు (8) రాబట్టిన దక్షిణాఫ్రికా బ్యాటర్‌గా బ్రెవిస్ రికార్డు సృష్టించాడు.**
- **టీ20ల్లో దక్షిణాఫ్రికా తరఫున సెంచరీ సాధించిన అత్యంత పిన్న వయస్కుడు బ్రెవిస్ (22 ఏళ్ల 105 రోజులు). ఇప్పటి వరకు రిచర్డ్ లెవి (24 ఏళ్ల 34 రోజులు) పేరిట ఈ రికార్డు ఉంది.**
- **ఆసీస్ గడ్డపై టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు బ్రెవిస్‌దే. షేన్ వాట్సన్ (2016లో భారత్‌పై 124 నాటౌట్) రికార్డు బద్దలైంది.**

రోహిత్ మొదలెట్టాడు..


జిమ్‌లో నాయర్‌తో రోహిత్

ముంబయి: టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ మంగళవారం సాధన మొదలెట్టాడు. భారత మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అతడితో ఉన్నాడు. ఐపీఎల్ తర్వాత రోహిత్ కొన్ని నెలల పాటు విశ్రాంతి తీసుకున్నాడు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు టెస్టులకు గుడ్‌బై చెప్పిన రోహిత్.. వన్డే ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అతను గత ఏడాదే టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. జిమ్‌లో నాయర్‌తో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో రోహిత్ పోస్ట్ చేశాడు. రోహిత్‌కు నాయర్ వ్యక్తిగత కోచ్ కూడా. నాయర్ ఇంతకుముందు కార్తీక్, రాహుల్, రింకు సింగ్‌లతో కూడా కలిసి పనిచేశాడు. రోహిత్ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతాడా లేదా అన్న చర్చ సాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ వన్డే దిగ్గజం ఆ ఫార్మాట్లో 32 శతకాలు సాధించాడు. న్యూజిలాండ్‌పై భారత్ గెలిచిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన సంగతి తెలిసిందే.

బిన్నీ అప్పటిదాకా..


రోజర్ బిన్నీ

బెంగళూరు: బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ సెప్టెంబరులో జరిగే వార్షిక సర్వసభ్య సమావేశం వరకు పదవిలో కొనసాగనున్నాడు. బిన్నీ గత నెలలోనే 70 ఏళ్లు పూర్తిచేసుకున్నాడు. బోర్డు రాజ్యాంగం ప్రకారం ఆ వయసు దాటాక పదవిలో ఉండేందుకు వీలు లేదు. కానీ జాతీయ క్రీడల పాలన బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడంతో బిన్నీ పదవిలో కొనసాగడానికి అవకాశం దక్కింది. ఆ బిల్లు ప్రకారం జాతీయ క్రీడా సమాఖ్యల ఆఫీసు బేరర్లు 75 ఏళ్ల వరకు పదవుల్లో (ఆయా క్రీడల అంతర్జాతీయ సంఘాల నిబంధనలు అనుమతిస్తే) ఉండొచ్చు. "బిన్నీ సెప్టెంబరులో బోర్డు సమావేశం వరకు పదవిలో ఉండొచ్చు. అతడికి మరో దఫా అవకాశం లభిస్తుందా లేదా అన్నది బోర్డులోని బలమైన వ్యక్తుల చేతుల్లో ఉంది" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. బిన్నీ 2022లో బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు.



టైరే కదా అని...



బైక్ కండిషన్‌లో ఉంది కదా..
ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయిస్తున్నాం కదా..
కారు బాగానే నడుస్తోంది కదా...
అని చాలా ధీమాగా ఉన్నారు కదా..!
మరి టైర్ల గురించి పట్టించుకుంటున్నారా..?
మనలో చాలామంది అరిగిపోయేంత వరకు టైర్లను నడిపిస్తునే ఉంటారు. ఇది ప్రమాదకరమని చెబుతున్నారు నిపుణులు.

ఎన్ని కి.మీ. వాడొచ్చు..

- ద్విచక్ర వాహనాలకు అయితే గరిష్ఠంగా 30-35 వేల కి.మీ. వరకు.
- ముందు చక్రం అదనంగా మరో అయిదు వేల కి.మీ.లు వాడొచ్చు.
- కార్లకు 50వేల కి.మీ. దాకా టైర్లు కొనసాగించవచ్చు.
- టైర్లకు ఎక్కువగా ఎండ తగలడం, వర్షపు నీటిలో ఉండడం, డ్రైవింగ్ చేసే విధానం, రోడ్ల పరిస్థితులను బట్టి టైర్ల అరుగుదల ఉంటుంది. కొన్నిసార్లు నిర్దేశితదూరం తిరగకున్నా మార్చాల్సి ఉంటుంది.
- ప్రతి టైర్ వాల్‌పై ఇరువైపులా ట్రెడ్ వేర్ ఇండికేటర్స్ (టీడబ్ల్యూఐ) ఉంటాయి. దానికి ఎదురుగా టైర్ గ్రిప్ మధ్యలో 1.6 మిల్లీమీటర్ల లోపలకు చిన్న బొడుపులాంటివి ఉంటాయి. దానివరకు వరకు టైర్ అరిగితే ఏమీ కాదు. ఆ టీడబ్ల్యూఐ బొడుపులను తాకేలా టైర్లు అరిగితే.. ప్రమాణాల ప్రకారం మార్చాల్సిందే.

చూట్టానికి బాగున్నా..

- ఏ టైర్లు అయినా అయిదేళ్ల వరకు మన్నుతాయి. ఆ తర్వాత తప్పనిసరిగా మార్చాలి.
- నిర్దిష్ట దూరం తిరిగినా, తిరగకపోయినా.. అయిదేళ్ల తర్వాత టైర్‌ను మారిస్తేనే.. ఎటువంటి ప్రమాదాలకు అవకాశం ఉండదు.
- సాధారణంగా అయిదేళ్ల తర్వాత టైర్ రబ్బర్‌లో ఉండే సున్నితత్వం పోతుంది. మనకు కనిపించకుండానే పగుళ్లు వచ్చి హార్డ్‌గా మారుతుంది.
- టైర్ చూడటానికి బాగుందని మరికొన్నేళ్లు దానిని అలాగే కొనసాగించకూడదు.





ముందుది వెనక్కి.. వెనకది ముందుకి..

చాలా కార్లకు ఇంజిన్ ముందువైపు ఉంటుంది. దీనివల్ల ముందు టైర్లలో కొంత ఎక్కువగా అరుగుతుంది. అందుకే ప్రతి 5 వేల కి.మీ. తర్వాత వాటిని రొటేషన్ విధానంలో మార్చాలని నిపుణులు సూచిస్తున్నారు.

- వెనుక (రియర్) కుడి టైర్‌ను, ముందు ఎడమ వైపునకు.. ముందు ఎడమవైపు టైర్‌ను వెనుక కుడి వైపునకు మార్చాలి. అలాగే వెనుక ఎడమ టైర్‌ను ముందు కుడి వైపునకు మార్చాలి. ముందు కుడివైపు టైరును వెనుక ఎడమ వైపునకు మార్చాలి. ఇలా రొటేషన్ చేయాలి.
- 5 వేల కి.మీటర్లకు వీల్ అలైన్‌మెంట్, వీల్ బ్యాలెన్సింగ్ తప్పనిసరిగా చెక్ చేయించాలి.

కొనేటప్పుడు ఇవి చూడాలి!



- ప్రతి వాహనం కంపెనీని బట్టి.. దాని టైరుకు నిర్దేశిత ప్రమాణాలు ఉంటాయి.
- ఉదాహరణకు ఓ టైర్ వాల్‌పై '205/55 ఆర్ 16 91 ఎస్' అని ఉంటే.. అవి ఒక్కో అంశాన్ని సూచిస్తాయి.
- 205 అనేది టైరు వెడల్పు 205 మిల్లీ మీటర్లు అనేది చెబుతుంది.
- 55 అనేది టైర్ యాస్పెక్ట్ రేషియో 55 శాతం అని సూచిస్తుంది.
- ఆర్ అనేది ఆ టైర్ రేడియల్ కన్‌స్ట్రక్షన్ అని చెబుతుంది.
- 16 అనేది రిమ్ డయామీటర్ 16 అంగుళాలు ఉందని తెలియజేస్తుంది.
- 91 అనేది లోడ్ ఇండెక్స్‌ను వివరిస్తుంది. ప్రతి టైర్ గరిష్ఠంగా ఎంత బరువును తట్టుకుంటుంది అనేది లోడ్ ఇండెక్స్ ద్వారా తెలుస్తుంది. లోడ్ ఇండెక్స్ అనేది 62 నుంచి 126 వరకు ఉంటుంది.
- వి అనేది స్పీడ్ రేటింగ్‌ను తెలియజేస్తుంది. అంటే ఆ టైర్లతో గంటకు గరిష్ఠంగా ఎన్ని కి.మీటర్ల వేగంతో ప్రయాణించవచ్చో చెబుతోంది. 12 రకాల స్పీడ్ రేటింగ్స్ ఉంటాయి. ఎన్ అంటే గంటకు 140 కి.మీ. వేగం, పి-150, క్యూ-160, ఆర్-170, ఎస్-180, టి-190, యూ-200, హెచ్-210, వి-240, జెడ్-240ప్లస్, డబ్ల్యూ-270, వై-300 కి.మీ. అని అర్థం!

ఎప్పుడు తయారైందనేది కీలకం..

సాధారణంగా టైర్ జీవితకాలం అయిదేళ్లు అయినప్పుడు.. కొత్త టైర్ తీసుకునే సమయంలో అది ఎప్పుడు తయారైందనేది కూడా తప్పనిసరిగా పరిశీలించాలి. ఇందుకు నాలుగు అంకెలతో కూడిన సూచిక టైర్ వాల్‌పై ఉంటుంది. ఉదాహరణకు '1825' అని ఉంటే.. 2025వ సంవత్సరంలో 18వ వారం ఆ టైర్ తయారైనట్లు అర్థం. దీనిని చూసుకొని ఇటీవలి కాలంలో తయారైన టైరును ఎంపిక చేసుకోవచ్చు.

- ఈనాడు, అమరావతి





అనగనగా ఒకరోజు.. అడవిలో

విశాలమైన గడ్డి మైదానాలు.. వాటిలో పరుగులుపెట్టే వన్యప్రాణులు.. జీపు ఎక్కి గ్రాస్‌ల్యాండ్‌లో సఫారీ.. అక్కడే పొద్దుపొడుపున 'బుష్ బ్రేక్‌ఫాస్ట్'.. ఈ వీక్ కోసమే చాలామంది దక్షిణాఫ్రికా, కెన్యా దేశాల్లో యాత్రలు చేస్తుంటారు. ఇప్పుడిక అంత దూరం వెళ్లక్కర్లేదు. హైదరాబాద్‌కు సమీపంలో వికారాబాద్ పక్కనే ఉన్న అనంతగిరిహిల్స్ అడవుల్లో సరికొత్త ప్రకృతి పర్యాటకాన్ని అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) అందుబాటులోకి తీసుకువస్తోంది. కాటేజీలు, సఫారీ వాహనాలను సిద్ధం చేసింది. 'ది బ్రేక్'గా నామకరణం చేసిన ఈ ప్రాజెక్టును ఆగస్టు 15న ప్రారంభించనుంది.

రాత్రంతా అడవిలోనే..

మధ్యాహ్నం 3 గంటలకు మొదలయ్యే ఈ ట్రిప్ మరుసటిరోజు ఉదయం 11కు ముగుస్తుంది. తేనీటి విందుతో స్వాగత కార్యక్రమం ఉంటుంది. రాత్రి అనంతగిరి అడవిలోని బస. క్యాంప్‌ఫైర్, డిన్నర్ ఉంటాయి. మరుసటిరోజు ఉదయం 5.15కే నిద్ర లేస్తారు. అరగంటకే అడవిలో ట్రెక్కింగ్, బర్డ్‌వాక్, సఫారీ, ఆ తర్వాత బుష్ బ్రేక్‌ఫాస్ట్ ఉంటాయి.

క్షణక్షణం.. సరికొత్త అనుభూతి

అనంతగిరి అడవుల్లో ప్రకృతి పర్యాటకయాత్ర క్షణక్షణం సరికొత్త అనుభూతిని పంచుతుంది. ప్రకృతి సౌందర్యం.. స్వచ్ఛమైన గాలి.. జింకలు, కుందేళ్ల వంటి వన్యప్రాణులు.. అనంతపద్మనాభస్వామి ఆధ్యాత్మిక క్షేత్రం. మనసును మాయచేసే మబ్బివానలు.. బౌద్ధ మాలికలు.. గిరిజన పంటలు.. ఇలా చాలావాటికి ప్రసిద్ధి చెందిన ప్రాంతమిది.

■ ట్రెక్కింగ్‌కు 6 రూట్లు సిద్ధం చేశారు. వీటి దూరం కనిష్ఠంగా 0.73 కి.మీ., గరిష్ఠంగా 6.9 కి.మీ. కాగా దారిలో నీటి ప్రవాహాలు, పరుగులు తీసే జింకల గుంపులు కనిపించే అవకాశం ఉంది.



ప్రత్యేక కాటేజీలు..

అనంతగిరి అటవీ ప్రాంతంలో ఒకరోజు గడిపేలా అనేక ఆకర్షణలతో ఎఫ్‌డీసీ ప్యాకేజీ రూపొందించింది. రాత్రి బసకు నాలుగు కాటేజీలను సిద్ధం చేశారు. పక్కనే వాచ్‌టవర్ ఎక్కితే అనంతగిరి అటవీప్రాంతం కనువిందు చేస్తుంది. 20 లేదా 25వ తేదీ తర్వాత పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎఫ్‌డీసీ ప్రయత్నిస్తోంది.

'బుష్ బ్రేక్‌ఫాస్ట్'..

■ కెన్యా, ఆఫ్రికా అడవుల్లోని గ్రాస్‌ల్యాండ్‌లో గిరిజనులు తయారుచేసే అల్పాహారాన్ని పర్యాటకులకు బ్రేక్‌ఫాస్ట్‌గా ఇస్తారు. అనంతగిరిహిల్స్‌లోనూ ఆదే తరహాలో ఉండనుంది. ఉదయం జంగిల్‌వాక్ తర్వాత సఫారీ.. జీపులో 6 కి.మీ. తిప్పుతారు. ఒకచోట గడ్డి మైదానంలో టేబుళ్లు, కుర్చీలు వేసి బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చేటప్పుడే అల్పాహారం అందిస్తారు.

■ ప్యాకేజీ.. ఒక్కో గదిలో ఒకరుంటారా.. ఇద్దరు, ముగ్గురా.. అన్నదాన్ని బట్టి రూ.5 వేలు, రూ.3,800, రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులోనే ఆహారం, సఫారీ వంటివన్నీ కలిపి ఉంటాయి. వివరాలను ఎఫ్‌డీసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

– ఈనాడు, హైదరాబాద్

తీరం మురవంగా.. 'హర్ ఘర్ తిరంగా'



పర్యాటక శాఖ మంగళవారం విశాఖ ఆర్కే బీచ్‌లో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. సీఆర్‌పీఎఫ్ జవాన్లు జాతీయ జెండాలు చేతపట్టి బైక్ ర్యాలీ తీశారు. కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. 'హర్ ఘర్ తిరంగా' దేశభక్తికి నిదర్శనమన్నారు. సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్, పర్యాటకశాఖ అధికారిణి జె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం(పెదవాల్తేరు)

రథోత్సవం.. మంత్రముగ్ధం



మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్రుల సప్తరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం మహా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి పూర్వ అవతారమైన ప్రహ్లాదరాయల మహా రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాఘవేంద్రస్వామి గర్భగుడిలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలుకు విశేష పూజలు నిర్వహించి, మహా మంగళహారతి ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మఠంలో వసంతోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చి అలంకరించిన రథంపై ఉంచారు. అనంతరం పుర వీధుల్లో రథోత్సవం కనులపండువగా సాగింది. హెలికాప్టర్‌తో రథోత్సవంపై పూల వర్షం కురిపించారు.



నాడు 'గంట'కోసారి జ్ఞాపకం.. నేడు నాటి జ్ఞాపకం..

ఇది ఆదిలాబాద్ జిల్లా జైలు వద్ద ఏర్పాటు చేసిన గంట. జైలులో.. అదీ ఈ రోజుల్లో గంట అవసరం ఏముంటుందీ.. అని జైలు అధికారులను అడిగితే.. ఈ గంటకు 120 ఏళ్ల చరిత్ర ఉందంటూ ఆసక్తికర విషయాలను చెప్పారు. 1905లో నిజాం కాలంలో ఆసిఫాబాద్‌లో జిల్లా జైలును ప్రారంభించారట. అప్పుడే కంచుతో తయారు చేసిన ఈ గంటను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఖైదీలకు సమయం తెలపటానికి ప్రతి గంటకు ఒకసారి దీన్ని మోగించేవారట. భోజన సమయంలో, నిత్యం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఖైదీల లెక్క పూర్తయ్యాక అంతా సక్రమంగా ఉందన్న సంకేతం ఇవ్వటానికి సైతం మోగించేవారట. అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు.. ఏకబిగిన దీన్ని మోగించేవారట. 2007లో ఈ జిల్లా జైలును ఆదిలాబాద్‌కు మార్చారు. ఆ గంటను సైతం ఇక్కడికి తరలించారు. జైలు పర్యవేక్షణాధికారి అశోక్‌కుమార్ దానికి బంగారు వర్ణం పూయించి జైలు ముందు ఏర్పాటు చేయటంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రస్తుతం ములాకత్ సమయం ప్రారంభానికి, ముగింపునకు గుర్తుగా ఈ గంట మోగిస్తామని అధికారులు తెలిపారు.

– ఈనాడు, ఆదిలాబాద్

'భారీకాయం'.. 'బలం'.. నమస్తుభ్యం

నేలమీద అతి పెద్ద జీవి ఏనుగే. బలంలోనూ దానికి సాటిలేదు. వాటి సంరక్షణకు పిలుపునిస్తూ ఏటా ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నెహ్రూ జంతు ప్రదర్శనశాలలోనూ మంగళవారం ఘనంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. జూలోని ఏనుగులతో మూడు కిలోమీటర్ల నడక నిర్వహించారు. ఆడ ఏనుగులు వనజ, ఆశ, సీతతో పాటు మగ ఏనుగు విజయ్‌కి పసందైన అయిదు కిలోల జంబో కేకు (వివిధ రకాల పండ్లు, కూరగాయలు) అందజేయగా.. అవి ఇష్టంగా తిన్నాయి. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణలో ఏనుగుల పాత్ర కీలకమని జూ క్యూరేటర్ వసంత తెలిపారు.

– న్యూస్‌టుడే, చార్మినార్

ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ శిల్పి సుదర్శన్ పట్నాయక్ మంగళవారం ఒడిశాలోని పూరీ తీరంలో సైకత శిల్పం తీర్చిదిద్దారు. అడవుల నరికివేత తగదని, ఏనుగుల రక్షణ మనందరి బాధ్యత అన్న సందేశంతో ఇసుకను ఆకట్టుకునే శిల్పంగా మలిచారు.

-న్యూస్‌టుడే, గోపాలపూర్





1,116 శివలింగాల ఆలయం!



కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లాలో ఉన్న కోటి లింగేశ్వర దేవాలయంలో ప్రపంచంలోనే అత్యధిక శివలింగాలున్నాయని ప్రతీతి. ఇదే తరహాలో 1,116 శివలింగాలతో అలరారుతోంది మహాలింగ పంచముఖేశ్వరాలయం. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, జమ్ములపాలెంలో ఉంది. దీని నిర్మాణం వెనుక ఈ గ్రామానికి చెందిన వెంకట శేషమాంబ విశేషకృషి ఉంది. ఆమె 1994లో తీర్థయాత్రలకు నేపాల్ వెళ్లినప్పుడు అక్కడున్న పశుపతినాథ్ దేవాలయంలో ఒకేచోట 524 శివలింగాలను చూశారు. పట్టుబట్టి 1,116 శివలింగాలతో దేవాలయ నిర్మాణానికి 1998లో శంకుస్థాపన చేశారు. 2004లో పూర్తిచేశారు. గురుమాత అష్టోత్తర శత శక్తిపీఠం పక్కనే ఉన్న ఈ దేవాలయాన్ని దర్శిస్తే సకల దోషాలూ పోతాయని అందరూ విశ్వసిస్తారు. ప్రతి సోమవారం, కార్తిక మాసం, మాఘమాసాల్లో అధికసంఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చి పూజలు చేస్తారు. మన రాష్ట్రంలో ఎక్కువ శివలింగాలు ఒకేచోట ఉన్న దేవాలయం ఇదొక్కటే కావడం విశేషం.

– ఈనాడు, ఒంగోలు. న్యూస్‌టుడే, టంగుటూరు

బీట్ 'రూట్' మారింది!

మనీ ప్లాంట్, స్నేక్ ప్లాంట్, పీస్‌లిల్లీ.. ఇలాంటి మొక్కలు ఇంట్లో అలంకరించుకోవడం సాధారణంగా చూస్తుంటాం. భీమవరానికి చెందిన ఏసుబాబు తన ఇంట్లో బీట్‌రూట్ మొక్కను అలంకరణగా పెంచుతున్నారు. దాని ఎర్రటి చిగురు చూస్తే.. బీట్‌రూట్ తినేందుకే కాదు.. గృహాలంకరణలోనూ స్థానం కల్పించాల్సిందే అనిపిస్తోంది. ఏసుబాబు రెండు రోజుల కిందట మార్కెట్ నుంచి తెచ్చిన దుంప మొలకెత్తడంతో దాన్ని ఓ కప్పులో పెట్టి నీళ్లు పోశారు.. అంతే అది ఇలా ఆకట్టుకుంటోంది. – ఈనాడు, భీమవరం



కశ్మీర్‌లో కొత్త సవాలు.. 'బెడ్‌రూం జిహాదీలు'

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భద్రతాదళాలకు 'బెడ్‌రూం జిహాదీలు' పేరుతో విద్రోహశక్తుల నుంచి కొత్త సవాలు ఎదురవుతోంది. సురక్షితంగా ఇళ్లలో కూర్చొని సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు, విద్వేషభరిత సమాచార వ్యాప్తికి కొందరు పాల్పడుతున్నారు. సంప్రదాయ సాయుధ ఉగ్రవాదులకు భిన్నంగా ఉండే వీరు జమ్మూకశ్మీర్‌ను అస్థిరపరిచే కుట్రలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో అనేక నకిలీ ఖాతాలను వారు తెరిచినట్లు తమ దర్యాప్తులో గుర్తించామన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలు, వాటి సానుభూతిపరులు దీన్ని నియంత్రిస్తున్నట్లు భావిస్తున్నారు. పలు వారాలుగా కొనసాగుతున్న ఈ దర్యాప్తులో భాగంగా వేలాది సోషల్ మీడియా పోస్టులు, వ్యాఖ్యలు, ప్రైవేటు సందేశాలను అధికారులు విశ్లేషించారు. ఈ సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాక్‌లో ఉన్న హ్యాండ్లర్లకు ప్రత్యక్ష సంబంధం ఉందనేందుకు ఆధారాలు ఈ క్రమంలోనే లభ్యమయ్యాయి.



పురుషోత్సవం

తమిళనాడులోని పొన్నర్ శంకర్‌స్వామి ఆలయంలో ఏటా పురుషులు మాత్రమే పాల్గొనే ప్రత్యేక ఉత్సవం జరుగుతుంది. దిండుక్కల్ జిల్లా నత్తం సమీపంలోని పాదసిరుక్కుడి గ్రామంలో ఈ ఆలయం ఉంది. ఈ క్షేత్రంలో సోమవారం రాత్రి 'ఊరుండై సోరూ కరి విరుందు' ఉత్సవాన్ని నిర్వహించారు. సుమారు 5 వేల మందికిపైగా పురుషులు పాల్గొన్నారు. స్వామివారికి 101 మేకలు, కోళ్లను మొక్కుగా సమర్పించారు. అనంతరం వాటితో కూరలు వండి ఆ మాంసాహారాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఉత్సవానికి హాజరైన పురుషులకు అక్కడే విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొంటే స్వామివారు ఆగ్రహించి చెడు కలిగిస్తారని స్థానికులు నమ్ముతారు.

– న్యూస్‌టుడే, చెన్నై(ఆర్కేనగర్)

కీబోర్డు వదిలి.. పేజీలు తిరగేసి

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లతో బిజీగా ఉండే ఐటీ ఉద్యోగుల కోసం ఫీనిక్స్ గ్రూప్ డైరెక్టర్ చుక్కపల్లి ఆకాష్ తమ గచ్చిబౌలి హైటెక్ సిటీ ఫీనిక్స్ సంస్థ ఉన్న ఈక్వినాక్స్ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అందులో తెలుగుతో పాటు దాదాపు 5వేలకు పైగా వివిధ భాషల పుస్తకాలను ఉంచారు. వీటిని ఫీనిక్స్ ఫౌండేషన్ కంపెనీ ఉద్యోగులతో పాటు ఈక్వినాక్స్ భవనంలోని ఇతర కంపెనీల ఉద్యోగులు సైతం వినియోగించుకోవచ్చని అక్కడి సిబ్బంది తెలిపారు.

–ఈనాడు, హైదరాబాద్



కారు స్టేటస్ సైకిల్ పర్యావరణ సింబల్!!



నల్గొండ వీధుల్లో సైకిల్‌పై నిరాడంబరంగా వెళుతున్న ఈ సార్ పేరు మునగాల వెంకట్‌రెడ్డి. ఫిజిక్స్ అధ్యాపకులు. నెలకు రూ.లక్షన్నర జీతం. కారులో తిరిగే స్తోమత. అయితేనేం నల్గొండ రైల్వే స్టేషన్ నుంచి కళాశాలకు సైకిల్‌పైనే వెళ్లి వస్తారు. ఆయన స్వస్థలం మిర్యాలగూడ సమీప లక్ష్మీపురం గ్రామం. మిర్యాలగూడలో నివాసం ఉండే వెంకట్‌రెడ్డి.. ఇంటి నుంచి మిర్యాలగూడ స్టేషన్‌కూ సైకిల్‌పైనే వెళ్లి వస్తారు. 'మొదట్లో నేను సైకిల్‌పై వస్తుంటే చాలా మంది ఇదేంటి అని.. ముక్కున వేలేసుకునేవారు? పర్యావరణ హితంగా ఉండాలని ఆచరణాత్మకంగా పాటిస్తున్నా" అని సగర్వంగా చెప్పారు.

–ఈనాడు, నల్గొండ



పుస్తక పఠనంతో పుష్కల లాభాలు

పుస్తక పఠనాన్ని ప్రతిఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలి. దానివల్ల దక్కే లాభాల్లో కొన్ని ఇవీ..
✦ ఏకాగ్రత పెరుగుతుంది. ✦ ఒంటరితనం తగ్గుతుంది. ✦ నాణ్యమైన, ధ్రువీకృత సమాచారం అందుతుంది.
✦ ఇతరులను అర్థం చేసుకోవడం అలవడుతుంది. ✦ సామాజిక మాధ్యమాల స్క్రోలింగ్‌తో ఎదురయ్యే సమస్యలను తప్పించుకోవచ్చు.

– అలెక్స్, కంటెంట్ క్రియేటర్



తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి చెక్కులను అందిస్తున్న దాత కొడాలి శ్రీకాంత్ తదితరులు

తితిదే అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన క్యాప్షన్ సర్వీసెస్ సంస్థ అధినేత కొడాలి శ్రీకాంత్ మంగళవారం శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి, ఎస్వీ గో సంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం సమర్పించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్కులను అందజేశారు.

తిరుమలకు వచ్చే వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి

ఆగస్టు 15 నుంచి అమలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమలకు వచ్చే వాహనాలకు ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ తప్పనిసరి చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలిపిరి తనిఖీ కేంద్రానికి వివిధ వాహనాల్లో చేరుకునే భక్తులకు మెరుగైన భద్రత, అధిక రద్దీ నివారణ, పారదర్శక సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 15 నుంచి ఫాస్టాగ్ లేని వాహనాలను తిరుమలకు అనుమతించబోమన్నారు.

కూలీ సినిమాకు వెళ్లిరండి

ఉద్యోగులకు సెలవు, టికెట్లిచ్చిన తమిళనాడు సంస్థ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: అగ్ర కథానాయకుడు రజినీకాంత్ నటించిన కూలీ చలనచిత్రం విడుదల సందర్భంగా ఓ సంస్థ తన ఉద్యోగులకు సెలవు ఇవ్వడంతో పాటు ఉచితంగా సినిమా టికెట్లు అందించింది. గురువారం ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తమిళనాడులోని మదురై కేంద్రంగా పనిచేస్తున్న యూనో ఆక్వా కేర్ అనే సంస్థ ఉద్యోగులకు ఉచితంగా టికెట్లు ఇవ్వడంతో పాటు సెలవు కూడా మంజూరు చేసింది. చెన్నై, బెంగళూరు, తిరుచ్చి, తిరునెల్వేలి, చెంగల్పట్టు, మాట్టుత్తావణి, అరప్పాళైయం తదితర ప్రాంతాల్లోని శాఖలకు ఈ నిర్ణయం వర్తింపజేసింది. సినిమా విడుదల రోజున ఆశ్రమాలకు ఆహార పంపిణీ, విరాళాలు అందించడంతోపాటు ప్రజలకు స్వీట్లు పంపిణీ చేయనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ సర్క్యులర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పలువురు ఉద్యోగులు వారి సంస్థలను ట్యాగ్ చేసి సెలవు కోరుతూ పోస్టులు పెడుతున్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

హైదరాబాద్ యువతి దుర్మరణం

పెద్దఅంబర్‌పేట (దుండిగల్) న్యూస్‌టుడే: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని దుండిగల్‌కు చెందిన యువతి దుర్మరణం చెందింది. ఉన్నత ఉద్యోగం చేసి కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటుందని భావించిన ఆ కుటుంబం ఆశలు ఆవిరయ్యాయి. సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వర్మ, హేమలత దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చారు.



శ్రీజ వర్మ

దుండిగల్ గండిమైసమ్మ కూడలి సమీపంలోని శ్రీశ్రీహోమ్స్‌లో నివసిస్తున్నారు. శ్రీనివాసరావు ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తుండగా, భార్య ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు శ్రీజ వర్మ(23), శ్రేయ వర్మ ఉన్నారు. పెద్దకుమార్తె శ్రీజావర్మ ఇల్లినోయ్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నారు. ఇల్లినోయ్ రాష్ట్రం షికాగోలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఆమె శనివారం రాత్రి భోజనం చేయడానికి సమీపంలోని హోటల్‌కు ఎలక్ట్రిక్ సైకిల్‌పై వెళ్లారు. తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన ట్రక్కు ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్న కూతురు శ్రేయ వర్మ సైతం 20 రోజుల క్రితం ఎంఎస్ చేయడానికి అమెరికా వెళ్లింది. మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ద్వారా మంత్రి శ్రీధర్‌బాబును సంప్రదించి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

10 రైళ్లు ఐదు రోజులు రద్దు

ఈనాడు, హైదరాబాద్: పాపటపల్లి-డోర్నకల్ బైపాస్ మధ్య మూడో రైల్వే లైను నిర్మాణ పనుల నేపథ్యంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగనుంది. 10 రైళ్లు ఐదు రోజులు పూర్తిగా రద్దయ్యాయి. మరో 26 రైళ్లలో కొన్నింటిని ఒక రోజు, మరికొన్నింటిని రెండు రోజుల పాటు ద.మ.రైల్వే రద్దు చేసింది. తొమ్మిది రైళ్లను దారి మళ్లించింది. రెండు రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయి.

14 నుంచి 18 వరకు రద్దయిన రైళ్లు

కాజీపేట-డోర్నకల్, డోర్నకల్-కాజీపేట (67765/67766), డోర్నకల్-విజయవాడ, విజయవాడ-డోర్నకల్ (67767/67768), విజయవాడ-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-విజయవాడ (67215/67216), గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు (12705/12706), విజయవాడ-సికింద్రాబాద్, సికింద్రాబాద్-విజయవాడ (12713/12714).

చీర చింపి.. జడ పట్టి ఈడ్చి

మహిళా ఏపీఎంపై వైకాపా నేతల దాష్టీకం ● వాస్తవాలు నివేదించడాన్ని తట్టుకోలేక దాడి



వైకాపా నేతలు, మహిళల చెర నుంచి ఏపీఎం రజినిని విడిపించుకొని తీసుకెళ్తున్న పోలీసులు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: తాము చెప్పినట్లు వినలేదని, తమకు వ్యతిరేకంగా నివేదిక పంపారని కక్ష గట్టిన వైకాపా నాయకులు ఓ మహిళా ఉద్యోగిపై దాడికి పాల్పడిన దారుణమిది. తనతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు చిత్రహింసలకు గురిచేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు, స్థానికుల కథనం.. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ-3 మహిళా సమాఖ్యకు సంఘమిత్రగా, ఆ ప్రాంతంలో ఆశా కార్యకర్తగా తలారివాండ్లపల్లెకు చెందిన నల్లకాసుల శేఖర్ భార్య నాగరాజమ్మ 15 ఏళ్లుగా పని చేస్తున్నారు. రెండు ఉద్యోగాలు చేస్తూ ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మోసం చేస్తున్నారని ఇటీవల తెదేపా నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివరాలు ఆరా తీసిన గుర్రంకొండ ఏపీఎం రజిని.. నాగరాజమ్మ రెండు ఉద్యోగాలు చేస్తున్నది వాస్తవమేనని నివేదిక పంపించారు. పీహెచ్‌సీ వైద్యులు కూడా ఇదే మాదిరిగా నివేదిక ఇచ్చారు.

నడిరోడ్డుపై అడ్డగించి..

ఏపీఎం రజినిపై కక్షగట్టిన నాగరాజమ్మ తన మద్దతుదారులతో కలిసి ఆమెపై దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. 'తలారివాండ్లపల్లె, మర్రిమానుపల్లెకు చెందిన కొందరు వైకాపా నేతలు, మహిళలు నాగరాజమ్మ ఆధ్వర్యంలో మంగళవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి వచ్చారు. ఏపీఎంను రమ్మని పిలిచారు. విధి నిర్వహణలో భాగంగా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన రజినిని నడిరోడ్డుపైనే నాగరాజమ్మ, ఆమె మద్దతుదారులు అడ్డుకున్నారు. పలువురు మహిళలు ఆమెపై పిడిగుద్దులు కురిపించడంతో పాటు చీర చింపివేశారు. జుట్టు పట్టుకుని కింద పడదోసి, హత్యాయత్నానికి పాల్పడ్డారు. అసభ్యంగా తిట్టడంతో పాటు వికృత చేష్టలతో చిత్రహింసలకు గురిచేశారు. స్థానికులు ఆమెను కాపాడి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి నిందితులు పారిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామ'ని ఎస్సై రఘురాం తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, ఉద్యోగులకు రక్షణ కల్పిస్తామని చెప్పారు. పలు మహిళా సంఘాల నేతలు, సీసీలు, సంఘమిత్రలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, ఏపీఎంపై దారుణానికి పాల్పడిన మూకపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఒంగోలులో పోలీసు విచారణకు ఆర్‌జీవీ

- న్యాయవాదిని అనుమతించని దర్యాప్తు అధికారులు
- వర్మ సెల్‌ఫోన్ స్వాధీనం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ప్రకాశం జిల్లా ఒంగోలు గ్రామీణ పోలీసుల ఎదుట మంగళవారం హాజరయ్యారు. 2024లో ఆయన దర్శకత్వంలో వచ్చిన వ్యూహం సినిమా ప్రమోషన్‌లో భాగంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల వ్యంగ్య చిత్రాలతో వారి వ్యక్తిత్వాలను కించపరిచేలా ఎక్స్‌లో పోస్టులు చేశారు. దీనిపై తెదేపా నాయకుడు ఎం.రామలింగం ఫిర్యాదు మేరకు మద్దిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 7న తొలిసారి విచారణకు ఆర్‌జీవీ హాజరయ్యారు. తదుపరి విచారణకు సహకరిస్తానని చెప్పి వెళ్లిన ఆయన... తనపై అన్యాయంగా కేసు పెట్టారని, దాన్ని కొట్టేయాలని హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆయనకు ఊరట లభించలేదు. ఈ నేపథ్యంలో మరోసారి విచారణకు హాజరుకావాలని ఒంగోలు గ్రామీణ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు జులై 22న వాట్సప్‌లో నోటీసులు పంపారు. దీంతో మంగళవారం ఒంగోలు వచ్చారు. ఆయన వెంట న్యాయవాది, వైకాపా లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు కూడా హాజరయ్యారు.



విచారణకు హాజరైన రామ్‌గోపాల్ వర్మ

అయితే పోలీసులు విచారణకు న్యాయవాదిని అనుమతించలేదు. ఫిబ్రవరిలో జరిగిన తొలివిడత విచారణలో ఆర్‌జీవీ తన సెల్‌ఫోన్ తీసుకెళ్లలేదు. మంగళవారం విచారణలో దర్యాప్తు అధికారి శ్రీకాంత్ బాబు... ఫోన్ స్వాధీనం చేయాలని, విచారణ దానిమీదే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. ఫోన్ తన న్యాయవాది వద్ద ఉందని ఆర్‌జీవీ చెప్పడంతో ఆయనను పిలిపించి వర్మ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. సుమారు 60 ప్రశ్నలను దర్యాప్తు అధికారి సంధించారు. నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌తో వర్మకు ఉన్న సంబంధాలపై ఆరాతీసినట్లు సమాచారం. ఈ సినిమాకు నిర్మాత కావడం వల్లే కిరణ్‌కుమార్ తితిదే బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కించుకున్నారా.. అని పోలీసులు అడిగినట్లు తెలిసింది. ఈ సినిమాకు ముందే ఆయన బోర్డు సభ్యుడైనట్లు వర్మ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. వర్మ ఇచ్చిన సమాధానంతో పోలీసులు అనుబంధ ప్రశ్నలు వేస్తూ సమాచారం రాబట్టే ప్రయత్నం చేశారు. విచారణ అనంతరం ఆయనకు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.



సేలం నుంచి శస్త్రచికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ పారిముత్తు

చెన్నైలోని రోగికి సేలం నుంచి శస్త్రచికిత్స

విజయవంతంగా నిర్వహించిన వైద్యుడు పారిముత్తు

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: తమిళనాడులోని సేలం నుంచి 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నైలోని రోగికి 'టెలిసర్జరీ' విజయవంతంగా జరిగింది. సేలంలోని ధరన్ ఆసుపత్రి నుంచి రోబోటిక్ విధానంలో చెన్నైలోని ప్రశాంత్ ఆసుపత్రిలో రోగికి చికిత్స అందించారు. 'తమిళనాడు స్టేట్ చాప్టర్ ఆఫ్ ది అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా కాన్ఫరెన్స్' (టీఎన్‌ఏఎస్ఐసీఓఎన్-2025) వార్షిక సమావేశం సందర్భంగా ప్రశాంత్ గ్రూప్ ఆసుపత్రుల రోబోటిక్ సర్జరీ విభాగ అధిపతి డాక్టర్ పారిముత్తుకుమార్ ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. 45 ఏళ్ల పురుషుడు హెర్నియా సమస్యతో ప్రశాంత్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. అతనికి డాక్టర్ పారిముత్తు సేలం ఆసుపత్రి నుంచి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఇందుకు గంటన్నర సమయం పట్టింది. పారిముత్తు చేసిన శస్త్రచికిత్స విజయవంతమైనందుకు టీఎన్‌ఏఎస్ఐ ఛైర్మన్ డాక్టర్ పి.సుందరరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రశాంత్ గ్రూపు ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ జి.ప్రశాంత్ కృష్ణ, ధరన్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.సెల్వరాజ్ తదితరులు రోబోటిక్ ద్వారా టెలిసర్జరీ జరిగిన విధానాన్ని వివరించారు.


మహిళను చేయిపట్టుకొని లాగడం నేరం కాదు: మద్రాస్ హైకోర్టు

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: దురుద్దేశం లేకుండా ఓ పురుషుడు మహిళ చేయి పట్టుకొని లాగడం నేరం కాదని ఓ కేసు విచారణ సమయంలో మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం వ్యాఖ్యానించింది. చోళవందానైకి చెందిన మురుగేశన్ అనే వ్యక్తి 2015లో పశువులు మేపుతున్న మానసిక దివ్యాంగురాలి చేయి పట్టుకొని లాగినట్లు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి నిందితుణ్ని అరెస్టు చేశారు. ఈ కేసును విచారించిన ప్రత్యేక కోర్టు.. మురుగేశన్‌కి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీనిని రద్దు చేయాలని మురుగేశన్ మదురై ధర్మాసనంలో అప్పీల్ చేశారు. విచారణ జరిపిన జస్టిస్ మంజుల.. దురుద్దేశం లేకుండా చేయి పట్టుకొని లాగడం నేరం కాదని, బాధపెట్టే చర్య మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కేసులో బాధితురాలిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో పిటిషనరు చేయి పట్టుకొని లాగినట్లు ఎలాంటి ఆధారాలూ లేవని అన్నారు. దిగువ కోర్టు మురుగేశన్‌కి విధించిన శిక్షను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబు మంచి వాళ్లను పంపారని.. అక్కడి ప్రజలంతా అనుకోవాలి

- నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, అమలు చేయండి
- స్వర్ణాంధ్ర యంగ్ ప్రొఫెషనల్స్ సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి.. వాటిని అమలు చేయడంపై స్వర్ణాంధ్ర యంగ్ ప్రొఫెషనల్స్ దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 అమల్లో భాగంగా నియోజకవర్గాల వారీగా నియమించిన యంగ్ ప్రొఫెషనల్స్‌కు శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు వారికి దిశానిర్దేశం చేశారు. 'నియోజకవర్గానికో యంగ్ ప్రొఫెషనల్‌ను నియమించడం కొత్త విధానం. విధుల్లో చేరాక కొన్ని ఇబ్బందులూ ఎదురవుతాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల్ని సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. సరైన సమాచారం మీ దగ్గర లేకుంటే మిమ్మల్ని పరిగణనలోకి తీసుకోరు. అందుకే ప్రతి అంశాన్ని అధ్యయనం చేయండి. అప్డేట్ అవ్వండి.



మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలి. నియోజకవర్గ అభివృద్ధికి ఆలోచనలను చేసి, అమలు చేయడానికి ఆకాశమే హద్దుగా భావించండి. చంద్రబాబు మంచి వాళ్లను తమ నియోజకవర్గానికి పంపించారని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. మీరు మంచి పేరు తెచ్చుకోండి. . నాకూ మంచి పేరు తీసుకురండి' అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం సెమీకండక్టర్ యూనిట్‌ను కేటాయించిందని, ఇది మంచి పరిణామమని, రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టం ఏర్పడేందుకు దోహదపడుతుందని చంద్రబాబు పేర్కొన్నారు.

వినూత్నంగా ఆలోచించాలి

'నేను విద్యుత్ లేని ఊరు నుంచి వచ్చాను. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు తెచ్చా. నిత్య విద్యార్థిగా ఉంటూ.. అభివృద్ధిపై నిరంతరం ఆలోచించడం వల్లే ఇది సాధ్యమైంది' అని సీఎం పేర్కొన్నారు. 'ప్రజలకు ఏది మంచిదో చెప్పాలి. సరైన విధానాలు అవలంబించకపోతే ఎలాంటి పరిణామాలు వస్తాయో వారికి వివరించాలి. ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యలొస్తాయో ముందే అంచనా వేయాలి. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తేనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి సాధ్యం' అని చంద్రబాబు వివరించారు. 'రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని నిరంతరం తెలుసుకోవాలి. యంగ్ ప్రొఫెషనల్స్‌కు ఇదో అద్భుతమైన అవకాశం' అని సీఎం వివరించారు. కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు.

విద్యార్థులూ.. ఈ పోటీలు మీకోసమే!

- పర్యావరణంపై ఫొటోలు పెట్టండి.. క్విజ్‌లో పాల్గొనండి
- ఈ నెల 21 వరకు గడువు

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులూ.. మీరు ప్రకృతి ప్రేమికులా.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారా.. అయితే మీకోసం కేంద్ర పర్యావరణ, విద్యా మంత్రిత్వశాఖలు జాతీయస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నాయి. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి ధ్రువపత్రం.. ప్రతిభావంతులకు జాతీయస్థాయిలో బహుమతులు అందజేస్తారని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ మండలి మాజీ ఛైర్మన్, పోటీల కో-కన్వీనర్ డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మీరు చేస్తున్న కృషిని ప్రతిబింబించేలా ఫొటోతీసి అప్‌లోడ్ చేయాలి. మొక్కలు నాటుతున్న, నీరుపోస్తున్న సమయంలో, మీరు పెంచిన మొక్కలు లాంటి పర్యావరణ పరిరక్షణకు సంబంధించి తీసిన సెల్ఫీలు ఉండాలి. అనంతరం పర్యావరణంపై ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని జవాబులు ఇవ్వాలి. వెంటనే మీ మార్కులు కనిపిస్తాయి. ఈ నెల 30న ఫలితాలు వెల్లడిస్తారు. పోటీల్లో పాల్గొనేందుకు గడువు ఈ నెల 21వ తేదీ. ఈ నెల 12 వరకు దేశవ్యాప్తంగా 8.90 లక్షల మంది పోటీల్లో పాల్గొన్నారు.

- 1-5, 6-8 9-12, ఆ తర్వాత తరగతుల వారిని ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి పోటీలు జరుపుతారు. www.ecomitram.app ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎలాంటి ఫీజు లేదు.

ఏపీ సెంట్రల్ యూనివర్సిటీపై

గెజిట్ నోటిఫికేషన్ జారీ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం మేరకు ఏర్పాటై ప్రస్తుతం అనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ స్వరూప, స్వభావాన్ని వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. వర్సిటీ కార్యనిర్వాహక మండలి స్వరూపాన్ని అందులో పేర్కొంది.

- యూనివర్సిటీ ఉపకులపతి ఛైర్మన్‌గా ఉండే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి/వారి నామినీ, యూజీసీ ఛైర్మన్/యూజీసీలో జాయింట్ సెక్రటరీ హోదాలో పనిచేసే వారి నామినీ, ఏపీ ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శులు ఎక్స్‌అఫీషియో మెంబర్లుగా ఉంటారు.
- వీరికితోడు ప్రొ.వైస్‌ఛాన్సలర్, రొటేషన్ పద్ధతిలో వీసీ నియమించే ఒక డీన్, ఇద్దరు బోధనా సిబ్బంది (ఇందులో ఒకరు ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/మహిళ/మైనార్టీకి చెందినవారై ఉండాలి), విజిటర్ (రాష్ట్రపతి)నామినేట్ చేసే ముగ్గురు ప్రతిభావంత విద్యార్థులు, ఇద్దరు ప్రస్తుతం పనిచేస్తున్న లేదంటే పదవీ విరమణ చేసిన వీసీలు, ఇతర రాష్ట్రాలకు చెందిన కేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లను వీసీ సిఫారసు ఆధారంగా సభ్యులుగా నియమిస్తారు.
- అలాగే వైస్‌ఛాన్సలర్ సిఫారసు చేసిన ప్యానల్ నుంచి ఇద్దరు ప్రఖ్యాత విద్యావంతులను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినేట్ చేస్తుంది.
- ఈ విద్యాసంస్థలో విద్యార్థి, ఉద్యోగి కాని ఒక వ్యక్తిని 'మెంబర్ ఆఫ్ ద కోర్టు'గా వీసీ సిఫారసు చేసిన ప్యానల్ నుంచి విజిటర్ నామినేట్ చేస్తారు. రిజిస్ట్రార్ ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు కార్యదర్శిగా వ్యవహరిస్తారు.
- ఎక్స్ అఫీషియో సభ్యులు కాకుండా మిగిలిన సభ్యులంతా మూడేళ్లు ఇందులో కొనసాగుతారు.
- ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సంవత్సరానికి కనీసం 3 సార్లు సమావేశం కావాల్సి ఉంటుంది.
- ఒకసారి వీసీగా నియమితులైన వ్యక్తి ఐదేళ్లు కానీ, 70 ఏళ్ల వరకు కానీ కొనసాగుతారు.
- వీసీగా పనిచేసిన వారిని మరోసారి నియమించే వీలు కల్పించారు.
- ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థి మండలి ఏర్పాటు చేయాలని ఇందులో నిర్దేశించారు. విద్యార్థి సంక్షేమ డీన్ దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

వీడీ రాజగోపాల్ కేసు విస్తృత ధర్మాసనానికి బదిలీ

ఈనాడు, దిల్లీ: జగన్ అక్రమాస్తుల కేసులో 16వ నిందితుడిగా ఉన్న తన ప్రాసిక్యూషన్‌కు అవినీతి నిరోధక సవరణ చట్టం 2018 కింద ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండానే దర్యాప్తు సంస్థ దాఖలుచేసిన ఛార్జిషీట్‌ను సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ గనులశాఖ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. అవినీతి నిరోధక సవరణ చట్టం 2018లోని నిబంధనల ప్రకారం నిందితుల ప్రాసిక్యూషన్‌కు అధీకృత వ్యవస్థ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్న నిబంధన ఆ చట్టసవరణ కంటే ముందు జరిగిన నేరాలకు వర్తిస్తుందా? లేదా అన్న అంశం ప్రస్తుతం విస్తృత ధర్మాసనం ముందు ఉందని అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ధర్మాసనం దీన్ని కూడా ట్యాగ్ చేయాలని ఆదేశించింది. అంతవరకు ఈ కేసులో వీడీ రాజగోపాల్ పాత్ర వరకు ట్రయల్‌పై స్టే ఇస్తున్నట్లు పేర్కొంది.

మద్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పు వాయిదా

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పు వాయిదా పడింది. మిథున్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీల పిటిషన్లపై తీర్పులను ఈ నెల 18వ తేదీకి ఏసీబీ కోర్టు న్యాయాధికారి వాయిదా వేశారు. ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిళ్లపై తీర్పునూ 18వ తేదీకి వాయిదా వేశారు. మరో నిందితుడు దిలీప్ బెయిల్ పిటిషన్‌పై మంగళవారం వాదనలు ప్రారంభం కావాల్సి ఉండగా.. బుధవారానికి వాయిదా వేశారు.

దస్తగిరికి జైల్లో బెదిరింపుల ఘటన..

సమగ్ర విచారణ కోసం కమిటీ

- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో ఏర్పాటు
- వివేకా హత్య కేసుకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరిని కడప కేంద్ర కారాగారంలో బెదిరించిన ఘటనపై లోతైన విచారణ కోసం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. వైఎస్సార్ కడప జిల్లా డీఎంహెచ్‌వో కె.నాగరాజు, విజయవాడ జిల్లా జైలు సూపరింటెండెంట్ మహ్మద్ ఇర్ఫాన్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్‌ను సభ్యులుగా నియమించింది. వివేకా హత్య కేసులో నిందితుడైన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డా.చైతన్యరెడ్డి.. వైద్యశిబిరం ముసుగులో 2023 నవంబరు 28న కడప కేంద్ర కారాగారంలోకి వెళ్లి దస్తగిరిని బెదిరించారనేది ప్రధాన అభియోగం. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ దీనిపై సమగ్ర విచారణ జరిపి కొన్ని నెలల కిందట ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. చైతన్యరెడ్డి జైల్లోకి ప్రవేశించేందుకు అప్పటి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఐఎన్ఎస్ ప్రకాశ్, డిప్యూటీ సూపరింటెండెంట్ కె.జవహర్‌బాబు, డిప్యూటీ సివిల్ సర్జన్ డా.జి.పుష్పలత బాధ్యులని తేల్చారు. అయితే ఈ వ్యవహారంలో వైద్యారోగ్య, పోలీసుశాఖలకు చెందిన మరికొంత మంది ప్రమేయం కూడా ఉన్నట్లు హోంశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో అప్పట్లో కడప కేంద్ర కారాగారంలో జరిగిన ఘటనలపై మరింత లోతైన విచారణ కోసం కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

★ "వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారి మా రాజకీయ జీవితాన్ని నాశనం చేశావ్. నీ వల్ల మా నాన్న, వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కరరెడ్డి జైలుకెళ్లారు. నువ్వు మా మాట వింటే బాగుపడతావు. లేకుంటే జైల్లోనే చస్తావు. సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ నిన్ను కొట్టి అప్రూవర్‌గా మార్చాడని, అవినాష్‌రెడ్డి, భాస్కరరెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పించాడని చెప్పు" అంటూ దస్తగిరిని బెదిరించారనేది చైతన్యరెడ్డిపై అభియోగంగా ఉంది.

బుడమేరులో పెరిగిన నీటి మట్టం



మంగళవారం సాయంత్రం ఓ ఇంట్లో నీటిమట్టం ఇలా..

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే: విజయవాడలోని బుడమేరులో రెండు రోజులుగా పెరుగుతున్న నీటి మట్టం.. స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. విజయదుర్గానగర్ మధ్యకట్టలో బుడమేరు లోపలకు వేసుకున్న ఇళ్లలోకి సోమవారం మధ్యాహ్నం నీరు చేరింది. కొన్ని ఇళ్లలోకి రెండు అడుగుల మేర రాగా మంగళవారం సాయంత్రానికి కాస్త తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది సెప్టెంబరు మొదటి వారంలో వచ్చిన వరద.. 10 రోజుల పాటు స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేసింది. వర్షాలు కురవకపోయినా బుడమేరులో నీరు రావడం, వరద వస్తుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆయా ప్రాంతాలను నగరపాలకసంస్థ అధికారులు పరిశీలించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు సూచనలు చేశారు.

శ్రీశైలంలో 4 గేట్ల ఎత్తివేత

నన్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి 1,57,373 క్యూసెక్కుల వరద వస్తుండటంతో శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. 4 క్రస్ట్‌గేట్లను 10 అడుగులు ఎత్తి 1,08,628 క్యూసెక్కులు, విద్యుత్తు కేంద్రాల నుంచి 65,689 క్యూసెక్కుల ప్రవాహాన్ని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయ నీటిమట్టం మంగళవారం సాయంత్రం 6 గంటలకు 883 అడుగులు ఉంది. 204.35 టీఎంసీల నీటినిల్వ నమోదైంది. ఈ సీజన్‌లో జలాశయం గేట్లు ఎత్తడం ఇది మూడోసారి.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ సోమువీర్రాజు



ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబును భాజపా ఎమ్మెల్సీ సోమువీర్రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో మంగళవారం ఆయన్ను కలిసి తూర్పుగోదావరి జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. నీటిపారుదల సదుపాయాల మెరుగుదల, జాతీయ రహదారుల విస్తరణ, పర్యాటక రంగ అభివృద్ధి, గృహనిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల అభివృద్ధి, గండిపోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధి వంటి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశ అనంతరం చంద్రబాబుకు గండి పోచమ్మ తల్లి చిత్రపటాన్ని అందించారు.

పీపీపీ పద్ధతిలో అధునాతన వైద్య సేవలు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సామాన్య ఆసుపత్రుల్లోని అధునాతన వైద్యసేవల్లో కొన్ని సర్వీస్ ప్రొవైడర్లకు అప్పగించాలని, మరికొన్నింటిని పీపీపీ పద్ధతిలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కాకినాడ జీజీహెచ్‌లోని క్యాథ్ ల్యాబ్‌ను సర్వీస్ ప్రొవైడర్‌కు అప్పగించనుంది. శ్రీకాకుళం, నెల్లూరు, తిరుపతి జీజీహెచ్‌ల్లో కొత్త క్యాథ్ ల్యాబ్‌లను పీపీపీ విధానంలో ఏర్పాటు చేసి, స్థానిక కార్డియాలజీ విభాగాల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకురానుంది. విశాఖపట్నంలోని కేజీహెచ్, ప్రభుత్వ శ్వాస కోశ-అంటువ్యాధుల ఆసుపత్రి (జీహెచ్‌సీసీడీ), కాకినాడ, గుంటూరు, తిరుపతి జీజీహెచ్‌ల్లో ఐదు సీటీ స్కానింగ్ యంత్రాలు ఈ పద్ధతిలోనే కొనుగోలు చేయనుంది. కర్నూలు జీజీహెచ్‌లో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన 128 స్లైస్ సిటీస్కాన్ నిర్వహణను ఏపీఎంఎస్ఐడీసీ లేదా సర్వీసు ప్రొవైడర్‌కు అప్పగించాలని శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఫార్మెటివ్ ప్రశ్నపత్రాల రూపకల్పనలో గందరగోళం

ఈనాడు, అమరావతి: ఫార్మెటివ్-1 పరీక్షల్లో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) ఇచ్చిన ప్రశ్నపత్రాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకటో తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాషకు సంబంధించి 35 మార్కులకు ప్రశ్నపత్రం ఇచ్చారు. అందులో ఒక కథ ఇచ్చి, దాని ఆధారంగా జవాబులు రాయాలని పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో నేరుగా ఒకటో తరగతిలోనే ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమంది మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాలు, పదాలు లాంటివి నేర్చుకున్నారు. మిగతా వారు నేరుగా ఒకటో తరగతిలోనే ప్రవేశాలు పొందారు. ఇలాంటి విద్యార్థులకు కథనం ఇచ్చి, జవాబులు రాయమంటే వారికి ఎలా సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. "ఎస్‌సీఈఆర్టీలో ప్రశ్నపత్రాలు రూపొందించే వారికి కనీస అవగాహన ఉండటం లేదు. సిలబస్ కూడా అవగాహన లేకుండా ప్రశ్నపత్రాలు రూపొందిస్తున్నారు. కొన్నిసార్లు తరగతి స్థాయి కంటే తక్కువ స్థాయి ప్రశ్నలు ఇవ్వడం, మరోసారి విద్యార్థుల స్థాయికి మించి ప్రశ్నపత్రాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. మూడో తరగతి ఆంగ్ల భాష పరీక్షకు నాలుగో తరగతిలోని పాఠాల నుంచి ప్రశ్నలు ఇచ్చారు. కొన్నింటిలో ఆగస్టు, సెప్టెంబరు పాఠ్యప్రణాళిక సైతం ప్రశ్నపత్రాల్లో ఇచ్చారు" అని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు.

రూ.115 కోట్లతో 77 వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్లు

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో 77 వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్ల (ఎఫ్ఎస్‌టీపీ) ఏర్పాటుకు ప్రభుత్వం రూ.115.50 కోట్లు కేటాయించింది. స్వచ్ఛ భారత్(గ్రామీణ్) కార్యక్రమంలో భాగంగా పనుల నిర్వహణకు టెండర్లు పిలిచి తదుపరి చర్యలు తీసుకోవాలని స్వచ్ఛాంధ్ర సంస్థ ఎండీని ఆదేశిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల్లో అనేక చోట్ల సెప్టిక్ ట్యాంకుల్లో మల వ్యర్థ జలాలను నేరుగా నదుల్లో, సముద్రంలో వదిలేస్తున్నారు. ఇది పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇందుకోసం అవసరమైన ప్రాంతాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్య కార్యదర్శి పేర్కొన్నారు.

స్త్రీశక్తి పథకం అమలులో ఇబ్బందులు రాకూడదు

- అన్ని ముందస్తు చర్యలు తీసుకోండి
- ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి
- ఈపోస్ యంత్రాలకు జీపీఎస్ అనుసంధానం చేయండి
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు


స్త్రీశక్తి పథకం సన్నద్ధతపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: మహిళలకు ఉచిత బస్సుప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకం అమలులో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పెరిగే రద్దీకి తగినట్టు బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పథకం ప్రారంభం కానుండగా దీనిపై సీఎం చంద్రబాబు మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రయాణికులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఆదేశించారు. ఎక్కడ సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా వ్యవస్థ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ పథకం అమలు తీరుపై ప్రయాణికుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని, దీని వల్ల పథకాన్ని మరింత మెరుగుపరిచేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

అన్ని బస్టాండ్లలో ఆర్వో ప్లాంట్లు

ఈపోస్ యంత్రాలు (టికెట్ జారీ మిషన్లు) తప్పనిసరిగా జీపీఎస్‌తో అనుసంధానం కావాలని, దీనివల్ల వాటిని ట్రాక్ చేసి ప్రయాణికులకు సమాచారం అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని సీఎం తెలిపారు. బస్టాండ్లు పరిశుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని, రెండు గంటలకోసారి మరుగుదొడ్లు శుభ్రపరిచేలా చూడాలని సూచించారు. అన్ని బస్టాండ్లలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల కొత్త ఫ్యాన్లు, కుర్చీలు అదనంగా ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు తగిన సమాచారం ఇవ్వాలి.. బస్సు స్టేషన్లలో సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు కొత్త పథకంపై అధ్యయనం

ఆటో డ్రైవర్లకు సాయం అందించడంపై అధ్యయనం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న పథకాలతో పాటు, కొత్త పథకం రూపొందించేలా అధ్యయనం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ.. బస్సులు ఎక్కడా ఆగకుండా తగిన చర్యలన్నీ తీసుకున్నామని వివరించారు. జీరో ఫేర్ టికెట్ల కోసం 14వ తేదీ నాటికి అన్ని ఈపోస్ యంత్రాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పూర్తిచేస్తామని వెల్లడించారు. సిబ్బందికి శిక్షణ పూర్తిచేశామని అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో ప్రారంభించనున్న సీఎం

స్త్రీశక్తి పథకాన్ని సీఎం చంద్రబాబు విజయవాడ పీఎన్‌బీఎస్‌లో ప్రారంభించనున్నారు. అక్కడి సిటీ బస్సు టెర్మినల్ ఆవరణలో 15వ తేదీ మధ్యాహ్నం పథకాన్ని ఆరంభిస్తారు. అనంతరం మహిళా ప్రయాణికులతో మాట్లాడతారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దూషించి.. అక్రమంగా నిర్బంధించి..

- మాజీ ఎమ్మెల్యే మొండితోక వీరంగం
- భయంతో వణికిపోయిన మున్సిపల్ కమిషనర్

నందిగామ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లోవరాజును వైకాపా మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, వైకాపా నాయకులు దూషించి అక్రమంగా నిర్బంధించిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. కమిషనర్ ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు వైకాపా నాయకులపై కేసు నమోదుచేశారు. మున్సిపల్ కమిషనర్ సోమవారం కార్యాలయంలో ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు మాజీ ఎమ్మెల్యేతో పాటు కొందరు వైకాపా నాయకులు అక్రమంగా ఆయన గదిలోకి వచ్చి నిర్బంధించి బెదిరించారు. కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లి ఆయన్ను చుట్టుముట్టి సమాచారం ఇవ్వాలన్నారు. ఒక ఆర్జీ ఇచ్చి.. వెంటనే సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండురోజుల్లో ఇస్తామని చెప్పినా మాజీ ఎమ్మెల్యే తీవ్ర పదజాలంతో కమిషనర్‌ను దూషించి భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం మిగిలినవారు సిబ్బందిని నిర్బంధించి కార్యాలయం తలుపులు మూసేశారు. సిబ్బందితో మేటర్ టైప్ చేయించి కమిషనర్‌తో సంతకం చేయించారు. దీంతోపాటు మరో ఖాళీ కాగితంపైనా సంతకం చేయించారు. దీనిపై కమిషనర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, పట్టణ వైకాపా అధ్యక్షుడు మహమ్మద్ మస్తాన్, మరికొందరిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తనతో సంతకం పెట్టించుకున్న పేపర్లు తిరిగి ఇప్పించి, ప్రాణ రక్షణ కల్పించాలని కమిషనర్ పోలీసులను కోరారు.

వైఎస్సార్ విగ్రహం తొలగింపు పైనా..

నందిగామ గాంధీసెంటర్‌లో ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని రెండు రోజుల క్రితం తొలగించారు. దీనిపైనే కమిషనర్‌ను మాజీ ఎమ్మెల్యే బెదిరించారు. దీనిపైనా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందే పూర్తవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

నిరంతరం పర్యవేక్షించాలి. వీటికి అనుసంధానంగా పెట్టుబడులు, వెంచర్లు కూడా రావాల్సి ఉంది' అని సీఎం వివరించారు.

గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా అమరావతి..: 'కేవలం భవనాల నిర్మాణంతో మాత్రమే రాజధాని నగరం పూర్తి కాదు. ఆర్థిక కార్యకలాపాలు కూడా పెద్ద ఎత్తున రావాల్సి ఉంది. నిర్మాణాలు పూర్తి చేసి రాజధాని నగరంగా విజిబిలిటీ వస్తే పెట్టుబడిదారులు వస్తారు. నాలెడ్జ్ ఎకానమీ, స్టార్టప్స్ లాంటి ఎకో సిస్టమ్ కూడా రాజధానిలో కల్పించాలి. దేశంలోని అత్యుత్తమ పది రియల్ ఎస్టేట్ కంపెనీలను కూడా ఆహ్వానించి ఇక్కడ ప్రాజెక్టులు చేపట్టేందుకు అవకాశం కల్పించాలి. అమరావతిని గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా మార్చేందుకు ఈవీ వాహనాలు ప్రోత్సహించాలి. సీడ్ క్యాపిటల్, క్యాపిటల్ సిటీ, క్యాపిటల్ ఏరియా ప్రాంతాల్లో గాలి నాణ్యత ఎలా ఉందో నమోదు చేసి వివరాలు ప్రదర్శించాలి' అని అధికారులను సీఎం ఆదేశించారు.

మాస్టర్ ప్లాన్ ప్రభావితం కాకుండా రైతుల సమస్యలకు పరిష్కారం: రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్ల విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. రైతుల విజ్ఞప్తులను పరిశీలించి మాస్టర్ ప్లాన్ ప్రభావితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల్లోగా ఈ అంశాన్ని కొలిక్కి తెస్తామని మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాజధాని పనులు జరగకపోవడంతో నిర్మాణానికి తెచ్చిన ఇనుము, సామగ్రి తుప్పు పట్టిపోయిందని కాంట్రాక్టర్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. నిర్మాణం కోసం సేకరించిన ఇసుక నిల్వల్ని కూడా గత పాలకులు ఎత్తుకెళ్లారని తెలిపారు. స్పందించిన సీఎం.. ఆ ఇసుకను అందించాలని మైనింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు.

బంగారం దోపిడీకి తుపాకులతో బీభత్సం

- చందానగర్ ఖజానా జ్యూయెలర్స్‌లోకి చొరబడ్డ ఆరుగురు దుండగులు


వెండి ఆభరణాలు బ్యాగుల్లో సర్దుకుంటున్న దుండగులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని చందానగర్ ఖజానా జ్యూయెలర్స్‌లోకి పట్టపగలు తుపాకులతో చొరబడిన దుండగులు 10 నిమిషాలపాటు బీభత్సం సృష్టించారు. ఒక సిబ్బందిపై కాల్పులు జరిపి వెండి వస్తువులు, 1గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తీసుకొని పరారయ్యారు. అయితే బంగారం లాకర్ తాళాన్ని మేనేజర్ ఇంటి దగ్గర మరిచిపోవడంతో భారీ చోరీ తప్పింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చందానగర్‌లోని గంగారం జాతీయ రహదారిలో ఉన్న ఖజానా జ్యూయెలర్స్ దుకాణాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు సిబ్బంది తెరిచారు. 10.30కు రోజువారీ విధులు, ఇతర అంశాలపై స్టోర్ డిప్యూటీ మేనేజర్ సతీష్ సిబ్బందితో గ్రౌండ్‌ఫ్లోర్‌లో సమావేశమయ్యారు. అనంతరం మేనేజర్ అంజిరెడ్డి.. సెక్యూరిటీ గార్డు సమక్షంలో మొదటి అంతస్తులోని లాకర్ తెరిచి బంగారం, విలువైన ఆభరణాలు సిబ్బందికి ఇస్తే డిస్‌ప్లేలో పెట్టాల్సి ఉంది. ఈ మేరకు ప్రధాన గేటు దగ్గర ఉండే సెక్యూరిటీ గార్డు శ్రీను మొదటి అంతస్తులోకి వెళ్లాడు. అప్పటికే దుకాణం బయట తచ్చాడుతున్న ఓ దుండగుడు భద్రతా సిబ్బంది పైకి వెళ్లడాన్ని గమనించి లోపలిలోకి చొరబడ్డాడు. తరువాత వరుసగా మరో ఐదుగురు మాస్కులు, టోపీలు, హెల్మెట్లు ధరించి వచ్చారు. వారిలో ముగ్గురి దగ్గర తుపాకులున్నాయి. ప్రధాన ద్వారం సమీపంలోని సిబ్బంది ప్రశ్నించేలోపే ఒకతను అతడి తలపై తుపాకీ గురి పెట్టి లాకర్ చూపించాలన్నాడు. బిల్ కౌంటర్ దగ్గరున్న వ్యక్తిని, బంగారం నాణ్యత నిర్ధారించే వ్యక్తిని కొట్టారు. మేనేజర్ లేడని చెప్పగా.. ఒక రౌండు గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ సమయంలో స్టోర్‌లో మొత్తం 34 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు.

లాకర్ తెరిచే అవకాశం లేకపోవడంతో..

డిప్యూటీ మేనేజర్ సతీశ్‌కు తుపాకీ గురిపెట్టి లాకర్ తాళమివ్వకుంటే చంపేస్తామని బెదిరిస్తూ నిందితుల్లో ఒకడు మొదటి అంతస్తులోకి తీసుకెళ్లాడు. తాళం తెచ్చేందుకు మేనేజర్ బయటికెళ్లాడని చెప్పగా.. కోపంతో అతని కాలిపై కాల్పులు జరిపాడు. దీంతో సిబ్బంది కేకలు పెడుతూ తలో మూలకు వెళ్లి దాక్కున్నారు. అనంతరం దొంగలు డిస్‌ప్లే అద్దాలు ధ్వంసం చేసి 10 కిలోల వెండి, పలు 1గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో పరారయ్యారు. ఈ తతంగం మొత్తం 10 నిమిషాల్లో జరిగింది. తరువాత సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినయ్, ఏసీపీ శ్రీనివాస్, చందానగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్ చేరుకొని పరిశీలించారు. దుండగులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని ప్రాథమికంగా నిర్ధారించారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఏపీ తదితర రాష్ట్రాల పోలీసుల్ని అప్రమత్తం చేశారు.

ఉత్తమ పాఠశాలలకు అవార్డులు

ఈనాడు, అమరావతి: ఉత్తమ పాఠశాల అవార్డులకు 10 పాఠశాలలను ఎంపిక చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. యాజమాన్యాల వారీగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత, అత్యధిక సరాసరి మార్కులు సాధించిన పాఠశాలలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరికి ఆగస్టు 15న విజయవాడలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

పురస్కారాలకు ఎంపికైన పాఠశాలలు..

- కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం అంగలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల
- పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
- ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు ఏపీఆర్ఎస్ (బాలికలు)
- పార్వతీపురం మన్యం జిల్లాలోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, యూఆర్‌జేసీ (బాలికలు)
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వీవీపాలెం మండలం చుండి ఆదర్శ పాఠశాల
- నంద్యాల జిల్లా పాణ్యం మండలం నెరవాడ ఎంజేపీ ఏపీ బీసీ సంక్షేమ పాఠశాల (బాలికలు)
- ప్రకాశం జిల్లా కొండపి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల (బాలికలు)
- కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల
- విజయనగరం జిల్లా వంగర కేజీబీవీ
- పార్వతీపురం మన్యం జిల్లా హడ్డుబంగి జీటీడబ్ల్యూఏ బాలికల ఉన్నత పాఠశాల

దంచికొట్టి.. దడ పుట్టించి..

- భారీ వర్షాలతో వరంగల్, నల్గొండ జిల్లాలు అతలాకుతలం
- వరంగల్ జిల్లా సంగెంలో అత్యధికంగా 21.8 సెం.మీ.


వరంగల్ రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రాంతంలో నీట మునిగిన రహదారి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధం కావడంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు చాలా జిల్లాల్లో 10 సెంటీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వరంగల్ జిల్లా సంగెం మండలంలో 21.8 సెం.మీ. నమోదైంది. 12 ప్రాంతాల్లో 10.7 సెం.మీ.కి పైగా కురిసింది. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా.. మూడున్నర గంటల పాటు కుండపోత వర్షంతో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 40 కాలనీలు జలమయమయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 73 మండలాల్లో వర్షం కురవగా.. సూర్యాపేట జిల్లా నాగారంలో 19 సెం.మీ వర్షపాతం నమోదైంది. వాగులు పొంగిపొర్లడంతో పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. రానున్న మూడు రోజుల (72 గంటలు) పాటు పలు జిల్లాల్లో భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ 'రెడ్ ఎలర్ట్' ప్రకటించింది.

సంక్షేమాధికారులు వసతి గృహాల తనిఖీలకు వెళ్లాల్సిందే

- ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశాలు
- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: జిల్లా, డివిజన్ స్థాయి సాంఘిక సంక్షేమ అధికారులు నిరంతరం వసతి గృహాలు తనిఖీ చేయాలని ఆ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. అక్కడ అన్ని అంశాలను పరిశీలించి, ఫొటోలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. అడ్మిషన్ల నుంచి హాజరు, పరిశుభ్రత వరకు అన్ని వివరాలు నమోదు కావాల్సిందేనని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల అధికారులతో మంత్రి మంగళవారం విజయవాడలో ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. 'వసతి గృహాల పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సమాచారం సేకరిస్తాం. బదిలీల్లో అధికారుల పనితీరుకు దాన్ని ప్రామాణికంగా తీసుకుంటాం' అని మంత్రి డోలా వివరించారు. గ్రామ సచివాలయాల్లోని ఏఎన్ఎంలను వసతి గృహాలకు మ్యాపింగ్ చేసి, వారు వారానికోసారి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించేలా పర్యవేక్షించాలని సూచించారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఎల్ అండ్ టీ భాగస్వామ్యం

- ఐకానిక్ భవన నిర్మాణంలో సహకారం
- సీవోఈలోనూ కీలక పాత్ర
- వెల్లడించిన సంస్థ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, నిర్వహణలో భాగస్వామ్యం వహించనున్నట్లు ఎల్ అండ్ టీ తెలిపింది. గ్లోబల్ టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సొల్యూషన్స్ కార్యకలాపాలు నిర్వహించే తమ అనుబంధ సంస్థ ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ద్వారా సహకరించనున్నట్లు పేర్కొంది. సంస్థ అనుభవాన్ని క్వాంటమ్ వ్యాలీ నిర్మాణంలో వినియోగిస్తామంది. "క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ఏపీ కేంద్రంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 'క్వాంటమ్ సిస్టం 2'ను ఐబీఎం సంస్థ ఏర్పాటు చేయనుంది. ఏపీ ప్రభుత్వం, ఐబీఎంతో కలిసి ఇందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తాం. అవసరమైన భవనాలు నిర్మిస్తాం. ఐకానిక్ భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. ఈ పార్కులో సాంకేతిక పరిశోధనలకు భాగస్వామ్య సంస్థలతో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) నిర్వహణలో ఎల్‌టీఐ మైండ్‌ట్రీ కీలక పాత్ర పోషిస్తుంది' అని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది.

8 దశాబ్దాల అనుభవం

- తయారీ, సేవలకు సంబంధించి 30 బిలియన్ డాలర్ల విలువైన ఈపీసీ ప్రాజెక్టులను ఎల్ అండ్ టీ నిర్వహిస్తోంది. 8 దశాబ్దాలుగా ప్రధాన వ్యాపారాల్లో ఉత్తమంగా సేవలు అందిస్తోంది.
- గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ సొల్యూషన్స్ కంపెనీగా ఎల్‌టీఐ మైండ్ ట్రీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. డిజిటల్ టెక్నాలజీ వినియోగించి ఆవిష్కరణలను వేగవంతం చేస్తుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ భాగస్వామిగా 700లకు పైగా క్లయింట్‌లకు సాంకేతిక నైపుణ్యాన్ని అందిస్తోంది. 40 దేశాల్లో 83 వేలకు పైగా నిపుణులు సంస్థలో పనిచేస్తున్నారు.

భవిష్యత్తులో క్వాంటమ్ వ్యాలీ ఎందుకు కీలకమంటే..

- క్వాంటమ్, క్లాసికల్ కంప్యూటింగ్‌లో పరిశోధన, అభివృద్ధికి ఇది కేంద్రం.
- విద్యా సంస్థలు, అంకుర సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వానికి మధ్య సహకారం.
- పరిశోధన బృందాలు, పారిశ్రామికవేత్తలకు అవసరమైన కార్యాలయాల ఏర్పాటు.
- కమ్యూనిటీ జోన్‌లు, హాకథాన్‌లు, వర్క్‌షాప్‌లు, సమావేశాలు, ఔట్‌రీచ్‌ల నిర్వహణ.

కంప్యూటింగ్ ఆవిష్కరణకు కేంద్రం

– వేణు లంబు, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సీఈవో, ఎండీ

'అధునాతన కంప్యూటింగ్ ఆవిష్కరణకు ఇది కేంద్రం. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఏర్పాటు చేసే క్వాంటమ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సాంకేతిక పరిశోధన, ఇంక్యుబేషన్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉంటుంది. పారిశ్రామిక, సామాజిక అవసరాలకు అనుగుణంగా అప్లికేషన్లను రూపొందించాలన్నదే లక్ష్యం. జాతీయ క్వాంటమ్ మిషన్‌తో సమన్వయం చేసుకుంటూ అమరావతి క్వాంటమ్ వ్యాలీని ముందుకు తీసుకెళ్తాం'.

మాజీ సైనికుల సంక్షేమానికి రూ.10 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్

- డ్రోన్‌లతో ఉపాధే కాదు.. సమాజ సేవ కూడా చేయాలి
- దేశ సేవ నుంచి పల్లె సేవకు' పథకం ఆవిష్కరణలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ వెల్లడి

ఈనాడు, అమరావతి: మాజీ సైనికులు దేశానికి ఆస్తి అని, వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ తెలిపారు. ఇందులో భాగంగానే రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఏపీ మాజీ సైనికుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయబోతోందని చెప్పారు. మాజీ సైనికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం 'దేశ సేవ నుంచి పల్లె సేవకు' పథకం ఆవిష్కరణ సందర్భంగా మంగళవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకంలో భాగంగా వ్యవసాయ డ్రోన్లను సైనిక సంక్షేమ శాఖ, కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు చెందిన దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ కొలాబరేషన్‌లో మాజీ సైనికులకు సరఫరా చేయనున్నారు. "మాజీ సైనికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించేందుకు నిర్దేశించిన ఈ పథకం కింద తీసుకునే డ్రోన్లతో ఉపాధి పొందడమే కాకుండా సమాజ సేవ చేయాలి" అని విశ్వజీత్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సంచాలకుడు బ్రిగేడియర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. "ఆర్మీ నుంచి తిరిగొచ్చాక ప్రభుత్వ ఉద్యోగం కోసం కాకుండా ఇలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

30 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు

రూ.30 కోట్లతో నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న 30 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (యూపీహెచ్‌సీలు) సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ.కోటి చొప్పున వెచ్చించనుంది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో అర్బన్ పీహెచ్‌సీల వసతులపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 560 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 175 మున్సిపల్ భవనాల్లో, మరో 293 సొంత భవనాల్లో ఉన్నట్లు అధికారులు వివరించారు. నిర్మాణంలో ఉన్న 62 భవనాలు ఈ ఏడాది చివరకు పూర్తవుతాయని వివరించారు. మిగిలిన 30 కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాల్సి ఉందని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం యూపీహెచ్‌సీలకు నిర్మాణానికి మంత్రి ఆమోదం తెలిపారు.



మద్యపానానికి ప్రతిచర్య అధిక స్థాయిలో..

మద్యం తాగినప్పుడు తాత్కాలికంగా ఆనందంలో మునిగి తేలుతున్నట్లు అనిపించొచ్చు. కానీ తర్వాత- అందుకు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా మూల్యం చెల్లించుకోక తప్పదు! చర్యకు ప్రతిచర్య ఉంటుందనేది వాస్తవం. అయితే మద్యపానానికి ప్రతిచర్య చాలా అధిక స్థాయిలో ఉంటుంది.

– రోహిత్ గుప్తా, న్యూట్రిషన్ కోచ్

దేవుడిపై కుట్రలుపన్నే వ్యవస్థలను రూపుమాపాలి

- అందుకు తిరుపతి నుంచే నాంది పలకాలి: పీవీఎన్ మాధవ్


భాజపా నేతలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మాధవ్

ఈనాడు డిజిటల్, తిరుపతి: "దేశంలో వైషమ్యాలు, సంఘర్షణలకు తావులేకుండా ప్రపంచ శాంతి కోసం నడిచే వసుధైక కుటుంబం మనది. ఇప్పుడు దేవుడిపైనా కుట్రలు జరుగుతున్నాయి.. నా దేవుడే నిజమైనవాడు.. నా మార్గంలో నడవకపోతే భూమి మీద ఉండడానికి అర్హత లేదు.. అనే వ్యవస్థలను ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి నుంచే రూపుమాపాలి" అని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తిరుపతి జిల్లాలో పర్యటించారు. కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. తిరుమలలో ఉద్యోగాల్లో ఉన్న అన్యమతస్థులను తొలగించి వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలను చూపాలని తితిదేని కోరారు. వైకాపా ఐదేళ్ల అరాచక పాలనలో పేదల డబ్బులు దోచుకుని.. ఆర్థిక సంఘాల నిధులు సైతం పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, ఎంపీల స్థానాలకే పరిమితమైన భాజపాను స్థానికసంస్థల వరకు తీసుకెళతామన్నారు. నామినేటెడ్ పదవుల్లో కీలక స్థానాలు భాజపా కార్యకర్తలకు దక్కేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో భాజపా నుంచి 10 నుంచి 15 మందితో కూటమి ఏర్పాటుచేసి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి నేడు భూమిపూజ

ఈనాడు, అమరావతి: హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రాజధాని అమరావతిలో అత్యాధునిక క్యాన్సర్ కేర్ క్యాంపస్ ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించిన భూమి పూజ తుళ్లూరు సమీపంలో బుధవారం ఉదయం 10.18 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు నారా బ్రాహ్మణితోపాటు.. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్ తదితరులు, ప్రముఖ వైద్య నిపుణులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొంటారు.

రెండు దశల్లో నిర్మాణం..: రాజధానిలో 21 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న క్యాన్సర్ కేర్ క్యాంపస్‌లో సమగ్ర క్యాన్సర్ చికిత్స, పరిశోధనతోపాటు.. రోగుల సంరక్షణకు ఎక్సలెన్సీ సెంటర్ అందుబాటులోకి తెస్తారు. తొలి దశలో 500 పడకల సామర్థ్యంతో విస్తృత శ్రేణి ఆంకాలజీ సేవలు అందిస్తారు. రూ.750 కోట్ల పెట్టుబడితో మౌలిక సదుపాయాలు, అధునాతన పరికరాలు సమకూరుస్తారు. వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్స తదితర ప్రక్రియలకు ఇంటిగ్రేటెడ్ కేర్ మోడల్‌తో ఏర్పాటుచేసి.. 2028 నాటికి శస్త్రచికిత్సలు ప్రారంభించాలని భావిస్తున్నారు. రెండో దశలో పడకల స్థాయి వెయ్యికి పెంచుతారు. ప్రత్యేక విభాగాలు, పరిశోధన విభాగాల ఏర్పాటు, క్లిష్టమైన, అధునాతన క్యాన్సర్ కేసులకు ప్రాంతీయ రిఫరల్ కేంద్రంగా దీనిని తీర్చిదిద్దుతారు.

ఈనాడు ఫొటోగ్రాఫర్లకు ఏపీపీజేఏ అవార్డులు

ఈనాడు, అమరావతి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయస్థాయి పోటీల విజేతలను మంగళవారం ప్రకటించారు. మొత్తం 28 మంది ఫొటోగ్రాఫర్లకు అవార్డులు, మరో 22 మందికి మెరిట్ సర్టిఫికెట్లు ఈ నెల 19న విజయవాడలో అందజేస్తామని ఏపీపీజేఏ అధ్యక్షుడు సి.హెచ్.వి.ఎస్.విజయభాస్కరరావు తెలిపారు. విజేతల్లో ఐదుగురు 'ఈనాడు' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు, మరో ఐదుగురికి మెరిట్ సర్టిఫికెట్లు వచ్చాయి.

- జనరల్ సెక్షన్ విభాగంలో.. తొలి అవార్డు రాజుషిండే (హిందూస్థాన్ టైమ్స్, ముంబయి), ద్వితీయ అవార్డు మన్వేందర్ వశిష్ట లావ్ (పీటీఐ, దిల్లీ), తృతీయ అవార్డు చల్లా మల్లికార్జునలకు (ఈనాడు, ఒంగోలు) వచ్చాయి.
- ఈ పోటీల్లో స్పాట్‌న్యూస్ విభాగంలో ప్రథమస్థానం కె.ఆర్.దీపక్ (ది హిందూ, వైజాగ్), రెండో స్థానం ఎం.ఎస్.బసవన్న (ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్, మైసూర్), మూడోస్థానం కె.వి.ఎస్.గిరి (ది హిందూ, విజయవాడ)కు వచ్చాయి.
- **ఏపీపీజేఏ ఎచీవ్‌మెంట్ అవార్డులు:** ఫొటో జర్నలిజం విభాగంలో ఈనాడు స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు వై.వి.వి.సత్యనారాయణ (విజయవాడ), ఎం.సంపత్‌కుమార్ (విజయవాడ), కోనసీమ జిల్లాకు చెందిన ఫొటో కంట్రిబ్యూటర్ వి.కె.ఆర్.ఎస్.శర్మకు అవార్డులొచ్చాయి.
- **జనరల్ విభాగంలో ఎచీవ్‌మెంట్ అవార్డు:** సిహెచ్.రాజారమేష్ (కాకినాడ)
- **సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్:** ఫొటో జర్నలిజం విభాగంలో దండా శ్రీనివాస (హైదరాబాద్), హరిగంగాధర్ (తిరుపతి)
- **సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ జనరల్ విభాగం:** ఆవుల శ్రీనివాస్ (హైదరాబాద్), పి.సింహాచలం (ఆదిలాబాద్), సైదేశ్వరరావు (వరంగల్).

హత్య కేసులో దోషి శ్రీకాంత్ పెరోల్ రద్దు

ఈనాడు, నెల్లూరు, అమరావతి: తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ఖైదీ అవిలేె శ్రీకాంత్‌కు జారీ చేసిన 30 రోజుల పెరోల్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. 2007లో ఓ బ్రాందీ షాపు మేనేజరును హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో న్యాయస్థానం శ్రీకాంత్‌కు యావజ్జీవ శిక్ష విధించింది. 2010 అక్టోబరు నుంచి నెల్లూరు కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. 2014 ఫిబ్రవరిలో తప్పించుకుని పారిపోయాడు. నాలుగున్నరేళ్ల తర్వాత 2018 నవంబరులో మళ్లీ లొంగిపోయాడు. తనకు 30 రోజుల పాటు పెరోల్ కావాలంటూ ఈ ఏడాది మే 28న హోంశాఖకు విన్నవించుకున్నాడు. ఉన్నతాధికారులు నిరాకరించినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాంత్‌కు పెరోల్ జారీ చేయటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పెరోల్ రద్దు చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. దీంతో శ్రీకాంత్‌ను పోలీసులు మంగళవారం మళ్లీ జైలుకు తరలించినట్లు సమాచారం.

EENADU Vol: 52, Issue: 4 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఏఐ ఇమేజ్ జనరేటర్లు అత్యంత అద్భుతంగా ఫొటోలు సృష్టిస్తున్నాయి. ఒక్క ప్రాంప్ట్ ఇస్తే చాలు, కోరుకున్న ఇమేజ్‌ను కళ్ల ముందుంచుతున్నాయి. కొందరు వీటిని ఆకతాయి పనులకూ వాడుకుంటున్నారు. అందుకే ఇప్పుడు ఏ ఫొటో కనిపించినా అది అసలుదా? ఏఐ సృష్టించిందా? అనే అనుమానం మనసులో రేగుతోంది. దీన్ని తెలుసుకునేదెలా?



ఏది ఏఐ? ఏది అసలు?

రివర్స్ ఇమేజ్ సెర్చ్‌తో.. అంటే ఫొటోను గూగుల్ ఇమేజెస్‌లో అప్‌లోడ్ చేసి వెతికితే దాన్ని అంతర్జాలంలో ఎక్కడెక్కడ వాడారో తెలుసుకోవటం సాధ్యమే. కానీ ఏఐ టూల్స్ భయంకరంగా తెలివి మీరాయి. ఆ ఇమేజ్ పూర్తిగా కొత్తది కావొచ్చు. దాన్ని వెబ్‌లో ఇంతకుముందెన్నడూ వాడక పోవచ్చు. అప్పుడెలా గుర్తించటం? ఇక్కడే ఏఐ ఫొటోలను గుర్తించే టూల్స్, వెబ్‌సైట్ల అవసరం ఏర్పడుతోంది. ఇవీ కొన్నిసార్లు పొరపాటు పడొచ్చు గానీ చాలావరకూ నకిలీ ఇమేజ్‌లను పట్టుకోవటంలో సాయం చేయగలవు. అలాంటి కొన్ని ఏఐ టూల్స్ ఇవిగో..

డీప్‌ఫేక్-ఓ-మీటర్ (DeepFakeometer)

ఇది ఓపెన్ యాక్సెస్ వేదిక. లాగిన్ అయ్యి, ఉచితంగా వాడుకోవచ్చు. ఇది ఏఐ ఇమేజ్‌లనే కాకుండా ఏఐ వీడియో, ఏఐ ఆడియోలనూ గుర్తించగలదు. ఫొటో లేదా వీడియోను అప్‌లోడ్ చేయగానే దీనిలోని బోలెడన్ని ఏఐ డిటెక్షన్ టూల్స్ రంగంలోకి దిగి, జల్లెడ పడతాయి. అసలుదో, నకిలీదో చెప్పేస్తాయి.

సైట్ఇంజిన్ (Sightengine)

ప్రముఖ ఏఐ జనరేటర్ల ఇమేజ్‌లను ఆటోమేటిగ్గా పసిగట్టటం దీని ప్రత్యేకత. ఎలాంటి వాటర్‌మార్క్స్ అవసరం లేదు. మన కళ్లు గుర్తించలేని డిజిటల్ ట్యాంపరింగ్‌నూ కచ్చితంగా గుర్తిస్తుంది. తప్పుడు సమాచారాన్ని, ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ ఐడీ, మార్కెట్‌ప్లేస్ స్పామ్ వంటి వాటినీ తెలియజేస్తుంది.

హైవ్ మోడరేషన్ (hivemoderation)

ఇది హైవ్ సంస్థకు చెందిన ఏఐ జనరేటెడ్ ఇమేజ్ డిటెక్టర్ టూల్. మెషిన్ లెర్నింగ్ సాయంతో ఏఐ ఇమేజ్, వీడియోలను గుర్తిస్తుంది. ఆ మధ్య పోప్ ఫ్రాన్సిస్ తెల్ల జాకెట్‌లో కనిపించిన ఇమేజ్ నకిలీదని తెలుసుకోవటానికి ప్రముఖ మీడియా సంస్థలు దీన్నే వాడుకున్నాయి.

కళ్లతో చూసి కూడా..

నకిలీ ఇమేజ్‌లను గుర్తించటానికి అన్నిసార్లూ టూల్సే అవసరం లేదు. కళ్లతో చూసీ పోల్చుకోవచ్చు. ఏఐ ఇమేజ్‌లలో కొన్ని చిత్రమైన అంశాలు హెచ్చరికలుగా ఉపయోగపడతాయి.

- ఏఐ ఇప్పటికీ చేతుల విషయంలో ఇబ్బంది పడుతుంది. వేళ్ల సంఖ్య ఎక్కువగా ఉన్నా, గోళ్లు విచిత్రంగా కనిపించినా, ఆకారం చుట్టుపక్కల దృశ్యంలో కలిసి పోతున్నా ఏఐ కావొచ్చని అనుకోవచ్చు.
- సాధారణంగా ఏఐ చెవి దిద్దులు, కనుబొమల వంటివి రెండు వైపులా ఒకేలా ఉండే ముఖాలను సృష్టిస్తుంటుంది. అదే నిజమైన ముఖాల్లో ఇవి కాస్త భిన్నంగా ఉంటాయని తెలుసుకోవాలి.
- నీడలు వ్యతిరేక దిశలో పడుతున్నాయా? ఎలాంటి కాంతి పడకపోయినా వ్యక్తుల ముఖాలు వెలుగుతున్నాయా? అయితే తేడా ఉందనే అర్థం.
- ఇమేజ్ నేపథ్యంలో చిందర వందర అక్షరాలు, విచిత్రమైన వీధి చిహ్నాలు, మళ్లీ మళ్లీ అవే డిజైన్‌లు కనిపిస్తుంటే అసలుది కాకపోయే అవకాశమే ఎక్కువ.
- చర్మం మరీ నునుపుగా, ప్లాస్టిక్ మాదిరిగా కనిపిస్తున్నా అనుమానించాల్సిందే. కాస్త నిశితంగా చూస్తే కల్పితమైందని తెలిసిపోతుంది.

చిన్న చిట్కా: ఏదైనా అనుమానిత కంటెంట్ సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతుంటే మనకెందుకులే అని ఊరుకోవద్దు. మూడు చుక్కల మీద తాకి, రిపోర్టు చేయటం మంచిది. ముఖ్యంగా ఫేస్‌బుక్, ఎక్స్‌లో ఇది మరింత ముఖ్యం. ఇలా నకిలీ కంటెంట్ బాగా వైరల్ కాకముందే అడ్డుకోవచ్చు.

చాట్‌బాట్ తీరే వేరు

చాట్‌జీపీటీ, గ్రాక్, మెటా ఏఐ వంటి చాట్‌బాట్స్ వాడకం రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే కొందరి దైనందిన వ్యవహారాల్లో ఇవి విడదీయలేని భాగమయ్యాయి కూడా. కానీ చాలామందికి ఇవెలా పనిచేస్తాయో తెలియదనే అనుకోవాలి. జూన్, 2024 తర్వాత జరిగిన ఘటనలను వెతకటానికి చాట్‌జీపీటీ మనలాగే అంతర్జాలాన్ని శోధిస్తుందంటే నమ్ముతారా? మనలాగే ఇవీ భ్రాంతులకు లోనవుతాయని ఎందరికి తెలుసు? ఇలాంటి ఆశ్చర్యకర విషయాల గురించి తెలుసుకుంటే చాట్‌బాట్స్ ఎలా పనిచేస్తాయో, అసలవి ఏమేం చేయగలవో, ఏం చేయలేవో బాగా అవగతమవుతుంది. చాట్‌బాట్స్‌ను మరింత సమర్థంగా వాడుకునే తీరూ తెలిసొస్తుంది.



మనుషులతోనే సక్రమంగా..

ఏఐ చాట్‌బాట్స్ మనుషులనే మించి పోతున్నాయని భావిస్తుంటాం గానీ వీటిని సక్రమంగా పనిచేయించేది మనుషులే. ఏఐ చాట్‌బాట్స్‌కు పలు అంచెల్లో శిక్షణ ఇస్తారు. వీటిల్లో ఒకటి **ప్రి-ట్రెయినింగ్**. ఇందులో భారీ సమాచార నిధిలోంచి తర్వాత వచ్చే పదాన్ని అంచనా వేసేలా ఏఐ మోడళ్లకు నేర్పిస్తారు. భాష, నిజానిజాలు, కార్యకారణ సంబంధాలను అర్థం చేసుకోవటానికి ఇదే పునాది వేస్తుంది. నిజానికి ప్రి-ట్రెయినింగ్ దశలో ఏఐ బాట్‌ను సమాజానికి హాని తలపెట్టే అంశాల గురించి (ఉదా: బాంబుల తయారీ) అడిగినా సవివరంగా చెప్పగలదు. కానీ మానవ 'వ్యాఖ్యాతలు' ఇలాంటి ప్రమాదాన్ని తప్పించటానికి సరైన మార్గనిర్దేశం చేస్తారు. ఉపయోగపడే, సురక్షితమైన ప్రతిస్పందనలు అందించేలా తీర్చిదిద్దుతారు. ఈ ప్రక్రియను **అలైన్‌మెంట్** అంటారు. బాంబు తయారీ వంటి ప్రమాదకర విషయాల గురించి అడిగితే చాట్‌బాట్స్ నిరాకరించటానికిదే కారణం. అలైన్‌మెంట్ చేయనట్టయితే అవి అనూహ్యంగా స్పందించి ఉండేవి. తప్పుడు, హానికర సమాచార వ్యాప్తికి కారణమయ్యేవి. అంటే ఏఐ ప్రవర్తనలో మనుషుల జోక్యమే కీలకం అన్నమాట.

నేర్చుకోవటం విభిన్నం

మనం చిన్నప్పటి నుంచే అత్తత్త, తాత్తత్త వంటి ముద్దు ముద్దు పలుకులతోనే మాట్లాడటం మొదలెడతాం. ఆ మాటకొస్తే పదాల ద్వారానే భాషను నేర్చుకుంటాం. కానీ ఏఐ చాట్‌బాట్స్ అలా కాదు. **టోకెన్స్** అనే చిన్న చిన్న భాగాల మీద భాషను నేర్చుకుంటాయి. వీటిల్లో పదాలు, ఉప పదాలు, అస్పష్ట క్యారెక్టర్ల శ్రేణులు ఏవైనా ఈ భాగాల్లో ఉండొచ్చు. ఉదాహరణకు- 'చాట్‌జీపీటీ అద్భుతమైంది' అనే వాక్యం 'చాట్', 'జీ', 'పీటీ', 'అద్భుత', 'మైంది' అనే భాగాలుగా **టోకెనైజేషన్** కావొచ్చు. అంకెలనూ ఇలాగే విభజించుకుంటాయి. ఈ టోకెనైజేషన్ అనేది హేతుబద్ధ విధానాన్ని అనుసరించి సాగుతుంది. ఇది కొన్నిసార్లు అనూహ్య విభజనలకు, చమత్కారాలు, ద్వంద్వార్థాలకూ దారితీయొచ్చు. ఆధునిక ఏఐ చాట్‌బాట్స్ సాధారణంగా 50వేల నుంచి లక్ష టోకెన్లను కలిగుంటాయి.

భ్రాంతులకూ కొదవలేదు

ఏఐ చాట్‌బాట్స్ కొన్నిసార్లు **భ్రాంతి** (హలూసనేషన్)కి గురవుతాయి. చాలా నమ్మకంగా తప్పుడు, అనుచిత సమాచారాన్ని సృష్టిస్తాయి. దీనికి కారణం అవి నిజాలను ధ్రువీకరించుకోవటానికి బదులు **టెక్స్ట్ ఆధారిత ధోరణుల** ఆధారంగా అంచనా వేయటం. చాట్‌బాట్స్ పనిచేసే తీరు మూలంగానే ఇలాంటి తప్పులు దొర్లుతుంటాయి. ఇవి కచ్చితత్వానికి బదులు సమగ్రతకు ప్రాధాన్యమిస్తాయి. అసంపూర్ణ శిక్షణ సమాచారం మీద ఆధారపడతాయి. వీటికి వాస్తవ ప్రపంచ అవగాహన ఉండదు. ఫ్యాక్ట్-చెకింగ్ టూల్స్, ప్రాంప్ట్స్ వంటి వాటితో ఏఐ భ్రాంతులను తగ్గించే అవకాశముంది. అయితే పూర్తిగా నిర్మూలించుకోలేవు. ఉదాహరణకు- ఏదైనా పరిశోధన పత్రంలోని ప్రధాన అంశాల గురించి చాట్‌జీపీటీని అడిగారనుకోండి. సుదీర్ఘంగా, చాలా బాగుందే అనిపించే సమాధానమే ఇస్తుంది. స్క్రీన్‌షాట్స్, లింక్‌లనూ జోడిస్తుంది. కానీ వాటిల్లో తప్పుడు పరిశోధన పత్రాలూ ఉండొచ్చు. అందువల్ల ఏఐ సృష్టించిన దాన్ని అవగాహన సమాచారంగానే పరిగణించాలి. అదే సత్యమని, కొట్టిపారేయలేమని భావించొద్దు.

వెబ్ సెర్చ్ సాయంతో

ఏఐ చాట్‌బాట్స్ నిరంతరం తమకు తాము అప్‌డేట్ కావు. వీటిని అప్‌డేట్ చేయటం చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఇది చాలా సున్నితమైన ప్రక్రియ. అందువల్ల తాజా సంఘటనల విషయంలో బాట్స్ ఇబ్బంది పడొచ్చు. శిక్షణ కోసం వాడుకున్న సమాచారం చివరిసారి ఎప్పుడు అప్‌డేట్ అయిన దాన్ని బట్టి చాట్‌బాట్స్‌కు గల జ్ఞానం ఆధారపడి ఉంటుంది. దీన్నే **నాలెడ్జ్ కటాఫ్** అంటారు. దీనికి ఆవలి ఘటనలు, ఆవిష్కరణలు, ధోరణుల విషయాల మీద చాట్‌బాట్స్‌కు అవగాహన ఉండదు. చాట్‌జీపీటీ తాజా వర్షన్ కటాఫ్ జూన్, 2024. అందువల్ల దీన్ని ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు ఎవరని దీన్ని అడిగితే బింగ్ సెర్చింజన్ సాయంతో అంతర్జాలాన్ని వెతుకుతుంది. ఆ ఫలితాలను చదివి, సోర్స్‌ల విశ్వసనీయత, సమంజసత్వాన్ని జల్లెడ పడుతుంది. చివరికి సమాధానం చెబుతుంది. ఇతర ఏఐ చాట్‌బాట్స్ సైతం వెబ్ సెర్చ్ సాయంతో నిత్యనూతన సమాధానాలు ఇస్తుంటాయి. చాట్‌బాట్స్ జ్ఞానాన్ని సమర్థంగా ఎలా అప్‌డేట్ చేయాలనేది ఇప్పటికీ సవాల్‌గానే నిలుస్తోంది. ఓపెన్ ఏఐ కొత్త చాట్‌జీపీటీ వర్షన్ల రూపంలో చాట్‌జీపీటీ జ్ఞానం అప్‌డేట్ అవుతుందని భావిస్తున్నారు.

అంతర్గత రీజనింగ్

ఇటీవల ఏఐ చాట్‌బాట్స్ బాగా ఆదరణ పొందటానికి ఒక కారణం **రీజనింగ్** ఫీచర్. ఇది సంక్లిష్ట సమస్యలను పరిష్కరించటానికి ఉపయోగపడుతోంది. రీజనింగ్ అనేది హేతుబద్ధంగా అనుసంధానమైన అంతర్గత అంచెల ద్వారా సాగుతుంది. దీన్నే **చెయిన్ ఆఫ్ థాట్ రీజనింగ్** అనీ పిలుస్తారు. చాట్‌బాట్స్ అంచెలంచెలుగా ఆలోచించటానికిది వీలు కల్పిస్తుంది. ఉదాహరణకు- 5,600-600×7,000=? అని చాట్‌బాట్‌ను అడిగితే సరిగ్గా సమాధానం చెబుతుంది. తీసివేతకు ముందు గుణకారం చేయాలనే సంగతి దానికి తెలుసు. ఇందుకు చాట్‌జీపీటీ తనలో ఇన్‌బిల్ట్‌గా ఉన్న కాలిక్యులేటర్ సాయం తీసుకుంటుంది. ఇలా తమలోని రీజనింగ్‌ను, కాలిక్యులేటర్‌తో అనుసంధానం చేయటం ద్వారా సంక్లిష్ట పనుల్లో విశ్వసనీయతను మెరుగుపరచుకుంటుందన్నమాట.

ప్రతి పాస్‌వర్డూ ప్రత్యేకమే

ఆన్‌లైన్‌లో ఎన్ని ఖాతాలుంటే అన్నింటికీ ప్రత్యేకమైన, వేర్వేరు పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాల్సిందే. వీటిని సెట్ చేసుకోవటం, గుర్తుంచుకోవటం కష్టమైనా సరే. ఒకే పాస్‌వర్డ్‌ను అన్నింటికీ వాడటం ఎట్టి పరిస్థితుల్లోనూ మంచిది కాదు. ఎందుకంటే ఒక పాస్‌వర్డ్ హ్యాకర్ల చేతికి చిక్కిందంటే అన్ని ఖాతాలనూ యాక్సెస్ చేయగలరు. ఇది తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. పాస్‌వర్డ్ కఠినంగా ఉండేలా చూసుకోవటమూ తప్పనిసరి. పెద్ద, చిన్న అక్షరాలు, అంకెలు, సింబల్స్‌తో కూడిన కనీసం 16 క్యారెక్టర్ల పాస్‌వర్డ్‌ను నిర్ణయించుకోవాలి. వీటన్నింటినీ ఎక్కడ గుర్తుంచుకుంటామని భావిస్తే పాస్‌వర్డ్ మేనేజర్ సాయం తీసుకోవచ్చు.



నిమిషంలో ఆందోళన పరార్

బాగా ఆందోళన చెందుతున్నారా? అయితే గూగుల్ బ్రౌజర్ ఓపెన్ చేసి "breathing exercise" అని టైప్ చేసి ఎంటర్ చేయండి. వెంటనే తెర మీద ఒక నిమిషం గైడ్ వీడియో ప్రత్యక్షమవుతుంది. తెల్ల చుక్క పెద్దగా అవుతున్నంత సేపు (బ్రెత్ ఇన్) సేపు శ్వాస తీసుకోండి. చిన్నగా అవుతున్నంత సేపు (బ్రెత్ అవుట్) శ్వాస వదలండి. ఇలా దీర్ఘంగా శ్వాస తీసుకోవటం వల్ల పారాసింపథెటిక్ నాడీవ్యవస్థ ప్రేరేపితమై, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఇతరత్రా యాప్స్‌తో పని లేకుండానే నిమిషంలో ఆందోళన తగ్గించుకోవచ్చు.



ఒప్పో కొత్త టర్బో ఫోన్లు

ఒప్పో సంస్థ గేమింగ్ ఫోన్ల శ్రేణిలో కే13 టర్బో ప్రొ, కే13 టర్బో పరికరాలను పరిచయం చేసింది. కే13 టర్బో ప్రొ ముఖ్యమైన ఫీచర్లు ఇవీ.. 6.8 అంగుళాల ఎల్‌టీపీఎస్ ఎమోలెడ్ తెర, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 1,600 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, వెనకాల రెండు కెమెరాలు (50ఎంపీ ప్రైమరీ షూటర్, 2ఎంపీ సెన్సర్), ముందు 16ఎంపీ షూటర్, 7,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 80డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్.



ఇది ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఒప్పో కలర్ ఓఎస్ 15, స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. కే13 టర్బోలోనూ దాదాపు ఇవే ఫీచర్లుంటాయి. కాకపోతే మీడియాటెక్ డైమెన్సిటీ 8450 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. పరికరాలను చల్లగా ఉంచటానికి వీటిల్లో ఇన్‌బిల్ట్ ఫ్యాన్ వ్యవస్థ కూడా ఉంది. కే13 టర్బో ప్రొ ప్రారంభ ధర రూ.37,999. ఆగస్టు 15 నుంచి అమ్మకాలు మొదలవుతాయి. కే13 టర్బో ప్రారంభ ధర రూ. 27,999. ఇవి రెండూ ఐపీఎక్స్9 రేటింగ్‌తో వస్తుండటం గమనార్హం. 1.5 మీటర్ల లోతు నీటిలో 30 నిమిషాల సేపు మునిగినా వీటి లోపలికి నీరు చేరదు.

లావా నుంచి మరో బ్లేజ్

దేశీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీ లావా తమ బ్లేజ్ సిరీస్‌లో కొత్త బడ్జెట్ ఫోన్‌ను తీసుకొచ్చింది. పేరు లావా బ్లేజ్ ఎమోలెడ్ 2. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.67 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ+ ఎమోలెడ్ డిస్‌ప్లే, 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 33డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్, ఐపీ64 రేటింగ్, మీడియాటెక్ డైమెన్సిటీ 7060 చిప్‌సెట్, 6జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ, అదనంగా 6జీబీ వర్చువల్ ర్యామ్ సపోర్టు, వెనకాల 50 ఎంపీ కెమెరా, ముందు 80 ఎంపీ కెమెరా వంటి ఫీచర్లతో అలరిస్తోంది. దీనికి ఒకసారి ఆండ్రాయిడ్ ఓఎస్ అప్‌గ్రేడ్, రెండేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుతాయి. మిడ్‌నైట్ బ్లాక్, వైట్ ఫెదర్ రంగుల్లో లభించే దీని ధర రూ. 13,499. ఆగస్టు 16 నుంచి అమ్మకాలు ప్రారంభం.



స్మార్ట్‌ఫోనే మౌజ్

స్మార్ట్‌ఫోన్‌నూ డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లకు వైర్‌లెస్ మౌజ్‌గా ఉపయోగించుకోవచ్చని తెలుసా? కాకపోతే ఇందుకు రిమోట్ మౌజ్ యాప్ సాయం అవసరం. ఇది వై-ఫై లేదా బ్లూటూత్ ద్వారా కంప్యూటర్‌ను ఫోన్‌తో అనుసంధానం చేస్తుంది. అప్పుడు ఫోన్ టచ్‌స్క్రీన్ ఓ కాల్పనిక ట్రాక్‌ప్యాడ్‌గా మారుతుంది. పీసీకి వై-ఫై, బ్లూటూత్ సపోర్టు ఉండాలి. దీన్ని ఎలా సెట్ చేసుకోవాలంటే?




- ఆండ్రాయిడ్ యూజర్లు బ్లూటూత్ కీబోర్డ్ అండ్ మౌజ్, యూనిఫైడ్ రిమోట్ వంటి రిమోట్ మౌజ్ యాప్స్. ఐఫోన్ వాడేవారు రిమోట్ మౌజ్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాక అది బ్లూటూత్ లేదా వై-ఫై యాక్సెస్‌ను అడుగుతుంది. దీనికి అనుమతిస్తే కంప్యూటర్, ఫోన్ మధ్య అనుసంధానానికి వీలు కల్పిస్తుంది.
- ఫోన్ యాప్ నుంచి కంప్యూటర్‌ను గుర్తించొచ్చు. లేదా కంప్యూటర్ బ్లూటూత్ సెటింగ్స్ ద్వారానైనా ఫోన్‌ను గుర్తించొచ్చు.
- రెండూ కనెక్ట్ కాగానే ఫోన్ తెర మీద ట్రాక్‌ప్యాడ్ ప్రత్యక్షమవుతుంది. దీన్ని కర్సర్‌ను మూవ్ చేయటానికి, క్లిక్, స్క్రోలింగ్, మీడియా ప్లే వంటి పనులకు వాడుకోవచ్చు.
- పైన కుడిమూలన ఉండే చక్రం గుర్తు మీద క్లిక్ చేసి యాప్ సెటింగ్స్‌ను ఇష్టమైనట్టుగా మార్చుకోవచ్చు కూడా. అక్కడి నుంచి పాయింటర్ వేగాన్ని సవరించుకోవచ్చు. క్లికింగ్ చప్పుడును ఆఫ్ చేయొచ్చు. కావాలనుకుంటే కీబోర్డు మోడ్‌నూ మార్చుకోవచ్చు.

వాట్సప్ మరింత భద్రంగా

ఏదో పనిలో ఉంటారు. హఠాత్తుగా ఫోన్ రింగ్ అవుతుంది. ఎవరో మిమ్మల్ని విచిత్రమైన పేర్లతో కూడిన గ్రూప్‌లో చేరుస్తారు. ఎవరు అందులో చేర్చారో తెలియదు. ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే మెసేజ్‌లు రావటం మొదలవుతాయి. ఇది నిజంగానే ఇబ్బంది కలిగిస్తుంది కదా. ఇలాంటి పరిస్థితిని తప్పించటానికే వాట్సప్ సేఫ్టీ ఓవర్‌వ్యూ అనే కొత్త ఫీచర్‌ను తీసుకొస్తోంది.

సేఫ్టీ ఓవర్‌వ్యూ చేసే ప్రధానమైన పని- మీ కాంటాక్ట్స్‌లో సేవ్ చేసుకోని వారు మిమ్మల్ని నేరుగా గ్రూప్‌లో చేర్చకుండా చూడటం. ఇలాంటివారు మిమ్మల్ని గ్రూప్‌లో చేర్చటానికి ప్రయత్నిస్తే ఆహ్వానిస్తున్నవారెవరో తెర మీద చూపిస్తుంది. ఆ గ్రూప్ ఎప్పుడు క్రియేట్ అయ్యింది? అందులో ఎంతమంది ఉన్నారు? అనేవీ కనిపిస్తాయి. అది మీకు నచ్చకపోతే చాట్ ఓపెన్ చేయకుండానే తేలికగా క్విట్ అవ్వచ్చు. ప్రస్తుతం మోసం చేసే గ్రూపులెన్నో పుట్టుకొస్తున్నాయి. ఈ సంవత్సరం తొలి ఆర్నెళ్లలోనే మోసాలతో ముడిపడిన 68 లక్షల ఖాతాలను వాట్సప్ తొలగించింది. అయినా మోసాలు ఆగటం లేదు. ఉద్యోగాలు, పెట్టుబడులు, త్వరగా డబ్బు సంపాదన ఎరలతో కొన్ని గ్రూప్‌లు బురిడీ కొట్టిస్తున్నాయి. ప్రజల నుంచి డబ్బులు కాజేసి, పత్తాలేకుండా పోతున్నాయి. ఈ నేపథ్యంలో సేఫ్టీ ఓవర్‌వ్యూ మంచి రక్షణ అని చెప్పుకోవచ్చు. గ్రూప్‌లో చేరటానికి ముందు మరోసారి ఆలోచించుకోవటానికిది అవకాశం కల్పిస్తుంది.



- వాట్సప్ మరో రక్షణ ఫీచర్‌నూ పరీక్షిస్తోంది. ఇది కాంటాక్ట్స్ జాబితాలో లేనివారు మీకు మెసేజ్ పంపిస్తే వారి ప్రొఫైల్ పిక్చర్, పేరు (పబ్లిక్ అయితే) వంటి వివరాలను చూపిస్తుంది. ఆ మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చిందో కూడా తెలియజేస్తుంది. అపరిచితుల మెసేజ్‌లకు స్పందించటానికి ముందే జాగ్రత్త పడటానికిది తోడ్పడుతుంది.


మూడు అంచెల జాగ్రత్త

వాట్సప్ తేలికైన మూడు అంచెల జాగ్రత్త తీసుకోవాలనీ సూచిస్తోంది. అవే పాజ్, క్వశ్చన్, వెరిఫై. అపరిచిత మెసేజ్‌ల విషయంలో తొందరపడొద్దు. కాసేపు ఆలోచించుకోవాలి. ఆ మెసేజ్ విశ్వసనీయమైనదేనా? దాన్ని పంపించినవారు స్నేహితుడిననో, కుటుంబ సభ్యుడిననో అంటున్నారా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. ఒకవేళ వారు తెలిసినవారేనని నిజంగా అనిపిస్తే వారికి కాల్ చేసి, మరోసారి ధ్రువీకరించుకోవాలి.

- వాట్సప్ ప్రైవసీ సెటింగ్స్‌నూ సమీక్షించుకోవటమూ మంచిదే. గ్రూప్‌లో మిమ్మల్ని ఎవరు యాడ్ చేయొచ్చో మీరే నిర్ణయించుకోవచ్చు. అజ్ఞాత, యాదృచ్ఛిక చాట్స్‌లోకి మిమ్మల్ని లాగకుండా ముందే నిలువరించొచ్చు. టూ-స్టెప్- వెరిఫికేషన్ కూడా అదనపు భద్రత కల్పిస్తుంది.
- ఎలాంటి అనుమానం వచ్చినా మనకెందుకులే అని తేలికగా తీసుకోవద్దు. బ్లాక్ చేయటంతో పాటు రిపోర్టు చేయాలి కూడా. ఈ చిన్న పని ముమ్ముందు ఇబ్బందులు పడకుండా కాపాడుతుంది.

ఐడియా చెబితే చాలు
కామిక్ కథ అల్లేస్తుంది!

గూగుల్ తమ జెమినీ యాప్‌లో ఓ సరికొత్త ఫీచర్ జతచేసింది. పేరు **స్టోరీబుక్**. ఏఐ-జనరేటెడ్ ఆర్ట్, ఆప్షనల్ ఆడియో నరేషన్ సాయంతో యూజర్ల ఆలోచనలను కథలుగా మలచటం దీని ప్రత్యేకత. ఈ ఫీచర్‌ను వాడుకోవటం చాలా తేలిక. మీరు రచయిత గానీ చిత్రకారుడు గానీ కావాల్సిన అవసరం లేదు. వినోదభరితమైన ఐడియాను టైప్ చేసి.. వాటర్‌కలర్, కామిక్ బుక్, క్లేమేషన్, పిక్సెల్ ఆర్ట్‌లలో ఏదో ఒక స్టైల్‌ను ఎంచుకుంటే చాలు. మిగిలిన పనంతా జెమినీయే చేసి పెడుతుంది. ఇచ్చిన ఐడియాను రంగురంగుల బొమ్మలతో కూడిన 10 పేజీల కథ లేదా కామిక్‌గా మార్చేస్తుంది. కావాలనుకుంటే సవరణలు చేసుకోవచ్చు. కథలను సేవ్ చేసుకోవచ్చు, షేర్ చేసుకోవచ్చు. యాప్ మీ భాషను సపోర్టు చేసినట్టయితే కథను పెద్దగా చదివి వినిపిస్తుంది కూడా. ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటి మీదా స్టోరీబుక్ ఫీచర్ పనిచేస్తుంది.




తల్లిదండ్రులు, పిల్లల కోసమే

కథలు చెప్పటాన్ని ఇష్టపడే వారిని దృష్టిలో పెట్టుకునే స్టోరీబుక్ ఫీచర్‌ను రూపొందించారు. పడుకునే సమయంలో పిల్లలకు కథలు చెప్పటానికి తల్లిదండ్రులు దీన్ని వాడుకోవచ్చు. పిల్లలు గీసిన బొమ్మలను గానీ పిల్లల ఫొటోలను గానీ అప్‌లోడ్ చేసినా స్టోరీబుక్ దాని చుట్టూ కథ అల్లగలదు. ఇలా మామూలు ఘటనలను మరపురాని సంఘటనలుగా మలచగలదు. ప్రస్తుతానికిది ఆంగ్ల భాషలోనే అందుబాటులో ఉంది. త్వరలో మరిన్ని భాషలకు విస్తరించనున్నారు. అధికారికంగా 18 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసు గలవారే వాడుకోవాలి. పిల్లలకు కథలు చెప్పటానికి ఇప్పటికే దీన్ని ఎంతోమంది ఉపయోగిస్తున్నారు. చాలా ఏఐ టూల్స్ మాదిరిగానే స్టోరీబుక్ కూడా కొన్ని తప్పులు చేసే అవకాశం లేకపోలేదు. కానీ చాలావరకూ బాగానే కథలు అల్లుతోంది. ముఖ్యంగా వినోద భరితమైన, మనసుకు హత్తుకునే కథలను బాగా అందిస్తోంది.

ఫోన్ సెన్సర్ల మాయాజాలం

నేటి స్మార్ట్‌ఫోన్లలో బోలెడన్ని సెన్సర్లుంటాయి. ఇవి ఆటోమేటిక్ స్క్రీన్ రొటేషన్, ఫిట్‌నెస్ ట్రాకింగ్ వంటి రకరకాల పనులకు తోడ్పడతాయి. మరి ఏ సెన్సర్ దేనికి ఉపయోగపడుతుందో మీకు తెలుసా?



- **యాక్సెలోమీటర్:** పరికరం వేగాన్ని, దిశలు మారటాన్ని గుర్తిస్తుంది.
- **గైరోస్కోప్:** వృత్తాకార కదలికలను, భ్రమణ వేగాన్ని లెక్కిస్తుంది.
- **మ్యాగ్నెటోమీటర్:** అయస్కాంత క్షేత్రాలను పసిగడుతుంది. వాటిని దిక్సూచి, నావిగేషన్‌కు వాడుకుంటుంది.
- **యాంబియెంట్ లైట్ సెన్సర్:** ఆటోమేటిక్‌గా స్క్రీన్ ప్రకాశాన్ని సరిచేస్తుంది.
- **ప్రాగ్జిమిటీ సెన్సర్:** కాల్ చేస్తున్నప్పుడు ఫోన్‌కు దగ్గరగా ఉన్న వస్తువులను గుర్తిస్తుంది.
- **ఇమేజ్ సెన్సర్:** పలు కెమెరాలను వాడుకొని ఫొటోలు, వీడియోలు గ్రహిస్తుంది.
- **టైమ్-ఆఫ్-ఫ్లైట్ సెన్సర్:** పొట్రెయిట్ మోడ్ కోసం దూరాన్ని లెక్కిస్తుంది.
- **ఫింగర్‌ప్రింట్ సెన్సర్:** భద్రత ధ్రువీకరణకు ఉపయోగపడుతుంది.
- **హార్ట్ రేట్ సెన్సర్:** గుండె కొట్టుకునే వేగాన్ని పర్యవేక్షిస్తుంది.
- **ఎస్‌పీఓ2 సెన్సర్:** రక్తంలో ఆక్సిజన్ మోతాదులను లెక్కిస్తుంది.
- **థర్మోమీటర్:** పరికరం ఉష్ణోగ్రతను గమనిస్తుంది.
- **బారోమీటర్:** వాతావరణంలో పీడనాన్ని లెక్కిస్తుంది.
- **మైక్రోఫోన్ అరే:** ఆడియోను రికార్డు చేస్తుంది. నాయిస్ క్యాన్సెలేషన్‌కు వీలు కల్పిస్తుంది.

ఎక్కువ సెన్సర్లుంటే ఫోన్ బాగా పనిచేస్తుందా?

ఫోన్ సమర్థంగా పనిచేయటానికి ఎక్కువ సెన్సర్లు ఉండాల్సిన అవసరమేమీ లేదు. కానీ ఎక్కువ సెన్సర్లుంటే ఎక్కువ ఫీచర్లు లభిస్తాయి. కచ్చితత్వమూ మెరుగవుతుంది. అంటే సెన్సర్ల సంఖ్య కన్నా వీటి కచ్చితత్వం, సమన్వయంతోనే ఫోన్ సామర్థ్యం ఆధారపడి ఉంటుందన్నమాట.

ఈనాడు బిజినెస్

నాట్కో ఫార్మా ఆదాయం రూ.1,390 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: నాట్కో ఫార్మా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.1,390.6 కోట్ల ఆదాయంపై రూ.480.3 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.1,410.7 కోట్లు, నికర లాభం రూ.668.5 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 2.47శాతం, నికర లాభం 28.09 శాతం తగ్గాయి. త్రైమాసిక ఈపీఎస్ రూ.26.84గా ఉంది. అమెరికా మార్కెట్లలో ధరల ఒత్తిడి, పరిశోధన, అభివృద్ధి కోసం ఖర్చులు, దీర్ఘకాలిక వృద్ధి కోసం పెట్టుబడులు పెంచడంతో లాభాల క్షీణతకు కారణమయ్యిందని కంపెనీ వివరించింది. రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.2 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ఆమోదించినట్లుగా తెలిపింది. దీనికి రికార్డు తేదీ ఆగస్టు 19గా నిర్ణయించింది.

గ్రాన్యూల్స్ లాభం రూ.112.6 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఉత్తర అమెరికా మార్కెట్‌లో అమ్మకాలు పెరగడంతో హైదరాబాద్‌కు చెందిన గ్రాన్యూల్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.1,210 కోట్ల ఆదాయం, రూ.112.6 కోట్లు నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.1,179.9 కోట్లు, నికర లాభం రూ.134.6 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఆదాయం 3 శాతం వృద్ధి చెందింది. లాభం 16 శాతం క్షీణించింది. నికర అప్పులు రూ.948 కోట్లుగా ఉన్నాయి. తొలి త్రైమాసికంలో పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కోసం రూ.68 కోట్లు కేటాయించింది. ఐపటీ హైదరాబాద్‌లో పెప్టైడ్ అభివృద్ధి కోసం కొత్త ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ త్రైమాసికంలో రూ.280.6 కోట్ల నగదును సాధించామని సంస్థ ఛైర్మన్, ఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి వెల్లడించారు.

హిందాల్కో లాభంలో 30% వృద్ధి


దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో హిందాల్కో ఇండస్ట్రీస్ ఏకీకృత నికర లాభం రూ.4,004 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.3,074 కోట్లతో పోలిస్తే ఇది 30 శాతం అధికం. కార్యకలాపాల ద్వారా ఆదాయం సైతం 13% పెరిగి రూ.57,013 కోట్ల నుంచి రూ.64,232 కోట్లకు చేరింది. కంపెనీ ఎండీ సతీశ్ పాయ్ మాట్లాడుతూ '2024-25 రికార్డు లాభదాయకత అనంతరం హిందాల్కో తన వృద్ధిని కొనసాగించింది. కార్యకలాపాల సామర్థ్యం, వ్యయ నియంత్రణ, ఉత్పత్తుల విస్తరణతో తొలి త్రైమాసికంలో బలమైన పనితీరును నమోదు చేసింద'న్నారు.

కర్ణాటక బ్యాంక్ లాభం రూ.290 కోట్లు

దిల్లీ: కర్ణాటక బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.290 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కిందటేడాది ఇదే సమయంలోని రూ.400 కోట్లతో పోలిస్తే 27% క్షీణత నమోదు చేసినట్లయింది. మొత్తం ఆదాయం రూ.2,557 కోట్ల నుంచి రూ.2620 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 3.54% నుంచి 2.82 శాతానికి పరిమితమైంది. స్థూల నిరర్థక ఆస్తులు 3.54% నుంచి 3.46 శాతానికి; నికర నిరర్థక ఆస్తులు లేదా మొండి బకాయిలు 1.66% నుంచి 1.44 శాతానికి తగ్గాయి.

అంబానీలు @ రూ.28 లక్షల కోట్లు

- దేశంలోనే అత్యంత విలువైన కుటుంబ వ్యాపారం వీరిదే
- తర్వాతి స్థానంలో బిర్లా, జిందాల్‌లు
- హురున్- బార్‌క్లేస్ నివేదిక



ముంబయి: దేశంలోనే అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల జాబితాలో ముకేశ్ అంబానీ కుటుంబం రూ.28 లక్షల కోట్ల విలువతో అగ్రస్థానంలో నిలిచిందని హురున్ నివేదిక వెల్లడించింది. బార్‌క్లేస్‌తో కలిసి ఈ నివేదికను వెలువరించారు. అదానీ కుటుంబ సంపద రూ.14.01 లక్షల కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపు కావడం విశేషం. అత్యంత విలువైన 300 భారతీయ కుటుంబాల మొత్తం సంపద 1.6 లక్షల కోట్ల డాలర్లు (రూ.140 లక్షల కోట్లు)గా ఉంది. మన దేశ జీడీపీ కంటే ఇది 40 శాతం అధికం. దేశ జీడీపీలో అంబానీ కుటుంబ వాటా ఒక్కటే 12 శాతంగా ఉంది. గతేడాదితో పోలిస్తే అంబానీ కుటుంబ సంపద 10 శాతం వృద్ధి చెందడంతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. తొలి తరం ప్రారంభించిన అత్యంత విలువైన కుటుంబ వ్యాపారంగా అదానీలు నిలిచారు.

✦ కుమార మంగళం బిర్లా కుటుంబ సంపద 20% పెరిగి రూ.6.47 లక్షల కోట్లకు చేరింది. దీంతో ఒక స్థానం మెరుగుపడి రెండో స్థానానికి చేరారు.

✦ జిందాల్ కుటుంబం మూడో స్థానానికి ఎగబాకింది. వీరి సంపద 21% పెరిగి రూ.5.70 లక్షల కోట్లుగా ఉంది.

✦ బజాజ్ కుటుంబం నాలుగో స్థానానికి పడిపోయింది. వీరి సంపద 21% తగ్గి రూ.5.64 లక్షల కోట్లుగా నమోదైంది.

రోజుకు రూ.7100 కోట్ల సంపాదన!: దేశంలో అగ్రగామి 300 కుటుంబాలు గతేడాది రోజుకు రూ.7100 కోట్ల సంపద సృష్టించాయి. 1 బి.డాలర్ల (దాదాపు రూ.8,700 కోట్లు)కు పైగా సంపద కలిగిన కుటుంబాల సంఖ్య 37 నుంచి 161కు పెరిగింది. ఇందులో నాలుగో వంతు వ్యాపారాలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుకాలేదు.

✦ 91 ధనిక కుటుంబాలతో ముంబయి అగ్రస్థానంలో నిలిచింది. దిల్లీ-ఎన్‌సీఆర్ (62), కోల్‌కతా (25) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో మొదటి తరం కుటుంబ వ్యాపారాలు

స్థానం	వ్యాపార సంస్థ	విలువ (రూ.కోట్లలో)	వ్యవస్థాపకులు
3	దివీస్ లేబొరేటరీస్	1,80,000	దివి కె.మురళి
5	అపోలో హాస్పిటల్స్	1,04,200	ప్రతాప్ సి.రెడ్డి
6	జీఎంఆర్	98,300	గ్రంధి మల్లికార్జునరావు
7	ఎమ్ఈఐఎల్	85,300	పీపీ రెడ్డి
20	కిమ్స్	27,000	బొల్లినేని భాస్కరరావు

బహుళ తరాల కుటుంబ వ్యాపారాలు

స్థానం	వ్యాపార కుటుంబం	సంస్థ	సంపద (రూ.కోట్లలో)
22	ప్రసాద్ కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	1,02,200
104	ప్రసాద్, దేవినేని కుటుంబాలు	నవ	17,200
115	రెడ్డి కుటుంబం	మేధా సర్వోడ్రైవ్స్	14,900
116	రాజు కుటుంబం	ఎన్‌సీసీ	14,500
121	దాట్ల కుటుంబం	బయోలాజికల్ ఇ	13,100
143	రావు కుటుంబం	అవంతీ ఫీడ్స్	10,000
157	కేశవరెడ్డి కుటుంబం	అరాజెన్ లైఫ్‌సైన్సెస్	8,400
205	రాజు కుటుంబం	ఎస్ఏసీఎల్ ఇండస్ట్రీస్	4,400
243	గుప్తా కుటుంబం	డీఈసీ ఇన్‌ఫ్రా	3,200
269	రావు కుటుంబం	కేఎంవీ ప్రాజెక్ట్స్	2,100

అపోలో హాస్పిటల్స్ లాభంలో 42% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: వైద్య రంగంలోని అపోలో హాస్పిటల్స్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.433 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలోని రూ.305 కోట్లతో పోలిస్తే ఇది 42% అధికం. 2024-25 ఏప్రిల్- జూన్‌లో ఆదాయం రూ.5,086 కోట్లు ఉండగా, ఈసారి 15% వృద్ధితో రూ.5,842 కోట్లకు చేరింది. పార్క్‌వే హెల్త్‌కేర్ (మారిషస్) నుంచి అపోలో గ్లెనీగల్స్ పెట్-సీటీ ప్రైవేట్ లిమిటెడ్‌లో 50% వాటాను రూ.8.5 కోట్లకు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. రాబోయే అయిదేళ్ల కాలంలో 4,300 పడకలను అదనంగా తీసుకొస్తామని, దీనికోసం రూ.7,600 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టబోతున్నట్లు అపోలో హాస్పిటల్ ఎంటర్‌ప్రైజ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి తెలిపారు. విడతలవారీగా తొలి దశలో 2000 పడకలకు సంబంధించిన పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయన్నారు. బెంగళూరు నగర శివార్లలో కొత్తగా 500 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ ఆసుపత్రుల్లో కొత్తగా 160 పడకలను జత చేయబోతున్నట్లు తెలిపారు. గచ్చిబౌలిలో ఏర్పాటు చేయబోతున్న ఆసుపత్రితో కలిపి నగరంలో మొత్తం 1,400 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు.

హెచ్‌యూఎల్ ఐస్‌క్రీమ్ వ్యాపార విభజనకు వాటాదార్ల అనుమతి

దిల్లీ: ఐస్‌క్రీమ్ వ్యాపారాన్ని విభజించి, స్వతంత్ర నమోదిత సంస్థగా ఏర్పాటు చేసేందుకు వాటాదార్లు అనుమతి ఇచ్చినట్లు హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) తెలిపింది. ప్రస్తుతం హెచ్‌యూఎల్ ఐస్‌క్రీమ్ వ్యాపార విభాగం చేతిలో క్వాలిటీ వాల్స్, కార్నెటో, మ్యాగ్నమ్ బ్రాండ్లు ఉన్నాయి. వాటాదార్ల అనుమతితో ఐస్‌క్రీమ్ వ్యాపారాన్ని విభజించాలన్న కంపెనీ లక్ష్యానికి మరో అడుగు చేరువైంది. హెచ్‌యూఎల్ ఐస్‌క్రీమ్ వ్యాపార విభజన ప్రణాళికకు అనుకూలంగా 99.99% మంది వాటాదార్లు ఓటేశారని కంపెనీ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ విభజన ప్రక్రియను కంపెనీ పూర్తి చేయనుంది. అనంతరం ఎక్స్ఛేంజీల్లో కొత్త సంస్థ షేర్లు నమోదుకానున్నాయి.

ఫార్మా ఉత్పత్తుల రవాణాలోకి సెల్సియస్ లాజిస్టిక్స్

ఈనాడు, హైదరాబాద్: ఫార్మా ఉత్పత్తులను రవాణా చేసేందుకు సెల్సియస్ ప్లస్‌ను ప్రారంభించినట్లు సెల్సియస్ లాజిస్టిక్స్ తెలిపింది. ఇందుకోసం రూ.50 కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టినట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ స్వరూప్ బోస్ తెలిపారు. ఫార్మా సంస్థల అవసరాలను తీర్చేందుకు వీలుగా ఔషధాలు, వ్యాక్సిన్లు, ఇతర ఉత్పత్తులను తగిన శీతలీకరణ పద్ధతుల్లో, సురక్షితంగా రవాణా చేస్తామని తెలిపారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా 100 కొత్త వాహనాలను తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక నైపుణ్యాలున్న 30-40 మంది సిబ్బందినీ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రాణాలను కాపాడే ఔషధాలను సమయానుకూలంగా డెలివరీ ఇచ్చే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. రాబోయే 18 నెలల్లో ఈ విభాగం నుంచి రూ.100 కోట్ల మేరకు ఆదాయం సాధించాలని అంచనా వేస్తున్నట్లు వివరించారు.

తిరుమల, విశాఖలో వీఐ 5జీ సేవలు

ఈనాడు, హైదరాబాద్: వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు వీలుగా తిరుమల, విశాఖపట్నంలో 5జీ సేవలను ప్రారంభించినట్లు టెలికాం సంస్థ వీఐ(వొడాఫోన్ ఐడియా) తెలిపింది. ఈ నగరాల్లో 5జీ ఆధారిత మొబైల్ ఉన్న వీఐ వినియోగదారులు ప్రారంభ ఆఫర్ కింద రూ.299 నుంచి మొదలయ్యే ప్లాన్లను వాడుకోవచ్చని తెలిపింది. దేశవ్యాప్తంగా తమకు 17 సర్కిళ్లలో 5జీ స్పెక్ట్రం ఉందని పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 5జీ సేవలను క్రమంగా విస్తరిస్తున్నామని వీఐ బిజినెస్ హెడ్ దీపక్ రావు వెల్లడించారు.

రెయిన్‌బో చేతికి ప్రతీక్షలో 76% వాటా

ఈనాడు, హైదరాబాద్: పిల్లల వైద్య చికిత్స సేవలను అందించే రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ (ఆర్‌సీఎంఎల్) గువాహటిలోని ప్రతీక్ష హాస్పిటల్‌లో 76 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.171 కోట్లను చెల్లించనుంది. సంస్థ దగ్గరున్న నగదు నిల్వలు, అంతర్గత ఆదాయాలను దీనికోసం కేటాయించనున్నట్లు తెలిపింది. ప్రతీక్షలో నియంత్రిత వాటాను కొనుగోలు చేసినట్లు, ఆ ఆసుపత్రి ప్రమోటర్లు డాక్టర్ ప్రమోద్ కుమార్ శర్మ అతని కుటుంబం మిగిలిన వాటాలతో కొనసాగుతారని వెల్లడించింది. ప్రతీక్ష రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌గా అది కొనసాగనుంది. ఇందులో 150 పడకలున్నాయి. ప్రస్తుతం 100 అందుబాటులో ఉండగా, మిగిలినవి మరో నెలలో సిద్ధం అవుతాయి. దీంతో రెయిన్‌బో ఆసుపత్రి 21 నగరాల్లో సుమారు 2,185 పడకల సామర్థ్యానికి చేరుకుంటుంది. అస్సాంతో పాటు, ఈశాన్య భారతంలో విస్తరించేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని రెయిన్‌బో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ కంచర్ల తెలిపారు.

8 ఏళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం



దిల్లీ: కూరగాయలు, పప్పు ధాన్యాలు సహా ఆహార పదార్థాల ధరలు తగ్గడంతో వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటెయిల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జులైలో 1.55 శాతానికి దిగివచ్చింది. ఇది దాదాపు 8 ఏళ్ల కనిష్ఠస్థాయి. 2017 జూన్‌లో నమోదైన 1.46% తర్వాత ఇదే తక్కువ. 2025 జూన్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండగా, గత ఏడాది జులైలో 3.6 శాతంగా నమోదైంది. 2019 జనవరి తర్వాత మొట్టమొదటిసారిగా ఆర్‌బీఐ లక్ష్యమైన 2% దిగువకు ద్రవ్యోల్బణం వచ్చింది. జాతీయ గణాంకాల కార్యాలయం వివరాల ప్రకారం..

✦ జులైలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం -1.76 శాతంగా ఉంది. 2019 జనవరి తర్వాత ఆహార ద్రవ్యోల్బణానికి ఇదే కనిష్ఠ స్థాయి.

✦ 'జులైలో రిటెయిల్ ద్రవ్యోల్బణం, ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. సానుకూల ప్రాతిపదిక ప్రభావం(బేస్ ఎఫెక్ట్)తో పాటు పప్పులు, రవాణా, కమ్యూనికేషన్, కూరగాయలు, తృణధాన్యాలు, విద్య, గుడ్లు, పంచదారల్లో ద్రవ్యోల్బణం తగ్గింది' అని ఎన్ఎస్ఓ వెల్లడించింది.


✦ గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణ రేటు 1.18% కాగా.. పట్టణ ప్రాంతాల్లో 2.05%. అస్సాంలో అత్యంత తక్కువగా 0.61%, కేరళలో ఎక్కువగా 8.89% ద్రవ్యోల్బణం నమోదైంది.

కోడి గుడ్లు

13న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	520
గోదావరి	510
విశాఖపట్నం	515
చిత్తూరు	548

అధిక రిఫండ్‌లతో తగ్గిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు



దిల్లీ: అధిక రిఫండ్‌ల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు 11 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024-25 ఇదే సమయంలోని రూ.6.91 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి 3.95% తక్కువ అని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

✦ ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 11 మధ్య నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.2.29 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వ్యక్తిగత, హెచ్‌యూఎఫ్ తదితర కార్పొరేటేతర పన్ను వసూళ్లు రూ.4.12 లక్షల కోట్లుగా ఉన్నాయి. సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూ.22,362 కోట్ల మేర వసూలైంది.


✦ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా జారీ అయిన నికర రిఫండ్‌లు 10% పెరిగి రూ.1.35 లక్షల కోట్లకు చేరుకోవడం విశేషం.

✦ స్థూల వసూళ్లు (రిఫండ్‌లకు ముందు) రూ.7.99 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.8.14 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి 1.87% తక్కువ.

✦ 2025-26లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.25.20 లక్షల కోట్లకు చేరొచ్చని ప్రభుత్వం అంచనా వేసింది.

ట్రంప్ సుంకాలతో దీర్ఘకాలంలో భారత్‌కు లాభమే

యూనియన్ ఏఎంసీ ఎండీ, సీఈఓ మధు నాయర్



ఈనాడు, హైదరాబాద్: చరిత్రలో అప్పుల భారంతో ఉన్న రాజ్యాలన్నీ ఏదో ఒక దశలో ఇబ్బందిని ఎదుర్కొన్నాయని, అమెరికా విషయంలో ఇది మరోసారి రుజువు అవుతోందని యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (యూనియన్ ఏఎంసీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మధు నాయర్ అన్నారు. ట్రంప్ విధించిన సుంకాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా కాస్త బలహీనం అయ్యే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. ఇదే సమయంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు దీర్ఘకాలంలో లాభదాయకమని అభిప్రాయపడ్డారు. స్వల్పకాలంలో మన ఈక్విటీ మార్కెట్లలో హెచ్చుతగ్గులు, అనిశ్చితి తప్పదని తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి రాబోతున్న 'యూనియన్ డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ యాక్టివ్ ఎఫ్ఓఎఫ్' పథకంపై మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం అమెరికా 36 ట్రిలియన్ డాలర్ల రుణ భారంతో ఉంది. వడ్డీ భారం పెరుగుతోంది. దీన్ని ఎదుర్కోవడం ఆ దేశానికి సవాలుగా మారింది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు డాలర్ విలువను తగ్గించడం లేదా ఆర్థిక సంస్కరణలు అవసరం. వీటిని హఠాత్తుగా చేయడం సాధ్యం కాదు' అని వివరించారు. తయారీ రంగాన్ని తిరిగి అమెరికాకు తరలించడం అంత తేలిక కాదని, ప్రపంచీకరణతో చైనా, భారత్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తయారీకి కేంద్రంగా మారాయని చెప్పారు. అమెరికాలో ఉన్న అధిక కార్మిక వ్యయాల కారణంగా అక్కడ తయారీని పెంచేందుకు వ్యాపారవేత్తలు ఆసక్తి చూపించకపోవచ్చని తెలిపారు. దీనివల్ల దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పెట్టుబడులు పెరుగుతాయి..

ట్రంప్ విధానాల వల్ల కొత్త వాణిజ్య ఒప్పందాలు, భాగస్వామ్యాలు ఏర్పడేందుకు అవకాశాలున్నాయని మధు నాయర్ తెలిపారు. ఫలితంగా భారత్ వంటి దేశాలకు పెట్టుబడులు పెరుగుతాయన్నారు. బలమైన దేశీయ మార్కెట్ లాభాలతో భారత్ వేగవంతమైన ఆర్థిక వృద్ధి కొనసాగుతుందని తెలిపారు. మొత్తం జీడీపీలో అమెరికా ఎగుమతులు తక్కువగా ఉండటమూ కలిసొచ్చే అంశంగా పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో మన దేశంతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే భారత్‌లో పెట్టుబడులు పెరుగుతాయన్నారు.

11–12 శాతం రాబడి..

స్వల్పకాలంలో మార్కెట్లు కాస్త దిద్దుబాటుకు లోనైనప్పటికీ, దీర్ఘకాలంలో మంచి ఫలితాలు కనిపిస్తాయన్నారు. ఈక్విటీల్లోకి మ్యూచువల్ ఫండ్లు, ఎన్‌పీఎస్, ఈపీఎఫ్ఓ తదితర మార్గాలతోపాటు, రిటెయిల్ పెట్టుబడులు కలిసి నెలకు రూ.50వేల కోట్ల వరకూ వస్తున్నాయని తెలిపారు. మార్కెట్ 10% తగ్గినా, వెంటనే పుంజుకుంటుందని వివరించారు. విదేశీ పెట్టుబడిదారులూ భారత్‌ను విస్మరించలేరని పేర్కొన్నారు. మార్కెట్ ప్రస్తుతం 'ఫెయిర్ వాల్యూ'లో ఉందని, రాబోయే అయిదేళ్ల కాలంలో 11-12% రాబడులు ఆశించవచ్చని తెలిపారు. పెట్టుబడిదారులు క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా తమ మదుపును కొనసాగించాలన్నారు.

కోల్‌కతాలో కంట్రోల్‌ఎస్ కేంద్రం



ఈనాడు, హైదరాబాద్: డేటా కేంద్రాలను నిర్వహించే కంట్రోల్‌ఎస్ కోల్‌కతాలోకి అడుగు పెట్టింది. బెంగాల్ సిలికాన్ వ్యాలీలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించింది. తూర్పు భారతదేశంలో డిజిటల్ వ్యవస్థ వృద్ధికి ఇది ఎంతో తోడ్పడుతుందని సంస్థ పేర్కొంది. ఈ ప్రాంతంలో ఇది తొలి రేటెడ్-4 డేటా సెంటర్ అని తెలిపింది. ఇది మొదటి దశలో 16ఎండబ్ల్యూ ఐటీ లోడ్ సామర్థ్యాన్ని అందిస్తుంది. గిరాకీకి అనుగుణంగా 60ఎండబ్ల్యూకి సామర్థ్యాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు ఉన్నాయని తెలిపింది. ఈ డేటా కేంద్రంపై ఎంత పెట్టుబడి పెట్టిన విషయం వెల్లడించలేదు. తూర్పు భారతంలో అత్యాధునిక డేటా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు దశలవారీగా రూ.2,200 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు సంస్థ సీఈఓ శ్రీధర్ పిన్నపురెడ్డి తెలిపారు.

పీడబ్ల్యూసీలో 20,000 ఉద్యోగాలు



దిల్లీ: వచ్చే అయిదేళ్లలో తన సిబ్బంది సంఖ్యను 20,000కు పైగా పెంచుకుని 50,000కు చేర్చాలన్న ప్రణాళికలో ఉన్నట్లు పీడబ్ల్యూసీ ఇండియా పేర్కొంది. 2030 ప్రణాళికలను ప్రకటిస్తూ ఆ మేరకు తెలిపింది. ఇందులో భాగంగా వచ్చే అయిదేళ్లలో ఆదాయ వృద్ధిని మూడింతలు చేయడంపై దృష్టి పెట్టింది. ఇందుకోసం వార్షిక ఆదాయాల్లో 5 శాతం కంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా డిజిటలీకరణ, క్లౌడ్, సైబర్‌భద్రత, సస్టెయినబులిటీ, రిస్క్-రెగ్యులేటరీ తదితర కీలక వ్యాపార విభాగాలను బలోపేతం చేసుకోనుంది.

ముంబయి- ఫుకెట్‌కు సర్వీసులు ప్రారంభించనున్న ఆకాశ ఎయిర్



దిల్లీ: సెప్టెంబరు 20 నుంచి ముంబయి-ఫుకెట్ (థాయ్‌లాండ్)కు నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఆకాశ ఎయిర్ తెలిపింది. అంతర్జాతీయ సేవల నెట్‌వర్క్‌ను విస్తరించే క్రమంలో ఆగ్నేయాసియా విపణిలో అడుగుపెట్టడమే దీని వెనక సంస్థ ఉద్దేశంగా తెలుస్తోంది. ఆకాశ ఎయిర్‌కు ఫుకెట్ ఆరో విదేశీ గమ్యస్థానం. ప్రస్తుతం దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుదాబి (యూఏఈ), కువైట్ సిటీ (కువైట్)లకు ఆకాశ ఎయిర్ విమాన సర్వీసులను నడుపుతోంది.

ముంబయి- తాష్కెంట్, అల్మటీకి ఇండిగో సర్వీసులు: ముంబయి నుంచి నేరుగా తాష్కెంట్ (ఉజ్బెకిస్థాన్), అల్మటి (కజకిస్థాన్) విమాన సర్వీసులను సెప్టెంబరు నుంచి ప్రారంభించనున్నట్లు ఇండిగో తెలిపింది. మధ్య ఆసియాకు చెందిన ఈ రెండు నగరాలకు వారానికి నాలుగు చొప్పున విమాన సర్వీసులను నడపనుంది.

ఒడుదొడుకుల మధ్య నష్టాలు



సెన్సెక్స్ ▼368 80236 | నిఫ్టీ ▼98 24487

బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ప్రభావం

ఎఫ్ఐఐ అమ్మకాలు: రూ.3398.8 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.3507.93 కోట్లు

బ్యాంకుల షేర్లు డీలా పడటంతో మన స్టాక్ మార్కెట్ నష్టాన్ని నమోదుచేసింది. దేశీయ, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు మదుపర్ల అప్రమత్తత కూడా ఇందుకు కారణమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు పెరిగి 87.63 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడి చమురు 0.65% నష్టంతో 66.18 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్, చైనా సూచీలు లాభపడగా, దక్షిణ కొరియా మార్కెట్ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.83,000 కోట్లు తగ్గి రూ.443.30 లక్షల కోట్లు (5.06 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

ఒడుదొడుకుల మధ్య

సెన్సెక్స్ ఉదయం 95 పాయింట్ల (క్రితం ముగింపు 80,604) నష్టంతో 80,508 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆ వెంటనే లాభాల్లోకి వచ్చిన సూచీ 80,997.67 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. మళ్లీ కాసేపటికే నష్టాల్లోకి జారుకొని ఒడుదొడుకుల మధ్య కదలాడింది. చివరకు 368.49 పాయింట్ల నష్టంతో 80,235.59 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 97.65 పాయింట్లు తగ్గి 24,487.40 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,465.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 24,702.60 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

11 కంపెనీల షేర్లకే లాభాలు..

సెన్సెక్స్ 30 షేర్లలో 11 మినహా మిగతావన్నీ నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా బజాజ్ ఫైనాన్స్ షేరు 2.87% నష్టపోయింది. అలాగే ట్రెంట్ 1.46%, హెచ్‌యూఎల్ 1.39%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.31%, ఎటెర్నల్ 1.10%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.02% మేర తగ్గాయి. మరోవైపు మారుతీ సుజుకీ షేరు 2.02%, టెక్ మహీంద్రా 1.87%, ఎం అండ్ ఎం 1.64%, ఎన్‌టీపీసీ 1.16%, టాటాస్టీల్ 0.85%, సన్ ఫార్మా 0.58%, టైటాన్ 0.52% మేర పెరిగాయి.

✦ హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన రోజే అదరగొట్టాయి. బీఎస్ఈలో ఇష్యూ ధరతో (రూ.70) పోలిస్తే 67.14 శాతం అధికంగా రూ.117 వద్ద నమోదైంది. చివరకు 75.48 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ అయిన రూ.122.84 వద్ద ముగిసింది.

✦ బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టయిల్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు రెండో రోజు ముగిసేనాటికి 65 శాతం స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,65,14,421 షేర్లను విక్రయానికి ఉంచగా.. 1,07,81,214 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. రిటైల్ మదుపర్ల నుంచి 73 శాతం స్పందన లభించింది.

✦ పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు సంబంధిత ముసాయిదా పత్రాలను సెబీకి పవరికా లిమిటెడ్ సమర్పించింది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా రూ.1,400 కోట్లను సమీకరించాలని కంపెనీ అనుకుంటోంది. ఇష్యూలో భాగంగా రూ.700 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.700 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు.

✦ భారత్‌లో ఖరీదైన ట్యాబెట్లను స్థానికంగా తయారు చేసి సరఫరా చేసేందుకు భగవతి ప్రోడక్ట్స్‌తో చైనా స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వన్‌ప్లస్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా వన్‌ప్లస్ ప్యాడ్ 3, వన్‌ప్లస్ ప్యాడ్ లైట్‌ను భారత్‌లో తయారు చేయనున్నారు.

✦ బ్రిటన్‌కు చెందిన ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మైనింగ్ అండ్ మెటల్స్ (ఐసీఎంఎం)లో చేరిన తొలి భారతీయ కంపెనీగా హిందుస్థాన్ జింక్ నిలిచింది. పర్యావరణహిత లక్ష్య సాధనలో పరిశ్రమ సహకారాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో ప్రముఖ గనులు, లోహ కంపెనీలతో ఐసీఎంఎంను ఏర్పాటు చేశారు.

✦ ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్‌గా కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆర్‌బీఐ అనుమతి లభించినట్లు పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ తెలిపింది.

✦ ఏఎన్‌కే హోటల్స్, ప్రైడ్ హాస్పిటాలిటీలో నియంత్రిత వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు టాటా గ్రూప్‌నకు చెందిన ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ తెలిపింది. దీంతో హోటల్ పోర్ట్‌ఫోలియో 55000 గదులతో 550 ఆస్తులను అధిగమించనున్నట్లు వెల్లడించింది.

✦ కోహాన్స్ లైఫ్ సైన్సెస్ హైదరాబాద్‌లో కొత్త సీజీఎంపీ ఒలిగోన్యూక్లియోటైడ్ బిల్డింగ్ బ్లాక్ తయారీ కోసం రూ.23 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది.

✦ అమెరికా అనుబంధ సంస్థ ఎన్‌జే బయోలో బయోకాంజుగేషన్ సామర్థ్యాల విస్తరణ కోసం 10 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.87.6 కోట్లు) వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టనున్నట్లు కోహాన్స్ లైఫ్‌సైన్సెస్ తెలిపింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ఎన్‌హెచ్‌పీసీ	1131.16	1101.63	3,442.76	3,037.92
ఆయిల్ ఇండియా	2,046.51	2,016.30	----	----
నజారా టెక్నాలజీస్	51.30	23.62	498.77	250.00
డిష్‌టీవీ	(94.53)	(1.56)	329.36	455.29
ఆల్కెమ్ లేబొరేటరీస్	664.00	---	3,371.00	---
ఎన్ఎస్‌డీఎల్	82.60	66.60	190.40	156.50
స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్	(4.19)	(23.00)	387.98	323.15
వీనస్ పైప్స్ అండ్ ట్యూబ్స్	24.80	27.50	276.40	240.00
ఎమ్ఆర్ఎఫ్	500.00	571.00	7,676.00	7,196.00
నైకా	24.47	13.64	2164.27	1753.44
సుజ్లాన్ ఎనర్జీ	324.32	302.29	3,165.19	2,044.35

ఈనాడు సినిమా

సినీ కార్మికుల సమ్మెతో తెలుగు చిత్రసీమలో క్లాప్ బోర్డుల చప్పుళ్లు వినిపించడం లేదు. చిత్రీకరణలన్నీ ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. కానీ, సినీప్రియులకు వినోదాలకు లోటు లేదన్నట్లుగానే బాక్సాఫీస్ బరిలో కొత్త చిత్రాల సందడి కనిపిస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటికే ఓసారి ప్రేక్షకుల్ని పలకరించిన కథానాయకులు సైతం.. ఈ ద్వితీయార్ధంలో మరో మారు వినోదాల విందు వడ్డించేందుకు సిద్ధమవుతుండటం ఇటు ప్రేక్షకుల్లోనూ అటు మార్కెట్ వర్గాల్లోనూ జోష్‌ను నింపుతోంది. మరి రెండోసారి బాక్సాఫీస్ బరిలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్న ఆ తారలెవరు?

మరో మారు.. వినోదాల జోరు


బాలకృష్ణ

సంక్రాంతికి ఒకటి.. దసరాకి మరొకటి అంటూ అగ్ర కథానాయకులు వరుస చిత్రాలతో బాక్సాఫీస్ బరిలో సందడి చేస్తుంటే ప్రేక్షకులకు అంతకంటే కావాల్సిందేముంటుంది. మార్కెట్ వర్గాలు కోరుకునేది కూడా ఇదే. ఇలా అగ్ర హీరోలు ఏడాదికి ఒకటికి రెండు చిత్రాలతో వినోదాలు పంచుతుంటే పరిశ్రమలోనూ నూతనోత్తేజం కనిపిస్తుంటుంది. కానీ, ఇలాంటి మ్యాజిక్‌లు ఈరోజుల్లో మరీ అరుదైపోయాయి. స్టార్ హీరోలంతా కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తుండటం.. దీనికి తగ్గట్లుగానే ఒప్పుకున్న సినిమాలు కూడా ఏళ్లకు ఏళ్లు సెట్స్‌పైనే ఉండటంతో వాళ్ల నుంచి ఏడాదికి ఒక్క చిత్రం చూడటమే గగనమైపోతుంది. కానీ, ఈ ఏడాది కొందరు అగ్ర హీరోలు రెండేసి చిత్రాలతో బాక్సాఫీస్ బరిలో సందడి చేస్తుండటం ఇటు ప్రేక్షకుల్లోనూ అటు మార్కెట్ వర్గాల్లోనూ జోష్‌ను నింపుతోంది. ఈ సంవత్సరం సంక్రాంతికి 'డాకు మహారాజ్'గా థియేటర్లలో జోరు చూపించారు నందమూరి బాలకృష్ణ. ఇప్పుడాయన దసరా బరిలో 'అఖండ 2: తాండవం'తో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు. విజయవంతమైన 'అఖండ'కు సీక్వెల్‌గా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న మాస్ యాక్షన్ కథతో ఈ చిత్రం ముస్తాబవుతోంది. తొలి భాగంలో లాగే బాలయ్య ఇందులో రెండు పాత్రల్లో కనువిందు చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర గ్లింప్స్.. అందులో అఘోరాగా బాలయ్య చేసిన విన్యాసాలు ప్రేక్షకుల్ని విశేషంగా అలరించాయి. దీంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. మరి ఆ అంచనాల్ని అందుకుంటూ బాలకృష్ణ ఈ ఏడాది మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంటారో లేదో తెలియాలంటే సెప్టెంబరు 25 వరకు వేచి చూడక తప్పదు.


నాగార్జున

నాగ్.. విలనిజం

కథానాయకుడు నాగార్జున కెరీర్‌లో ఈ 2025 ప్రత్యేకంగా నిలవనుంది. ప్రస్తుతం వైవిధ్యభరితమైన పాత్రలతో అలరించేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్న ఆయన.. ఈ సంవత్సరంలో వరుసగా రెండు చిత్రాల్లో ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లో కనువిందు చేయడం విశేషం. ఈ జూన్‌లో ఆయన 'కుబేర'తో ప్రేక్షకుల్ని పలకరించిన సంగతి తెలిసిందే. నాగ్ అందులో దీపక్‌గా గ్రే షేడ్‌తో సాగే పాత్రలో అలరించారు. ఇక ఇప్పుడు 'కూలీ' కోసం పూర్తి స్థాయి ప్రతినాయక పాత్రలో విలనిజం చూపించేందుకు సమాయత్తమవుతున్నారు. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. నాగార్జున దీంట్లో సైమన్‌గా రజనీని ఢీ కొట్టే విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 14న రానుంది. ఈ సినిమాలో ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తుండటం మరో విశేషం.


పవన్ కల్యాణ్

విజయమే లక్ష్యంగా పవన్..

కథానాయకుడు పవన్ కల్యాణ్ రాజకీయాలతో తీరిక లేకుండా గడపడం వల్ల గతేడాది ఒక్క చిత్రాన్నీ ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేకపోయారు. కానీ, ఈ ఏడాది మాత్రం ఒకటికి రెండు చిత్రాలతో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే ఆయన 'హరి హర వీరమల్లు'గా వెండితెరపై సందడి చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ఓజీ'తో దసరా బరిలోకి దిగనున్నారు పవన్. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. గ్యాంగ్‌స్టర్ డ్రామా కథతో ముస్తాబైన ఈ సినిమాలో ఓజాస్ గంభీర అనే శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు పవన్. మరి ఆయన చేసే యాక్షన్ హంగామా సినీప్రియుల్ని ఏమేర అలరిస్తుందో తెలియాలంటే సెప్టెంబరు 25వరకు వేచి చూడక తప్పదు.


సిద్ధు

కుర్రాళ్లు వస్తున్నారు..

ఈ ఏడాది ఆరంభంలో 'జాక్' రూపంలో సిద్ధు జొన్నలగడ్డకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. దీంతో ఇప్పుడు రెండో ప్రయత్నంగా 'తెలుసు కదా'తో బాక్సాఫీస్ బరిలో అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. నీరజ కోన దర్శకత్వంలో ముస్తాబైన ఈ రొమాంటిక్ డ్రామా ప్రస్తుతం నిర్మాణాంతర పనుల్లో ఉంది. ఈ అక్టోబరు 17న థియేటర్లలోకి రానుంది. గతేడాది దీపావళికి 'క'తో థియేటర్లలో మెరుపులు మెరిపించారు కిరణ్ అబ్బవరం. కానీ, ఈ ఏడాది ఆరంభంలో వచ్చిన 'దిల్ రూబా'తో ఆ జైత్ర యాత్రను కొనసాగించలేకపోయారు. దీంతో ఇప్పుడు మరోసారి దీపావళి బరిలోనే అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు 'కె-ర్యాంప్'తో సిద్ధమయ్యారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ కూడా అక్టోబరు 17నే ప్రేక్షకుల్ని పలకరించనుంది. ఇక ఈ ఏడాది ఇప్పటికే 'రాబిన్ హుడ్', 'తమ్ముడు' చిత్రాలతో సినీప్రియుల్ని పలకరించిన నితిన్‌కు. రెండూ చేదు ఫలితాల్నే అందించాయి.

పార్కింగ్ దర్శకుడితో విక్రమ్!


విక్రమ్

తమిళ కథానాయకుడు విక్రమ్ తదుపరి రెండు చిత్రాలు ఇప్పటికే ఖరారయ్యాయి. ఆయన 63వ సినిమాని మడోన్ అశ్విన్, 64వ చిత్రాన్ని ప్రేమ్ కుమార్ తెరకెక్కించనున్నారు. ఇప్పుడివి ఇంకా పూర్తి కాకముందే 65వ ప్రాజెక్ట్‌పైనా చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. 'పార్కింగ్' సినిమాతో జాతీయ స్థాయిలో మెరిశారు దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్. ఇప్పుడాయన విక్రమ్‌తో ఓ సినిమా చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇదే చియాన్ 65వ చిత్రంగా పట్టాలెక్కనున్నట్లు తెలిసింది. ఈ ఏడాది చివర్లో దీనిపై ప్రకటన వెలువడే అవకాశముంది. రామ్ కుమార్ ప్రస్తుతం శింబుతో ఓ చిత్రం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇది పూర్తయ్యాకే విక్రమ్ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తోంది.

డొక్కా సీతమ్మ కథతో..


సముద్ర, శివిక

సముద్ర, శివిక, కుసుమ, సుప్రియ ప్రధాన పాత్రధారులుగా సురేశ్ లంకలపల్లి తెరకెక్కించిన చిత్రం 'అన్నపూర్ణ తల్లి బువ్వమ్మ'. సిరాజ్, ఖాదర్ గోరి నిర్మించారు. రూపేశ్, ఆదిల్, నవీన్ మట్టా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో గుమ్మడికాయ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "డొక్కా సీతమ్మ లాంటి స్ఫూర్తిదాయక వ్యక్తుల కథలు తప్పకుండా జనాలకు తెలియాలి. ఇటువంటి ఆదర్శవంతమైన చిత్రాలే నేటి సమాజానికి అవసరం" అన్నారు. "డొక్కా సీతమ్మ జీవిత కథే ఈ సినిమా. ఇందులో నేను సీతమ్మ భర్త పాత్రను పోషించడం నా అదృష్టం" అన్నారు దర్శకుడు వి.సముద్ర. "మేము చాలా మంచి చిత్రం తీశాం. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాం" అన్నారు దర్శకుడు సురేశ్. ఈ కార్యక్రమంలో శివిక, సిరాజ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన రేకెత్తించేలా యూనివర్సిటీ – దర్శకుడు త్రివిక్రమ్

"కొన్ని విషయాల్ని ఆర్.నారాయణమూర్తి చెబితేనే వింటారు ప్రేక్షకులు. ఎందుకంటే డబ్బు కోసమో లేదంటే విజయం కోసమో కాకుండా నిజంగా ప్రజలకి తెలియాల్సిన విషయాన్నే చెబుతుంటారు. అలాంటి అంశాలు ఉంటాయనే ఆయన తీసిన సినిమాల్ని అందరం చూస్తాం, గౌరవిస్తాం" అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమా ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. ఆర్.నారాయణమూర్తి ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకనిర్మాణంలో రూపొందించిన చిత్రమిది.


త్రివిక్రమ్, ఆర్.నారాయణమూర్తి

ఈనెల 22న మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగానే ఈ సినిమా ప్రత్యేక ప్రదర్శనని ఏర్పాటు చేశారు. సినిమా ప్రదర్శన అనంతరం త్రివిక్రమ్ మీడియాతో మాట్లాడారు. "యూనివర్సిటీ పేపర్‌లీక్ సినిమా ప్రారంభం కావడానికి ముందు రెండున్నర గంటలు చూడాలా అని భయపడ్డాను కానీ, ఆలోచింపజేసే అంశాలతో పరుగులు పెట్టించారు ఆర్.నారాయణమూర్తి. నారాయణమూర్తి మరిన్ని సినిమాలు తీయాలంటే ఇలాంటి సినిమాలు బతకాలి. ఎన్నో సూపర్‌హిట్ సినిమాలు తీశారు. ఆయన్ని నా సినిమాలో ఓ పాత్ర కోసం అనుకున్నా. పారితోషికం ఆశచూపించి ఆర్.నారాయణమూర్తికి కొనలేరని ఎవరో చెప్పారు. ఆయన శైలిలో ఆయనొక సూపర్‌స్టార్. తర్వాత సినిమాకి మరింత ఎక్కువ ఖర్చు పెట్టి తీయడానికి అవకాశం కలిగేలా ఈ చిత్రానికి పెద్ద విజయం దక్కాలని కోరుకుంటున్నా. విద్యార్థుల భవిష్యత్ కోసమని వారి వర్తమానాన్ని తాకట్టు పెట్టే తల్లిదండ్రుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుందీ చిత్రం. మనం చదువుతో వచ్చే విజయం వెనకాల పరుగులు పెడుతున్నామా లేక, జ్ఞానం వెనకాలా? జ్ఞానం వెనకాల పరిగెడుతుంటే... అది మనకు ఆనందాన్ని ఇవ్వాలి కానీ, ఇంత నొప్పి ఎందుకు వస్తుంది. మనల్ని కన్నవాళ్లకి ఎందుకు ఇంత కష్టాన్ని ఇస్తుంది? పిల్లలమీద ఎందుకు అంత ఒత్తిడి పెట్టేస్తున్నాం? అనే విషయాలు ఈ సినిమాలో నాకు బాగా నచ్చాయి" అన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ "విద్యని ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేయాలి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని చెప్పే చిత్రమిది" అన్నారు.

కొత్తగా 43 మంది పరిచయం


కల్యాణ్

కొత్తతరం నటులు కల్యాణ్, ప్రియాపాల్, సోఫియా ఖాన్, ఊహారెడ్డి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'మానిప్యులేటర్'. వీజే సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనే రవిసాగర్‌తో కలిసి నిర్మిస్తున్నారు. 'ఏ స్టార్ ఈజ్ బార్న్'గా సెట్స్‌పైకి వెళ్లిన ఈ చిత్రానికి 'మానిప్యులేటర్' అనే పేరుని ఖరారు చేశారు. ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ చేతులమీదుగా మంగళవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కంటెంట్ ప్రధానంగా సాగే సినిమాలవైపు ప్రేక్షకులు మొగ్గు చూపిస్తున్నారు. బలమైన కంటెంట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందుతుందని ఆశిస్తున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "పాత్ర ప్రధానంగా, పక్కా కమర్షియల్ సినిమాగా రూపొందుతున్న చిత్రమిది. 43 మంది కొత్త నటులు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. కథ, కథనాలు ప్రేక్షకుల్ని మెప్పిస్తాయి. త్వరలోనే పాటల విడుదల వేడుకని నిర్వహిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్.

నిజమైన ప్రేమ ఒకరితోనే!


జాన్వీ కపూర్

రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్ జంటగా తెరకెక్కిన చిత్రం 'పరమ్ సుందరి'. తుషార్ జలోటా దర్శకత్వం వహించగా దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో కేరళ అమ్మాయిగా జాన్వీ, దిల్లీ అబ్బాయిగా సిద్ధార్థ్ సందడి చేశారు. అంతేకాదు ఈ ట్రైలర్‌లో "ఈ ప్రపంచంలో కోట్లాది ప్రజలు ఉన్నారు. కానీ నిజమైన ప్రేమ ఒకరితోనే ఉంటుంది"అంటూ సిద్ధార్థ్, "కేరళ మలయాళం మోహన్ లాల్, తమిళనాడు తమిళ్ రజనీకాంత్, ఆంధ్ర తెలుగు అల్లు అర్జున్, కర్ణాటక కన్నడ యష్"అంటూ జాన్వీ చెప్పిన డైలాగ్‌లు ఆకట్టుకున్నాయి. అందమైన ప్రకృతి దృశ్యాల నడుమ నాయకానాయికల ప్రేమ ప్రయాణం..కామెడీని పంచుతున్న సన్నివేశాలతో ట్రైలర్ ఆద్యంతం అలరించేలా సాగింది.

సైకలాజికల్ డ్రామా రావు బహదూర్


సత్యదేవ్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' చిత్రాలతో పేరు తెచ్చుకున్న వెంకటేశ్ మహా దర్శకుడిగా తెరకెక్కుతున్న చిత్రం... 'రావు బహదూర్'. సత్యదేవ్ ప్రధాన పాత్రధారి. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎ ప్లస్ ఎస్ మూవీస్ సంస్థలపై చింతా గోపాలకృష్ణారెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర నిర్మిస్తున్నారు. ఓ రాజవంశం నేపథ్యంలో సాగే ఈ కథ సైకలాజికల్ డ్రామాగా అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతోంది. గ్లోబల్ స్థాయి ప్రేక్షకులే లక్ష్యంగా సిద్ధమవుతున్న తెలుగు కథ ఇదని సినీ వర్గాలు తెలిపాయి. మంగళవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈనెల 15న థియేటర్లలోనూ, 18న డిజిటల్ వేదికలపైనా ప్రత్యేక వీడియోను విడుదల చేయనున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రపంచానికి వినిపించాల్సిన తెలుగు కథ ఇది" అన్నారు. సత్యదేవ్ మాట్లాడుతూ "నటులకు 'రావు బహదూర్' తరహా సినిమాల్లో నటించే అవకాశం అరుదుగా లభిస్తుంటుంది. రోజూ ఐదు గంటలు మేకప్‌కే కేటాయించాల్సి వచ్చేది. ఇందులో నేను నటించలేదు, రావు బహదూర్ పాత్రలో బతికాను" అన్నారు. వచ్చే ఏడాది వేసవిలో తెలుగుతోపాటు, పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకి ఛాయాగ్రహణం: కార్తీక్ పర్మార్, సంగీతం: స్మరణ్‌సాయి, ప్రొడక్షన్ డిజైన్: రోహన్ సింగ్, కూర్పు: వెంకటేశ్ మహా.

వేతనాల వివాదానికి నేడు తెర?

సినీ కార్మికుల వేతనాలపై నెలకొన్న వివాదానికి బుధవారం తెర పడే అవకాశాలున్నట్టు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మంగళవారం కార్మికులు, నిర్మాతలకీ మధ్య చర్చలు జరగాల్సి ఉండగా... కొన్ని కారణాలతో బుధవారానికి వాయిదా పడ్డాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే ఏర్పాటైన కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం చర్చలు జరగనున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ వివాదంపై జోక్యం చేసుకుని ఇరు వర్గాలతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం చర్చలు జరిపారు. పట్టు విడుపులతో ఉండాలని సూచించారు. ఆ దిశగానే బుధవారం అటు కార్మికులు, ఇటు నిర్మాతల మధ్య చర్చలు జరగనున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా సినీ కార్మిక సమాఖ్య (ఫిల్మ్ ఫెడరేషన్) అధ్యక్షుడు అనిల్ వల్లభనేని మాట్లాడుతూ "చర్చలతో సమస్యల్ని పరిష్కరించుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం మధ్యాహ్నం జరిగే చర్చలతో అందరికీ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. చిన్న నిర్మాతల గురించి, వర్కింగ్ కండిషన్స్ గురించి కూడా చర్చలు చేస్తాం. సమస్యలన్నింటికీ ఒక పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ని సినిమా హబ్‌గా మార్చాలనుకుంటున్నారని, ఇలాంటి సమయంలో సమ్మె మంచిది కాదని మాతో చెప్పార"న్నారు.

'భద్రకాళి' రాక


విజయ్ ఆంటోని

'భద్రకాళి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనున్నారు విజయ్ ఆంటోని. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని అరుణ్ ప్రభు తెరకెక్కించారు. రామాంజనేయులు జవ్వాజి నిర్మించారు. వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, స్పిరిట్ మీడియా సంస్థల ద్వారా సెప్టెంబరు 19న తెలుగులో విడుదల కానుంది. ఈ విషయాన్ని మంగళవారం ప్రకటించారు. "రాజకీయ అంశాలతో ముడిపడిన యాక్షన్ థ్రిల్లర్ ఇది. విజయ్ ఆంటోని కెరీర్‌లో మైలురాయిలా నిలిచే సినిమా అవుతుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, ఛాయాగ్రహణం: షెల్లీ కాలిస్ట్.

క్యాసినో వెనుక రహస్య కోణాలు

బ్రో.. ఓ లుక్కేయొచ్చు!

ఆన్‌లైన్ జూదమనేదే ఒక మాయాజాలం. అందులో ఆడి డబ్బులు పోగొట్టుకునే వారెందరో ఉంటారు. అమాయకుల్ని బంధీలుగా చేసుకుని ఇలాంటి జూద సామ్రాజ్యమంతటిని నడిపిస్తుంటారు కొందరు. అంతేకాదు తమకు పోటీగా ఉన్న ఇతర క్యాసినో వెబ్‌సైట్స్‌ని అడ్డుకోవడానికి ప్రాణాలు తీయడానికి కూడా వెనకాడరు. కానీ ఎన్ని తప్పులు చేసినా ఇలాంటి వారు ఏదో ఓ రోజు పోలీసులకు పట్టుబడక తప్పదు. ఇలాంటి వారిని పట్టుకోవడానికి పోలీసులు కూడా హంతకుల దారిలోనే వెళితే ఏమైందనే ఆసక్తికర కథతో తెరకెక్కిందే 'ది రౌండప్: పనిష్మెంట్' చిత్రం.



సినిమా: 'ది రౌండప్: పనిష్మెంట్'
జానర్: యాక్షన్ థ్రిల్లర్
ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్ వీడియో

కథాంశం: ఫిలిప్పీన్స్‌లో తాను భాగస్వామిగా ఉన్న ఆన్‌లైన్ క్యాసినో సంస్థకు వచ్చే అన్ని అడ్డంకులను తొలగిస్తుంటాడు బేక్ చాంగ్ గి(కిమ్ ము యోల్). సైబర్ సెక్యూరిటీ గురించి తెలిసిన కొందరు యువకుల్ని బెదిరించి బానిసలుగా చేస్కొని.. ఆన్‌లైన్ క్యాసినో ఆటలో సమస్యలు రాకుండా చూసుకుంటాడు. ఇదే బృందంలో తన దగ్గర పనిచేసే దక్షిణ కొరియా వ్యక్తి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. దాంతో బేక్ చాంగ్ అతణ్ని చంపి, మృతదేహాన్ని స్వదేశానికి పంపుతాడు. అప్పటికే డ్రగ్స్ దందా, మనీ లాండరింగ్ కేసులను ఛేదించే పోలీసు అధికారిగా ఉంటాడు మా సియోక్ డో(మా డాంగ్ సియోక్). ఇప్పుడు యువకుడి హత్యను ఛేదించడంతో పాటు ఆన్‌లైన్ జూదం ముఠాని పట్టుకొనే పనిలో పడతాడు సియోక్. ఎలాంటి ఎత్తుగడలు వేసి బేక్‌చాంగ్‌ని పట్టుకున్నాడనేది అసలు కథ.

❑ ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ మోసాలు చేసే గ్యాంగ్ ఆటకట్టించేందుకు ఓ పోలీసు అధికారి చేసే ప్రయత్నాల చుట్టూ తిరుగుతుందీ సినిమా. థాయ్‌లాండ్‌లో జరిగిన ఓ మర్డర్ కేసు ఆధారంగా తెరకెక్కింది. హియో మియాంగ్ హేయ్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. క్రైమ్ థ్రిల్లర్‌గా సాగే ఈ సినిమాలో మా డాంగ్ సియోక్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, పంచ్‌లు ప్రేక్షకుణ్ని అలరిస్తాయి. జూదం ఆటగాళ్ల గుట్టురట్టు చేసేందుకు వారి బృందం పనిచేసే తీరు, వ్యూహాత్మక ఆలోచనలు గొప్పగా అనిపిస్తాయి. ఇది ఒక కొరియన్ సినిమా అయినప్పటికీ తెలుగు భాషలో చేసిన డబ్బింగ్ సినీప్రియుల్ని ఆకట్టుకుంటుంది. క్యాసినో వెనుక ఉన్న రహస్య కోణాలు, అక్కడ బందీలైన అమాయక సిబ్బంది కష్టాలను దర్శకుడు బాగా చూపించారు. యాక్షన్ సీక్వెన్స్‌లోనూ కామెడీని పంచుతున్న 'ది రౌండప్: పనిష్మెంట్' సినిమాపై మీరూ ఓ లుక్కేయండి.

చిత్ర వర్గీకరణ

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో వర్గీకరణ అనే అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. ఈ వర్గీకరణ అక్షర, సంఖ్య, చిత్రరూపాల్లో ఉంటుంది. కొన్నిసార్లు వీటన్నింటిని మిళితం చేసి జవాబు కనుక్కోమనవచ్చు. ఈ తరహా ప్రశ్నల్లో ఒక సమూహంగా కొన్ని పదాలు, సంఖ్యలు లేదా చిత్రాలను ఇస్తారు. ఇందులో ఒకటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. పరీక్షార్థిని సమూహానికి చెందనిదేది అని అడుగుతారు. వీలైనంత ఎక్కువగా సాధన చేస్తే ఈ రకమైన సమస్యలను పరిష్కరించడం తేలిక అవుతుంది.




అన్నింటిలో విభిన్నమైంది.. సమూహంలో సరిపోనిది!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం


రీజనింగ్

సూచన (ప్ర.1 – 11): దిగువ ఇచ్చిన ప్రతి ప్రశ్నలో 1, 2, 3, 4, 5గా గుర్తించిన అయిదు చిత్రాలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఒకే రీతిలో ఉండగా, ఒకటి మాత్రం భిన్నమైంది. అయితే సమూహానికి చెందని దాన్ని కనుక్కోండి.

1. 


సాధన: ఇచ్చిన చిత్రాలను పరిశీలిస్తే.. త్రిభుజం లోపల, బయట ఉన్న వృత్తాల సంఖ్య సమానంగా ఉంది. కానీ చిత్రం 2లో మాత్రం వాటి సంఖ్య వేర్వేరుగా ఉంది.

సమాధానం: 2

2. 


సాధన: 1 నుంచి 4 వరకు ఉన్న చిత్రాల్లోని చేతులు, కాళ్ల పరిమాణం సమానంగా లేవు. కానీ 5లో మాత్రం ఆ రెండు సమానంగా ఉన్నాయి.

సమాధానం: 5

3. 


సాధన: చిత్రం 3లో మాత్రమే బాణం కొన దీర్ఘవృత్తాకార చిత్రం సరిహద్దు వెంట అపసవ్య దిశలో చలనాన్ని సూచిస్తుంది. మిగతా చిత్రాల్లో మాత్రం బాణం కొన సవ్యదిశ చలనాన్ని సూచిస్తుంది.

సమాధానం: 3

4. 


సాధన: 1, 2, 3, 5 చిత్రాలను గమనిస్తే, లోపలి చిత్రాల్లోని శీర్షాలు బయటి చిత్రంలోని శీర్షాలు కలిపి ఉన్నాయి. కానీ చిత్రం 4లో మాత్రం శీర్షాలు కలిసి లేవు.

సమాధానం: 4


5. 

సాధన: 1 నుంచి 4 వరకు పరిశీలిస్తే చిత్రాల్లో ఉన్న రెండు మూలకాలు ఒకేలా ఉన్నాయి. కానీ చిత్రం 5లో మాత్రం ఒకదానికొకటి విలోమ రూపాలుగా ఉన్నాయి.


సమాధానం: 5

6. 

సాధన: చిత్రం 4లో ఆరు వంపు రేఖలు ఉండగా మిగతా చిత్రాల్లో మాత్రం 5 వంపు రేఖలు ఉన్నాయి. సమాధానం: 4


7. 

సాధన: చిత్రాలను పరిశీలించి చూస్తే.. 3లో మాత్రం బాణం కొనలన్నీ ఒకే దిశలో ఉన్నాయి. మిగతా వాటిలో ఒకదానికొకటి వ్యతిరేక దిశలో ఉన్నాయి. సమాధానం: 3

8. 


సాధన: అన్ని చిత్రాల్లోని లోపలి, బయటి భుజాల మధ్య భేదం 2 గా ఉంది. కానీ చిత్రం 4లో మాత్రం ఆ భేదం 1 గా ఉంది.

సమాధానం: 4


9. 

సాధన: చిత్రాలన్నింటిలో బయటి మూలకాన్ని ఏర్పరిచే రేఖా ఖండాల సంఖ్య కంటే లోపలి మూలకాన్ని ఏర్పరిచే రేఖా ఖండాల సంఖ్య ఒకటి తక్కువగా ఉంది. కానీ చిత్రం 1లో మాత్రం లోపల ఒక రేఖా ఖండం ఉంటే బయట మాత్రం 3 ఉన్నాయి. దీనిలో భేదం 2గా ఉంది.

సమాధానం: 1

10. 

సాధన: చిత్రాలన్నింటినీ పరిశీలిస్తే.. 3లో మాత్రం కొక్కెం ఆకారంలో ఉన్నదానిపైన, కింద ఉన్న సింబల్స్‌లో తేడా ఉంది. మిగతా వాటిలో అన్నీ సమానంగా ఉన్నాయి. సమాధానం: 3

11. 



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

సాధన: అన్ని చిత్రాల్లోని బాణాలు ఒకదానికొకటి లంబంగా ఉన్నాయి. కానీ చిత్రం 3లో ఉన్న బాణాలు మాత్రం వ్యతిరేక దిశలో ఉన్నాయి.

సమాధానం: 3

740 Word of the Day

Abrasive

Telugu meaning: కరకు, దురుసు

English meaning: The word abrasive (అబ్రేసివ్) is an adjective that describes something rough, harsh, or likely to cause friction, either physically or in manner/behaviour.

Synonyms: Harsh, Rough

Antonyms: Smooth, Gentle

Usage: 1. His abrasive tone during the meeting offended several team members.

2. The cleaner used an abrasive pad to scrub the stubborn stains from the sink.

కరెంట్ అఫైర్స్



ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన అజయ్ సంతోష్ చదరంగంలో ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదా సాధించాడు. 2025, ఆగస్టు 10న సెర్బియాలో జరిగిన అంతర్జాతీయ టోర్నీలో 9 రౌండ్లలో 5 పాయింట్లు సాధించిన అజయ్ టైటిల్ గెలుచుకున్నాడు. ఈ క్రమంలో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాకు అవసరమైన మూడో నార్మ్‌ను సొంతం చేసుకున్నాడు.



ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి రితిక బంగారు పతకం నెగ్గింది. 2025, ఆగస్టు 11న బ్యాంకాక్‌లో జరిగిన మహిళల ప్లస్ 80 ఫైనల్లో అస్సెల్ టోక్తాసిన్ (కజకిస్థాన్)పై రితిక విజయం సాధించింది. 57 కేజీలలో యాత్రి పటేల్, 60 కిలోల విభాగంలో ప్రియ రజత పతకాలు గెలుపొందారు.

ప్రాజెక్ట్ టైగర్, ఎలిఫెంట్ కింద ఏపీకి 2020-21 నుంచి 2024-25 మధ్య కేంద్ర ప్రభుత్వం రూ.35.51 కోట్లు కేటాయించినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ లోక్‌సభలో వెల్లడించారు. ఇంతవరకు రూ.11.71 కోట్లు (33%) విడుదల చేసినట్లు తెలిపారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ అవయవదాన దినోత్సవం

ఆగస్టు 13
చరిత్రలో ఈనాడు

అవయవ దానం గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా ఆగస్టు 13న 'ప్రపంచ అవయవదాన దినోత్సవం'గా (World Organ Donation Day) నిర్వహిస్తారు. మనిషి శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తేనే ఆనందమయ జీవనాన్ని సాగిస్తారు. శరీర కీలక భాగాలు విఫలమైనప్పుడు అవయవ మార్పిడితో ఎంతో మందికి కొత్త జీవితాన్ని ఇవ్వొచ్చు. అయితే అవయవాలు అందుబాటులో లేకపోవడమే దీనికి ప్రధాన ఆటంకంగా మారింది. బతికున్నవారు రక్తం, కిడ్నీ, కాలేయం లాంటివి దానం చేయొచ్చు. గుండె, చర్మం, ఊపిరితిత్తులు, కంటి కార్నియా మొదలైనవాటిని బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచే సేకరించే వీలుంది. 18 ఏళ్లు దాటిన ఎవరైనా అవయవ దానానికి అర్హులే. అవయవదాన ప్రాముఖ్యత గురించి ప్రజలను చైతన్యపరచి, అవయవ దాతలుగా నమోదు చేసుకునేలా వారిని ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



☛ ఆర్గాన్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నెట్‌వర్క్ (ఓపీటీఎన్) ప్రకారం, 2024లో 48,000 కంటే ఎక్కువ అవయవ మార్పిడులు జరిగాయి. 24,000 కంటే ఎక్కువ మంది నుంచి అవయవాలు సేకరించారు. ఇప్పటికీ లక్ష కంటే ఎక్కువ మంది వ్యక్తులు అవయవ మార్పిడి వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, మన దేశంలో ప్రతి 10 లక్షల మందికి ఒక దాత మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇప్పటికీ 3 లక్షల మందికి పైగా ప్రజలు అవయవాల కోసం నిరీక్షిస్తున్నారు. సరైన సమయంలో శరీర భాగాలు లభించక రోజుకు 20 మంది మరణిస్తున్నారు. 2024లో భారత్‌లో 18,900 అవయవ మార్పిడులు జరిగాయి. సంఖ్యాపరంగా ప్రపంచవ్యాప్తంగా మన దేశం మూడో స్థానంలో ఉంది.

చారిత్రక నేపథ్యం: అమెరికాకు చెందిన రోనాల్డ్ లీ హెరిక్ 1954, ఆగస్టు 13న తన కిడ్నీని కవల సోదరుడికి దానం చేశారు. డాక్టర్ జోసెఫ్ ముర్రే అవయవ మార్పిడిని విజయవంతంగా పూర్తిచేశారు. వైద్య చరిత్రలో ఈ విధమైన ఆపరేషన్ నిర్వహించడం అదే తొలిసారి. దీన్ని స్మరించుకునేందుకు ఏటా ఆ తేదీన 'ప్రపంచ అవయవదాన దినోత్సవం'గా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2005లో తీర్మానించింది. మన దేశంలో జాతీయ అవయవదాన దినోత్సవాన్ని ఏటా ఆగస్టు 3న నిర్వహిస్తారు.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

వేవెల్ ప్రణాళిక - సిమ్లా సమావేశం

రెండో ప్రపంచ యుద్ధం ఒకవైపు... భారతీయుల స్వాతంత్ర్య సంగ్రామం మరోవైపు.. వెరసి ఆంగ్లేయులకు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి తంటాలు పడాల్సిన పరిస్థితి తలెత్తింది. క్రిప్స్ రాయబారం, ఆగస్టు ప్రతిపాదన విఫలమయ్యాయి. క్విట్ ఇండియా ఉద్యమం ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను మరింత పెంచింది. స్వేచ్ఛా భారతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారతీయులను విడగొట్టడానికి బ్రిటిష్ వారు అనేక కుటిల ప్రయత్నాలు చేశారు. సిమ్లా సమావేశం ఏర్పాటు చేసిన లార్డ్ వేవెల్ తన ప్రణాళికను భారతీయుల ముందు పెట్టారు. కానీ చివరికి ఈ ప్రణాళిక విఫలమైంది.


☛ లార్డ్ లిన్‌లిత్‌గో స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వం లార్డ్ వేవెల్‌ను భారత వైస్రాయ్‌గా నియమించింది.

☛ భారతదేశంలో బ్రిటిష్ పట్టు నిలిపేందుకు వేవెల్ ప్రయత్నాలు చేపట్టారు. దీనిలో భాగంగా కొన్ని ప్రతిపాదనలు చేసి దాన్ని భారత వ్యవహారాల కార్యదర్శికి సమర్పించారు. చివరికి బ్రిటన్ ప్రధాని చర్చిల్ కూడా ఈ ప్రతిపాదనలను అంగీకరించారు.

వేవెల్ ప్రతిపాదనలు

☛ వేవెల్ తన పేరు మీదుగానే ఈ ప్రణాళికను వెల్లడించారు.

☛ ఒక తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటును ఈ ప్రణాళిక ప్రతిపాదించింది. పలు రాజకీయ సంస్థలతో వైస్రాయ్ ఒక కార్యసమితిని ఏర్పాటు చేస్తారు. వైస్రాయ్ కార్యసమితి 1935 పరిధిలో పనిచేస్తుంది. గవర్నర్ల నిర్వహణలో ఉండే రాష్ట్రాల్లో సంకీర్ణ పద్ధతిలో మంత్రివర్గాలు తిరిగి ఏర్పడతాయి.



వేవెల్ ప్రణాళికపై ముస్లింలీగ్ వైఖరి, కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్య మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

Indian Overseas Bank Chennai (IOB) is inviting applications for the filling of Apprentice posts in various states. The total no. of posts is 750. The application fee is Rs. 944. The last date for receipt of online applications is 20 August 2025.

Jobs In HCSL

Hooghly Cochin Shipyard Limited (HCSL) is inviting applications for the Project Assistant, Outfit Assistant, and Semi-Skilled Rigger posts on a contract basis. The total no. of posts is 12. Eligible candidates can apply online before 26 August 2025.

Posts in HCL

Hindustan Copper Limited, Malajkhand Copper Project, Balaghat, Madhya Pradesh, invites online applications for Trade Apprenticeship training. The total no. of posts is 167. The last date for online applications is 27 August 2025.

Did You Apply..?

Today (August 13) is the last date for the following Jobs

☛ 42 Non-Teaching Vacancies in IIT Tirupati.
Eligibility: PG, BE/BTech, Degree.

☛ 12 Manager Jobs in Rail Vikas Nigam Limited.
Eligibility: BE/BTech.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Rearrangement of Phrases

Directions (Qs. 1 - 8): *Rearrange the following phrases of a sentence in the correct order. Ignore punctuation errors, if any.*

1. 1. by promoting rational drug use, robust surveillance,
2. Antimicrobial resistance threatens modern medicine
3. investing in new drug research and development,
4. and improving infection prevention and control practices
5. requiring coordinated action from governments, healthcare providers, and the pharmaceutical industry

A) 25134 B) 21534 C) 21345
D) 32145 E) 12345

2. 1. and incentivizing conservation-friendly investments,
2. Sustainable finance mechanisms can mobilize private capital
3. to protect ecosystems while generating stable returns for investors
4. by integrating biodiversity risk into lending and investment decisions,
5. using blended finance, green bonds, and nature-positive tax incentives,

A) 21354 B) 24135 C) 25413
D) 32145 E) 23145

3. 1. while engaging consumers in responsible consumption patterns
2. by redesigning products for durability and recyclability,
3. Transitioning the fashion industry toward circularity reduces waste and resource use
4. through textile recycling, garment repair services, and resale markets,
5. and creating new economic opportunities across supply chains

A) 21345 B) 32145 C) 23145
D) 24135 E) 32415

4. 1. while promoting digital payment systems and formal financial inclusion,
2. by enabling faster transfers, greater transparency, and lower fees
3. Streamlined remittance channels reduce transaction costs for migrants
4. thus increasing the development impact of cross-border money flows
5. and improving financial resilience for households left behind

A) 21534 B) 23145 C) 23415
D) 32145 E) 21354

5. 1. enabling earlier detection of diseases, personalized treatment plans, and optimized resource allocation,
2. while raising important questions about data privacy, algorithmic bias, and clinical accountability
3. by analyzing vast datasets from medical imaging, electronic health records, and genomic sequencing,
4. Artificial intelligence systems are transforming healthcare delivery
5. and driving innovation in telemedicine, diagnostics, and preventive care,

A) 41352 B) 43125 C) 43152
D) 31452 E) 53412

6. 1. ensuring long-term health of marine ecosystems,
2. such as sustainable fishing, ecotourism, and marine biotechnology,
3. by balancing ecological protection with job creation and community resilience,
4. The blue economy promotes economic growth from ocean resources
5. and supporting diversified livelihoods for coastal populations

A) 41325 B) 42315 C) 24135
D) 43215 E) 25134

7. 1. and enhancing biodiversity within city limits,
2. Urban green corridors connect parks, waterways, and street trees
3. by providing continuous habitats for pollinators and small wildlife,
4. while creating shaded pedestrian routes, improving air quality,
5. reducing urban heat island effects during heat waves,

A) 21345 B) 23451 C) 24351
D) 25341 E) 32451

8. 1. and contributing to national decarbonization targets,
2. by harnessing stronger and more consistent ocean winds,
3. Offshore wind projects can generate significant renewable electricity
4. creating skilled jobs in manufacturing, installation, and maintenance,
5. while supporting a just transition for communities reliant on fossil fuel industries

A) 21345 B) 32145
C) 25145 D) 24135
E) 32415

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

మెకానికల్ చేస్తే ఏ అవకాశాలు?

మెకానికల్ ఇంజినీరింగ్ మొదటి ఏడాది చదువుతున్నా. అందరూ కంప్యూటర్ సైన్స్ చదవమంటున్నారు. నాకు మెకానికల్ అంటేనే ఆసక్తి. దీనితో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - ఆనంద్



■ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో కంప్యూటర్ సైన్స్ చదివినవారికే ఉద్యోగావకాశాలుంటాయి అనేది అపోహ మాత్రమే. నిజానికి కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ చదివినవారందరికీ మంచి ఉద్యోగాలు దొరకడం లేదు. ఈ మధ్యకాలంలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ లాంటి కోర్ బ్రాంచీల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కోర్ బ్రాంచీల్లో బీటెక్ పూర్తి చేసినవారికి ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది. అయితే మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా నూతన నైపుణ్యాలను పొందడం తప్పనిసరి.

మెకానికల్ ఇంజినీరింగ్ చదివినవారికి ప్రైవేటు రంగంలో ఆటోమొబైల్, ఏరోస్పేస్, హెవీ మెషినరీ, సిమెంట్, స్టీల్ పరిశ్రమల్లో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, డిజైన్ విభాగాల్లో అవకాశాలుంటాయి. క్యాడ్, క్యామ్ లాంటి సాఫ్ట్‌వేరుల్లో ప్రావీణ్యం ఉంటే డిజైన్, ఆర్ అండ్ డీ రంగాల్లో చేరవచ్చు. పవర్ ప్లాంట్లు, రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో కూడా మంచి అవకాశాలున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలైన బీహెచ్ఈఎల్, గెయిల్, ఎన్టీపీసీ, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఇస్రోల్లో కొలువులు పొందవచ్చు. ఆసక్తి ఉంటే డిగ్రీ అర్హత ఉన్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్, యూపీఎస్సీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ బోర్డులు నిర్వహించే పోటీ పరీక్షలకు కూడా సిద్ధం అవ్వవచ్చు. ఎంటెక్, ఎంఎస్, ఎంబీఏ లాంటి ఉన్నత చదువులు చదివి బోధన, పరిశోధన, మేనేజ్‌మెంట్ రంగాలకు వెళ్ళవచ్చు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో మెకానికల్ ఇంజినీర్లకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి.

స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్

ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళితే మెకానికల్ ఇంజనీరింగ్‌లో మంచి కెరియర్ నిర్మించుకోవచ్చు. దీనికోసం స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను అనుసరించడం మేలు.

▲ మొదటి సంవత్సరంలో ఆటో క్యాడ్, సాలిడ్ వర్క్స్, ఫ్యూజన్ 360 వంటి టూల్స్‌లో ప్రాథమిక అంశాలు నేర్చుకొంటూ, మ్యాథ్స్, ఫిజిక్స్‌లపై మంచి పట్టు సాధించాలి.

▲ రెండో సంవత్సరంలో డిజైన్ టూల్స్‌లో నైపుణ్యం పెంపొందించుకోవాలి. సీఎన్‌సీ మెషిన్లు, త్రీడీ ప్రింటింగ్ అవగాహనతో మినీ ప్రాజెక్టులు చేయాలి.

▲ మూడో సంవత్సరంలో సిమ్యులేషన్ టూల్స్ నేర్చుకోవాలి. మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్ పద్ధతులు తెలుసుకోవాలి. ప్రముఖ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసే ప్రయత్నం చేయాలి.

▲ నాలుగో సంవత్సరంలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి. ప్లేస్‌మెంట్‌కు అవసరమైన ఆప్టిట్యూడ్, టెక్నికల్ ప్రిపరేషన్ చేయాలి. ఎన్‌పీటెల్, స్వయం, కోర్స్ ఎరా, యుడెమి లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా థర్మల్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, ఇండస్ట్రీ 4.0, ఐఓటీ లాంటి అంశాలపై సర్టిఫికేషన్లు పొందాలి. అదనంగా ఇండస్ట్రీ విజిట్లు, వర్క్‌షాప్‌లు, హాకథాన్స్‌లో పాల్గొనాలి. లింక్డ్‌ఇన్ లాంటి ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌ల్లో చురుగ్గా ఉండాలి. సస్టెయినబుల్ ఎనర్జీ, ఆటోమేషన్ లాంటి భవిష్యత్తు రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఆయుర్వేదిక్ సైన్సెస్ సంస్థలో అవకాశాలు

394 పోస్టులు

దిల్లీలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్).. 394 పోస్టులను ప్రకటించింది. ఈ ఖాళీలు గ్రూప్-ఏ, బీ, సీ కేటగిరీల్లో ఉన్నాయి.



ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టులు: స్టాఫ్ నర్స్-14, అసిస్టెంట్-13, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్-15, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1-10, అప్పర్ డివిజన్ క్లర్క్-39, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-2-14, లోయర్ డివిజన్ క్లర్క్-37, ఫార్మసిస్ట్ గ్రేడ్-1-12, మల్టీ టాస్కింగ్ స్టాఫ్-179.

అర్హతలు: స్టాఫ్ నర్స్: బీఎస్సీ నర్సింగ్/ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ డిప్లొమా. టీచింగ్/ రిసెర్చ్ హాస్పిటల్‌లో రెండేళ్ల అనుభవం. స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదుకావాలి.

● **అసిస్టెంట్:** డిగ్రీ, కంప్యూటర్స్ పరిజ్ఞానం.

● **మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్:** మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్ డిగ్రీ. సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం.

● **స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1:** పదోతరగతి, షార్ట్‌హ్యాండ్‌లో నిమిషానికి 120 పదాలు రాయగలగాలి. టైపింగ్ వేగం నిమిషానికి 40 పదాలు. స్టెనోగ్రాఫర్‌గా మూడేళ్ల అనుభవం ఉండాలి. డిగ్రీ చేసి, మీటింగ్‌లు/ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేవారికి ప్రాధాన్యమిస్తారు.

● **అప్పర్ డివిజన్ క్లర్క్:** ఏదైనా డిగ్రీ.

● **స్టెనోగ్రాఫర్ గ్రేడ్-2:** పదోతరగతి, షార్ట్‌హ్యాండ్‌లో నిమిషానికి 100 పదాలు రాయగలగాలి. నిమిషానికి 40 పదాలు టైప్ చేయగలగాలి. డిగ్రీ చేసినవారికి ప్రాధాన్యం.

● **లోయర్ డివిజన్ క్లర్క్:** ఇంటర్మీడియట్ పాసై.. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీలో 30 పదాలు టైప్ చేయగలగాలి.

● **ఫార్మసిస్ట్ గ్రేడ్-1:** ఫార్మసీ డిప్లొమా/ డీ ఫార్మ్ (ఆయుర్వేదిక్), రెండేళ్లు ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో పని చేసిన అనుభవం ఉండాలి.

● **మల్టీ టాస్కింగ్ స్టాఫ్:** ఐటీఐ/ ఒకేషనల్ ట్రెయినింగ్ సర్టిఫికెట్ (ఎంటీఎస్ ట్రేడ్‌తో) లేదా పదోతరగతి పాసై.. ఎంటీఎస్‌గా ఏడాది అనుభవం ఉండాలి.

వయసు: గ్రూప్-ఏకు 40, గ్రూప్-బీ, సీలోని కొన్ని పోస్టులకు 30 ఏళ్లు, స్టెనోగ్రాఫర్, ఎల్‌డీసీ, ఫార్మసిస్ట్ పోస్టులకు 27 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: గ్రూప్-ఏ పోస్టులకు నెలకు రూ.15,600-39,100. గ్రూప్-బీ, సీ పోస్టులకు రూ.9,300-34,800.

దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ, బీ, సీ పోస్టులకు వరుసగా రూ.1,000, 500, 200. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, మహిళలు, మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఎంపిక ఇలా

◆ గ్రూప్-ఏ పోస్టులను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. సీబీటీకి 70 మార్కులు, ఇంటర్వ్యూకు 30 మార్కులు. గ్రూప్-బీ, సీ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఇస్తారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.

◆ యూడీసీ, స్టెనోగ్రాఫర్, ఎల్‌డీసీలకు రాత పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. జనరల్ ఇంగ్లిష్, జనరల్ ఇంటెలిజెన్స్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి 25 ప్రశ్నల చొప్పున ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.

◆ ఎల్‌డీసీ, స్టెనోగ్రాఫర్ పోస్టులకు స్కిల్ టెస్ట్ కూడా ఉంటుంది.

◆ ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. ఎంటీఎస్ పోస్టులకు నెగటివ్ మార్కులు ఉండవు.

◆ స్టాఫ్‌నర్స్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్, ఫార్మసిస్ట్‌లకు సీబీటీ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 70, జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలు 20, కంప్యూటర్ పరిజ్ఞానానికి సంబంధించిన 10 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు.

పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 40 కేంద్రాలు, తెలుగు రాష్ట్రాల్లో.. హైదరాబాద్, వరంగల్, విజయవాడల్లో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.08.2025

వెబ్‌సైట్: http://www.ccras.nic.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

బ్యాక్ఎండ్ డెవలప్‌మెంట్

సంస్థ: కోడింగ్ జూనియర్
నైపుణ్యాలు: ఏపీఐస్, సీఎస్ఎస్, డాకర్, గిట్, గోలాంగ్, మాంగోడీబీ, మైఎస్‌క్యూఎల్, రియాక్ట్, రెస్ట్ ఏపీఐ, ఎస్‌క్యూఎల్, టైప్‌స్క్రిప్ట్
స్టైపెండ్: రూ.7,000-10,000
☛ https://shorturl.at/OfE1G

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: చారిటిజం నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.7,000
☛ https://shorturl.at/ynTY1

బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: ఫంగస్సన్ సర్వీసెస్ ప్రై. లి.
నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, కోల్డ్ కాలింగ్, కస్టమర్ అక్విజిషన్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.7,000-18,000
☛ https://shorturl.at/q16w3

యూఐ/యూఎక్స్ డిజైన్

సంస్థ: ఎంఐటీఆర్ కన్సల్టెన్సీ
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఎక్స్‌డి, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, యూజర్ ఇంటర్‌ఫేస్ డెవలప్‌మెంట్, వైర్‌ఫ్రేమింగ్
స్టైపెండ్: రూ.3,000
☛ https://shorturl.at/67Hg5

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్

సంస్థ: డిజిటల్ వెబ్ క్రాఫ్ట్స్
నైపుణ్యాలు: డిజిటల్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.7,000-10,000
☛ https://shorturl.at/VBP4Q

వీటికి దరఖాస్తు గడువు: సెప్టెంబరు 5

క్యాంపస్ మార్కెటింగ్

సంస్థ: ఎడ్యువేద అకాడమీ
నైపుణ్యాలు: డిజిటల్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, నెట్‌వర్కింగ్ స్టైపెండ్: రూ.10,000-25,000
☛ https://shorturl.at/0lKDW

సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్ ఆపరేషన్స్

సంస్థ: బోసన్ మెషిన్స్ ఓపీసీ ప్రై. లి.
నైపుణ్యాలు: లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ స్టైపెండ్: రూ.10,001-30,002
☛ https://shorturl.at/GEaEh

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 25

సబ్జెక్ట్ మ్యాటర్ ఎక్స్‌పర్ట్ (ఫిజిక్స్)

సంస్థ: కుందుజ్ టెక్నాలజీస్ ప్రై. లి.
నైపుణ్యాలు: ఆన్‌లైన్ టీచింగ్, ఫిజిక్స్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్, టీచింగ్
స్టైపెండ్: రూ.11,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 4
☛ https://shorturl.at/4TPAZ

క్రియేటివ్ డిజైన్

సంస్థ: లిటిల్ బిగ్ థింగ్స్
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఫొటోషాప్, ఫిగ్మా స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 24
☛ https://shorturl.at/suxU9

పైతాన్ డెవలప్‌మెంట్

సంస్థ: థింక్ యాక్ట్ రైజ్ ఫౌండేషన్
నైపుణ్యాలు: మెషిన్ లెర్నింగ్, పైతాన్, రెస్ట్ ఏపీఐ స్టైపెండ్: రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 27
☛ https://shorturl.at/sNK6K

హైదరాబాద్‌లో

కరిక్యులం డెవలపర్-ఇంగ్లిష్

సంస్థ: గ్రేటర్ దేన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.14,501-15,002
☛ https://shorturl.at/tzKHH

టెలికాలింగ్

సంస్థ: ఎడ్యుకేస్ ఇండియా
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/v5qOr

కంప్యూటర్ ఆపరేటర్

సంస్థ: చెరాగ్ ట్రేడర్స్ నైపుణ్యం: ఎంఎస్ ఆఫీస్ స్టైపెండ్: రూ.18,000-26,000
☛ https://shorturl.at/cAqRf

వీటికి దరఖాస్తు గడువు: సెప్టెంబరు 5

చక్కెర పరిశ్రమలో ఏయే హోదాలు?

అందరిలా ఇంజినీరింగ్/ మేనేజ్‌మెంట్ కాకుండా విభిన్నమార్గంలో పయనించాలనుకునేవారు ఆలోచించదగ్గవాటిలో చక్కెర పరిశ్రమ ఒకటి. దీనిలో ప్రవేశించేందుకు అనువైన కోర్సులను ఎంచుకుంటే.. మంచి కెరియర్ లభించడంతో పాటు వ్యవసాయ రంగ మూలాలకు దూరం అవుతున్నామన్న భావన ఉంటే అది తొలగిపోతుంది.

▼ **షుగర్ టెక్నాలజీ:** షుగర్ ఇంజినీరింగ్, ఆల్కహాల్ టెక్నాలజీ, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు ఉన్నాయి.


నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్.ఎస్.ఐ.) రెండు రకాల విద్యార్థులకు పీజీ డిప్లొమా కోర్సులు అందిస్తోంది. బీఎస్సీ డిగ్రీ చేసినా, ఇంజినీరింగ్ చేసినా పర్తించేలా రెండున్నరేళ్ల డిప్లొమా కోర్సు చక్కెర పరిశ్రమలో సాంకేతికపరమైన పొజిషన్లకు సిద్ధం చేస్తుంది. బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌తో చేసిన విద్యార్థులు లేదా బీఈ/ బీటెక్.-కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లు ఈ కోర్సుకు అర్హులు.

▼ **షుగర్ ఇంజినీరింగ్:** ఎన్.ఎస్.ఐ. సంస్థ బీఈ/ బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేసినవారికి ఏడాదిన్నర షుగర్ ఇంజినీరింగ్ కోర్సును అందిస్తోంది.

▼ **బీటెక్ ఆల్కహాల్ ఇంజినీరింగ్:** ఇది ఇంటర్మీడియట్ తర్వాత చేసే నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్. ఈ కోర్సులో భాగంగా చక్కెర ఉత్పత్తి, ఎథనాల్ తయారీ, చెరకు సాగు తదితర అంశాలను నేర్పిస్తారు.

స్వల్పకాల కోర్సులు

ఇంజినీరింగ్ చేసినవారికి పీజీ కోర్సులే కాదు, ఈ పరిశ్రమపై మమకారం కలిగి తక్కువ విద్యార్హతలున్న యువతకూ అవకాశాలున్నాయి. స్వల్పకాల వ్యవధి కోర్సులు అందుబాటులో ఉన్నాయి.



▼ **ఆల్కహాల్ టెక్నాలజీ:** చెరకు పరిశ్రమలో భాగమైన ఆల్కహాల్ తయారీకి ఫెర్మంటైజేషన్ (పులియబెట్టడం), డిస్టిలైజేషన్ (మొలాసిస్‌ను ఆల్కహాల్‌గా మార్చడం) ప్రక్రియల్లో ప్రొఫెషనల్‌గా తయారుచేసేందుకు డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ ఫెర్మంటైజేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ చేయవచ్చు.

▼ **స్వల్పకాల శిక్షణ కార్యక్రమాలు:** పంచదార పరిశ్రమలో వివిధ వాణిజ్య ఉత్పత్తులకు సుశిక్షితులైన యువతను తయారుచేసేందుకు వసంత దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్ జ్యూస్ సర్టిఫికేషన్, బాయిలర్ ఆపరేషన్, డిస్టిలరీ టెక్నిక్స్‌పై స్వల్పకాల శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తోంది.

▼ **షుగర్ టెక్నాలజీలో ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ కోర్సు:** ఇప్పటికే వేర్వేరు డిగ్రీలు చేసినవారు ఈ పరిశ్రమలోకి ప్రవేశించేందుకు అవగాహన కల్పించే ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్‌పై ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ కోర్సులున్నాయి.

▼ **షుగర్ బిజినెస్‌లపై కోర్సు:** వ్యవసాయ ఆధారిత చెరకు పంటను వివిధ రూపాల్లో వాణిజ్య ఉత్పత్తిగా ఎలా మార్చవచ్చో అవగాహన కల్పించి, అందుకు తగ్గ వృత్తి నిపుణులను తయారుచేసే కోర్సు. షుగర్ ప్రాసెసింగ్ టెక్నాలజీ బిజినెస్ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో షుగర్ ప్రాసెసింగ్ విధానం, కావలసిన యంత్ర సామగ్రి, మార్కెట్ అవసరాలను కవర్ చేస్తారు.

ఆసక్తికి తోడు అర్హతలు

చక్కెర పరిశ్రమపై ఆసక్తికి తోడు వృత్తిపరమైన అర్హతలు సాధిస్తే దీనిలో మంచి అవకాశాలున్నాయి.

✦ షుగర్ టెక్నాలజీ చేస్తే మాన్యుఫాక్చరింగ్ కెమిస్ట్, లాబొరేటరీ ఇన్చార్జి, చీఫ్ కెమిస్ట్ అండ్ టెక్నాలజిస్ట్ లాంటి పొజిషన్లు లభిస్తాయి. ✦ షుగర్ ఇంజినీరింగ్ చేస్తే ప్రొడక్షన్ ఇంజినీర్, బాయిలర్ ఆపరేటర్, కేన్ ఇన్‌స్పెక్టర్, ఎస్టిమేషన్ ఇంజినీర్ హోదాలున్నాయి.

✦ డిస్టిలరీ ఆపరేషన్ సంబంధిత కోర్సులు చేస్తే డిస్టిలరీ మేనేజర్ సహా వివిధ రకాల సూపర్‌వైజరీ పొజిషన్లను ఆఫర్ చేస్తున్నారు. ✦ మేనేజ్‌మెంట్, రిసెర్చ్ సంబంధిత కోర్సుల్లో యోగ్యత సాధించినవారికి భారీ పంచదార పరిశ్రమల్లో హెచ్ఆర్ మేనేజర్, ఫైనాన్స్ పొజిషన్లు ఆఫర్ చేస్తున్నారు. ఈ రంగంలో రిసెర్చ్ చేసినవారికి అకడమిక్ (బోధన) అవకాశాలు వస్తున్నాయి.

భారత వ్యవసాయ రంగంలో చెరకు సాగు శతాబ్దాల నుంచి విడదీయరాని అంతర్భాగంగా అలరారుతోంది. ఐదు కోట్ల మంది రైతులకు, 5 లక్షల మందికి చక్కెర ఉత్పత్తి కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఈ అనిశ్చిత వ్యవసాయ ఉత్పత్తికి వృత్తి ప్రావీణ్యం అద్ది కొత్త వ్యాపారావకాశాలు అందుకునేందుకు ఉవ్విళ్లూరుతున్న షుగర్ ఫ్యాక్టరీలు, కోపరేటివ్ సొసైటీలు సమర్థులైన యువత కోసం చూస్తున్నాయి. పంచదారతో ఆకర్షణీయమైన ఉత్పత్తులు తయారుచేసే ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు విభిన్న కోర్సులు చేసిన వారి కోసం ఎదురు చూస్తున్నాయి.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

నో టీ స్ బో ర్డు

ఉద్యోగాలు

ఎయిమ్స్ బీబీనగర్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ

ఎయిమ్స్ బీబీనగర్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 6 గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఇంగ్లిష్, తెలుగు, సైకాలజీ, న్యూట్రిషన్, సోషియాలజీ, స్టాటిస్టిక్స్. **అర్హత:** పోస్టును అనుసరించి పీజీతో పాటు ఉద్యోగ అనుభవం.
గరిష్ఠ వయసు: 63 ఏళ్లు.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.08.2025.
చిరునామా: ఎయిమ్స్, బీబీనగర్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్, తెలంగాణ - 508126.
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://aiimsbibinagar.edu.in/nonfaculty.html

ఎస్‌జీ పీజీ ఐఎంఎస్‌లో ప్రొఫెసర్లు

సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎస్‌జీ పీజీ ఐఎంఎస్) వివిధ విభాగాల్లో 262 ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రొఫెసర్ ◗ అసిస్టెంట్ ప్రొఫెసర్
◗ అడిషనల్ ప్రొఫెసర్ ◗ అసోసియేట్ ప్రొఫెసర్
అర్హత: పోస్టును అనుసరించి పీజీ, డీఎన్‌బీ, ఎండీ/ఎంఎస్/డీఎం, ఎంసీహెచ్‌తో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 08.09.2025 నాటికి 50 ఏళ్లు.
వేతన శ్రేణి: నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500 - రూ.1,67,400, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300 - రూ.2,09,200, అడిషనల్ ప్రొఫెసర్‌కు రూ.1,48,200 - రూ.2,11,400, ప్రొఫెసర్‌కు రూ.1,68,900 - రూ.2,20,400.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్ రూ.2000. ఓబీసీ/ ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ/ ఈడబ్ల్యూఎస్‌కు రూ.1000.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://sgpgims.org.in/Home/Recruitment_active.html

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో ..

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్, దిల్లీ రెగ్యులర్ ప్రాతిపదికన 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఐటీ): 01
◗ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఎస్&టీ/బీడీ): 01
◗ సీనియర్ ఎగ్జిక్యూటివ్ (ఐటీ): 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్. 60 శాతం మార్కులతో ఐటీ/ఎలక్ట్రానిక్స్ లేదా ఎంసీఏ లేదా ఎంబీఏ ఉత్తీర్ణులైనవారికి ప్రాధాన్యం.
గరిష్ఠ వయసు: డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 45 ఏళ్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌కు 35 ఏళ్లు. **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.70,000 - 2,00,000, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌కు రూ.27,000 - రూ.1,00,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీలకు రూ.400. ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్‌లకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://rvnl.org/job

ఆర్‌వీఎన్‌ఎల్‌లో ఇంజనీర్లు

దిల్లీలోని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్) ఒప్పంద ప్రాతిపదికన 3 ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ సీనియర్ సైట్ ఇంజనీర్ - 01 ◗ ఎస్ఏపీ ఇంజనీర్ (డెవలపర్) - 01 ◗ ఎస్ఏపీ ఇంజనీర్ (ఫంక్షనల్ కన్సల్టెంట్/ఫిన్) - 01
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో బీకామ్, ఎంకామ్, ఎంబీఏ, బీఈ, బీటెక్ (ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, సేల్స్ అండ్ మార్కెటింగ్).
గరిష్ఠ వయసు: 35 ఏళ్లు.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.400. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు ఫీజు లేదు.
ఆఫ్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 10.09.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
చిరునామా: డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్ట్ క్రాంతి భవన్, భికాజీ కామా ప్లేస్, ఆర్.కె. పురం, న్యూదిల్లీ-110066.
వెబ్‌సైట్: https://rvnl.org/job

బెల్‌లో ట్రైనీ ఇంజనీర్లు

ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, నవరత్న హోదా కలిగిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్), బెంగళూరు తాత్కాలిక ప్రాతిపదికన 6 ట్రైనీ ఇంజనీర్-1 పోస్టుల భర్తీకి కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి బీఈ/బీటెక్‌తో పాటు పని అనుభవం .
గరిష్ఠ వయసు: 28 ఏళ్లు. **వేతనం:** నెలకు రూ.30,000 - రూ.40,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.177. ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్షతో.
వెబ్‌సైట్: https://bel-india.in/job-notifications/

శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఖాళీలు

కోల్‌కతాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్టు ఒప్పంద ప్రాతిపదికన 4 సీనియర్ హైడ్రోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఎస్సీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 01.08.2025 నాటికి 30 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.57,000.
పోస్టు ద్వారా దరఖాసు స్వీకరణకు చివరి తేదీ: 29.09.2025
ఎంపిక: రాత పరీక్ష/ప్రొఫిషియెన్సీ టెస్ట్/ పర్సనల్ ఇంటర్వ్యూతో.
చిరునామా: డైరెక్టర్, మెరైన్ డిపార్ట్‌మెంట్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్ట్, కోల్‌కతా, నెం.15, స్ట్రాండ్ రోడ్, కోల్‌కతా -700001.
వెబ్‌సైట్: https://smp.smportkolkata.in/smpk/en/job-openings/

అప్రెంటిస్

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌లో..

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో 167 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ మేట్: 01 ◗ బ్లాస్టర్: 12 ◗ డీజిల్: 10
◗ ఫిట్టర్: 16 ◗ టర్నర్: 16 ◗ వెల్డర్: 16
◗ ఎలక్ట్రీషియన్: 36 ◗ డ్రాఫ్ట్స్‌మ్యాన్: 07
◗ సీఓపీఏ: 14 ◗ సర్వేయర్: 08
◗ మెకానిక్: 02 ◗ మ్యాసన్: 04
◗ కార్పెంటర్: 06 ◗ ప్లంబర్: 05
◗ హార్టికల్చర్ అసిస్టెంట్: 04
◗ ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్: 04
◗ సోలార్ టెక్నీషియన్: 06
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/బీఈ లేదా బీఏ/బీఎస్సీ/బీకామ్.
వయసు: 18 - 25 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.08.2025
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో.
వెబ్‌సైట్: https://www.hindustancopper.com/Page/Career_New



వాక్-ఇన్స్

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో..

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్, దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన 3 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
◗ ప్రాజెక్ట్ మేనేజర్: 01 ◗ క్వాలిటీ అస్యూరెన్స్ ఇంజినీర్: 01
◗ చీఫ్ సేఫ్టీ మేనేజర్: 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ (సివిల్ ఇంజినీరింగ్/డిప్లొమా ఇన్ క్వాలిటీ అస్యూరెన్స్)తో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: ప్రాజెక్ట్ మేనేజర్‌కు 55 ఏళ్లు, క్వాలిటీ అస్యూరెన్స్ ఇంజినీర్‌కు 50 ఏళ్లు, చీఫ్ సేఫ్టీ మేనేజర్‌కు 50 ఏళ్లు. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 22.08.2025
వెబ్‌సైట్: https://rvnl.org/job

టాటా మెమోరియల్ సెంటర్‌లో ..

టాటా మెమోరియల్ సెంటర్ నవీ ముంబయి తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీగా ఉన్న 5 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
◗ సైంటిఫిక్ అసిస్టెంట్ (ప్రాజెక్ట్) 04 ◗ సైంటిఫిక్ అసిస్టెంట్ (కాంట్రాక్ట్): 01
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీతో పాటు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో పరిజ్ఞానం. **వేతనం:** నెలకు సైంటిఫిక్ అసిస్టెంట్ (ఆన్ ప్రాజెక్ట్)కు రూ.25,000 - రూ.62,000, సైంటిఫిక్ అసిస్టెంట్ (కాంట్రాక్ట్)కు రూ.25,510 - రూ.35,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 22.08.2025
వేదిక: రూమ్.నం.205, సెకండ్ ఫ్లోర్, సెంటర్ ఫర్ క్యాన్సర్ ఎపిడెమాలజీ, అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్, సెక్టార్ 22, ఖర్‌గర్, నవీ ముంబయి-410 210.
వెబ్‌సైట్: https://tmc.gov.in/m_events/Events/JobDetail?jobId=36012

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

చదువు

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడితో మోదీ చర్చలు

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. వాణిజ్యం, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం రవాణా వంటి అంశాలపై ద్వైపాక్షిక సహకారం కొనసాగించేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. మిర్జియోయెవ్‌తో తన సంభాషణ ఫలవంతంగా ముగిసిందని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. "ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన కీలకాంశాల్లో సాధించిన ప్రగతిని ఇరువురం సమీక్షించాం. భారత్‌-ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిశ్చయించాం" అని మోదీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఈ చర్చలు ఉజ్బెకిస్థాన్ వైపు చూపడం గమనార్హం. 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

బెంగాల్ పోలీసులను బెదిరించిన భాజపా ఎమ్మెల్యేకు సమన్లు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఆర్జీకర్ హత్యాచార ఉదంతానికి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన నిరసనల్లో పోలీసులను బెదిరించారనే ఆరోపణలపై భాజపా ఎమ్మెల్యే, మాజీ క్రికెటర్ అశోక్ డిండాకు సమన్లు జారీ అయ్యాయి. "నిరసనల్లో ఎమ్మెల్యే డిండా పోలీసులను బెదిరించారు. విధుల్లో ఉన్న అధికారులపై దాడి చేయడానికి ఇతరుల్ని రెచ్చగొట్టారు. ఓ ఐపీఎస్ అధికారి గార్డుపై కూడా దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీని స్వాధీనం చేసుకున్నాం. ఈ నెల 17న కోల్‌కతాలోని న్యూ మార్కెట్ పోలీసుస్టేషన్ ముందు హాజరు కావాలని డిండాకు సమన్లు జారీ అయ్యాయి" అని మంగళవారం ఓ పోలీసు అధికారి వెల్లడించారు. బెంగాల్ సచివాలయం వరకు ఈ నెల 9న నిర్వహించిన ఆందోళనల్లో భద్రతా సిబ్బంది విధులకు ఆటంకం కల్పించడం, వారిపై దాడికి దిగడం, ప్రజా ఆస్తులకు నష్టం కలిగించారన్న ఆరోపణలపై మొత్తం ఏడు కేసులను పోలీసులు నమోదు చేశారు.

అక్టోబరు 1 నుంచి యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాలు

దిల్లీ: ఐఏఎస్, ఐపీఎస్ వంటి ప్రతిష్ఠాత్మక పోస్టులకు నియామక పరీక్షలు నిర్వహించే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) త్వరలో వందో సంవత్సరంలోకి ప్రవేశించనుంది. ఈ సందర్భంగా ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి వచ్చే ఏడాది అక్టోబరు 1 వరకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఛైర్మన్ అజయ్ కుమార్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు యూపీఎస్సీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. వందేళ్ల పండగ సందర్భంగా కమిషన్ విధుల్లో కొన్ని సంస్కరణలను తీసుకురానున్నామని అందులో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ చట్టం 1919, లీ కమిషన్ 1924లో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా 1926 అక్టోబరు 1న యూపీఎస్సీ ఏర్పాటయింది.

35 ఏళ్ల క్రితం హత్య.. ఇప్పుడు దర్యాప్తు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో 35 ఏళ్ల క్రితం జరిగిన పండిత్ మహిళ హత్య కేసులో రాష్ట్ర దర్యాప్తు సంస్థ మంగళవారం పలు చోట్ల దాడులు నిర్వహించింది. సౌరాలోని షేర్-ఎ-కశ్మీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో నర్సుగా పనిచేసిన సరళా భట్ అనే మహిళ 1990 ఏప్రిల్‌లో వసతిగృహం నుంచి అదృశ్యమైంది. మరుసటిరోజు అనుమానాస్పద స్థితిలో శ్రీనగర్‌లో శవమై కనిపించింది. హత్యకు సంబంధించి గతంలో నిషేధిత జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్(జేకేఎల్ఎఫ్)తో సంబంధం ఉన్న వ్యక్తుల ఇళ్లపై ఏజెన్సీ సోదాలు చేసింది. వీరిలో జేకేఎల్ఎఫ్ మాజీ అధ్యక్షుడు పీర్ నూరుల్ హక్ షా అలియాస్ ఎయిర్ మార్షల్ కూడా ఉన్నారు.

ఏకకాల ఎన్నికలపై పార్లమెంటరీ ప్యానెల్ గడువు పొడిగింపు

దిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు రెండు బిల్లులను పరిశీలించిన పార్లమెంటరీ కమిటీ గడువును లోక్‌సభ మంగళవారం మరోసారి పొడిగించింది. దీని ప్రకారం నివేదికను సమర్పించేందుకు ప్యానెల్‌కు శీతాకాల సమావేశాల చివరి వారం వరకు గడువు లభించింది. పార్లమెంటరీ ప్యానెల్ ఛైర్మన్ పి.పి.చౌదరి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

విదేశాల్లో జైలుశిక్ష పడితే ఓసీఐ కార్డు రద్దు

దిల్లీ: విదేశాల్లో ఉండే భారత సంతతి వ్యక్తులు ఎలాంటి వీసా లేకుండా స్వదేశానికి వచ్చేందుకు వీలు కల్పించే ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డు రద్దు కాకుండా ఉండాలంటే కొన్ని నియమాలు పాటించాలని మంత్రిత్వశాఖ తెలిపింది. రెండేళ్లు, ఆ పైన జైలు శిక్ష పడినా, ఏడేళ్లు, అంతకన్నా ఎక్కువ కాలం శిక్షపడే కేసు ఛార్జిషీటులో పేరున్నా వారికి ఈ కార్డు రద్దవుతుందని మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఓసీఐ కార్డులను ప్రభుత్వం 2005లో ప్రవేశపెట్టింది. 1950 జనవరి 26 నుంచి భారత పౌరులుగా ఉన్న వారికి ఓసీఐగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించింది.

ఇజ్రాయెల్ మారణహోమంపై భారత్ మౌనం సిగ్గుచేటు

- ప్రియాంకా గాంధీ విమర్శ



దిల్లీ: గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని, ఇప్పటికే వేల మంది పాలస్తీనియన్ల మరణానికి కారణమైందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. మొత్తం 60 వేల మందికి పైగా గాజా ప్రజలను ఇజ్రాయెల్ హత్య చేసిందని, వారిలో 18,430 మంది చిన్నారులు ఉన్నారని ఆమె అన్నారు. ఆ దేశం చిన్నారులతో సహా వందల మంది ఆకలి చావులకు కారణమైందని, లక్షలాది మంది ఆకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఆమె ఖండించారు. ఈ విషయంలో భారత్ మౌనం సిగ్గుచేటని విమర్శలు గుప్పించారు. మంగళవారం ఈ మేరకు ప్రియాంక 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఐదుగురు అల్‌జజీరా జర్నలిస్టుల హత్య పాలస్తీనాలో జరిగిన మరో దారుణమన్నారు. సత్యం కోసం నిలబడే వారి ధైర్యాన్ని, ద్వేషం, హింసతో ఇజ్రాయెల్ ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదని ఆమె నొక్కి చెప్పారు.

ఇజ్రాయెల్ రాయబారి ఖండన

ప్రియాంక ఆరోపణలను భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఖండించారు. గాజాలోని వేల మంది హమాస్ ఉగ్రవాదులనే తాము చంపామని బదులిచ్చారు. "మీ వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయి. 25 వేల మంది హమాస్ ఉగ్రవాదులను ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. సామాన్యుల వెనుక దాక్కొని హమాస్ హేయమైన వ్యూహాలకు పాల్పడుతుండటంతోనే ప్రాణనష్టం మరింత పెరుగుతోంది'' అని రూవెన్ వెల్లడించారు. ఇజ్రాయెల్ 20 లక్షల టన్నుల ఆహార పదార్థాలను గాజాలోకి పంపించిందని, హమాస్ మాత్రం వాటిని స్వాధీనం చేసుకొని అక్కడి ఆకలిచావులకు కారణమవుతోందన్నారు. గాజాలో మారణహోమం లేదని, గడిచిన 50 ఏళ్లలో అక్కడి జనాభా 450 శాతం పెరిగిందని పేర్కొన్నారు. రూవెన్ ఉపయోగించిన పదాలు ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ ఖండించింది. గాజాలో 18 నుంచి 20 నెలలుగా జరుగుతున్న మారణహోమంపై మౌనం వహిస్తున్న మోదీ- రూవెన్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తారని ఆశించకూడదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

సంక్లిష్టంగా నాడు.. సరళంగా నేడు

- మారుతున్న ఆదాయపు పన్ను చట్టం
- 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు

దిల్లీ: అర్థం కాని భాష, లెక్కకు మిక్కిలి సెక్షన్లు, మరెన్నో అధ్యాయాల సమాహారంగా ఉన్న 'ఆదాయపు పన్ను చట్టం-1961' త్వరలోనే చరిత్రగా మిగలనుంది. దీనిస్థానంలో సరళంగా రూపొందించిన నూతన ఐటీ బిల్లుకు మంగళవారం పార్లమెంటు ఆమోదం తెలపడంతో ఇది చట్టంగా మారేందుకు ఇక రాష్ట్రపతి సంతకమే మిగిలి ఉంది. సంక్లిష్టమైన ఐటీ నిబంధనల్ని సులభంగా అర్థం చేసుకునేలా భాష పరంగానే కాకుండా ఇతరత్రా అనేక మార్పులు చేసినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో తెలిపారు. భారీగా రాసిఉన్న సమాచారం స్థానంలో 39 కొత్త పట్టికలు, 40 నూతన సూత్రాలను తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. చదవడానికి, అర్థం చేసుకునేందుకు, అమలుకు వీలుగా ఇది ఉంటుందని వివరించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి వస్తుందని చెప్పారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ బిల్లును రికార్డుస్థాయిలో ఆరు నెలల్లో రూపొందించి.. ఈ ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రవేశపెట్టారు. దీనికోసం అందరూ కలిసి వెచ్చించిన సమయం 75 వేల గంటలు.

అంశం	ప్రస్తుత చట్టంలో	కొత్త బిల్లులో
పదాలు	5.12 లక్షలు	2.6 లక్షలు
సెక్షన్లు	819	536
అధ్యాయాలు	47	23

నేర నిరూపణ జరిగిన వ్యక్తి పార్టీ నేతగా ఉండవచ్చా?

- సుప్రీం కోర్టు పరిశీలనలో కీలక అంశం

దిల్లీ: నేర నిరూపణ జరిగిన కారణంగా ఓటు వేయలేకపోతున్న వ్యక్తి ఒక రాజకీయ పార్టీకి లేదా సంఘానికి నాయకత్వం వహించవచ్చా అన్న అంశంపై విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. 2017లో దాఖలైన ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంలో లేవనెత్తిన ఈ ప్రశ్న ఆసక్తికరమైందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఓటు వేసే అర్హత కోల్పోయిన కారణంగా ఒక వ్యక్తి తన ఆలోచనా విధానానికి అనుగుణమైన రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకునే అర్హత కూడా కోల్పోతాడా అన్న ప్రశ్నపై విచారణ జరగాల్సి ఉందని కోర్టు పేర్కొంది. "చట్టబద్ధమైన ఓ హక్కును కోల్పోయిన వ్యక్తి రాజ్యాంగ హక్కును శాశ్వతంగా దూరం చేయలేం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై తదుపరి విచారణను కోర్టు నవంబరు 19కి వాయిదా వేసింది. ఓటు వేసే అర్హత కోల్పోయిన వ్యక్తి అభ్యర్థులకు పార్టీ టికెట్లు పంపిణీ చేయకూడదు అని పిటిషనర్ పేర్కొన్నారు. 'ఈ విషయంపై కొంత అయోమయం ఉన్న దరిమిలా స్పష్టత సాధించాల్సిన అవసరం ఉంది. నేర నిరూపణ జరిగిన వ్యక్తి ఒక రాజకీయ పార్టీకి నాయకత్వం వహించరాదని లా కమిషన్‌తో సహా పలు కమిషన్లు పేర్కొన్నాయి" అని న్యాయమూర్తి అన్నారు. 80 ఏళ్లు దాటిన వ్యక్తి ప్రభుత్వ పదవి ఏదీ చేపట్టడానికి వీల్లేకుండా పార్లమెంటు చట్టం చేస్తే అప్పుడు ఆ వయసు దాటిన వారు రాజకీయ పార్టీలకు నేతృత్వం వహించే హక్కు కోల్పోతారా? అని ప్రశ్నించారు. నేర నిరూపణ జరిగిన వ్యక్తులు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేయకుండా, పార్టీ పదవుల్లో ఉండకుండా నిషేధం విధించాలని, ఓటేసే అర్హత లేనన్నాళ్లూ వారిపై ఈ నిషేధం అమలులో ఉండాలని పిటిషనర్ కోరుతున్నారు.

భారత తొలి వాణిజ్య భూపరిశీలన ఉపగ్రహ సమూహం

- సిద్ధం చేయనున్న పిక్సెల్ నేతృత్వంలోని కన్సార్షియం



దిల్లీ: భారత తొలి వాణిజ్య భూ పరిశీలన ఉపగ్రహ సమూహాన్ని నిర్మించి, నిర్వహించడానికి ఉద్దేశించిన బిడ్‌ను బెంగళూరుకు చెందిన పిక్సెల్ స్పేస్ నేతృత్వంలోని ఒక కన్సార్షియం దక్కించుకుంది. రోదసి కార్యకలాపాల నియంత్రణ సంస్థ 'ఇన్-స్పేస్' ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన చేసింది. ఈ కన్సార్షియంలో పియర్‌సైట్ స్పేస్, శాట్‌ష్యూర్ ఎనలిటిక్స్ ఇండియా, ధ్రువా స్పేస్ సంస్థలు ఉన్నాయి. వచ్చే ఐదేళ్లలో ఈ కంపెనీలు ఈ ప్రాజెక్టుపై రూ. 1,200 కోట్లకుపైగా వెచ్చించనున్నాయి. 12 భూ పరిశీలన ఉపగ్రహాలను నింగిలోకి పంపుతాయి. వీటిలో పాన్‌క్రొమాటిక్, మల్టీస్పెక్ట్రల్, మైక్రోవేవ్ సింథటిక్ ఎపెర్చర్ రాడార్ వంటి సెన్సర్లు ఉంటాయి. అత్యంత కచ్చితత్వంతో కూడిన వ్యవసాయం, నీటి నాణ్యత పర్యవేక్షణ, భూ వినియోగ మ్యాపింగ్, పర్యావరణ అంశాలపై పరిశీలన, విపత్తులపై అంచనా, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో ఇవి సేవలు అందిస్తాయి. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య నమూనా కింద ఉపగ్రహ సమూహాన్ని నిర్మిస్తారు. ఇది భారత ప్రైవేటు రంగ సామర్థ్యానికి నిదర్శనమని ఇన్-స్పేస్ ఛైర్మన్ పవన్ గోయెంకా తెలిపారు.

నియంత్రణ లేని మైనింగ్‌తో ఆరావళి పర్వతశ్రేణికి ముప్పు

సుప్రీంకోర్టు ఆందోళన

దిల్లీ: నాలుగు రాష్ట్రాల పరిధిలో విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణికి, దాని పరిధిలోని జీవావరణానికి.... నియంత్రణలేని మైనింగ్‌తో ముప్పుపొంచి ఉందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. మైనింగ్ అనుమతుల జారీకి ఆ రాష్ట్రాలు ఒక్కోవిధమైన నిర్వచనాన్ని ఇస్తున్నాయని, రకరకాల నిబంధనలను అనుసరిస్తున్నాయని పేర్కొంది. ఏకరూప విధానాన్ని అనుసరించడం ద్వారా ఆరావళి పర్వతాలను పరిరక్షించుకోవాల్సి ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం మంగళవారం అభిప్రాయపడింది. ఏకరూప విధానాన్ని రూపొందించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికను సమర్పించేందుకు మరో రెండు నెలల సమయం ఇస్తున్నట్లు తెలిపింది. అధికారులను నిందించటంపై ఆసక్తి లేదని, ఆరావళి పరిరక్షణే ధ్యేయమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆరావళి పర్వత శ్రేణులు దిల్లీ, హరియాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల పరిధిలో విస్తరించి ఉన్నాయి.

దుండగుడి కాల్పుల్లో ముగ్గురి మృతి

అమెరికాలోని టెక్సాస్‌లో ఘటన

టెక్సాస్: ఓ గన్‌మన్ టార్గెట్ స్టోర్‌లోని పార్కింగ్ ప్రదేశంలో విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఒకరికి గాయాలయ్యాయి. అనంతరం దుండగుడు కారులో పారిపోతుండగా ఛేదించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన అమెరికాలోని టెక్సాస్ రాజధాని ఆస్టిన్‌లో చోటుచేసుకుంది. 30 ఏళ్ల ఆ వ్యక్తి మానసిక ఆరోగ్యం సరిగా లేదని ఆస్టిన్ పోలీస్ అధికారి లీసా డేవిస్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2:15 గంటలకు ఓ కాల్‌కు స్పందించిన అధికారులు టార్గెట్ స్టోర్‌లోని పార్కింగ్ ప్రాంతంలో బులెట్ గాయాలతో పడి ఉన్న ముగ్గురిని కనుగొన్నారన్నారు. అందులో ఇద్దరు ఘటనా స్థలంలోనే మరణించారని, మూడో వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన తర్వాత ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. మరో వ్యక్తికి అక్కడే ప్రథమ చికిత్స అందించామని వివరించారు.

లారెన్స్ బిష్ణోయ్ ముఠాను 'ఉగ్రవాద సంస్థ'గా ప్రకటించాలి

కెనడా ఎంపీ ఫ్రాంక్ కాపుటో

దిల్లీ: లారెన్స్ బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కెనడా ఎంపీ ఫ్రాంక్ కాపుటో ప్రధాన మంత్రి మార్క్ కార్నీ, గవర్నింగ్ లిబరల్ పార్టీని కోరారు. గ్యాంగ్ సభ్యులు సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన 'ఎక్స్' వేదికగా ఓ లేఖను పంచుకున్నారు. బిష్ణోయ్ గ్యాంగ్ నేర సామ్రాజ్యం విస్తరిస్తోందని, కెనడా పౌరులను దోచుకోవడం, హత్య కేసుల్లో వీరి పాత్ర ఉందని కెనడా ఎంపీ ఫ్రాంక్ కాపుటో తన లేఖలో ఆరోపించారు.

విడాకులు తీసుకున్నాక అత్తమామలపై నేర విచారణ తగదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



దిల్లీ: దంపతులకు విడాకులు మంజూరై విడివిడిగా జీవిస్తున్నప్పటికీ అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులపై మళ్లీ నేర విచారణను కొనసాగించడం న్యాయం కాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. వరకట్న వేధింపులకు గురయ్యానని, భర్త, అతడి కుటుంబ సభ్యుల నుంచి క్రౌర్యాన్ని ఎదుర్కొన్నానని భర్త నుంచి విడిపోయిన ఓ మహిళ తన మాజీ మామపై వేసిన అభియోగాలను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ పైవిధంగా వ్యాఖ్యానించింది. ఈ కేసులోని దంపతులు 2021లోనే విడాకులు తీసుకుని విడివిడిగా జీవిస్తున్నారు. కానీ ఆ తరవాత మామ మీద కోడలు అభియోగాలు మోపింది. ఆమె ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడానికి మధ్యప్రదేశ్ హైకోర్టు నిరాకరించడంతో మామ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిజానికి అత్తమామలు కుమారుడు, కోడలు వద్ద ఉండటం లేదు. వేరుగా జీవిస్తున్నారు. వారు దూరమైన కోడలిని మళ్లీ వేధించిన దాఖలా లేదు. అయినా వారిని కేసులోకి లాగడమేమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 142వ రాజ్యాంగ అధికరణ అందరికీ సంపూర్ణ న్యాయం కోసం భరోసా ఇస్తోందని గుర్తుచేసింది. నిజంగా అన్యాయం జరిగితే కోర్టులు జోక్యం చేసుకోవడం ఎంత ముఖ్యమో, చట్టాన్ని దుర్వినియోగం కాకుండా చూడటమూ అంతే ముఖ్యమని తేల్చిచెప్పింది.

జిల్లా జడ్జి నియామక ప్రక్రియపై విచారణ

ఏడేళ్లపాటు న్యాయవాద వృత్తిలో ఉన్న న్యాయాధికారిని జిల్లా జడ్జిగా నియమించవచ్చునా అనే అంశాన్ని సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. జిల్లా జడ్జిగా నియమించడానికి దరఖాస్తుదారునికి తగు అర్హతలు ఉన్నాయా అనేది నియామక సమయంలోనే తేల్చాలా? లేక దరఖాస్తు చేసిన సమయంలో నిర్ణయించాలా? లేక రెండు సందర్భాల్లోనా అనే అంశాన్ని ధర్మాసనం పరిశీలించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్వీ అంజారియాల బెంచి కోరింది. ఇది న్యాయమూర్తుల నియామకాన్ని నిర్దేశించే 233(2) రాజ్యాంగ అధికరణకు సంబంధించినదని పేర్కొంది. ఇక్కడ కేసు కేరళ జ్యుడీషియల్ సర్వీసులో మున్సిఫ్‌గా పనిచేస్తున్న న్యాయాధికారికి సంబంధించినది. ఆయన్ను జిల్లా జడ్జిగా నియమిస్తూ జారీ అయిన ఉత్తర్వును గతంలో కేరళ హైకోర్టు కొట్టివేసింది. నియామక సమయంలో ఆయన న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయడం లేదని, మున్సిఫ్/మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారనే కారణంపై జిల్లా జడ్జిగా ఆయన నియామకాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు వ్యక్తి సుప్రీంకోర్టు ఆశ్రయించగా 2021లో హైకోర్టు ఉత్తర్వుపై స్టే లభించింది.

జర్నలిస్టు సిద్ధార్థ్‌కు రక్షణ

'ఆపరేషన్ సిందూర్' గురించి ప్రచురితమైన కథనానికి సంబంధించి సీనియర్ పాత్రికేయులు సిద్ధార్థ్ వరదరాజన్‌పై నమోదైన కేసులో అస్సాం పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. భారత న్యాయ సంహితలోని సెక్షన్ 152(సార్వభౌమాధికారాన్ని ప్రమాదంలో పడేసే చర్య)ని సవాలుచేస్తూ ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెన్స్ జర్నలిజం దాఖలుచేసిన పిటిషన్‌ను న్యాయస్థానం విచారించింది. కేసు దర్యాప్తు విషయంలో సహకరించాలని వరదరాజన్, స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ధర్మాసనం సూచించింది.



నిత్యావసరాలతో గాజాలోని ఖాన్ యూనిస్ చేరుకున్న ట్రక్కును చుట్టుముట్టిన పాలస్తీనియులు

బలూచ్ లిబరేషన్ ఆర్మీపై అమెరికా ఉగ్ర ముద్ర

ఇస్లామాబాద్: గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెడుతున్న బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ)పై అమెరికా ఉగ్ర ముద్ర వేసింది. బీఎల్ఏ దాని పోరాట విభాగం మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్ర సంస్థ(ఎఫ్‌టీవో)గా గుర్తించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. ఈ నిర్ణయం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడడంలో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కాగా పాక్ సైన్యాధిపతి, ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. 2000 సంవత్సరం నుంచి బీఎల్ఏ ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పాక్ కేంద్రంగా బీఎల్ఏ పలు దాడులు చేపడుతుండడంతో 2019లో ఆ సంస్థను గ్లోబల్ టెర్రరిస్టుగా(ఎస్‌డీజీటీ) అమెరికా గుర్తించింది. బీఎల్ఏకు ఎఫ్‌టీవో గుర్తింపు నిర్ణయంతో ఆ ఉగ్రవాద సంస్థ ఆస్తులను స్తంభింపజేయడానికి, దాని కార్యకలాపాలను నేరంగా గుర్తించడానికి, ఇతర దేశాలతో కలిసి ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలను నాశనం చేయడానికి అమెరికాకు ఉపయోగపడనుంది. పాక్ కేంద్రంగా కార్యకలాపాలు చేపట్టే లష్కరే తయ్యిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్)ను అమెరికా ఇటీవల విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించిన విషయం తెలిసిందే. ఫలితంగా పాక్‌పై ఉన్న ఉగ్రవాద ముద్ర మరింత బలపడింది. ఈసారి అమెరికా పర్యటనలో దీన్ని చెరిపివేసుకునే ప్రయత్నాన్ని ఆసిమ్ మునీర్ చేశారు. ఇందులో భాగంగానే బీఎల్ఏను విదేశీ ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్పించారు. తద్వారా తమది కూడా ఉగ్రవాద బాధిత దేశమే అని ప్రపంచాన్ని నమ్మించేందుకు పాక్ యత్నిస్తోంది



మెంటానాలో విమానాలు ఢీకొన్న అనంతరం చెలరేగిన మంటలు

ఆగిన విమానంపైకి దూసుకెళ్లిన మరో విమానం

అమెరికాలో ఘటన.. ఇద్దరికి గాయాలు

కాలిస్పెల్: అమెరికాలోని మోంటానా విమానాశ్రయంలో ప్రమాదం చోటుచేసుకుంది. పార్కింగ్ చేసి ఉన్న ఓ విమానంపైకి చిన్న విమానం దూసుకెళ్లింది. దీంతో భారీగా మంటలు వ్యాపించి పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. కాలిస్పెల్ నగరంలోని మోంటానా విమానాశ్రయంలో టీబీఎం 700 టర్బోప్రాప్ విమానాన్ని ల్యాండ్ చేసేందుకు పైలట్ ప్రయత్నించారు. ఆ సమయంలో ఆగిఉన్న విమానంపైకి టీబీఎం 700 టర్బోప్రాప్ దూసుకెళ్లింది. వెంటనే విమానంలోని పైలట్ సహా నలుగురు ప్రయాణికులు బయటకు రావడంతో ప్రాణ నష్టం తప్పింది. పైలట్ నియంత్రణ కోల్పోవడంతో విమానం అదుపుతప్పి అక్కడ ఆగి ఉన్న పలు విమానాలను ఢీకొందని, దీంతో భారీగా మంటలు వ్యాపించాయని తమ ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు అధికారులు వెల్లడించారు.

మా చిరునామాతో 9 నకిలీ ఓట్లు

కేరళలో ఓ మహిళ ఆరోపణ

తిరువనంతపురం: కేరళలోని త్రిశ్శూర్‌లో తమ చిరునామాతో 9 నకిలీ ఓట్లు నమోదయ్యాయని ఓ మహిళ ఆరోపించింది. త్రిశ్శూర్‌లోని పూన్‌కున్నంకు చెందిన ప్రసన్నకు స్థానికంగా 4సీ క్యాపిటల్ విలేజ్ అపార్ట్‌మెంట్లలో ఇల్లు ఉంది. అయితే తన కుటుంబం నుంచి త్రిశ్శూర్‌లో ఓటు వేసే ఏకైక వ్యక్తి తానేనని ప్రసన్న పేర్కొన్నారు. మిగిలిన నలుగురు కుటుంబసభ్యులు తమ స్వస్థలమైన పూచినిపాడులో ఓటు హక్కు నమోదుచేసుకున్నారని తెలిపారు. ఇటీవల ధ్రువీకరణ కోసం తనను సంప్రదించినప్పుడు ఈ తొమ్మిది అదనపు పేర్ల గురించి తెలుసుకున్నానని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశానని ప్రసన్న పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవడానికి భాజపా ఓట్ల చోరీకి పాల్పడిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఖాళీగా ఉండే ఫ్లాట్లను నకిలీ చిరునామాలుగా మార్చి, ఇతర జిల్లాల నుంచి ఓట్లను బదిలీ చేశారని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ఓటరు నమోదుకు చిరునామా రుజువుగా.. పోస్టల్ కార్డును ఉపయోగించడం ద్వారా ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను సులభతరం చేసిందని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో కేరళలో భాజపా గెలుచుకున్న ఏకైక లోక్‌సభ స్థానం త్రిశ్శూర్.

అసీం మునీర్ లాడెన్ లాంటి వాడు

పెంటగాన్ మాజీ అధికారి మండిపాటు

వాషింగ్టన్: అమెరికా పర్యటనలో ఉండగానే అణు బెదిరింపులకు పాల్పడిన పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్‌ను పెంటగాన్ మాజీ అధికారి తీవ్రంగా విమర్శించారు. మునీర్.. సూట్‌లో ఉన్న కరడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా మాజీ చీఫ్ ఒసామా బిన్ లాడెన్ అని మైఖెల్ రూబిన్ అన్నారు. సగం ప్రపంచాన్ని అణ్వాయుధాలతో నాశనం చేస్తామని బెదిరిస్తున్న పాకిస్థాన్ చట్టబద్ధమైన దేశంగా ఉండే హక్కును కోల్పోయిందని మండిపడ్డారు. 'అమెరికా గడ్డపై ఉండి పాక్ ఆర్మీ చీఫ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. ఈ బెదిరింపు నేపథ్యంలో పాకిస్థాన్ ఒక దేశంగా తమ బాధ్యతలను నిర్వర్తించగలదా అనే ప్రశ్న చాలా మందిలో తలెత్తుతోంది. మునీర్ వ్యాఖ్యలు గతంలో ఐసిస్, ఒసామా బిన్ లాడెన్ చేసిన ప్రకటనలను తలపిస్తున్నాయి. ఆయన మాటలను ట్రంప్ సర్కార్ వెంటనే ఖండించి, దేశం నుంచి బహిష్కరించాల్సింది. పాక్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకుని, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశంగా గుర్తించాలి" అని రూబిన్ అన్నారు.

భారత్‌-అమెరికా సంబంధాలు మళ్లీ మెరుగవుతాయి

ఇటీవల భారత దిగుమతులపై అమెరికా విధించిన సుంకాలపై కూడా రూబిన్ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ న్యూదిల్లీని లక్ష్యంగా చేసుకోవడాన్ని తప్పుబట్టారు. "ప్రస్తుత పరిపాలనా విధానం మారిన తర్వాత భారత్-అమెరికా సంబంధాలు గణనీయంగా మెరుగవుతాయి. ట్రంప్ ఒక వ్యాపారవేత్త. చెడు శాంతి ఒప్పందం.. యుద్ధాన్ని ముందుకు తీసుకెళ్తుందనే విషయం ఆయనకు అర్థం కావడం లేదు" అని రూబిన్ వ్యాఖ్యానించారు.

15న మసీదులన్నీ త్రివర్ణ పతాకం ఎగరేయాలి

ఛత్తీస్‌గఢ్ వక్ఫ్‌బోర్డు ఆదేశం

రాయ్‌పుర్: రాష్ట్రంలోని మసీదులు, దర్గాలు, మదర్సాలన్నీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగరేయాలని ఛత్తీస్‌గఢ్ వక్ఫ్ బోర్డు ఆదేశించింది. 'త్రివర్ణ పతాకం గౌరవానికి.. గర్వానికి ప్రతీక..' ఇది ఏ మతానికీ సంబంధించినది కాదని ఛత్తీస్‌గఢ్ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ డా. సలీం రాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు వక్ఫ్‌బోర్డు నిర్వాహకులకు ఆయన ఓ లేఖ రాశారు. 'ఈ ఏడాది 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్ని మసీదులు, దర్గాలు, మదర్సాలు ప్రధాన ద్వారం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగరేయాలి. స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను అర్థం చేసుకుని దేశభక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలి" అని ఆయన కోరారు.

ఐఎస్ఐ ఉగ్రవాదుల నెట్‌వర్క్ గుట్టురట్టు

చండీగఢ్: ఐఎస్ఐ మద్దతు గల బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ) టెర్రర్ నెట్‌వర్క్‌ను ఛేదించి, ఐదుగురు ఉగ్రవాదులను మంగళవారం పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ నిందితుడికి గాయాలయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎస్‌బీఎస్‌లోని ఓ మద్యం దుకాణంపై దాడి చేయాలని వారు ప్రణాళిక వేసుకున్నారని డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. నిందితుల నుంచి ఓ హ్యాండ్ గ్రెనేడ్, ఎ30 బోర్ పిస్టల్‌తో పాటు రెండు లైవ్ కాట్రిడ్జ్‌లు, రెండు ఖాళీ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జమ్మూకశ్మీర్‌లో తుపాకీ పేలి.. సైనికుడి మృతి

భద్రవాహ్: ఓ సైనిక స్థావరంలో ప్రమాదవశాత్తు తుపాకీ పేలి సైనికుడు మృతిచెందిన ఘటన జమ్మూకశ్మీర్‌లోని డోడా జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన సురేశ్ బిస్వాల్ భద్రవాహ్‌లోని సర్నా శిబిరంలో తన సర్వీసు తుపాకీని శుభ్రం చేస్తుండగా పొరపాటున అదిపేలి ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల శబ్దం విన్న తోటిసైనికులు రక్తపు మడుగులో ఉన్న సైనికుడిని స్థానిక ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

జమ్మూలో వర్ష బీభత్సం.. పాఠశాలల మూసివేత

జమ్ము: భారీ వర్షాల కారణంగా జమ్మూ ప్రాంతంలోని పలు జిల్లాలు ప్రభావితమయ్యాయి. రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా ఆకస్మికంగా వరదలు పోటెత్తాయి. దీంతో ఓ ఉన్నత పాఠశాల సహా రెండు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ప్రధాన రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో రాజౌరీ, రియాసీ, పూంఛ్ జిల్లాల్లో పాఠశాలలను తాత్కాలికంగా మూసివేశారు. రియాసీలో చీనాబ్ నది నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరింది. ఈ నెల 13, 14, 15 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.



జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా కంజాలో భారీ వర్షాల కారణంగా రహదారిపై విరిగిపడిన కొండచరియలు



బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు

దిల్లీ ధర్నాకు ఎంపీలను పంపించండి

సీఎం చంద్రబాబును కలిసి విన్నవించిన రాష్ట్ర బీసీ నేతలు

ఈనాడు, అమరావతి: బీసీల హక్కుల సాధన కోసం ఈ నెల 18, 19 తేదీల్లో దిల్లీ వేదికగా చేపట్టే కార్యక్రమాలకు పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలను పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నూకానమ్మ, రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ కోరారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. 18వ తేదీన ధర్నా కార్యక్రమాన్ని, 19వ తేదీన సెమినార్‌ను నిర్వహించనున్నట్లు వివరించారు. బీసీలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇంకా ఆదుకుంటామని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు.

పీఆర్ టీచర్ల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి: ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ ఉపాధ్యాయ కుటుంబాలకు తక్షణమే కారుణ్య నియామకాలు చేపట్టాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయ రాజు, చిరంజీవి కోరారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ మంగళవారం సచివాలయంలో సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హృదయరాజు, చిరంజీవిలు మాట్లాడుతూ.. జిల్లా విభజన కారణంగా జడ్పీ పీఎఫ్ బిల్లుల సమర్పణలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని, తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన 8 మండలాల్లోని టీచర్లు, ఉద్యోగుల పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి: ఈయూ

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ (పీటీడీ) ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కోరింది. పదవీవిరమణ పొందిన, చనిపోయిన ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు చెల్లించలేదని, గ్రాట్యుటీ బకాయిలు కూడా గత డిసెంబరు నుంచి పెండింగ్‌లో ఉన్నాయని ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టకపోతే.. మిగిలిన సంఘాలతో కూడా చర్చించి నెలాఖరుకు రాష్ట్రస్థాయి కార్యాచరణ చేపడతామని తెలిపారు.

పీఎఫ్ ట్రస్టుకు మళ్లీ వినతులకు అవకాశం: ఎన్ఎంయూఏ

ఈనాడు, అమరావతి: హయ్యర్ పింఛన్‌కు సంబంధించి డిమాండ్ నోటీసులు వచ్చినా డబ్బులు చెల్లించలేకపోయిన ఉద్యోగులు మరోసారి వినతి పెట్టుకునేందుకు పీఎఫ్ ట్రస్ట్ అవకాశం కల్పించినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) తెలిపింది. ట్రస్ట్ అధికారులు ఆ వినతులు పరిశీలించి, తదుపరి ఆదేశాలిస్తే ఈ నెల 30లోపు చెల్లింపులు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. గతంలో డిమాండ్ నోటీస్ వచ్చి, అందులోని మొత్తాన్ని చెల్లించలేనివాళ్లు హైదరాబాద్ రీజనల్ పీఎఫ్ కమిషనర్‌కు వినతి పంపాలని, ఓ కాపీని ఆర్టీసీలో డిప్యూటీ సీఏఓకి పంపాలని ఎన్ఎంయూఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

డీ-స్లడ్జింగ్ వాహనాల సమర్థ వినియోగానికి జిల్లా స్థాయి కమిటీలు

ఈనాడు, అమరావతి: సఫాయి కర్మచారీలకు అందించిన వాక్యూమ్ సక్షన్ డీ-స్లడ్జింగ్ వాహనాల సమర్థ వినియోగం, మంజూరు చేసిన రుణ వాయిదాలు సక్రమంగా చెల్లింపు తదితర విషయాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకునేందుకు సంయుక్త కలెక్టర్ నేతృత్వంలో జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారులు కొన్ని నెలలపాటు వాయిదాలు చెల్లించకుండా డీఫాల్టర్‌గా ఉంటే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పూర్తిస్థాయి ప్రయత్నాలు చేసిన తర్వాత ఆ జాబితా సిద్ధం చేయాలని సూచించింది. అలాంటి సందర్భాల్లో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించి ఎంపిక చేయాలని తెలిపింది. తర్వాత వారంలోపు వాహనాన్ని వారికి అప్పగించాలని సూచించింది.

వైఎస్ విగ్రహం ఏర్పాటు విషయంలో వివరాలు సమర్పించండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని వర్సిటీ వర్గాలు మార్చుకోవడంపై మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని వర్సిటీ అధికారులను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విగ్రహం ఏర్పాటుకు పిటిషనర్ రూ.4 లక్షలు విరాళంగా ఇచ్చారని కోర్టు దృష్టికి తెచ్చారు.

ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండండి

స్పోర్ట్స్ డీఎస్సీ అభ్యర్థులకు శాప్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీ స్పోర్ట్స్ డీఎస్సీ-2025కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) పేరు చెప్పి కొందరు ఫోన్లు చేస్తున్నారని అలాంటి కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని శాప్ ఎండీ అజయ్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫేక్ కాల్స్ చేస్తున్న వారు శాప్ నుంచి మాట్లాడుతున్నామని వివరాలు అడుగుతున్నారని ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని నమ్మవద్దన్నారు. స్పోర్ట్స్ మెగా డీఎస్సీ పారదర్శకంగా జరుగుతోందని, శాప్ నుంచి ఎవరికీ ఫోన్ కాల్స్ రావని స్పష్టం చేశారు. ఇటీవల ప్రకటించిన 'ప్రిలిమినరీ' జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 13 వరకు తెలియజేయాలని తెలిపారు. అభ్యంతరాల స్వీకరణకు శాప్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ కూడా ఏర్పాటు చేశామన్నారు.

పాలనా సౌలభ్యం..

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- జిల్లా, మండల, గ్రామాల సరి హద్దులు, పేర్ల మార్పులు
- నేడు సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ
- ఇప్పటికే ప్రభుత్వం వద్ద కొన్ని ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా ప్రజల అవసరాలు, పాలనా సౌలభ్యాన్ని పక్కన పెట్టి.. రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేశారు. పెద్దఎత్తున అభ్యంతరాలు వచ్చినా తోసిపుచ్చి.. 13 జిల్లాలను 26 చేశారు. అశాస్త్రీయ విభజన కారణంగా.. కొన్నిచోట్ల జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్ల మార్పుపైనా డిమాండ్లు వస్తున్నాయి. దీంతో ప్రజలకు పాలన దగ్గర చేయడం, సేవలు మెరుగుపరచడం, వనరుల కేటాయింపు, పరిపాలనా సౌలభ్యమే లక్ష్యంగా జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్లు మార్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అధ్యయనానికి ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని నియమించింది. వీరు బుధవారం సచివాలయంలో వినతులు స్వీకరించి, ఇప్పటికే ఉన్న ప్రతిపాదనలపై చర్చించనున్నారు. అనంతరం ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. తర్వాత గవర్నర్ తుది నోటిఫికేషన్ జారీచేస్తారు. ఇదంతా డిసెంబరు 31లోగా పూర్తవ్వాలి. జనగణన నేపథ్యంలో 2026 జనవరి 1 నుంచి 2027 మార్చి 31 వరకు ఎలాంటి మార్పులు చేయడానికి వీలుండదు.

ఇప్పటికే ప్రభుత్వం ముందున్న ప్రతిపాదనలు

- ◆ బాపట్ల జిల్లాలో ఉన్న బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజన్లను సవరించి.. అద్దంకి కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటుచేయాలి
- ◆ పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలోని లఖనాపురం గ్రామాన్ని లఖనాపురం, రావివలస గ్రామాలుగా విభజించాలి.
- ◆ చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాలను అన్నమయ్య జిల్లాలో కలపాలి.
- ◆ మదనపల్లె మండలాన్ని విభజించి అర్బన్ మదనపల్లె మండలాన్ని సృష్టించాలి.
- ◆ నందిగామ నియోజకవర్గంలోని వీరులపాడు మండలకేంద్రంగా జుజ్జూరు ఉంది. వీరులపాడునే మండల కేంద్రంగా కొనసాగించాలని ఎమ్మెల్యే సౌమ్య కోరుతున్నారు.
- ◆ విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాలను విశాఖపట్నం జిల్లాలో విలీనం చేయాలి.

సరిహద్దుల మార్పు, కొత్తగా ఏర్పాటుకు పరిశీలించే అంశాలేంటి?

- ◆ విస్తీర్ణం, జనాభా, ఆదాయం
- ◆ చారిత్రక, భౌగోళిక సంబంధాలు, సామీప్యం, సహజ లక్షణాలు, ఉమ్మడి ఆసక్తులు, సామాజిక, సాంస్కృతిక, విద్యా అవసరాలు
- ◆ అభివృద్ధి స్థాయి, ప్రణాళికబద్ధమైన సంక్షేమ కార్యక్రమాలు
- ◆ పరిపాలన అవసరం, పాలనా సామర్థ్యం
- ◆ ఆర్థికాంశాలు.. ఖర్చుల ప్రభావం

500 మీటర్లు పూర్తయిన డయాఫ్రం వాల్

- డిసెంబర్ నాటికి మొత్తం పూర్తి: రామానాయుడు



మూడు గ్రాబర్లతో చేస్తున్న డయాఫ్రం వాల్ పనులు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం మంగళవారం నాటికి 500 మీటర్లు పూర్తయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మొత్తం 1,395 మీటర్ల డి వాల్ నిర్మాణానికి 500 మీటర్లు పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన మేరకు డయాఫ్రం వాల్ పనులు షెడ్యూలు ప్రకారమే జరుగుతున్నాయని స్పష్టంచేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లోతైన భాగంలో డి వాల్ నిర్మాణం పూర్తయిందని, ఇక లోతుగా వెళ్లి పని చేయాల్సిన అవసరం లేనందున మిగిలిన మేర డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయడం సాధ్యమవుతుందని వెల్లడించారు. "మూడు ట్రెంచి కట్టర్లు, మూడు గ్రాబర్లతో గ్యాప్ 2 డయాఫ్రం వాల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొంత వరద ఉన్నా అక్కడ నీరు చేరకుండా ఎప్పటికప్పుడు ఎత్తిపోసేస్తూ పనులు చేస్తున్నాం. ఎగువ కాఫర్ డ్యాంను పటిష్ఠ పరిచే బట్రస్ డ్యాం నిర్మాణ పనులు 90శాతానికి పైగా పూర్తయ్యాయి' అని మంత్రి రామానాయుడు వివరించారు.

విద్యారంగంలో మౌలికవసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులు ఉపయోగించండి

కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు లంకాదినకర్ వినతి



కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకాదినకర్

ఈనాడు, దిల్లీ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి అవసరమైన మౌలికసదుపాయాల కల్పన కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు ఉపయోగించాలని ఏపీ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకాదినకర్ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో విద్యారంగం అభివృద్ధికి ఈ నిధులను వినియోగించాలన్నారు. దీని వల్ల పట్టణ-గ్రామీణ ప్రాంత పాఠశాలల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి వీలవుతుందని తెలిపారు. గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి వృత్తి శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.

బీఫార్మసీ, ఫార్మాడీ కళాశాలలకు అనుమతులు

ఈనాడు, అమరావతి: 2025-26 విద్యా సంవత్సరానికి గాను బీఫార్మసీ, ఫార్మాడీ కోర్సులకు సంబంధించి ఆరు ప్రభుత్వ, 85 ప్రైవేటు ఫార్మసీ కళాశాలలకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భారత ఫార్మసీ కౌన్సిల్ ఇచ్చిన అనుమతుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది.

మాజీ సైనికులకు వ్యవసాయ డ్రోన్‌లు

- 'దేశ సేవ నుంచి పల్లె సేవకు' పథకంలో భాగంగా యూఏవీ నిర్వహణపై శిక్షణ

ఈనాడు, అమరావతి: సైనికులుగా దేశానికి సేవలందించిన వారు.. ఇప్పుడు మాజీ సైనికులుగా పల్లె సేవకు సిద్ధమవుతున్నారు. పదవీ విరమణ చేసి వచ్చిన మాజీ సైనికులకు ప్రత్యామ్నాయ ఉపాధికల్పన కోసం సైనిక సంక్షేమ శాఖ, కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు చెందిన దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'దేశ సేవ నుంచి పల్లె సేవకు' పథకానికి శ్రీకారం చుట్టారు. ఔత్సాహికులైన మాజీ సైనికులకు ఈ పథకం కింద దక్ష అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ నుంచి వ్యవసాయ డ్రోన్లను అందజేస్తారు. రూ.11లక్షల విలువైన ఈ డ్రోన్‌ను మొదట రూ.1.50 లక్షలు కట్టి పొందొచ్చు.. మిగిలిన మొత్తాన్ని ఎలా చెల్లించాలి, రాయితీ వివరాలను అగ్రిమెంట్‌లో పొందుపరుస్తారు. ఏడాది గ్యారెంటీ ఇస్తారు. డ్రోన్‌తోపాటు వచ్చే బ్యాటరీ సెట్‌తోపాటు మరో అయిదు సెట్లను అందజేస్తారు. ఈ డ్రోన్‌తో రోజుకు 30 ఎకరాల విస్తీర్ణంలో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయవచ్చు.

శిక్షణ..

చిన్న, మధ్య తరహా వ్యవసాయ డ్రోన్‌ల నిర్వహణ కోసం పైలట్ శిక్షణను దక్ష అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ ఇవ్వనుంది. డ్రోన్ తీసుకున్న మాజీ సైనికుడికి మాత్రమే శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ కోసం ఒక్కొక్కరికీ అవసరమయ్యే రూ.80వేలను సైనిక సంక్షేమ శాఖ భరిస్తుంది. హైదరాబాద్/చెన్నైలో ఈ శిక్షణ ఉంటుంది.. 10 రోజుల శిక్షణ అనంతరం వ్యవసాయ డ్రోన్ పైలట్‌గా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ధ్రువీకరణ పత్రాన్నీ ఇస్తారు. అప్పుడు వారు లీగల్ డ్రోన్ పైలట్ అవుతారు. వారి పేరు, లైసెన్స్ వివరాలను డీజీసీఏ వద్ద నమోదు చేస్తారు. ఈ పైలట్ లైసెన్స్ ఉంటే తర్వాత నిఘా డ్రోన్‌లను ఆపరేట్ చేసే అర్హత కూడా వచ్చే అవకాశం ఉంటుంది. మాజీ సైనికులకు పురుగు మందులు పిచికారీ చేసే పనిని కూడా కోరమాండల్ కంపెనీ ఇస్తుంది. ఇందు కోసం ఎకరాకు రూ.400 నుంచి రూ.500 వరకు ఇస్తారు.

కొనుగోలు చేసి.. కన్నారని నమ్మించి..

- సరోగసీ ముసుగులో 'సృష్టి' మోసాలు
- 25 మంది అరెస్టు.. కేసు సిట్‌కు బదిలీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాధన రష్మి. చిత్రంలో ఏసీపీ సుబ్బయ్య

ఈనాడు, హైదరాబాద్ రెజిమెంటల్ బజార్, న్యూస్‌టుడే: సంతానం లేని దంపతుల నుంచి అండాలు, వీర్యకణాలు సేకరించారు. అద్దె గర్భంలో బిడ్డ పెరుగుతున్నట్లు నమ్మించారు. పేద కుటుంబాల నుంచి కొనుగోలు చేసిన శిశువులను వారికిచ్చి రూ.లక్షలు కాజేశారు. సరోగసీ ముసుగులో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ సాగించిన మోసాలపై పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసిన అంశాలివి. తీవ్రత దృష్ట్యా కేసును హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిట్‌కు బదిలీ చేశారు. ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతపై గతంలోనే తెలుగు రాష్ట్రాల్లో 15 కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు 25 మంది నిందితులు అరెస్టయ్యారు. సికింద్రాబాద్ ఉత్తర మండలం డీసీపీ కార్యాలయంలో మంగళవారం డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ఇప్పటి వరకూ జరిగిన దర్యాప్తు వివరాలు వెల్లడించారు.

నకిలీ స్కానింగ్ రిపోర్టులతో మస్కా...

విజయవాడకు చెందిన డాక్టర్ అత్తలూరి నమ్రత అలియాస్ పచ్చిపాల నమ్రత పలుచోట్ల యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాలు ప్రారంభించారు. సరోగసీ కోసం తమను సంప్రదించిన ఒక్కొక్కరి వద్ద రూ.20-40 లక్షలు వసూలు చేసేవారు. సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో వైద్య పరీక్షల అనంతరం దంపతులను విశాఖపట్నం పంపేవారు. సరోగసీ కోసమంటూ భార్యభర్తల నుంచి అండం, వీర్యకణాలు సేకరించేవారు. కొందరు మహిళలకు అండాలు సరిగా లేవంటూ హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి అదనంగా వసూలు చేసేవారు. ఆసుపత్రిలో మహిళా సిబ్బంది, గర్భిణులను సరోగసీ తల్లులుగా చూపి బాధితులను మభ్యపెట్టేవారు. నెలరోజుల తరువాత ఒక మహిళ గర్భం(సరోగసీ)లో పిల్లలు ప్రాణం పోసుకుంటున్నారంటూ చెప్పేవారు. బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతున్నట్లు నకిలీ స్కానింగ్ రిపోర్టులు పంపి నమ్మకం కలిగించే వారు. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న ఏజెంట్ల ద్వారా గర్భిణుల కోసం వెతికే వారు. వారి కుటుంబ నేపథ్యం తెలుసుకున్నాక పుట్టబోయే బిడ్డకు రేటు నిర్ణయించి తమ అధీనంలోకి తీసుకునేవారు. డాక్టర్ నమ్రత... ఏజెంట్ నుంచి వైద్యుల వరకూ పెద్ద ఎత్తున కమీషన్ ఆశ చూపి సిండికేట్‌గా మార్చారు. దేశవ్యాప్తంగా శిశు విక్రయ ముఠాలు, ఏజెంట్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు.

గర్భిణులకు ప్రసవం కాగానే మగ పిల్లాడైతే రూ.4.5 లక్షలు, ఆడపిల్ల అయితే రూ.3.5 లక్షలు ఏజెంట్లకు పంపుతారు. పిల్లల్ని విక్రయించిన తల్లిదండ్రులకు రూ.80-90 వేలు ఇచ్చి.. మిగిలిన సొమ్మును ఏజెంట్లు పంచుకుంటారు. ఏ ప్రాంతానికి చెందిన దంపతులైనా.. విశాఖపట్నంలోని క్లినిక్‌లోనే పిల్లలను అప్పగిస్తారు. తమ సొంత బిడ్డేనని తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేందుకు నకిలీ డీఎన్ఏ పరీక్షల నివేదికలు ఇచ్చేవారు. గత నెల 27న రాజస్థాన్ దంపతులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. డాక్టర్ నమ్రతపై 8 కేసులు నమోదయ్యాయి. 25 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో నమ్రత, ఆమె కుమారుడు ఎస్ఎస్ జయంత్ కృష్ణ, నలుగురు వైద్యులు, ఏజెంట్లు, పిల్లల్ని విక్రయించిన తల్లిదండ్రులు ఉన్నారు.

తప్పుడు పత్రాలతో భూమి ఆక్రమించారు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ పత్రాలతో పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించి తన భూమి ఆక్రమించారని వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మండలం బండివారిపల్లె గ్రామానికి చెందిన రమణయ్య వాపోయారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలకు ఈ మేరకు వినతి అందించి సమస్య వివరించారు. భూమి ఆక్రమించిన వారికి నాయకులు, మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లోని కొందరు సిబ్బంది సహకరిస్తూ తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

◆ తన భర్త రాఘవేంద్రరాజు యూపీ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తూ అనారోగ్యంతో 2008లో చనిపోయారని, అప్పట్నుంచి కారుణ్య నియామకం కోసం అర్జీలు ఇచ్చినా న్యాయం జరగలేదని వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం క్రిష్టంపల్లె గ్రామానికి చెందిన గుడిమెట్ల మంగమ్మ వాపోయారు. పోలియోతో వైకల్యానికి గురైన తాము కులాంతర వివాహం చేసుకున్నామని, చనిపోయేనాటికి తన భర్తకు 11 ఏళ్ల సర్వీసు ఉన్నందున తమ కుమార్తెకు ఉద్యోగం ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

◆ 25 ఏళ్లుగా సాగుచేస్తున్న భూమికి పాస్ పుస్తకాలు, పంట పన్ను రశీదులు ఉన్నా.. రీ సర్వేలో భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారని కృష్ణా జిల్లా అంపాపురం గ్రామానికి చెందిన కరణం అప్పారావు అర్జీ ఇచ్చారు.

నేడు గ్రూపు-I క్రీడా కోటా సర్టిఫికెట్ల పరిశీలన

ఈనాడు, అమరావతి: గ్రూపు-1 క్రీడా కోటాకు సంబంధించిన 37 మంది అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో బుధవారం హాజరు కావాలని ఏపీపీఎస్సీ కార్యదర్శి రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన మొదలవుతుందని, గైర్హాజరైతే తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

'ఫార్మసీ ఇన్‌స్పెక్టర్ల నియామకం చేపట్టాలి'

ఈనాడు, అమరావతి: ఫార్మసీ ఇన్‌స్పెక్టర్ల నియామకం వెంటనే చేపట్టాలని సీఎం చంద్రబాబును రాష్ట్ర ఫార్మసిస్టుల సమాఖ్య కోరింది. మెడికల్ షాపులలో ప్రజలకు మందులు ఇస్తున్న అర్హత లేని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని విన్నవించింది. ఫార్మసిస్టులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సిబ్బందిపై క్రమశిక్షణ, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఏపీ ఫార్మసిస్టుల సమాఖ్య అధ్యక్షుడు సింగనమల సుమన్ మోదీ మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఫార్మసిస్టుల రిజిస్ట్రేషన్‌ను ఐదేళ్లకోసారి రెన్యువల్ చేయాలని అందులో కోరారు.

మన మిత్రలో పింఛన్ గ్రీవెన్స్‌కు అవకాశం

ఈనాడు, అమరావతి: వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా మన మిత్ర యాప్‌లో ఆగస్టు 15 నుంచి పింఛను గ్రీవెన్స్ నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) ఎక్స్ అఫీషియో కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. పింఛనుకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేసి, అందుకు తగ్గ పత్రాలను అప్‌లోడ్ చేయొచ్చని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో..

1,184 కి.మీ. రహదారుల నిర్మాణం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో 1,184 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించినట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇక్కడ 1,507 మొబైల్ టవర్లు ప్రారంభమైనట్లు తెలిపారు. 'ఈ ప్రాంతాలకు 22 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరయ్యాయి. ఒక ఐటీఐ పని చేస్తోంది. 320 పోస్టాఫీసులు, 30 ఏటీఎంలు అందుబాటులో ఉన్నాయి. 257 మంది బ్యాంకింగ్ కరెస్పాండెంట్లు సేవలు అందిస్తున్నారు' అని తెలిపారు. అయితే ఈ ప్రాంతాల్లో ఒక్క బ్యాంక్ బ్రాంచి కూడా లేదని మంత్రి చెప్పారు. '2013-25 ఏప్రిల్ మధ్యకాలంలో వామపక్ష ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 18కి పడిపోయింది. ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం 2017లో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీం ప్రారంభించాక ఇప్పటివరకూ రూ.3,769 కోట్లు విడుదల చేసింద'ని కేంద్రమంత్రి నిత్యానందరాయ్ వివరించారు.

ఫ్లైయాష్‌ను ఇటుకల బట్టీలకు ఉచితంగా అందించాలి

అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణ

ఫ్లైయాష్‌ను ఇటుకల బట్టీలకు ఉచితంగా అందించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం లోక్‌సభలో గనులు, ఖనిజ చట్టసవరణ బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడారు. ఫ్లైయాష్‌ను ఇటుకల బట్టీలకు ఇవ్వడం వల్ల మట్టి తవ్వకాలు తగ్గడంతో పాటు నిర్మాణాల్లో కూడా సుస్థిర విధానాలు అనుసరించడానికి వీలవుతుందన్నారు. సున్నపురాయి రాయల్టీని ప్రస్తుత విధానం ప్రకారం తవ్వకం పరిమాణం ఆధారంగా కాకుండా సిమెంట్ ఉత్పత్తి నిష్పత్తి ఆధారంగా వసూలు చేయాలని సూచించారు. దీనివల్ల సున్నపురాయి తవ్వకాలపై పర్యవేక్షణను సులభతరం చేసి ప్రభుత్వానికి సరైన ఆదాయం ఆర్జించడానికి వీలవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత వైకాపా ప్రభుత్వం గనుల రంగాన్ని నాశనం చేసిందని ఎంపీ ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఖనిజాలు, ఇసుక అక్రమ రవాణా వల్ల ఈ రంగం వాటా జీడీపీలో 3.5% నుంచి 2.7%కి పడిపోయినట్లు లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు.

ఏపీలో 340 వెటర్నరీ డాక్టర్ పోస్టులు ఖాళీ

ఆంధ్రప్రదేశ్‌లో 340 వెటర్నరీ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర పశు సంవర్ధక శాఖ సహాయమంత్రి ఎస్పీ సింగ్ భగేల్ తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 2,743 పశువైద్యుల పోస్టులు ఉండగా అందులో 340 (12.39%) ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఆయన మంగళవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం వెల్లడించారు.

పీఎంఏవై-జి ఇళ్లలో 88,950 పూర్తి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) కింద ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేసిన 2,46,930 ఇళ్లలో 88,950 (36.02%) నిర్మాణం పూర్తయినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. లోక్‌సభలో ఆయన ఓ ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు.



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ న్యాపతి విజయ్, జస్టిస్ ఎన్ హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి

గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హైకోర్టు న్యాయమూర్తులు

నేడు వారు శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం

ఈనాడు, అమరావతి: హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఇటీవల నియమితులైన జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మంగళవారం రాజ్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో బుధవారం ఉదయం 10 గంటలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్.. ఈ నలుగురితో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

స్వాతంత్య్రోద్యమంలో ఉర్దూ భాష పాత్రపై వ్యాసరచన పోటీలు

ఈనాడు, అమరావతి: భారత స్వాతంత్య్ర ఉద్యమంలో ఉర్దూ భాష పాత్ర అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ నెల 13, 14 తేదీల్లో పదో తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రశంసా పత్రాలతోపాటు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలకు బహుమతులు అందిస్తామన్నారు.

21 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: మూడు శాఖల్లో 21 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వ్యవసాయ శాఖలో 10 (జోన్-1లో 8, జోన్-3లో 2) అధికారుల పోస్టులకు ఈనెల 19 నుంచి సెప్టెంబరు 8 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దేవాదాయశాఖలో 7 ఈఓ పోస్టులు, భూగర్భ జల విభాగం జోన్-4లో 4 సాంకేతిక సహాయకుల పోస్టుల కోసం 13 నుంచి సెప్టెంబరు 2 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

వెంకటేశ్ నాయుడి భార్య పిటిషన్‌పై వివరాలు సమర్పించండి

సిట్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: మద్యం కేసు దర్యాప్తులో భాగంగా తన భర్త సీహెచ్.వెంకటేశ్ నాయుడి(ఏ-34) సెల్‌ఫోన్ నుంచి సేకరించిన సమాచారాన్ని సిట్ అధికారులు మీడియాకు లీక్ చేస్తున్నారని, ఆ సమాచారం ఇకపై వ్యాప్తి చేయకుండా నియంత్రించాలని కోరుతూ వాసిరెడ్డి మహిత దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు మంగళవారం విచారించింది. పిటిషన్‌పై పూర్తి వివరాలు సమర్పించాలని న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సిట్ అధికారులను ఆదేశించారు. విచారణను ఈనెల 19కి వాయిదా వేశారు.

జిల్లాకు 8 మంది చొప్పున ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ సవరించింది. జిల్లాల్లో ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయికి పంపే జాబితా ఎనిమిది మందికి మించకూడదని పేర్కొంది. ప్రతి జిల్లా నుంచి ఎస్జీటీలు-2, స్కూల్ అసిస్టెంట్లు-4, ప్రధానోపాధ్యాయులు-2 చొప్పున జాబితాను పంపించాలని సూచించింది. రాష్ట్ర స్థాయిలో 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, తుది జాబితాను ఈ నెల 25న ప్రకటిస్తామని తెలిపింది. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు వెల్లడించింది.